# ప్లేటోనిక్ ప్రేమ

నవల

- డా.రాయపెద్ది వివేకానంద్



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 237

కౌముది మాసపత్రికలో

జనవరి 2021 సంచిక నుంచి డిసెంబర్ 2021 సంచిక వరకూ వచ్చిన

సీరియల్ నవల

## (ప్రారంభం)

**యధాలాపంగా** ప్రారంభమయిన వారి పరిచయం ఒక గొప్ప అద్భుతానికి నాంది అవుతుందని వారిద్దరికీ తెలియదు.

తను వివరించబోయే గతం తాలూకు జ్ఞ్యాపకాలు తనకు తెలియకుండానే తన జీవితంలో ఓ మార్పు తేబోతున్నాయని సంతోష్ ఆ సమయంలో ఊహించలేదు.

"ఓ! మై గాడ్! మీరు నా అభిమాన రచయిత సంతోష్ గారు కదూ" గొప్ప ఎక్సైట్‌మెంట్‌తో ఇంచుమించు గట్టిగా కేక వేసింది నవ్య.

అది ముంబయి నుండి సికింద్రాబాద్ వెళుతున్న ఎక్స్ ప్రెస్ రైలు. ఫస్ట్ క్లాస్ ఏసీ కంపార్ట్ మెంట్. అప్పుడే కదుల్తున్న రైల్లోకి హడావుడిగా చివరి నిమిషంలో ఎక్కిన ఆ అమ్మాయి తనకి అలాట్ అయిన కూపే లో ఎదురు బెర్త్ లో కూర్చుని వున్న సంతోష్ ని చూసి ఒక అద్భుతాన్ని చూస్తున్న దానిలా దిగ్భ్రమకి గురయ్యింది.

ఆమెని డ్రాప్ చేయటానికి వచ్చిన కార్ డ్రైవర్ లగేజ్ ని బెర్త్ క్రింద సర్దేసి 'వెళ్తానండీ' అని చెబుతున్నా ఆ డ్రైవర్ ని పట్టించుకునే స్థితిలో లేదు ఆ అమ్మాయి. చేసేదేం లేక కదులుతున్న రైల్లో నుంచి దిగిపోయాడు ఆ డ్రైవర్ కుర్రాడు.

రెండు చేతులతో చప్పట్లు చరుస్తూ, చిన్న పిల్ల లా గెంతులు వేస్తూ ఆయననే చూస్తుండి పోయింది.

అప్పటి దాకా లాప్ టాప్ లో ఏదో టైపు చేస్కుంటున్న సంతోష్ తల ఎత్తి చూశాడు.

అతని వయస్సు యాభై రెండుకి అటు ఇటుగా వుంటుంది. తెల్లటి సుకుమారమైన శరీరం. నుదుటన పడుతున్న జుత్తు,రిమ్ లెస్ కళ్ళ జోడు, చక్కగా షేవ్ చేసుకుని, గుబురు మీసం, తెల్లటి కుర్తా పైజామాలలో అతను చాలా హుందాగా వున్నాడు. అతని వయస్సు యాభై దాటినప్పటికి అతన్ని చూడగానే కలిగే మొదటి భావన, అబ్బో ఇతను చాలా అందంగా వున్నాడే, వయస్సులో వున్నప్పుడు ఇంకెలా వుండేవాడో అని అనిపిస్తుంది ఎవరికైనా అతన్ని చూస్తే.

ఆ అమ్మాయి బెర్త్ వంక చేత్తో చూపిస్తూ 'కుర్చో'మన్నట్టు కనుసైగతో తెలిపాడు.

అతని ఎదురుగా బెర్త్ పై ఆ అమ్మాయి మంత్ర ముగ్ధలా కూర్చుంది. ఆమె వయసు మహా అంటే పాతిక మించి వుండవు. ఆకర్షణీయమైన శరీర సౌష్టవం, ఖరీదైన జీన్స్, టీ షర్ట్, పోనీటైల్ వేసిన జుత్తు తో ఆధునిక యువతకి ప్రతినిధిగా అనిపించింది సంతోష్ కి.

"సర్. మీరు ఒక గొప్ప రచయిత, గొప్ప ట్రెయినర్, ఒక తత్వవేత్త స్థాయి మేధావి, ముువతరాన్ని మేల్కొలిపే లాంటి అద్భుత వక్త, యువతరమంతా మీ రచనలంటె పడి చస్తారు. నేను కూడా ఏమాత్రం ఎక్స్పెషన్ కాదు. నాకు మీరంటే పిచ్చి. మిమ్మల్ని టీవిల్లొ , యు ట్యూబ్ వీడియోల్లో చూడటమే . ఓ మై గాడ్. నా ఎదురుగా నా అభిమాన రచయిత కూర్చుని ప్రయాణిస్తున్నారు. ఐ జస్ట్ కాంట్ బిలీవ్ ఇట్" ఆ అమ్మాయి తెగ ఉద్వేగానికి లోనవుతోంది;.

ఆమె ఆ విధంగా ఉద్వేగ పడటం లో అర్థం వుంది. తెలుగు రాష్ట్రాలు రెండిట్లో సంతోష్ అంటే తెలియని వారు లేరు. అతను తన రచనల ద్వారా, ఉపన్యాసాల ద్వారా, టీవీ కార్యక్రమాల ద్వారా, యువత అభ్యున్నతికై సదా ఏదో కార్యక్రమాలు నిర్వహిస్తూ వుంటాడు.

కారణం తెలియదు గానీ తన సమయం మొత్తం రచనలకి, ఉపన్యాసాలకి వెచ్చిస్తూ ఇక ఏ ఇతర వ్యాపకాలు పెట్టుకోలేదు. అతను ఉచితంగానే తన అన్ని కార్యక్రమాలని నిర్వహిస్తూ వుంటాడు.

నిజానికి డిమాండ్ చేసి అడిగితే అతను చాలానే సంపాదించుకోగలిగి ఉండగలిగే వాడు. నిజానికి అతను వెనకేసుకున్నది ఏమి లేదు. అతని జీవిత విధానాన్ని దగ్గర నుంచి చూసిన వారెవ్వరికైనా తెలిసిపోతుంది అతను  చాలా నిరాడంబరమైన జీవితం జీవిస్తున్నాడు.

అతని వ్యక్తిగత జీవితం గురించి ప్రజలకు తెలిసింది చాలా తక్కువ. అతను చేస్తున్న కార్యక్రమాల ద్వారా అతని కీర్తి నలుచెరగులా విస్తరించింది. పద్మశ్రీ పురస్కారంతో బాటు, దేశ విదేశాలకు చెందిన ఎన్నో ప్రతిష్టాత్మక పురస్కారాలు, ఎన్నో యూనివర్శిటీల నుంచి లెక్కకు మిక్కిలిగా గౌరవ పురస్కారాలు అతన్ని వరించి వచ్చాయి. తనకు వచ్చే పెద్ద పెద్ద బహుమతి మొత్తాల్ని అదే వేదిక సాక్షిగా అతడు సేవా సంస్థలకి విరాళాలుగా ప్రకటించడం సహజంగా జరిగిపోయే విషయంగా మారిపోయింది.

యువత అభివృద్దికి సంబంధించిన కార్యక్రమాలు  ఎన్నింటికో రెండు తెలుగు రాష్ట్రప్రభుత్వాలు అతన్నిసంప్రదిస్తూ వుంటాయి.

ముంబాయి మహా నగరాన్ని వదిలి రైలు వేగంగా పరిగెడుతోంది. మసక అద్దం లోంచి బయటకు చూస్తూ కూర్చున్నాడు సంతోష్ భావరహితంగా. బయట నును చీకట్లు ముసురు కుంటున్నాయి.

ఒక విధమైన భక్తి భావం వదనం అంతటా నిండి వుండగా ఆయన వంకే చూస్తూ రెండు చేతులు జోడించి "నమస్తే సార్. నా పేరు నవ్య" అని తన్ని తాను పరిచయం చేసుకుంది.

"నమస్కారమమ్మా" భావ రహితంగా ఆమె వంకే చూస్తూ ప్రతినమస్కారం చేశాడు సంతోష్.

“నాకు తోచినట్టు నేనేదో పాటలు పాడుకుంటుంటాను, అవి చాలా బాగున్నాయి అంటు అందరూ అభినందిస్తుంటారు. నాకే తృప్తి లేదు, నేనింకా బాగా పాడాలి అని అనుకుంటూ వుంటాను. ఇదంత మా అమ్మ ప్రోత్సాహమే" అని చెప్పింది.

అప్పుడు అర్థం అయింది సంతోష్ కి ఆ అమ్మాయి సినీ గాయని నవ్య. ఇప్పుడు ఆశ్చర్య పోవటం అతని వంతయింది.

అమె కంఠధ్వని అతన్ని ఏదో లోకాలకు చేరుస్తోంది ఇందాకటి నుంచి.

ఆమె కంఠానికి ఏదో శక్తి వుంది. దాచుకుని వుంచిన విషాద జ్ఞాపకాల్ని తట్టిలేపి మనసుల్ని మౌనంగా ఏడిపించే శక్తేదో ఆమె గాత్రానికి వుంది అని ఎన్నో సార్లనుకున్నాడు ఆమె పాటల్ని విన్నప్పుడల్ల.

ఎక్కడో చూసినట్టు వుందే ఈ అమ్మయిని అని ఇందాకటి నుంచి అనుకుంటున్నాడు, ఇప్పుడు గుర్తు చిక్కింది. ఇప్పుడిప్పుడే తారాజువ్వలాగా తెలుగు, తమిళ్, హిందీ చిత్ర రంగాలలో తన పాటలతో దూసుకువెళుతున్న నవ్య అన్న మాట ఈ అమ్మాయి.

"అమ్మాయి. నిన్ను కలవటం నాక్కూడా చాలా సంతోషంగా వుంది; నిన్నటి సాయంత్రం టీవీలో చూశాను. ఏదో అవార్డ్ అందుకుంటూ వుండినావు. కంగ్రాచ్యులేషన్స్" మనస్ఫూర్తిగా అభినందించాడు సంతోష్.

"థాంక్యూ సర్. నాకు ఇప్పటికీ ఇదంతా కల లాగానే వుంది. కాలేజి ఫంక్షన్ లో ఒక సారి నేను పాడిన ఏదో పాట విని నా పేరు సినీ దర్శకుల దాకా చేరటం, ఒక దాని తర్వాత ఒకటి నాకు అవకాశాలు రావటం ఇదంతా నాకు ఇప్పటికి నమ్మశక్యం కావటం లేదు. ఈ సెలెబ్రిటీ స్టేటస్ నాకు ఇంకా అలవాటు కాలేదు సర్. నేను హాయిగా ఓ కాలేజి అమ్మయి లాగా వుండటంలోనే ఆనందంగా ఫీల్ అవుతాను" నిష్కల్మషంగా చెప్పుకుని పోతున్న ఆ అమ్మాయి పట్ల ఒక లాంటి ఆప్యాయత కలిగింది సంతోష్ కి.

విపరీతంగా కురుస్తున్న మంచు కారణంగా విమానాలు నిరవధికంగా రద్దయ్యాయి. అందువల్ల రైలు ప్రయాణం చేయాల్సి వచ్చింది. అదే మాట్లాడుకున్నారు ఇద్దరు. కంపార్ట్ మెంట్ కూడా పెద్ద రద్దీగా లేదు. వీళ్ళ కూపే లో వీళ్ళిద్దరే వున్నారు.

తనతో తెచ్చుకున్న ఏవో స్నాక్స్ అతనికి ఇచ్చింది. కాసేపట్లోనే ఇద్దరూ మంచి మిత్రులయ్యారు.

"సర్, గిర్, ఇవన్నీ కాదు, మిమ్మల్ని అంకుల్ అని పిలుస్తాను" అని ప్రకటించింది నవ్య హఠాత్తుగా.

సెలబ్రిటీ స్టేటస్ ఎంజాయ్ చేస్తున్నప్పటికి తను పసి పిల్లలాగానే ప్రవర్తించడం సంతోష్ కి బాగా నచ్చింది.

" అలాగే పిలువమ్మా" చిరు నవ్వు నవ్వుతూ అంగీకరించాడు.

క్రమంగా చర్చ సినిమాల మీదికి మళ్ళింది.

"మా కజిన్ ఒకతను సినిమా తీయాలని తెగ ఉబలాట పడుతున్నాడు. అతను యూ.ఎస్. లో పెద్ద సాఫ్ట్ వేర్ ఫర్మ్ నడుపుతున్నాడు. సినిమా తీయాలని ఎందుకో డిసైడ్ అయిపోయాడు. అతని సరదా నా కొంప ముంచే లాగుంది"

"అదేంటి?" చిరునవ్వుతో ఆడిగాడు సంతోష్.

'ఇంకో వారంలో అతను రాబోతున్నాడు ఇండియాకి. అతను వచ్చేలోగా ఒక మంచి కథ సేకరించి పెట్టమని కోరాడు. నేను ఎన్నో కథలు చదువుతూ కూర్చున్నాను ఆ సినిమా కోసమని, నాకు ఏవీ నచ్చటం లేదు.

ఏ కొత్త సినిమా అయినా సరే విడుదలకి ముందు వైవిధ్యమయిన కథ అని దాని తాలుకు దర్శక నిర్మాతలు, హీరో, హీరోయిన్లు చెపుతుంటారు. అది నిజానికి ఒక ఊతపదమైంది తప్ప ఏ సినిమా చూసినా ఏమున్నది గర్వకారణం అన్న విధంగా వుంటున్నాయి. అలాగని సినిమా వాళ్ళని తప్పులు పట్టలేను. అది కోట్లతో వ్యాపారం కద. వాళ్ళ సేఫ్టీ వాళ్ళు చూసుకోవటంలో తప్పేమీ లేదు.

అందుకే ఒక ఫార్ములా ఎంచుకుని సినిమా తీస్తూ వెళతారనుకుంటాను బహుశా.

నేను మాత్రం నిజంగానే ఒక వైవిధ్యమైన కథ కోసం చూస్తున్నాను. చదవంగానే నాకు 'ఆహా' అనే ఫీలింగ్ కలగాలి. అలా అనిపించినప్పుడే కథని తీసుకుందామని చూస్తున్నాను నేను. కానీ ఇప్పటిదాకా నాకు ఆ విధంగా 'ఆహా' అన్న ఫీలింగ్ ఏ కథ చదివినా కలగటం లేదు.

ఈ విషయంలో మా కజిన్ నాకు ఫుల్ రైట్స్ ఇచ్చాడు. లాభాపేక్ష ఏమీ లేకుండా నిజమైన ప్యాషన్ తో తీయబోతున్నాము మేము.

అంకుల్! మీరు యువత ఇష్టపడే రచయిత కద. ఒక మంచి కథ మాకు అందజేయగలరా?"

మొదట ఆ అమ్మాయి ఏదో సరదాగా అంటోందేమో అనుకున్నాడు. కానీ తను నిజంగానే సీరియస్ గా వుంది అని కాసేపట్లోనే అర్థమయింది అతనికి కూడా.

"చూడండి అంకుల్. మా జనరేషన్ కి తెలిసింది అమ్మాయి అబ్బాయి ఇవ్వాళ చూసుకోవటాలు, కాసేపట్లో ప్రొపోస్ చేసుకోవటాలు, లివింగ్ రిలేషనా, మారేజా అని డిసైడ్ చేసుకోవటం.. ఫెమినిజం, ఈగో, విడాకులు, సింగిల్ పేరెంటింగ్, అపార్థాలు, గోల. ఇప్పుడు ఎక్కడ చూసినా ఇదే.

ఇంటర్ నెట్, టీవీలు, మొబైల్ ఫోన్లు, టిక్ టాకులు, ఫేస్ బుక్కు, ఇన్‌స్టాగ్రాం లు మల్టీప్లెక్స్ లు. పిజ్జా హట్టులు, మెక్ డొనాల్డ్ లు. ఈ కాంక్రీట్ జంగిల్స్ లో మేము యాంత్రిక మృగాలలాగా జీవిస్తున్నాము. నిజమైన స్వచ్ఛమైన ప్రేమ కథలు ఉంటాయి అంటే మాకు నమ్మశక్యం కాదు నిజానికి.

ఇలాంటి వాతావరణంలో పెరుగుతున్న మాకు స్వచ్ఛమైన ప్రేమికులు వుంటారు అంటె నమ్మలేని స్థితికి చేరుకున్నాం. స్వచ్ఛమైన ప్రేమ అంటే అంతరించి పోయిన వృక్ష జాతులు, జంతు జాలాల లాగా భావిస్తాము ఎప్పుడైనా క్లాసిక్స్ చదివినప్పుడు.

ఇప్పటి జెనరేషన్ కి తెలియని ఒక స్వచ్ఛమయిన ప్రేమ కథ ని , 1970 ప్రాంతాలలొ జరిగినట్టు విలేజ్ లేదా స్మాల్ టవున్ బ్యాక్ డ్రాప్ తో 'ప్లాటొనిక్ లవ్' ఆధారిత ప్రేమ కథని సినిమా తీస్తే అది ఖచ్చితంగా సూపర్ హిట్ అవుతుందని నాకు బలంగా అనిపిస్తోంది. అలాంటి కథ ఒకటి చెప్పగలరా?"

ఆ అమ్మాయి వంక కాస్త జాలిగా చూశాడు. ఖచ్చితంగా ఫెయిల్ అయ్యే కథాంశం తో సినిమా తీస్తాను అని అడుగుతోంది. సినిమా అంటేనే ఒక వేగం, ఒక పరుగు. ఎన్నో కమర్షియల్ హంగులు జోడించి తీసినప్పటికీ అనేక సినిమాలు బాక్సాఫీస్ దగ్గర బోల్తా పడుతుంటాయి.

అందుకు అని చెప్పి తప్పించుకోవటానికి అన్నట్టు,"నేను ఇప్పటి దాకా సినిమాలకు వ్రాయలేదు" అని నీళ్ళు నములుతూ చెప్పాడు.

"నో ప్రొబ్లెమ్. మాకు వ్రాసివ్వండి. మా కజిన్ ద్వారా మీకు మంచి రెమ్యూనరేషన్ ఇప్పిస్తాను"

సంతోష్ నవ్వి, " రెమ్యూనరేషన్ ప్రధానం కాదు. ఇలాంటి కథాంశం తో సినిమా తీస్తే ఎవరు చూస్తారు?"

"లేదంకుల్. ఇప్పుడూ అంతా పాత ఫాషన్స్ ఫాలో అవుతున్నారు. పాత సినిమా కథాంశాలతో తీసినా ఎన్నో సినిమాలు సూపర్ హిట్ అవుతున్నాయి. మీరు ఒక కథ ఇవ్వండి చాలు మిగతాది మేము చూస్కుంటాము"

ఆ అమ్మాయి ఇక వదిలేలా లేదు అన్నది అర్థం అయింది అతనికి. కాసేపు మౌనంగా ఉండిపోయి నిదానంగా చెప్పాడు,

"నువ్వు అడుగుతున్న తరహా కథ చెప్పాలని నాకూ వుంది. ఊ. నువ్వడిగిన లాంటి కథ, మా తెలిసిన వాళ్ళ జీవితంలో జరిగింది. కాకపోతే సెవెన్టీస్ లో కాదు. ఎయిటీస్ లో. ఓకేనా?"

"పర్వా లేదు అంకుల్"

"సాధారణంగా నాయికా, నాయకుల పేర్లు లేకుండా కథలు సాగవు. కానీ సరదాగా నేను ఈ కథలో ఎక్కడా కూడా నాయిక, నాయకుల పేర్లు ప్రస్తావించను.

కథా నాయిక గురించి చెప్పాల్సి వచ్చినప్పుడల్లా 'ఆ అమ్మాయి', 'ఆమె' ఇలా ప్రస్తావిస్తాను.

అదే విధంగా కథానాయకుడి గురించి ప్రస్తావించినప్పుడలా 'అతడు', 'ఆ అబ్బాయి' అని చెబుతూ వెళతాను. అర్థం చేసుకోవటం లో నీకు ఏమి ఇబ్బంది కలగదు అనే అనుకుంటాను" చెప్పాడు సంతోష్.

"భలే. ఇదో ప్రయోగం. చెప్పండి అంకుల్. నాకు తెలిసి ఒక పాపులర్ నవలలో హీరో పేరు ప్రస్తావించకుండా కేవలం 'అతడు' అని ప్రస్తావిస్తూ రెండు భాగాల నవల వ్రాయటం జరిగింది."

నిజానికి ప్రయోగం కోసం కాకుండా, ఒక ప్రయోజనం కోసం అలా హీరో, హీరోయిన్ల పేర్లను ప్రస్తావించబోవటం లేదు అని సంతోష్ కి మాత్రమే తెలిసిన సత్యం.

సంతోష్ కి తెలియదు, తను చెప్పబోయే కథ వల్ల, ఒక గొప్ప అద్భుతం లాంటి సంఘటన జరగబోతోందని. అదికూడ మరి కొన్ని గంటల లోనే జరగబోతోంది అని.

సంతోష్ చెప్పటం ప్రారంభించాడు.

తను ఆమెని చూసిన ఆ మొదటి క్షణాలు అవి. అంత సులభంగా మరచిపోగలడా?

**నాకు నీదు దర్శనమైన యంతనే**

**మత్తుక్రమ్మి చూడ మరచినాను**

**కానబడియు గూడ కనరాకపోతివి,**

**నాదు చూపు చెదరె నాల్గుదెశల★**

**(★ దాశరథి గారు అనువదించిన 'గాలిబ్ గీతాలు' సంకలనం నుండి)**

తను ఆమెని చూసిన ఆ మొదటి క్షణాలు, దాదాపు ముప్పైమూడు సంవత్సరాల క్రితంవి అయినా, ఆ ఘడియలు ఒక క్షణం క్రితమే జరిగాయా అన్నంత స్పష్టంగా అతడి మనోఫలకంపై ముద్రించబడి వున్నాయి. అంత సామాన్యంగా మరచిపోగలిగిన క్షణాలా అవి.

ఆమెతో పరిచయం తనజీవితంలో సునామి సృష్టించబోతోంది అన్నది అతనికి ఆ క్షణంలో చూచాయగా కూడా తెలియదు.

ఓ పాఠకుడా అతనికి ముందుగానే తెలిసినా తనను సంభాళించుకునేవాడు కాదేమో అని అనుకుంటాను.

**'కాలి మాడి మసి అవటంలో వున్న మజా**

**శలభానికి తెలుస్తుంది. మనకేమి తెలుస్తుంది?'**

తన ఇంట్లో ముందు గదిలో కిటికీ ప్రక్కన కూర్చుని కవిత వ్రాసుకుంటున్నాడు అతను. కిటికీ లోంచి బయటి దృశ్యం అద్భుతంగా కనిపిస్తోంది. పచ్చటి పొలాలు, వాటిని ఆనుకుని ఎత్తైన కొండలు.

కర్నూలు జిల్లా ఆదోని లో వున్న ప్రకృతి దృశ్యాలు ఏ సినీ దర్శకుడి కంట బడకపోవటం ఒక ఆశ్చర్యం. బయట వాతా వరణం చాలా ఆహ్లాదంగా వుంది. ఊరికి దూరంగా విసిరేసినట్టున్న ఆ కాలనీలో చిరు చీకట్లు ముసురుకుంటున్నాయి. చిరు చలిగా వుంది,

**నీ గుండె చప్పుడు నన్ను చేరినప్పుడు**
**ఆ సమయం నాకు నిజంగా నాదమయం.**
**నీ ఆలోచనా ధారలో నేను భాగమైనప్పుడు**
**ఆ సమయం ఒక స్వర ప్రస్థానం..!**
**అభిరుచులను కలబోసుకుంటూ**
**అలవాట్లను సర్దుకుంటూ..**
**పొరబాట్లని సరిదిద్దుకుంటూ**
**యుగళగీతమై సాగుతున్న**
**మన స్నేహ జీవితానికి అభివందనం.**
**నిన్నూ నన్నూ కలిపిన**
**ఆ మొదటి క్షణానికి పాదాభివందనం.★**
**(★ శ్రీ కిరణ్ ప్రభ గారు రచించిన కవిత. 'కౌముది' గత సంచికల నుంచి)**

అతనికి కవితలు వ్రాయటం సరదా. ప్రతి అంశాన్నీ కవితాత్మకంగా అల్లి ఒక కొత్త అందాన్ని చూపగలడు. ఎప్పట్లాగే సీరియస్ గా కవిత వ్రాసుకుంటున్న అతను మువ్వల చప్పుడుకి వెనక్కి తిరిగి చూశాడు.

ఎవరో ఒక అమ్మాయి నిలబడి వుంది. మహా అంటే పదిహేడు సంవత్సరాలు వుంటాయి ఆ అమ్మాయికి.

ఆ మొదటి చూపులోనే గుండెలో ఏదో గిలిగింత, మనస్సంతా ఒక విధమైన పులకరింత, అవ్యక్తమైన భావాల సందడి ఇలాంటివేమీ జరగలేదు గానీ, ఎవరబ్బా ఈ అమ్మాయి చాలా చక్కగా వుందే అని మాత్రం అనుకున్నాడు.

తెల్లటి తెలుపు, చురుకైన కన్నులు, పిడికిట్లో ఇమిడిపోతుందేమో అని అనిపించే సన్నని నడుము, సూటి ముక్కు, కోలమొహం, పొడవాటి జడ. ఆమెలో ప్రత్యేకత ఆమె కళ్ళు. ఆవుదూడ కళ్ళలా పెద్దగా వుంటూ ఎంతో అమాయకత్వం, మంచితనం తమలో నింపుకుని ఉన్నాయి ఆమె కళ్ళు.

ప్రత్యేకమైన అలంకరణ ఏమీ చేసుకోలెదు. పావడా, పైటలలో సంప్రదాయబద్దంగా ఉంది. క్యాజువల్ గా ఇంట్లో వున్న అమ్మాయి , ఇంట్లో ఉన్నట్టే ప్రక్కింటికి వచ్చినట్టు వుంది తప్పితే ఏ హడావుడి లేదు తన వస్త్ర ధారణలో.

ప్రత్యేక శ్రద్ధతో జుత్తుని కూడా అలంకరించుకోలేదు తను. ఆ ముంగురులు చెల్లాచెదురుగా అల్లరి చేస్తున్నాయి, కిటికీలోంచి వస్తున్న కొండ గాలికి.

కానీ ఈ క్యాజువల్ లుక్కే తనకు మరింత వన్నెలు అద్దుతోందా అన్నట్టు వుంది ఆమె సౌందర్యం.

ఆమెని చూడగానే అతనికి చప్పున అసంకల్పితంగా మేఘసందేశం లో జేసుదాసు పాట గుర్తొచ్చింది.

**అందాలు అలలైన మందాకిని**

**మందార మకరంద రస వాహిని**

**ఆమె చరణాలు అరుణ కిరణాలు**

**ఆమె నయనాలు నీల గగనాలు**

**ఆ జవ్వనాలు నా జన్మకు**

**దొరికిన నైరుతి ఋతుపవనాలు**

**ఆ చిరునవ్వు లేత నెలవంక**

**దిగివచ్చెనేమో ఇలవంక**

**నవరస సుమ మాలికా**

**నవరస సుమ మాలికా**

**నా జీవనాధార నవరాగ మాలికా★**

(★ మేఘ సందేశం చిత్రం లోని పాట. రచన. వేటూరి సుందరరామమూర్తి)

అతడు వాళ్ళ ఊరి నుంచి ఆదోని వచ్చి డిగ్రీ కాలేజిలో చేరి రెండు రోజులే అవుతోంది. అన్న, వదినెల దగ్గర ఉంటున్నాడు. ఇంకా చుట్టు ప్రక్కల వారెవరూ పరిచయం కాలేదు . అతని అన్నయ్య కాలేజికి ప్రిన్సిపాల్. దానివల్ల అక్కడ సీట్ దొరకటం సులభమైంది. ప్రిన్సిపాల్ గారి తమ్ముడిగా ప్రత్యేక గుర్తింపు కాలేజీలో లభిస్తోంది కూడాను కాలేజీలో.

అతడు మొదట్నుంచీ మార్కుల పరంగా పెద్ద టాపర్ కాకపోయినా చాలా తెలివైన వాడు, చక్కటి సృజనాత్మకత వున్న కుర్రాడిగా చిన్నప్పటి నుంచీ పేరుంది.

అదీగాక అతనికి వున్న కవిత్వం వ్రాసే అలవాటు అతనికి ప్రత్యేక గుర్తింపుని ఇస్తుంది ఎక్కడికి వెళ్ళినా.

అతడు పెద్దగా చొచ్చుకునిపోయే తత్వం ఉన్నవాడు కాదు. తన లోకంలో తాను ఉంటాడు. అతన్ని కదిపి మాట్లాడిస్తే మాట్లాడతాడు, తనకై తానుగా కలివిడిగా అందరితో కలగలిసిపోయే తత్వం కాదు అతనిది. బాగా సిగ్గరి అతను.

తను అక్కడే వున్నానని సూచిస్తూ ఆమె కాస్తా కదిలింది. ఆ సమయంలో ఆమె గాజుల ధ్వని ఒక సంగీతం లా వినిపించింది.

ఆమె చలనాలు శిల్ప గమనాలు

ఆ దర్శనాలు – నా జన్మకు మిగిలిన

సుందర సుఖ తరుణాలు

ఆ కను చూపు, నాకు కడ దాక

పిలుపైనా లేని ప్రియలేఖ.★

(★ఇందాకటి మేఘసందేశం పాట కొనసాగింపు)

ఆమె వంక రెప్ప వేయటం మరచిపోయి చూస్తున్నాడు అతను.

ఆమె కూడా అతన్ని చూడటం అదే మొదటి సారి కావటంతో, 'ఎవరబ్బా ఇతను' అన్న భావనతో చూసింది.

అతను ఆరడుగుల ఎత్తు, ఎత్తుకు తగిన లావు తో ఆరోగ్యంగా ఉంటాడు. చూడగానే ఆకట్టుకునే అందం అతనిది. జలపాతంలాగా నిరంతరం నుదుటిపై వచ్చి పడే ఒత్తైన రింగుల జుత్తు, జ్ఞానం ఉట్టిపడే కళ్ళు, తెల్లటి శరీర ఛాయ ఇవన్నీ ఎందరిలో వున్నా అతన్ని ప్రత్యేకంగా నిలబెడతాయి.

ఇవన్నీ ఒకెత్తు, సూటిగా ఉండి చివర కొనదేలి వున్న ముక్కు అతనిలో ప్రత్యేక ఆకర్షణ అని చెప్పవచ్చు. వెరసి అతను గ్రీకు శిల్పంలా వున్నాడు అని చెప్పటం అతిశయోక్తి కాదు.

సన్నిహిత మిత్రులు అతన్ని 'రేమాండ్స్ మోడల్' అని పిలుచుకుంటూ ఉంటారు.

ఎవరబ్బా ఈ అబ్బాయి ఎప్పుడూ చూడలేదు అన్న భావన ఆ అమ్మాయి కళ్ళలో స్పష్టంగా కనిపిస్తోంది. బెరుకుగా అడిగింది "ఆంటీ ఉన్నారా?" అని. ఆమె స్వరం నిజంగా వీణ మీటినట్టు వుంది.

ఆంటీ ఎవరబ్బా అని ఒక క్షణం ఆలోచనలో పడి, తర్వాత చప్పున స్ఫురించింది, తన వదినెని ఈ అమ్మాయి ఆంటీ అని అంటోంది అని.

"లోపల ఉన్నారు పిలుస్తా ఉండండి" అంటూ లేచాడు.

వదినెమ్మతో ఆమె మాట్లాడుతూ ఉంటే, తను లోపలి గదిలోంచే వారి సంభాషణ వింటున్నాడు.

"ఆంటీ ఎల్లుండి రెడ్డి కళ్యాణ మండపంలో వెంపటి చినసత్యం గారి 'భామాకలాపం' నృత్య నాటకం జరుగబోతోంది. నేను నేపథ్యంలో పాడబోతున్నాను, మా తమ్ముడు మారుతి వేణుగాన సహకారం అందించబోతున్నాడు. మా గురువుగారు ప్రత్యేకంగా నన్ను పాడమని కోరారు. ఇది చాలా పెద్ద కార్యక్రమం. మీరు తప్పక రావాలి. అంకుల్ కి కూడా చెప్పండి" చాలా తియ్యటి గొంతుతో చెప్పదలచుకున్న విషయాన్ని నెమ్మదిగా వదినె గారితో , స్పష్టంగా చెప్పి వెళ్ళి పోయింది.

**మరుసటి రోజు సాయంత్రం.**

**స్థలం: రెడ్డి కళ్యాణ మండపం. ఆదోని.**

ఆమె అంత చక్కగా పాడగలదు అని అతనికి అప్పుడే తెలిసింది. చాలా పెద్ద వేదిక అది. హాల్లో ఎక్కడు కూర్చుని ఉన్నవారికి అయినా కనపడేలా వేదిక నిర్మాణం జరిగింది.

రెండు వరుసలుగా ఏర్పాటు చేయబడ్డ వేదిక పై కాస్త ఎత్తుగా అమర్చబడ్డ అరుగులాంటి నిర్మాణం, దానిపై మైకు ముందర కూర్చుని వుంది ఆ అమ్మాయి.

ఆ అమ్మాయికి ఇరువైపులా వాయులీన విద్వాంసులు, మృదంగ విద్వాంసుడు, కంజీర, గోటు వాద్యకళాకారుడు, వేణువాద్య కళాకారుడు, శృతి కి గాను తంబూర వాయిద్యంతో కళాకారుడు ఇలా అందరూ కొలువుదీరి వున్నారు.

వేణువు వాయించే కుర్రాడే ఆమె తమ్ముడు అని ఆమె చెప్పిన విషయం గుర్తు వచ్చింది. ఆ వాయిద్యాల పేర్లు కూడా అతనికి ఆ తర్వాత తెలిసింది. అతనికి ఇలాంటి ప్రపంచం ఒకటుంటుంది అని తెలియదు నిజానికి.

ఆ అరుగు లాంటి వేదిక ముందు నాట్యానికి అనుకూలమైన ఒక విశాలమైన వేదిక ఏర్పాటు చేయబడింది.

ఆమె గొంతు సవరించుకుని చిన్నగా పాడటం మొదలు పెట్టింది.

ఆమె కంఠంలొ ఏదో ఒక అద్భుతమైన ఇంద్రజాలం వుంది. ఆమె పాడితే హృదయం లో ఏదో తెలియని తియ్యటి అనుభూతి కలుగుతుంది.

ఆమె కంఠం నుంచి జాలువారుతున్న రసధుని స్పీకర్ల ద్వారా ఆ సభా మంటపాన్ని తేనెవానలా చుట్టుముట్టుతోంది. ఒక మంచు తుఫానులో ఇరుక్కుపోయిన తియ్యని అనుభూతి.

మృదంగం, శృతి చేస్తున్న సమ్మోహన ధ్వనులు, వయొలిన్ల తీగెలపై నుంచి వస్తున్న తీయని రాగాలు వెరసి స్వర రాగ గంగా ప్రవాహం అంటే ఏమిటో అతనికి మొదటి సారి అనుభవంలోకి వచ్చింది.

కొన్ని సార్లు కొన్ని పదాలు ఉత్తినే వాడేస్తూ వుంటాము, కాని అనుభవంలోకి వచ్చినప్పుడు తెలుస్తుంది వాటి నిజమైన అర్ధం.

స్వర రాగ గంగా ప్రవాహం అనే పదబంధానికి అతనికి నిజమైన అర్ధం తెలిసిన సాయంత్రం అది.

ఒక నవ యవ్వన వతి మెరుపుతీగెలా వేదికపై లయబద్దంగా, తాళానికి అనుగుణంగా నృత్యం చెస్తూ వుంటే గంటలు క్షణాల్ల గడిచిపోయాయి.

గంటలు క్షణాల్ల గడిచిపోవటం అనే పదబంధాన్ని ఊరికే వాడేస్తూ వుంటాము. ఆ పదబంధానికి కూడా అతను మొదటి సారి అనుభవపూర్వకంగా అర్థం తెలుసుకున్నాడు.

**భామనే! సత్య భామనే!**
**సత్య భామనే సత్య భామనే .**
**సత్య భామనే సత్య భామనే .**
**వయ్యారి ముద్దుల...**
**వయ్యారి ముద్దుల సత్యా భామనే.**
**సత్య భామనే.**

**భామనే పదియారువేల కోమలులందరిలోనా.**
**భామనే పదియారువేల కోమలులందరిలో.**
**లలనా చెలియా! మగువా సఖియా!**
**రామరో గోపాలదేవుని ప్రేమను దోచినదాన.**
**రామరో గోపాలదేవుని ప్రేమను దోచిన సత్య భామనే... .**
**సత్యా భామనే .**

**ఇంతినే... చామంతినే...**
**మరుదంతినే... విరిబంతినే...**
**ఇంతినే చామంతినే మరుదంతినే విరిబంతినే.**
**జాణతనమున సతులలో...**

**జాణతనమున సతులలో... నెరజాణనై!**

**నెరజాణనై!**

**నెరజాణనై వెలిగేటిదాన భామనే... సత్య భామనే!**

**అందమున అనందమున గొవిందునకు నేరవిందునై**

**అందమున అనందమున గొవిందునకు నేరవిందునై**

**నందనందుని ఎందుగానక**

**నందనందుని ఎందుగానక బేందమందున పొందుచున్న**

**భామనే... సత్య భామనే!**

**సత్య భామనే సత్య భామనే ★**

**( ★ సిద్ధేంద్ర యోగి విరచించిన – భామాకలాపం)**

కాని అతని దృష్టి ఎంత వద్దనుకున్నా పదే పదే పాట పాడుతున్న ఆ అమ్మాయి మీదకే వెళుతోంది.

నృత్యం చేస్తున్న మెరుపుతీగె లాంటి స్త్రీ గాని, వాద్య కళాకారులు గానీ, ప్రేక్షకులు గానీ ఎవ్వరూ కనిపించటం లేదు. ఆమె గాత్రం తప్ప ఏమీ వినిపించటం లేదు.

అతడు ఒక అలౌకిక ప్రపంచంలో వున్నాడు.

ఆమె గాత్రంలో ఒక మాయాజాలం వుంది. ఒక సమ్మోహనాస్త్రం వుంది. శ్రోతలను కట్టిపడేసే ఒక దైవీశక్తీ ఆమె గాత్రానికి వుంది. వచ్చేటప్పుడు జట్కా బండిలో అదే అన్నాడు వదినెమ్మతో.

ఆవిడ కూడా ఏకీభవించింది అతనితో. వారిద్దరూ చాలా సేపు ఆ నాట్య కార్యక్రమాన్ని గూర్చి మాట్లాడుకున్నారు.

"అక్కడ సత్యభామ వేషంలో అద్భుతంగా నాట్యం చేస్తున్న ఆయన స్త్రీ వేషంలో వున్న వెంపటి చిన సత్యం గారు అని గొప్ప కూచిపూడి నృత్య కళాకారుడు. తెలుసా." దార్లో వదినెమ్మ చెప్పిన మాటలు అతనికి చాలా ఆశ్చర్యం కలిగించాయి.

అతడు ఒక అద్భుతమైన ప్రపంచాన్ని మొదటి సారిగా చూసిన అనుభూతికి గురయ్యాడు.

ఆ అమ్మాయి తమ్ముడు మారుతి అక్కడే పరిచయం అయ్యాడు అతనికి.

ఒక సంవత్సరం చిన్నవాడు మారుతి. అదే ఊర్లో పాలిటెక్నిక్ కోర్స్ చేస్తున్నాడు. అతనికి వాళ్ళ అక్కయ్య పోలికలు బాగా ఉన్నాయి.

"మా ఇల్లు మీ ఇంటికి దగ్గరే. ఓ సారి రండి" అని మారుతి ఆహ్వానించాడు.

జాకీ ష్రాఫ్, మీనాక్షి శేషాద్రి నటించిన హిందీ చిత్రం 'హీరో' విడుదల అయిన కొత్తలు అవి. అందులో హీరో వేణువుపై ఒక ప్రత్యేకమైన ట్యూన్ ని వాయించే వాడు. అది చాలా క్రేజ్ పొందింది యూత్ లో. హరిప్రసాద్ చౌరాసియా అనే ప్రఖ్యాత వేణు గాన విద్వాంసుడు ఆ ట్యూన్ ని వాయించి పెట్టాడు ఆ సినిమా కోసం అని పత్రికల్లో కథలు కథలుగా చెప్పబడేది ఆ రోజుల్లో.

శంకరాభరణం సినిమా వచ్చిన కొత్తల్లో ప్రతి తల్లితండ్రీ తమ పిల్లలకు సంగీతశిక్షణ ప్రారంభించటం ఆనవాయితిగా ఉండేది. ఇప్పటికీ ఆ ప్రభావం కొనసాగుతోంది.

అదే విధంగా 'హీరో' సినిమా విడుదల తర్వాత యువతరం ఫ్లూట్ నేర్చుకోవటం ఒక ఫ్యాషన్ గా భావించేవారు.

ఆ ట్యూన్ ని సాధన చేయటానికి చాలా మంది ఫ్లూట్ నేర్చుకునేవారు ఆ రోజుల్లో.

అందరు అడిగినట్టే తను కూడా మారుతిని అడిగాడు ఆ తర్వాత ఒక రోజు. "హీరొ సినిమా ట్యూన్ వాయించటం వచ్చా" అని మారుతి నవ్వేసి, ఆ ట్యూన్ వాయించి వినిపించే వాడు.

ఆ తర్వాత తెలిసింది ఏమిటంటే 'హీరో' సినిమా విడుదలకు చాలా ఏండ్ల ముందరినుంచే అతను సశాస్త్రీయంగా వేణుగానాన్ని అభ్యసిస్తున్నాడు అని.

ఇదంతా ఒక కొత్త ప్రపంచం లాగా వుంది అతనికి.

ఆ కుర్రాడు వేణుగానంలో నిష్ణాతుడు. అలవోకగా స్వరాలు, కీర్తనలు, కృతులు పలికించగలడు తన వేణువు పై. ఆ కుర్రాడు చాలా మితభాషి. కొంతమందితో కొన్ని క్షణాలలోనే గాఢమైన అనుబంధం ఏర్పడుతుంది. ఆ కుర్రాడితో చక్కటి మైత్రి ఏర్పడింది అతడికి.

ఒక ఆదివారం ఉదయాన్నే రెండు వీధులకి అవతల ఉన్న వారి ఇంటికి వెళ్ళాడు అతను.

అప్పుడప్పుడె అభివృద్ధి చెందుతున్న కాలనీ అవటంతో అన్ని ప్లాట్లలో నిర్మాణాలు జరగకపోవటం వల్ల, ఖాళీ ప్లాట్లే ఎక్కువ దర్శనమిస్తాయి ఆ కాలనీలో. అడ్డుగా ఇళ్ళులేకపోవటం వల్ల వారి ఇల్లు ఇతడి ఇంటి నుంచి స్పష్టంగానె కనిపిస్తుంది. వాళ్ళింటి వైపు అడుగులు వేస్తూంటే వారి ఇంట్లో నుంచి వేణునాదం వినులవిందుగా వినిపిస్తోంది. మారుతి చక్కగా సాధన చేసుకుంటున్నాడు. అంత చిన్నవయస్సులోనే ఆ కుర్రాడు సాధించిన పరిపక్వతకి ఇతనికి కాస్తా ఆశ్చర్యం వేసింది.

'టక్....టక్' మని మూసి వుంచిన తలుపుపై చిన్నగా తట్టాడు.

తలుపు నెమ్మదిగా తెరుచుకుంది. ఊహించని విధంగా ఎదురుగా ఆ అమ్మాయి.

దేవలోకానికి చెందిన సౌందర్యం తనది. మాటల్లో వర్ణించబోతే ఎంతటి కవి అయినా విఫలుడే అవుతాడు.

అలా ఊహించని విధంగా ఆమె కనిపించేసరికి ఇతడు కాస్తా మొహమాట పడ్డాడు. తనను తప్పుగా ఎక్కడనుకుంటుందో అన్చెప్పి 'మారుతి.. మారుతి కోసం వచ్చాను' అని గొణిగినట్టు చెప్పాడు.

ఈ లోగా మారుతి లోపలి నుంచి వచ్చి 'ఏయ్ ఇతను మన ప్రిన్సిపాల్ గారి తమ్ముడు' అని పరిచయం చేశారు.

'తెలుసు మొన్న ఆంటి గారిని కలవటానికి వెళ్ళినప్పుడు చూశాను" మళ్ళీ వీణ మ్రోగిన అనుభూతి.

పక్కకి తప్పుకుంటూ లోనికి ఆహ్వానించింది చిరునవ్వుతో.

దేవతలకు మాత్రమే సాధ్యం ఇంతటి ప్రసన్నత అనుకున్నాడతడు. ఒక విధమైన పాజిటివ్ వైబ్రేషన్స్ తాకుతున్నాయి ఆమె సాన్నిధ్యంలో అతనికి. ఇది కేవలం అనుభవేకవేద్యమే. కొన్ని అనుభూతులను మాటల్లో వర్ణించటానికి వీలుకాదు. అతని మనస్సులో సరిగ్గా ఈ భావాలు కలిగాయి ఆ క్షణంలో.

వాళ్ళ అమ్మా,నాన్నా ఎక్కడో బయటికి వెళ్ళారట.

వాళ్ళింటి గురించి అతనికి అనేక విషయాలు ఆశ్చర్యాన్ని కలిగించాయి. వాళ్ళింట్లో కొట్టవచ్చినట్టు కనబడుతున్న అంశము – వారి లేమి.

దారిద్ర్యాన్ని అంత దగ్గరనుంచి అతను ఎప్పుడు చూసి వుండలేదు. ఐశ్వర్యంలోనే పుట్టి పెరగటం వల్ల అతనికి పేదరికం అంటే తెలియదు. ప్రత్యక్షంగా పేదరికాన్ని అతడు చూసింది లేదు. సినిమాల్లో టీవీల్లో చూడటమే కానీ మనుషుల కష్టాల పట్ల అతనికి అవగాహన తక్కువ.

ఈ అమ్మాయి కుటుంబం బాగా దిగువ మధ్య తరగతికి చెందినప్పటికీ ఎవరి వద్దా చేయి చాచక ఉన్నంతలో గౌరవంగా బ్రతుకుతున్నారు. వాళ్ళ నాన్నగారు తను చదువుకుంటున్న కాలేజిలోనే క్లర్క్ గా పని చేస్తున్నాడు. చుట్టు ప్రక్కల చాలా ఊళ్ళకు అదొక్కటే కాలేజి.

వాళ్ళు నివాసం ఉంటున్న ఇల్లు గురించి కాస్తా చెప్పాలి ఇక్కడ.

నిధులు సమకూరక పోవటం వల్ల నిర్మాణం సగంలో ఆగిపోయిన ఓ ఇంట్లో వుంటున్నారు వారు అద్దెకి. అలాగే వదిలేస్తే ఆ కాస్తా కూడా పాడుపడి పోతుందని పుణ్యాత్ముడు అయిన ఆ ఇంటి ఓనర్ వీరికి నిలువ నీడ కల్పించే ఉద్దేశ్యంతో నామ మాత్రపు అద్దెకి వారిని ఆ ఇంట్లో ఉండనిస్తున్నాడట.

బాపూ సినిమాలోనో, వంశీ తీసిన సినిమాలోనో ఉండే పేద కళాకారుల ఇల్లులా వుంది అది.

రంగులు కాదు కద, సిమెంట్ పూత కూడా లేక ఇటుకలు బయటికే కనిపిస్తూ గోడలు, మార్బల్ ఫ్లోరింగ్ మాట దేవుడెరుగు, అసలు బండ పరుపే లేని ఆ ఇంట్లో వారు ఓపిక గా నేలపై ఎర్రమట్టి పూసి అందంగా మలచుకున్నారు. ప్రతి గదిలో తెల్లటి ముగ్గులు.

ఇటుక గోడలపై నడుము ఎత్తులో తెల్లటి ముగ్గు డిజైన్ తో అలంకరించారు.

ఏది ఏమయినప్పటికీ అక్కడ ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అంశం అక్కడి ప్రశాంతతత. ఏదో ఆశ్రమంలో ఉండే స్థాయి ప్రశాంతత, ఒక విధమైన పాజిటివ్ వైబ్రేషన్స్ అక్కడ ఉన్నట్టు అతను అనుభూతికి గురయేవాడు అతను ఆ తర్వాత ఎన్ని సార్లు వాళ్ళ ఇంటికి వెళ్లినా.

ఏదైన గుడిలోనో, ఒక ఆధ్యాత్మిక కేంద్రంలోనో లభించే స్థాయి మానసిక ప్రశాంతత అతని అనుభూతిలోకి వచ్చేది అక్కడికి వెళ్ళిన ప్రతిసారీ.

మారుతి చక్కటి చిత్రకారుడు అని కూడా అర్థం అయింది. తను వాటర్ కలర్స్ ని ఉపయోగించి వేసిన వందలాది చిత్రాలని చూపించాడు.

ఇంటి బయట కూడా కాంపౌండ్‌లాగా చుట్టూ కర్ర ముక్కలు పాతి కంచె లాగా ఏర్పాటు చేసుకుని అందులోనే పూల మొక్కలు, ఆకుకూరలు, కూరగాయలు పండించుకుని వాడుకుంటున్నారు.

వాళ్ళ నాన్న గారు బంక మట్టితోనూ, సుద్ధ ముక్కలతోనూ చక్కగా బొమ్మలు తయారు చేస్తారట. అది ఆయనకు ఒక సరదా.

ఆ తోట మధ్యలో కొన్ని డజన్ల కొద్దీ అలాంటి బొమ్మలు కనిపించాయి. మూడు నుంచి నాలుగు అడుగుల ఎత్తు వున్నాయి ఆ విగ్రహాలు అన్నీ. జీవం ఉట్టిపడుతున్నాయి అవి. వాళ్ళ నాన్నగారు కూడా కళాకారుడే అని అర్థం అయింది. ఆయన చేసిన చిన్న చిన్న విగ్రహాలు చూసి ఆశ్చర్యంలో మునిగిపోయాడు అతను. సరదాగా అలా చేస్తూ ఉంటారట. ఎవరికి కావలిస్తే వారు తీసుకోవచ్చుట ఉచితంగా. ఆయనకి అది సరదా అంతే. దానివల్ల ఆయనకి ఆదాయం ఏమీ లేదు.

ఇంటిలో ఓ మూలగా కుట్టు మిషన్ కనిపించింది. టైలర్ షాప్స్ లో చూడటమే కుట్టు మిషన్‌ని. ఇంట్లో చూడటం అతనికి అదే ప్రథమం.

బార్న్ విత్ ఎ సిల్వర్ స్పూన్ అన్నట్టు కలిమిలోనే పుట్టి పెరగటం వల్ల అతనికి వాళ్ళ ఇంటి వాతావరణం కొత్తగానూ, వింతగానూ వుంది. కుట్టు మిషన్ వంక అర్థం కాక చూస్తూ ఉండిపోయాడు.

’మా అమ్మగారు, నేను చుట్టు ప్రక్కల వారికి జాకెట్లు, చీర ఫాల్స్ కుట్టి పెడతాం" మరొకసారి వీణ మ్రోగింది.

"ఎందుకలా కుట్టటం. హాబీనా?" అమాయకంగా అడిగాడు అతను. అతని ప్రశ్నలో వెటకారం లేకపోవటం గమనించి ఆ అమ్మాయి కూడా సిన్సియర్ గానే సమాధానం చెప్పింది.

"మా నాన్న గారి జీతం చాలా తక్కువ కదండి. ఇలా నేను అమ్మ కాస్త కష్ట పడి ఏదో వేడినీళ్ళకు చల్ల నీళ్ళలా కాస్త సహాయపడుతున్నాం"

వాళ్ళలో కొట్టవచ్చినట్టు కనిపిస్తున్న మరో అంశం ఆత్మతృప్తి. వారేమీ తమ జీవితం పట్ల కించ పడటటం లేదు. న్యూనతతో కుమిలి పోవటం లేదు. పైపెచ్చు చాలా ఆత్మవిశ్వాసంతొ కూడిన స్థైర్యం వారిలో అతనికి మరింత నచ్చింది.

"మీరు డిగ్రీ ఫస్ట్ ఇయర్ అన్నారు, కాలేజిలో ఎక్కడా కనిపించలేదేం?" అతడు అడిగాడు ఆ అమ్మాయిని.

"నేను ఇంట్లోనే వుండి  డిస్టన్స్ మోడ్ లో డిగ్రీ చదువుకుంటున్నాను.  పగలంతా ఓ చిన్న ఇంగ్లిష్ మిడియం స్కూల్లో టీచర్ గా పని చేస్తున్నాను. నా ఖర్చులకు నేనే సమకూర్చుకోవచ్చు కద. నాన్నకు సహాయపడినట్టు వుంటుంది. సాయంత్రాలు ట్యూయిషన్లు చెబుతాను"

అలా చెప్పి కాసేపాగి, "మా తమ్ముడిది పాలిటెక్నిక్ అవ్వంగానే మాకు మరింత చేదోడు వాదోడు గా వుంటాడు" తన తియ్యటి స్వరంతో తనకు తనే భరోసా చెప్పుకుంటున్నట్టు ఆ అమ్మాయి చెప్పింది.

యధార్ధ జీవితం తాలూకూ వ్యధార్థ దృశ్యం కళ్ళకి కట్టినట్టు కనిపించింది.

అతని తండ్రి రెవెన్యూ డిపార్ట్మెంట్ లో మంచి హోదాలో నాలుగు జిల్లాలకు అధికారిగా పని చేసి రెటైర్ అవటం వల్ల అతనికి కష్టం అంటే తెలియదు. ఇంచు మించు గౌతమ బుద్ధుడి బాల్యం లాగనే గడిచింది అతని జీవితం.

వార్ధక్యాన్ని, పేదరికాన్ని, మృత్యువుని మొదటి సారి చూసి గౌతమబుద్ధుడు ఎంత చలించిపోయాడో , అతడు కూడా ఇంచుమించూ అంతే విచలితుడు అయాడు. వాళ్ళింటికి రావటం వల్ల మనసుకు ఏదో బాధగా అనిపించింది. కానీ అదే సమయంలో ,అతడికి మనసుకు ఎందుకో చాలా సాంత్వన గా అనిపించింది.  ఆ అమ్మాయి ఏ భేషజాలు లేకుండా ఎటువంటి ఫాల్స్ ప్రిస్టేజీకి పోకుండా హాయిగా స్వచ్ఛంగా మాట్లాడుతోంది. ఎందుకో తెలియదు గానీ తనని మరీ మరీ కలవాలని అనిపించింది.

మనసుకు దిగులుగాను వుంది, సాంత్వనగా కూడా వుంది. ఈ ద్వైదీ భావన ఏమిటొ కూడా అతను అర్ధం చేసుకోలేక పొతున్నాడు.

ఆమెతో మాట్లాడుతూ వున్నా, ఆమె మాటలు వింటూ వున్నా అతనికి ఏదో తెలియని అనుభూతి, ఏదో తెలియని పాజిటివ్ ఫీలింగ్. గుడికెళ్ళివస్తే మాత్రమే కలుగుతుంది అలాంటి ఫీలింగ్ సాధారణంగా.

అతని మనసు చదివినట్టు "తరచూ వస్తూ వెళుతూ వుండండి, దగ్గరే కద ఇల్లు" అక్కా తమ్ముళ్ళు ఇద్దరూ ఒక్కసారే చెప్పారు.

అతనికి ఆమె మీద కలిగిన బలమైన మొదటి భావం – జాలి. అవును. దేవలోకంలో వుండాల్సిన ఆమె ఏదో శాపవశాత్తు, ఇలా కష్టపడుతోంది అని అనిపించింది.

**నీవెచటనున్ననూ నాకది నందనవనమే**

**నీవున్నపరిసరాలను బట్టి నీ విలువ కాక**

**నీ వల్ల పరిసరాలకు విలువ కలుగు.**

**ఎచట నీ పదాంకముల వీక్షింతు, నచట**

**అడవి దారియు నందనమట్లు తోచు★**

**(★విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ 'గీతాంజలి' తెలుగు అనువాదం చలం)**

'ఆ దేవుడు ఆ దేవితో అలక బూనెనేమో

ఈ తీరుగా శ్రీదేవిని ఇలకు పంపెనేమో'★

**(★ వేటూరి సుందర రామ మూర్తి – చంటి చిత్రం)**

ఆ రాత్రి అతను రాసుకున్న కవితా పంక్తులు అతనికి అయినా అర్థం అయ్యాయో లేదో.

ఆ రోజు నుంచి ఆ అమ్మాయిని కాస్తా ప్రత్యేకంగా గమనించడం ప్రారంభించాడు అని చెప్పవచ్చు. తమ ఇంటి ముందు గది కిటికీలోంచి చూసినా, మేడ ఎక్కి చూసినా వాళ్ళింటి పరిసరాలు, వారి పూదోట స్పష్టంగా కనిపిస్తాయి. ఒకటర్థమయింది అతనికి. ఆమె చాలా కష్ట జీవి. ఆమెని చూసి గడియారాన్ని సవరించుకొవచ్చు.

కష్టాలను మరచి పోవటానికి ఆమె డిసిప్లిన్డ్ లైఫ్ స్టయిల్ అన్న వ్యసనం పెంపొందించుకుందా అని అనిపించింది , సహజంగా బద్ధకస్తుడైన అతనికి.

ఆమె సమయ పాలనకి ప్రతీక.

ఎవరైనా టైమ్ మేనేజ్మెంట్ గురించి డాక్యుమెంటరీ తీస్తే ఈమెని బ్రాండ్ అంబాసిడర్ గా పెట్టుకోవచ్చు అతను తరచుగా అనుకునే వాడు ఆమె జీవిత విధానాన్ని చూసి.

ఉదయాన్నే అయిందింటికి ముందే నిద్రలేచి ఇల్లు ఊడ్వటం ఆమె విధి, ఇంటి ముందు ఆ పూదోటని సైతం కసువు చిమ్మేస్తుంది. ఇంటి ముంగిట కంచె వెంబడి వున్నరోడ్ ను సైతం చక్కగా చిమ్మేది. ఇందులో చెప్పుకోవాల్సిన ఒక అంశం

వుంది. మామూలుగా ఇంటెదురుగా చిమ్మే వారెవరైనా ఎటువైపుది అటు చిమ్మేసి తమింటి ముందు ఒక్కటీ శుభ్రంగా వుంచుకుంటారు. పక్కింటి వారికి ఇబ్బంది అవుతుందేమో అన్న కనీస విచక్షణ వుండదు చాలా మందికి.

ఆమె ఇంటికి అటు ఇటు రెండు వైపులా ఇంకా ఇళ్ళు నిర్మాణం కాకపోవటం వల్ల ఖాళీగానే వున్నాయి ప్లాట్లు. అయినా సరే అటు వైపుకి , ఇటు వైపుకి చిమ్మకుండా, చెత్తనంతా ఒక దగ్గరికి సమీకరించి దానిని తిరిగి ఓ పాత బుట్టలోకి ఎత్తేసి దూరంగా వున్న పబ్లిక్ డస్ట్ బిన్ లో వేసి వచ్చేది.

వారున్న ఇంటి గురించి నిర్మొహమాటంగా చెప్పాలి అంటే, వారికి నిలువనీడ ఒకటి వుండేది అంతే. మరే ఇతర కనీస సౌకర్యాలు వారికి వుండేవి కావు. వాళ్ళింటికి ఉన్న ఒకే ఒక లగ్జరీ కరెంట్ సదుపాయం వుండటం అంతే అని చెప్పవచ్చు. కనీస సౌకర్యాలైన మంచి నీళ్ళ కోళాయి, ఇంటి పైన ఓవర్ హెడ్ టాంక్, టీవీ, టేప్ రికార్డర్, ట్రాన్సిస్టర్ రేడియో, మోటార్ సైకిల్ సయితం వారికి లేవు.

ఇక నీళ్ళు కావాలంటే – అవి మంచి నీళ్ళయినా సరే, స్నానానికి నీళ్ళైనా సరే, ఓ రెండు ఫర్లాంగుల అవతల వున్న ఓ చేదబావి నుంచి తెచ్చుకొనే వారు.

ఇల్లు చిమ్మటం, ముగ్గు పెట్టడం తర్వాత ఈ నీళ్ళ కార్యక్రమం ప్రారంభమయి పోయేది. వాళ్ళ నాన్న గారు చేదిస్తే, ఈ అమ్మాయి, వాళ్ళ అమ్మ గారు బిందెలతో మోసుకుంటు వచ్చి ఇంటికి చేర్చే వారు. ఇంటికి అవసరమైన ప్రతీ నీటి చుక్క ఇలా చేరవేసే వారు. మారుతి కాస్తా పీలగా వుండటం వల్ల కావొచ్చు అతన్నీ ఈ భగీరధయత్నానికి దూరంగా ఉంచే వారు.

జీవించడాన్ని ఒక కళలాగా, ప్రతీ క్షణాన్నీ ఒక ఆనందానుభూతి లాగా ఆస్వాదించేది ఆమె అనిపిస్తుంది. ఆమె జీవించే విధానం లో ఒక లయ వుంది., ఒక పద్ధతి వుంది. బాగా శృతి చేసిన వీణపై ఓ కీర్తనని నాదించి ఆనందించే కళాకారిణి లాగా ఆమె ప్రతిక్షణాన్ని ఆస్వాదించేది. తన కష్టం లోనే ఆనందాన్ని అనుభవించేది.

ప్రచనకారులు, వేదాంతవేత్తలు చెప్పే మాటలు ఆమె ఆచరణలో పెడుతోందా అన్నట్టు వుండేది ఆమె నడవడిక. 'ఎలా వున్న జీవితాన్నిఅలా స్వీకరించు, ఎదుగుదలకై నీ ప్రయత్నాన్ని ఆపవద్దు'. ఆమె తన స్థితి పట్ల ఎప్పుడు కలత చెందినట్టు అనిపించదు.

కానీ తను ఒక సారి తన హృదయాన్ని ఆవిష్కరించింది అతని ఎదుట. అవి అతడు ఎన్నటికీ మరచిపోలేని మధురక్షణాలు. అసలు ఆ అమ్మాయి అలా మాట్లాడుతుంది అని అతడు ఊహించలేదు.

ఆ క్షణాలకి నాందిగా ఒక సంఘటన జరిగింది.

ఉరుములేని పిడుగులా ఊడిపడ్డాడు ఒక రోజు మారుతి. 'మనం సినిమాకెళదాం పద పద' అని తొందరించాడు.

'సరే. ఓ పది నిమిషాల్లో తయారయిపోయి నా సైకిల్ తీసుకుని మీ ఇంటికి వచ్చేస్తా"

"సైకిల్ వద్దు. మనం జట్కా బండి లో వెళదాం" ప్రత్యుత్తరం ఇచ్చాడు మారుతి.

"అదేంటి?"

"మా అక్కయ్య వస్తుంది మన కూడా. ముగ్గురికి జట్కా బండి అయితే సౌకర్యంగా వుంటుంది కద" మారుతి చెప్పాడు.

ఇది ఊహించలేదు అతను.

అతనికి మాటల్లో చెప్పలేని ఒక అనుభూతి కలిగింది.

'వంశీ' దర్శకత్వం వహించిన 'ఆలాపన' సినిమా అది. 'సితార','అన్వేషణ' లతో మంచి ఊపు మీదున్న వంశీకి ఈ సినిమా ఒక షాక్ ఇచ్చింది ఆ రోజుల్లో.

హాల్లో పెద్దగా రద్దీ లేదు. జనం బాగా పల్చగా వున్నారు.

ఇప్పటి మల్టిప్లెక్స్ లలో లాగా రిజర్వేషన్ ఏమీ ఆవసరం వుండేది కాదు ఆ రోజుల్లో. నేరుగా వెళ్ళీ టికెట్ కొనుక్కుని కూర్చుని చూడటమే.

ఆ అమ్మాయి, మారుతి తమ సీట్లలో కుర్చున్నారు. అతడు వెళ్ళి ఆ అమ్మాయికి దూరంగా మారుతి ప్రక్కన కూర్చోబోయాడు.

'ఏయ్. ఇటొచ్చి కూర్చోవా? ఎవరైనా వేరే వాళ్ళు వచ్చి కూర్చుంటే ఇబ్బందిగా వుంటుంది" వీణ మీటినట్టు ఆ అమ్మాయి కోరింది.

అతడు కాస్తా బిడియపడుతూ ఆ అమ్మాయి ప్రక్కన కూర్చున్నాడు. మధ్యలో ఆ అమ్మాయి, ఒక వైపు తను మరో వైపు మారుతి. అదీ సీటింగ్ అరెంజ్‌మెంట్.

తన చేతిని ఏమాత్రం ఈ అమ్మాయి వైపున్న హేండ్ రెస్ట్ పై పెట్టుకోకుండా, సినిమా చూసినంతసేపు, అటువైపు హేండ్ రెస్ట్ పై మాత్రమే వుంచుకున్నాడు అతను.

అది భయమో, సంకోచమో కాదు. అతడు పుట్టి పెరిగిన వాతావరణం, అతనికి లభించిన జన్మ సంస్కారం వల్ల తనకు తెలియకుండానే అలా ప్రవర్తించాడు.

ఆ అమ్మాయి అదేం గమనించనట్లే సంగీతం గురించి, నటీనటుల నటన గురించి చర్చిస్తూ, రాగాలగూర్చి, స్వరాల గూర్చి అతనికి తెలియని ఎన్నో విషయాలు చెబుతోంది. అతనికి కొద్దిగా అర్థం అవుతోంది. కొద్దిగా అర్థం అవటం లేదు.

ఈ సంఘటన పైకి కనిపించినంత మామూలుగా ముగిసి పోలేదు.

దీని ప్రభావం ఆ తరువాత జీవితంలో ఆమే తీసుకొనబోయే నిర్ణయాలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని ఛాయామాత్రంగా కూడా తెలియదు అతనికి ఆ క్షణంలో.

అప్పుడు రాత్రి పది దాటుతోంది.

కొబ్బరాకుల్లోంచి నిండు చంద్రుడు దోబూచులాడుతున్నాడు. మిద్దెపై పడుకున్న ఆమెకి ఎంతకీ నిద్ర రావటంలేదు. అలసిపోయిన అమ్మా,నాన్నా గాఢమైన నిద్రలోకి జారుకున్నారు. క్రింది గదిలో మారుతి టెక్స్ట బుక్స్ ముందేసుకుని చదువుకుంటున్నాడు.

అమె ఆలోచిస్తూ వుంది. ఎంతకీ ఆమె ఆలోచనలు ఒక కొలిక్కి రావటం లేదు.

***ఆమె అంతరంగం:***

'ఎవరితడు? నేనతన్ని చూసి సరిగ్గా ఆరు నెలలు కూడా కాలేదు. ఎందుకు ఇంత సంచలనానికి గురువుతోంది నా మనసు? అతన్ని చూడంగానే ఏదో ఉద్విగ్నత. అతనితో మాట్లాడుతు వుండి పోవాలని ఒక తపన. అతని సమీపంలో మనసుకు ఒక నిశ్చింత. అతనితో మాట్లాడుతూ వుంటే మనసుకు ఒక నెమ్మది.

కాలేజికి వెళ్ళకుండా ఇంటి బాధ్యతలు నేను తలకు ఎత్తుకోవటం మా ఇంట్లో అందరికీ సాధారణమైన విషయంలా అనిపించింది. కానీ అతను ఆ విషయం తెలిసిన రోజున ఎంత ఆశ్చర్యపోయాడొ.

అతని కళ్ళలో ఆశ్చర్యం, ఆశ్చర్యాన్ని మించి వేదన. 'మీరు ఇంత చిన్న వయస్సులో ఉద్యోగం....?' అంటూ మాటలు పూర్తి చేయకుండా ఆగి పోయాడు. మరలా నేను ఎక్కడా నొచ్చుకుంటానో అని సంకోచ పడ్డాడు.

అతనిలో నాకు ముఖ్యంగా నచ్చే అంశం అదే.

ప్రతీ మాట, ప్రతి చేత నా కోణంలో ఆలోచించి నన్ను నొప్పించకుండా వుండేలా జాగ్రత్త పడతాడు.

తన దృష్టిలో నేను ఎంతో ఎదిగిపోయానట. అతను అలా పొగిడేస్తుంటే ఎంత సిగ్గేసిందో. అతని ప్రవర్తన లో గానీ మాటల్లో గాని ఎక్కడా అతిశయం ఉండదు.

నేను పడుతున్న కష్టాల నుంచి ఖచ్చితంగా నాకు విముక్తి లభిస్తుందని, నన్ను ఊరడిల్లమనే వాడు. పైకి అలా గంభీరంగా కనిపిస్తానే కానీ నాక్కూడా ఎవరైనా ఇలా సాంత్వన వచనాలు పలికితే బాగుండు అని ఉండేది.

అతని మాటల్లొ ఎక్కడా నాటకీయత, కృతకత్వం వుండవు. చాలా సహజంగా మాట్లాడుతాడు.

పెద్దల దగ్గర ఎంత వినయంగా వుంటాడో చెప్పలేను. మా అమ్మానాన్నల్తో ఎంత గౌరవంగా మాట్లాడతాడొ. ఒక్కోసారి అతను మా అమ్మానాన్నలతో మాట్లాడుతు వుంటే ఎందుకో ఎంతో అలవాటైన ఇంటి అల్లుడు పండగకి వచ్చి అత్తా మామలతో మాట్లాడుతు ఉన్నట్టు అనిపిస్తుంది.

అలాంటప్పుడు 'చ! నేనేంటి ఇలా ఆలోచిస్తున్నాను' అని నన్ను నేను కట్టడి చేసుకొనే దాన్ని.

అతను ఐశ్వర్యంలో పుట్టిపెరగటం వల్ల ఒక్కోసారి చాలా జీవితానికి సంబంధించి, కష్టాల గురించి చిన్న చిన్న మౌలిక విషయాలు కూడా తెలియవు అని అనిపిస్తుంది. అతను ఒక్కోసారి వేసే ప్రశ్నలు మా పేదరికాన్ని ఎత్తిపొడుస్తూ అంటున్నాడా అనిపిస్తుంది, కాని అతని కళ్ళలోని అమాయకత్వం, మంచితనం చూస్తే అతన్ని ఎందుకో కాపాడాలి అనిపిస్తుంది. అర్థం లేని భావం ఇది. అతన్ని నేను కాపాడటం ఏమిటి? లోకం గురించి అసలు ఏమి తెలియని ఇంత అమాయకుడు ఏమిటా ఇతను అని జాలి వేస్తుంది. అతన్ని హత్తుకుని 'బుజ్జోడురా నీవు' అని ముద్దుగా అనాలనిపిస్తుంది.

అతని ప్రతి మాట నాకు ఇష్టం. అతని ప్రతి ఆలోచనా నాకు ఇష్టం.

ఏమిటి నేను చాలా దూరం ఆలోచిస్తున్నానా అని అప్పుడప్పుడు అనిపిస్తోంది. కాని నాకెందుకో అతడు చాలా ఆత్మీయంగా అనిపిస్తాడు.

అతనిలోని సంస్కారం నాకు చాలా నచ్చింది. ఎంతో జన్మ సంస్కారం ఉంటే గాని అంత చక్కటి ప్రవర్తన ఒక మనిషికి అలవడదు.

**మొన్న ఆలాపన** సినిమాకి వెళ్ళినప్పుడు అతని ప్రవర్తనతో నా దృష్టిలో అతను ఆకాశమంత ఎదిగిపోయాడు.

'పర్లేదు అలా ఇబ్బందిగా కూర్చోకు, హాయిగా కూర్చో అని అతనికి ఎంత చెప్పినా నా వైపున్న హేండ్ రెస్ట్ పై చేయి వేస్తే ఒట్టు. అతని ఇబ్బందిని పోగొట్టటానికి నేనే ఏదో ఒకటి కబుర్లు చెప్పాల్సి వచ్చింది. సంగీతం గురించి నేను చెబుతుంటే చిన్నపిల్లాడిలా విన్నాడు.

అతనికి సంగీతం గురించి ఏమి తెలియనట్టు నన్ను తృప్తి పరిచే దానికి నటిస్తాడు. కాని సంగీతం గురించి అతనికి తెలియని విషయం లేదు.

అతను పాశ్చాత్య సంగీతం, హిందుస్థాని సంగీతం, కర్ణాటక సంగీతం, సంగీతం లో ఫ్యూషన్ ఇలాంటి వాటిని గూర్చి వివరిస్తూ మొన్న కాలేజి ఆడిటోరియంలో ఇచ్చిన ఉపన్యాసం విని దంగైపోయాను. నేనా మీటింగ్ కి వెళ్ళలేదు అని అతను అనుకుంటున్నాడు.

కాలేజి లైబ్రరీలో పుస్తకాలు తెచ్చుకోటానికి వెళ్ళి అలాగే వస్తూ ఆడిటోరియం వద్ద ఏదొ కోలాహలంగా ఉంటే వెళ్ళాను. డిబేట్ ఏదో జరుగుతోంది. సర్లే అని వెనక్కు రాబోతున్న నేను అతని పేరు మైకులో వినిపించే సరికి మంత్రముగ్ధలా వెళ్ళి చివరి వరుస లో కూర్చున్నాను.

అతను తన వంతు వచ్చినప్పుడు మాట్లాడిన మాటలు విని ఆకాశమంత ఆశ్చర్యం కలిగింది.

'ఏ సంగీతం గొప్పది?' అన్నది అక్కడి డిబేట్ అంశం. ఒక్కొక్కరూ ఒక సంగీత శైలికి మద్దతుగా మాట్లాడుతుంటే, ఇతను మాత్రం వేదికనెక్కి గంభీరంగా "పెద్దలు మన్నించాలి. అసలు ఈ టాపిక్కే అర్థరహితమైనది." అని ప్రారంభించాడు.

"సృష్టి లో ప్రతి సంగీత ప్రక్రియకి తనదైన ప్రత్యేకత వుంది. ఆయా ప్రాంతాల్ని బట్టి ఆయా సామాజిక పరిస్థితులను బట్టి అక్కడ సంగీతం వేళ్ళూనుకుని బలంగా వృక్షంలా ఎదుగుతుంది. ఇందులో ఒకటి ఎక్కువ ఒకటి తక్కువ అనే ప్రసక్తి లేదు.

ట్రినిటీ ఆఫ్ కర్ణాటికి క్లాసికల్ మ్యూజిక్ అనదగ్గ 'త్యాగరాజస్వామి, ముత్తుస్వామి, శ్యామశాస్త్రి గార్లు ఎంత గొప్ప వారో తన అలసట మర్చి పోవటానికి 'హైలెస్సో, హైలెస్సో అని రాగం అందుకునే పడవని నడిపే వాడు కూడా అంతే గొప్పవాడు.

మైకేల్ జాక్సన్ ఎంత గొప్పవాడో, జెర్రమొచ్చింది అని జానపద గీతం అందుకునే కడప మునెయ్య కూడా అంతే గొప్ప వాడు.

అసలు ఈ సంగీత ప్రక్రియలలో ఏదో ఒక దాన్నే ఎన్నుకుని దానికే గుడ్డిగా మద్దతు పలకటంలో నిష్ణాతత చూపే వాడికే ప్రయిజు అన్న పక్షాన నాకు ప్రయిజే వద్దు. నేను చెప్పదలచుకున్న విషయాన్ని సూటిగా చెప్పగలిగాను అన్న తృప్తి చాలు నాకు.

నాకు సంగీతం ఏదయినా ఒక్కటే. ఈ భేదాలు వద్దు"

అలా పది నిమిషాలు సాగిన ఆ ప్రసంగంలో అతను చెప్పిన ఎన్నో విషయాలు నాకు అసలు అర్థం కాలేదు. సంగీతంలో ఎంతో తెలుసు నాకు అనుకునే నాకు ఆ రోజు నిజంగా భంగపాటు జరిగింది.

మా మధ్య ఎవరేం పోటీ పెట్టకున్నా, నిజంగా నేను సంగీత జ్ఞానం విషయంలో అతని ముందు ఓడిపోయిన అనుభూతి కలిగింది. నీ గెలుపూ నాదని తలచి.. అన్నట్టు ఏదో తెలియని ఆనందంతో ఇంటి దారి పట్టాను. అతను నన్ను చూడలేదు.

అతనికే ఫస్ట్ ప్రయిజు వచ్చిందని తరువాత వేరే వాళ్ళ ద్వారా తెలిసింది. కానీ ఈ పోటీ గురించి గానీ తనకు ఫస్ట్ ప్రయిజు వచ్చిందని గానీ జబ్బలు చరచుకుంటూ వచ్చి నాకేం చెప్పుకోలేదు. ఆ తరువాత కలిసినప్పుడు సయితం నేను చెప్పే విషయాలు ఆసక్తిగా విన్నాడే గానీ తన గొప్ప ఏమీ చాటుకోలేదు. ఇలాంటి వ్యక్తిని నేను మొదటి సారి చూస్తున్నాను.

అతన్ని దగ్గర నుంచీ చూసే కొద్దీ ఆశ్చర్య పోవటం నా వంతు అవుతూ వుంటుంది. అతను కథలు, కవితలు వ్రాస్తూ వుంటాడు అట. అవి అనేక పత్రికలలో పడ్డాయట, ఆకాశవాణి కడపకేంద్రం లో ప్రసారం అవుతూ వుంటాయట. అతని ఫైల్ యధాలాపంగా చూసి ఆశ్చర్యపోయాను.

మా పరిచయం అయిన కొత్తల్లో అతన్ని 'మీరు ... మీరు' అనే దాన్ని. ఇప్పుడు అలవోకగా ఏకవచనంలో పిలిచేస్తున్నాను. అతను చాలా రోజులు నన్ను 'మీరు... మీరు' అనే సంబోధించే వాడు.

నన్ను ఏకవచనంతో పిలవచ్చు అని నేనెంత నచ్చజెప్పినా అతను నన్ను బహువచనంతోనే పిలిచే వాడు. నేనే ఒక సారి, 'నువ్వు గనుక నన్ను మీరు గీరు అని పిలవటం ఆపకుంటే నాతో మాటలు మానేయవచ్చు. నన్ను ఏకవచనం తో పిలిచే వరకు నాతో మాట్లాడొద్దు పో' అని అలక నటించేటప్పటికి విధిలేక నన్ను ఏకవచనం తో సంబోధించటం మొదలెట్టాడు.

అతనికి నేనంటే ఎంత గౌరవమో అంత ఇష్టం ఇది నేను తొలి నాళ్ళలోనే గమనించాను.

అతన్ని ఒక సారి అడిగాను "నీవు కథలు, కవితలు వ్రాస్తావట కద" అని.

అదే ఇంకొకరు ఇంకొకరు అయితే రెచ్చిపోయి తెగ పోజు కొట్టి వుండేవారు. ఇతను తెగ సిగ్గుపడిపోయి, 'అయ్యో అవన్నీ ఏవో పిచ్చి రాతలు అంతే" అని తెగ ఇబ్బంది పడిపోయాడు అతను.

అలాగన్చెప్పి ఎప్పుడు సిగ్గు పడుతూ వుంటాడని చెప్పలేను.

ఒకసారి నా కళ్ళవెంబడి నీళ్ళు సుడులు తిరిగేలా కోప్పడ్డాడు. అసలేమి జరిగిందంటే.

నేను అతని పర్సనల్ ఫైల్ తెరచి ఒకసారి అతను వ్రాస్తున్న కవిత ఏదొ చూస్తుంటే అకస్మాత్తుగా ఊడిపడ్డాడు గదిలోకి, ఇక ఏమి అనటానికి తోచక నేను చప్పున "మీ చేతివ్రాత చాలా బాగుంది" అన్నాను.

నిజానికి అతని చేతివ్రాత చాలా వంకరటింకరగా కోళ్ళుకెలికినట్టు వుంటుంది. పోన్లే అని పొగిడితే ఏమయినా కృతజ్ఞత వుందా ఈ మనిషికి?

'బీ ఇన్ యువర్ లిమిట్స్. డోంట్ టచ్ మై ఫైల్స్' అని ఇంగ్లీష్ లో స్టయిల్ కొట్టాడు.

'అసలు ఎవర్ని అడిగి తన ఫైల్స్ తాకానని ఇంతెత్తు ఎగిరి పడ్డాడు. తన కథలు, కవితలు చదవొద్దు' అని కోప్పడ్డాడు

నాకు అసంకల్పితంగా కళ్ళలో నీళ్ళూ సుళ్ళు తిరిగాయి.

కళ్ళ నీళ్ళు దాచుకుంటూ బుంగమూతి పెట్టుకుని చివుక్కున లేచి ఇంటికి వచ్చేశాను. నాకు నిజానికి కోపం రాలేదు. దుఃఖం కలిగింది. ఏం మనిషి ఇతను అని చాలా బాధ పడ్డాను. అయినా తప్పు నాదే కద అని సరిపెట్టుకున్నాను.

అన్నట్టు అతనికి ఇంగ్లీష్ కూడా అద్భుతంగా వచ్చు అన్న పేరుంది.

చాలా త్వరలోనే మా కాలనీ లో స్టూడెంట్లందరు ఇంగ్లీష్ కి సంబంధించి ఇతని దగ్గరికి డవుట్లు అడిగే దానికి వెళ్ళే స్థాయిలో ఇతను పాపులర్ అయిపోయాడు

నా కళ్ళలో నీళ్ళు తెప్పించిన ఈ మహానుభావుడు, మరో అరగంట కల్ల నా ముందర వాలిపోయాడు.

నేను ఇంటికి వచ్చిన అరగంటకి అతను వచ్చి 'సారీ. నీ మనసు నొప్పించాను. నాకు ఎందుకో గానీ ఎవరైనా నా కథలు, కవితలు పూర్తవకముందే చదివితే తెగ సిగ్గేస్తుంది. అలాంటప్పుడు వారిని ఎంతలా విసుక్కుంటానో నాకే తెలియదు. నాపై నాకే స్పృహవుండదు అలాంటి క్షణంలో. అంతే తప్పనిచ్చి నిన్ను నొప్పించాలని కాదు. నిన్ను విసుక్కున్నందుకు మనస్ఫూర్తిగా సారి.'

అతను సారి చెబుతుంటే నాకు ఎంత ముద్దొచ్చిందో. కాసేపు బెట్టు చేసి 'అదేం లేదులే. నాక్కూడా నీపై కోపం రాలేదు. నాకు తీవ్రమైన దుఃఖం కలిగింది నీవలా తిట్టేసరికి. అయినా తప్పు నాదే కద. నాకు బాగ అయిందిలే. ఇంకెప్పుడు నీ దగ్గర చొరవ తీస్కుని నీ కవితలు కథలు, పూర్తవక ముందే చదవను లే; నాకు బాగా సిగ్గేసింది. నీ ఫైల్ చూస్తూ నీకు పట్టు పడ్డానని' అని చెప్పాను.

ఆ క్షణాలు బాగా నచ్చాయి నాకు. అవి మధురమైన క్షణాలు అని అనిపించింది.

నన్ను గుర్తించి, నా భావాల్ని గౌరవించి నేనెక్కడ నొచ్చుకున్నానో అని అతను అలా ఫీల్ అవటం నాకు బాగా నచ్చింది.

ఆ తరువాత ఒక గొప్ప పరిణామం జరిగింది. ఆ తరువాత అతను తను వ్రాయ బోయే కథలు, కవితల గురించి నాతో చర్చించే వాడు, వాటిని మధ్యలోనే నాకు చూపించే వాడు.

"అదేంటి ఎవరయినా మధ్యలో చూస్తే నీకు కోపం అన్నావు కద అన్ననా మాటలకి, అతని సమాధానం నన్ను అవాక్కయ్యేలా చేసింది.

"నాకు ఎందుకో నీకు చూపిస్తుంటే వేరే పరాయి వారికి చూపిస్తున్నట్టు అనిపించటం లేదు. నాకే నేను చూపిస్తున్నట్టు అనిపిస్తోంది. నీకు చూపించిన ప్రతి సారి నాకు ఇంకా మంచి మంచి భావాలు అప్రయత్నంగా వచ్చేస్తున్నాయి. నీవు నాకు ప్రేరణని ఇస్తున్నావు ఒక రకంగా".

కొన్ని కొన్ని భావాలకు అర్థం వుండదు.

ఆ తర్వాత అతన్ని చూడంగానే నాకు కూడా చాలా దగ్గరి వాడు అన్ను భావన బలంగా కలిగేది. అతని సాన్నిధ్యంలో నాకు ఎక్కడ లేని ఊరట కలిగేది. అతన్ని నాకు రక్షకుడిగా దేవుడు పంపాడేమో అన్నంత స్థాయిలో నాలో పిచ్చి పిచ్చి ఊహలు కలిగేవి.

ఇతన్ని నేను జీవితభాగస్వామి గా పొందగలిగితే ఎలా వుంటుంది అన్న ఆలోచన నాకు ఒక్కోసారి తీవ్రంగా కలిగేది.

కానీ జీవితం తాలుకు యధార్థాలు కళ్ళముందు నిలిచి నా ఆలోచనలు ఎంతమాత్రం ప్రాక్టికల్ అని నన్ను ప్రశ్నించాయి.

మా ఇద్దరి కులం ఒక్కటే దేవుడి దయవలన. కానీ ఆర్థికంగా వారికి మాకు హస్తిమశకాంతర వ్యత్యాసం వుంది. నా ఆశలన్నీ అత్యాశలేమో. కోరకూడని కోరికని కోరుకుంటున్నానేమో.

నాకేంటి ఇలాంటి ఆలోచనలు వస్తున్నాయి.

ఏది ఏమైనా అతనికి నా మనసు తెలపడం సబబు అని అనిపించింది.

నా ఆలోచనల్లో ఒక స్పష్టత రావటం వల్లనుకుంటాను నాకు ఒక విధమైన నిశ్చింత అనిపించింది.

మబ్బుల్లో దాగున్న నిండు చంద్రుడు బయటికి వచ్చి వెన్నెల విరజిమ్ముతున్నాడు.

ఇలా ఆలోచిస్తూ నిద్ర లోకి జారుకున్నాను.

"రేపు మధ్యాహ్నం కాలేజీకి వెళ్ళబోయే ముందు నన్ను కలువగలవా?" ఆమె అడిగింది.

అతడు తలూపాడు.

ఎందుకని అతడేం అడగలేదు.

మధ్యాహ్నం అతను వాళ్ళింటికి వెళ్ళేటప్పటికి ఆ అమ్మాయి భోంచేసి స్కూలుకు వెళ్ళటానికి సిద్ధమవుతోంది. వాళ్ళ అమ్మగారు కునుకు తీస్తున్నారు.

'ఒక్క క్షణం ఆగు' అన్నట్టు కనులతోనే చెప్పి ఆమె లోనికి వెళ్ళింది.

అంత చిన్న వయస్సులో ఆమె చీర కట్టుకోవటం లో ఏదో తెలియని అందం వుంది. ఒక విధమైన చందనం రంగు కాటన్ చీర, మెరూన్ రంగు బార్డర్, అదే రంగు జాకెట్. గంధం కలర్ చీర పై కనిపించీ కనిపించక లేలేత గోధుమ రంగులో లతలూ తీగెలు అల్లుకున్నట్టు డిజైన్. మొత్తమ్మీద ఆమె చాలా ఆకర్షణీయంగా కనిపిస్తోంది.

చెంగు చెంగున లేడి పిల్లలా వేగంగా లోని గదిలోకి వెళ్ళింది. వెళ్ళటం ఆలశ్యం మరు నిమిషంలో మెరుపుతీగ లా వెను తిరిగి వచ్చింది.

వస్తూ వస్తూ రెండు నోట్ బుక్స్ పట్టుకుని వచ్చింది.

'ఇవి పంకజ్ సార్ గారికి ఇవ్వవా? నేను హిందీ లెసన్స్ ప్రిపేర్ అవ్వటానికి తెచ్చుకున్నాను, సారీ నిన్ను ఇబ్బంది పెడుతున్నాను" అంది.

"ఏమి పర్లేదు. నేను ఇస్తాను" అన్నాడు అతడు. ఆ బుక్స్ తీసుకుని సైకిలెక్కి బయలుదేరాడు.

సైకిల్ మీద వెళుతున్న వాడల్లా, వీధి మలుపు తిరుగుతుండగా ఓ చిలిపి ఊహ వచ్చి ఆగాడు అతడు.

'ఈ నోట్ బుక్స్ లో తనకు ఏమయినా లెటర్ గానీ పెట్టలేదు కద' అనిపించి ఆ రెండు నోట్ బుక్స్ వంక చూశాడు.

వీధి చివర రోడ్డు మలుపులో సైకిల్ ఆపుకుని, ఓ కాలు నేలపై ఆన్చి, సైకిల్ హ్యాండిల్ బార్ పై అమర్చిన ఫ్రంట్ క్యారియర్ పై పుస్తకాన్ని ఉంచి, అన్ని పేజీలు తిరగేశాడు.

'ఊహూ, ఏమీ లేవు'

'తనవి పిచ్చి ఆలోచనలు కాకుంటే, ఆమె తనకు ఎందుకు ఉత్తరాలు వ్రాస్తుంది?' అని చిన్నగా నవ్వుకున్నాడు అతను.

తన ఆలోచనకు తనకే నవ్వు వచ్చి తిరిగి కాలేజికి బయలుదేరాడు. దూరం నుంచి ఆ అమ్మాయి తననే గమనిస్తోందని అతనికి ఆ క్షణంలో తెలియదు.

అతడికి ఎప్పుడు ఆశ్చర్యంగా అనిపించే అంశం ఒకటుంది. ఆ కుటుంబ సభ్యులు అంత కష్టపడి జీవిస్తున్నారు కద. చుట్టు ప్రక్కల వారికి వారి పట్ల ఎంతో గౌరవం, సానుభూతి ఉండాలి కద.

కాని తద్విరుద్ధంగా ఆ కాలనీ వారికి చాలామందికి వారి పట్ల చిన్నచూపు, ఇంకా వివరంగా చెప్పాలంటే వారి మీద ఒక విధమైన ఏవగింపు.

అతనికి కారణం తెలియదు.

అతను ఆ విషయం వారిని ఎప్పుడూ ఒపెన్ గా అడగలేదు. ఎంబరాసింగ్ గా ఉంటుంది కద అని.

ఆ తరువాత వాళ్ళ ద్వారా వీళ్ళ ద్వారా తెలిసింది ఏమిటంటే, వాళ్ళు ఒక సంవత్సరం క్రితం వాళ్ళ పెద్దమ్మాయి పెళ్ళి నిమిత్తం బాగా అప్పులు చేయాల్సివచ్చింది అట. అంతవరకు సరే.

కానీ ఆ అప్పుల్ని తీర్చే నిమిత్తం వీళ్ళ అమ్మ గారు ఏదో చీటి పాటలు అని నిర్వహించి, అనేక మందికి నెత్తిన టోపీ పెట్టిందట. ఏతా వాతా జరిగింది ఏమిటంటే వాళ్ళు అప్పులు తీర్చే మాట అటుంచి, కొత్తగా అపకీర్తి మూటగట్టుకున్నారు అనేది అర్థమయింది.

వాళ్ళ అక్కయ్య గారు కూడా అప్పుడప్పుడూ వస్తూ వుండేది. ఆమె ఈ అమ్మాయి కంటే ఓ రెండేళ్ళు పెద్దది వుండొచ్చు. ఆమె భర్త ఏదో చిన్న ఉద్యోగం చేసే వారు.

ప్రిన్సిపాల్ గారి తమ్ముడు అని చెప్పి కావచ్చు, వారందరూ కూడా ఈ అబ్బాయిని చాలా గౌరవంగా చూసే వారు.

ఏది ఏమయినా వాళ్ళింటికి తరచు ఇతను వెళ్ళిరావటం పట్ల అతని అన్న వదినెలు ఏమీ అభ్యంతరపెట్టకున్నా, చుట్టు ప్రక్కల వారు కనుబొమలు ఎగరవేస్తున్నట్టుగా ఇతనికి తరచు అనిపించేది.

ఇక అతని అంతరంగం ఎలా వుందో తెలుసుకుందాం.

నేను అలా ఆగి ఆమె నోట్ బుక్స్ ఎందుకు ఆద్యంతం వెదికానో నాకే స్పష్టంగా తెలియదు.

నాకు ఆమె అంటే ఇటీవల విపరీతమైన ఇష్టం ఏర్పడింది. ఆమెని చూడకుండా ఒక్కరోజు కూడా వుండలేకపోతున్నాను.

ఉదయాన్నే తను 8.30 కల్లా తయారయి స్కూలుకు బయలు దేరుతుంది. మా ఇంటి మేడ మీద ఎక్కి నిలబడితే తను వెళ్ళటం నాకు స్పష్టంగా కనిపిస్తుంది. మా ఇంటి నుంచి వాళ్ళ ఇల్లు దాదాపు ఓ అయిదు వందల అడుగుల దూరం ఉంటుంది. తను కావాలంటే మా ఇంటి వైపు చూడవచ్చు. తను బయలుదేరి రెండు ఖాళీ ప్లాట్లు దాటి మలుపు తిరిగే వరకు మా ఇల్లు కనిపిస్తుంది.

కాని తను ఎప్పుడూ తల తిప్పి మా ఇంటి వైపు చూచినట్టు నాకు అనిపించేది కాదు మొదట్లో. కానీ ఇటీవల ఆమె ఓరగా తలతిప్పి మా మేడ వంక చూడటం నేను గమనించాను కొన్ని సార్లు.

ఆపై తను తన ఎడమవైపుకు మలుపు తిరిగిందంటే ఇక తన మొహం నాకు కనిపించదు. అలాగే తనను కను మరుగు అయ్యే దాక తనను వెనుక నుంచి చూస్తుండిపోయే వాడిని.

సినిమాల్లో మరీ చుపిస్తారు లెండి, కిలోమీటర్ల దూరం నుంచి కూడా వాళ్ళు పాడుకునే పాటలు ఒకళ్ళకొకళ్ళకు వినిపించేటట్టు, వారి మొహాలపైని భావాలు ఒకరివి ఒకరికి స్పష్టంగా కనిపించేటట్టు గాను వెండి తెరపైనే సాధ్యం.

మాకయితే ఒకరి మొహాలు ఒకరికి మరీ స్పష్టంగా కనిపించకున్నా, ఒక మోస్తరులో చూసుకోగలిగేవారం.

నేను ఒక సారి ధైర్యం చేసి తనకు చేయి ఊపాను. తను మొదట కాస్త ఆశ్చర్యపడ్డట్టు కనిపించినా కూడా వెంటనే తను కూడా ఎవరికి కనిపించకుండా చేయి ఊపింది.

నాలో ఆ రోజంతా ఏదో తెలియని ఉత్సాహం.

ఏదో తెలియని ఆనందం. ఒక విధమైన ఉల్లాసం. ప్రపంచాన్ని జయించిన అనుభూతి. దేవత ఎదురై కోరిన వరాన్ని అందించిన అనుభూతి.

ప్రపంచమంతా ఆనందంగా వుందేమో అని అనిపించింది.

ఈ క్షణం ఇలాగే శాశ్వతత్వాన్ని పొందితే బాగుండు అని అనిపించింది.

అంతకు ముందు రోజే మా ఇంగ్లీష్ లెక్చరర్ బాలాజీ బద్రీనాథ్ గారు జాన్ కీట్స్ వ్రాసిన 'ఓడ్ ఆన్ ఎ గ్రీషియన్ ఎర్న్' అనే ఒక అద్భుతమైన కవితని మాకు వివరించారు.

'ఈ ప్రపంచం లో ఏ క్షణం కూడా శాశ్వతం కాదు, కానీ కవి, కళాకారుడు చిత్రికరించిన కళారూపాలలో మన మానసిక భావోద్వేగాలు అనుభూతులు శాశ్వతంగా నిలిచిపోతాయి. చిత్రకారుడు, కళాకారుడు నిజమైన చరిత్రకారుడు. అతని చేతిలో కదిలిపోయె కాలం లోని క్షణాలు శాశ్వతత్వాన్ని పొందుతాయి.... " ఇలా సాగిపోతుంది ఆ కవిత.

ఇక్కడ నా మనస్థత్వాన్ని గురించి కాస్తా చెప్పాలి మీకు.

మాములుగా నన్ను అభిమానించే దగ్గరివారి భాషలో చెప్పాలంటె కాస్తా సిగ్గరిని. కొత్తవారి దృష్టిలో చెప్పాలంటే నేను బహు మొహమాటస్తుడిని. ఇక మీకు ఈ పాటికే అర్ధం అయిపోయివుంటుంది, నాకు పెద్దగా స్నేహబృందం కూడా ఏమీ ఉండేది కాదని.

బాగా చనువుగా ఒకరిద్దరు స్నేహితులతొ మాత్రమే మెలిగే వాణ్ణి. మిగతా వారితో 'హలొ' అంటే 'హలో' అన్నట్టుగా సంభాషణలు సాగించేవాడిని.

నాకున్న ఇద్దరు దగ్గర స్నేహితులు విశ్వనాథ్, ఉమేష్.

ఉమేష్ పూర్తి పేరు ఉమా శంకర ప్రసాద్ అయితే అతన్ని ఉమేష్ అని పిలుచుకునే వారం. ఇంచుమించు నాలో కలిగే ప్రతి భావనని వారితో స్వేఛ్ఛగా పంచుకునేవాడిని.

మేనేజ్మెంట్ పరిభాషలో చెప్పాలంటే నేను టీమ్ ప్లేయర్ ని కాదు, సైకాలజిస్టుల భాషలో చెప్పాలంటే నేను ఇంట్రావర్ట్ని.

చిన్నప్పటి నుంచి కూడా నా నేస్తాలు సంగీతం, సాహిత్యాలే.

నేను చాలా చిన్నవయస్సు నుంచే కాగితాలు ఖరాబు చేసే వాడిని. ఇంట్లోవాళ్ళు వాటిని కవిత్వం అని పేరు పెట్టారు. వారిచ్చిన ప్రోత్సాహంతోనే పత్రికలకి పంపటం, అవి ప్రచురితం కావటం కూడా జరిగేది.

ఆకాశవాణి లో కూడా నా రచనలు, కవితలు విపరీతంగా ప్రసారం కావటం జరిగేది. కానీ ఇదంతా గొప్ప అని కూడా నాకు తెలియదు. ఒకట్రెండు సార్లు స్కూల్లో నేను ఏదో కవితలు వ్రాసుకుంటుంటే మేష్టార్లు కోప్పడటం కూడా జరగటం వల్ల అదేదో చేయకూడని పని అన్చెప్పి నాలో నేనే దాచుకునే వాడిని నా కవితలు, కథల విషయం.

డిగ్రీ చదవటం కోసమని ఈ ఊరికి రావటం నా జీవితంలో అతిపెద్ద మలుపుకు దారితీస్తుందని, ఈ అమ్మాయి పరిచయం నా జీవితంలో సునామి సృష్టిస్తుందని నేను ఏమాత్రం ఊహించలేకపోయాను.

నన్ను బాగా ఆకట్టుకున్న అంశం ఆమె కంఠధ్వని. ఏదో కవులు చెప్పినట్టు చెప్పటం కాదు. ఆమె మాట్లాడితే బాగా శృతిచేసిన వీణియను సుతారంగా గోటితో మీటితే ఎలా ధ్వనిస్తుందో నిజంగా ఆమె కంఠస్వరం అలా వినిపించేది. వందలమందిలో వున్నా నేనామె స్వరాన్ని గుర్తించగలను.

నేను ఖాళీగా వున్నప్పుడు కళ్ళు మూసుకుని ఆమె మాటల్ని నా హృదయంలోనే పదే పదే పలికించుకుని విని మురిసిపోయేవాడిని.

ఆమెని తలుచుకున్నపుడల్లా ఆమె కంఠ ధ్వని నాకు నా హృదయ కుహరంలో వినిపించేది. అది శాశ్వతత్వం పొందింది కూడా. నిజానికి ఆమె మాటల్ని నాలో నేను వినటానికే నేను ఏకాంతాన్ని ఆశ్రయించే వాడిని. నా హృదివీణపై ఆమెపలుకుల్ని పదే పదే స్వరపరచుకుని వినే వాడిని.

సాయంత్రం ఎప్పుడెప్పుడవుతుందా ఆమె మాటల్ని ఎప్పుడెప్పుడు విందామా అని ఉవ్విళ్ళూరే వాడిని.

ఆమె పరిచయం తర్వాత నేను కవితలు పుంఖానుపుంఖంగా వ్రాయటం ప్రారంభించాను. నా ప్రతి పంక్తికీ ఆమె ప్రేరణ. ఆమెని తలుచుకుంటేనే నాలో ఏవో భావనా తరంగాలు.

ఆమెని తలచుకుంటేనే నాలో ఏదో శక్తి తలెత్తేది. ఆమె నా అనుభూతులన్నింటికీ కేంద్రం.

ఆమె నాకు ప్రేరణ.

ఆమె నాకు శక్తి.

ఆమె ఆలోచనలు నాలో ఒక విధమైన పాజిటివ్ వైబ్రేషన్స్ ని నింపేవి. ఆమెని తలచుకుంటూ గంటలు గంటలు గడిపేవాడిని.

ఇలాంటి దేవతా మూర్తులు మామూలుగా చరిస్తూ ఇంటిముందు కసువు చిమ్ముతూ, ఇంటి పనులు చేసుకుంటూ, జీవనాధారానికి పని పాటలు చేసుకుంటూ ఉంటారా?

ఇది ఎలా సాధ్యం?

ఈమెకి ఏ మహిమలూ వుండవా? ఈమె నిజంగా దేవతా మూర్తి కాదా? ఈమె మామూలు స్త్రీయా? అబ్బా ఎంత ఘోరం.

ఆమెని నేను ఏకాంతంగా కలిసి మాట్లాడిన క్షణాలు చాలా తక్కువ. అయినప్పటికి మా ఇద్దరి మధ్య గాఢమైన అనుబంధం వుంది అన్న భావన నాకు కలిగేది. నాకు ఆ అమ్మాయితో అతి తక్కువ సమయంలోనే చాల చక్కటి అవగాహన ఏర్పడింది.

వాస్తవానికి నాకు ఆమెని చూడగానే కలిగిన మొదటి భావన జాలి.

చెప్పాలంటే నాకు ఆమెని చూసినప్పుడల్లా జాలితో పాటు కలిగే భావన ఆశ్చర్యం మరియు అబ్బురపాటు. అవును అబ్బురమే. ఇంతటి సౌందర్యరాశులు ఇలా భూమి మీద చరిస్తు వుంటారా అని. ఇంతటి దేవలోకపు సౌందర్యం కలిగిన స్త్రీ మామూలుగా మా ఇంటికి వచ్చి మాట్లాడుతూ వుంటుందా అని. ఇదంతా కలా నిజమా అని.

నా భావనలలో గానీ, నా దృష్టిలో గానీ ఏ విధమైన వాంఛాయుత ధోరణి గానీ, కామోద్రేకం గానీ వుండేవి గావు.

ఇది నిజం. ఇది ఎంత చెప్పినా స్నేహితులు కూడా నన్ను నమ్మేవారు కాదు.

అంత వెర్రి అభిమానం కూడదు అని హెచ్చరించేవారు.

నేనేమి అపర ప్రవరాఖ్యుడిని అని చెప్పను, నేను అందరి కుర్రాళ్ళలాగా అమ్మాయిల్ని అదోలాగా చూసేవాడిని. కాస్త నదురుగా కనిపించిన అమ్మాయిల గూర్చి స్నేహితులతో కల్సి కామెంట్స్ చేసుకుని నవ్వుకునే వాడిని.

సినిమా హీరోయిన్స్ ని చూసి ఒక విధమైన సెన్సువస్ ఫీలింగ్స్, అనుభూతులు పొందేవాడిని.

కానీ ఈ అమ్మాయి అంటేనే మాటల్లో చెప్పలేని సున్నితమైన భావం.

ఆమె అంటె ఒక ఆరాధన.

అమె అంటే ఒక అవ్యక్తమైన ఇష్టం.

ఆమె అంటే గౌరవం.

ఇవే నాకు కలిగిన భావనలు మొదట్లో తనను చూసినప్పుడు.

తను మొదటి సారి నాతో మాట్లాడినప్పుడు నాకు కలిగిన భావం ఆశ్చర్యం. ఈమె నాతో మాట్లాడను కూడా మాట్లాడుతుందా. అబ్బ ఎంత అదృష్టం నాది. అని నేనెంతగా మురిసిపోయానో నాకే తెలియదు.

ఆమె ఒక దేవకన్య అంతే.

ఏదో విధి వశాత్తు, తన పూర్వ జన్మ తాలూకు కర్మ క్షాళన నిమిత్తం  మర్త్యులు సంచరించే ఈ భూమ్మీద ఆమె సంచరించాల్సిన అగత్యం ఏర్పడి ఆమె ఈ భువిపై పాదాలు పెట్టాల్సొచ్చింది  అని నాకు నేను ఎన్నో సార్లు చెప్పుకున్నాను.

ఆమె ఈ భూలోకంలో ఉండదగిన స్త్రీ కాదు. అది నా బలమైన భావన.

ఇది రూపం మాత్రమే చూసి నేను ఏర్పరచుకున్న భావాలు కాదు. కవిత్వం వ్రాస్తుంటాను అని చెప్పాను కాబట్టి ఏదో పైత్య ప్రకోపం వల్ల ఇలా మాట్లాడుతున్నానేమో అని మీరు అపోహ పడటం సహజమే.

కేవలం రూపం చూసి మాత్రమే ఏర్పడే భావాలు ఇసుక మీది రాతల లాగా చాలా స్వల్ప ఆయుర్దాయం మాత్రమే కలిగి ఉంటాయని మీకూ తెలుసు.

తనని దగ్గర్నుంచి చూసిన ప్రతిసారీ, తను నా దృష్టిలో ఆకాశమంత ఎత్తుకు ఎదిగి పోయేది.

పదిహేడు ఏండ్ల వయస్సు పిల్లలు తల్లితండ్రుల వద్ద గారాం చేసి కోరింది కోరినట్టు పొందటం సహజం ఎక్కడైనా. తను చూద్దామా తన చదువును సైతం, పక్కకు పెట్టి ఇంటికి బాసటగా వుండటం కోసం, తను అంత చిన్న వయస్సులో పెద్ద బరువును తన తలపై పెట్టుకుని స్కూలుకి వెళుతుంటే నాకు ఏదోలా అయ్యేది మనస్సు.

ఉదయం ఎనిమిదిన్నరకి వెళ్ళి దాదాపు సాయంత్రం అయిదు దాకా పని చేసేది. మధ్యలో ఒక అరగంట భోజనానికి వచ్చేది.

ఇక సాయంత్రం వచ్చింది అంటే చుట్టుపక్కల పిల్లలు చాలా మందే ట్యూయిషన్ చెప్పించుకోటానికి సిద్ధంగా కూర్చుని వుండే వారు.

చల్లటి నీళ్ళతో మొహం కడుక్కొని, అద్దం లో బొట్టు సరి చూసుకుని, తనే వంట గదిలోకి వెళ్ళి ఏదో ఇంత ఫలహారం తిన్న శాస్త్రం చేసి ఇక వచ్చి ఆ పిల్లల మధ్య కుర్చీలో కూర్చొనేది. కుట్టు మిషన్ మీద ఏదో కుట్టుకుంటున్న వాళ్ళ అమ్మగారిని ఇబ్బంది పెట్టకుండా, తన పనులను తనే ఇలా చూసుకుని ఆ ట్యూషన్ క్రతువు ప్రారంభించిందంటే దాదాపు ఏడు ఏడున్నర దాకా కొనసాగుతుంది ఆ పని.

అదొక మహా యజ్ఞ్యం. ముంబాయి డబ్బావాలాలకు ఖచ్చితత్వంలో సిగ్మా సిక్స్ రేటింగ్ వుందట. ఇక్కడ ఈమె నిర్వహిస్తున్న ఈ మాహా యజ్ఞ్యం లో ఖచ్చితత్వం ఆ స్థాయిలోనే వుంటుంది అని అనిపించేది నాకైతే.

ఎల్.కే. జీ నుంచీ ఆరేడు తరగతుల వరకు వివిధ స్థాయిల పిల్లలు వుండే వారు ఆ బృందంలో.

వాళ్ళకి క్రితంరోజు ఇచ్చిన హోంవర్కులు సరిచూడటం, ఈవేళ్టి పాఠాలు చక్కగా బోధించడం ఇలా ఏక కాలంలో వివిధ తరగతుల పిల్లలకు పాఠాలు , హోం వర్కులు, డౌట్లు తీర్చటం, వాళ్ళలో వాళ్ళకు వచ్చే తగాదాలను తీర్చటం ఇలా ఆమే చేపట్టిన ప్రక్రియ సహస్రావధానానికన్న తక్కువయినది ఏమి కాదు అనిపించేది.

ఆమె దగ్గర చదువుకున్న పిల్లలు చక్కటి మార్కులతో పాటు, అతి చక్కని సంస్కారాలు పొంది వినయ సంపన్నులుగా పువ్వుల్లా ఎదుగుతున్నారు అని తలితండ్రులు ఎందరో వచ్చి అభినందించి వెళ్ళటం నేను చాలా సంధర్భాలలో గమనించాను.

ఆమె వదనం లో అలసట అన్నది నేను ఏ నాడు చూడలేదు.

ఉదయం ఎనిమిదిన్నరకి స్కూలుకు వెళ్ళేటప్పుడు అప్పుడే విరిసిన గులాబి పువ్వులా ఎలా స్వచ్ఛంగా, తాజాగా ఉండేదో సాయంత్రం ట్యూషన్లు ముగించి పిల్లలందర్నీ ఇళ్ళకు పంపేవరకు కూడా ఆమె అంతే తాజాదనపు చిరునవ్వుతో వుండేది.

**రాక్షసుల్లా** అల్లరి చేసే పిల్లలని సైతం ఆమె విసుక్కొనగా నేను చూడలేదు. లాలనగా, మృదువుగా, ప్రేమగా తేనెలూరె తియ్యదనంతో మాట్లాడేమాటలతోనే ఆమె ఆ పిల్లలను సముదాయిస్తూ ఉండేది.

చిత్రం ఏమిటంటే ఆమె సమక్షంలో పిల్లలందరూ కూడా మంత్ర ముగ్ధులుగా ప్రవర్తించే వారు. ఆమె చుట్టూ చేరి ఆమె చెప్పినట్టు వినేవారు. మొదట్లో అల్లరి అల్లరిగా వున్న పిల్లలు సైతం ఆమె ఆదరణతో, లాలనతో, ప్రేమతో ఏదో కనికట్టుకి గురి అయినట్టు నెమ్మదిగా ప్రవర్తించే వారు.

ఈ యావత్తు తతంగంలో ఆమె ప్రవర్తనలో ఎక్కడా కృతకత్వం కనిపించేదు కాదు, ఆమె హృదయం నుంచి ఒక జీవనదిలా సాటి వారందరిపట్ల ప్రేమ పొంగి ప్రవహించేది. ఏ కోశాన నాటకీయత వుండేది కాదు ఆమె ప్రవర్తన లో.

మూర్తీభవించిన మానవత్వం, జీవనది ఆనకట్ట తాలూకు  గట్లు తెగాయా అన్నట్టు సాటి వారిపై ప్రేమ ఉప్పొంగి ప్రవహించేది.

ఎవరితో ఎంత మేరకు మాట్లాడాలో అంతమేరకే మాట్లాడేది.

నేను విధిగా సాయంత్రాలు వారి ఇంటికి వెళ్ళి కాసేపు కూర్చుని వచ్చేవాడిని. ఆ అమ్మాయి తమ్ముడు మారుతికి కాలేజిలో ప్రాజెక్టు వర్క్స్ గట్రా పెరిగిపోవటం వల్ల క్రమంగా ఆలశ్యంగా రాసాగాడు ఇంటికి.

వాళ్ళ అమ్మగారు ఏదో ఒక దగ్గరకు బయటకు వెళ్ళే వారు. వాళ్ళ నాన్నగారు ఆ సమయంలో అరుదుగా ఇంట్లో వుండేవారు. సర్వ సాధారాణంగా నేను సాయంత్రాలు ఎప్పుడు వెళ్ళినా తను ఒక్కర్తే ఇంట్లో వుండేది. కాకపోతే కిష్కిందకాండ లో మర్కటాలు లేకుంటే ఎలాగా, ఆ సమయంలో బోలెడు మంది ట్యూషన్ పిల్లలు ఆమె చుట్టు పరివేష్టించి వుండేవారు.

మొదటి సారి అలాంటి సమయంలో నేను మొహమాట పడి వచ్చేయబోతే, "ఏం పర్లేదు. కూర్చో ఏవన్న మాటలు చెప్పు. నాకూ పొద్దున్నుంచి ఒకటే రొటీన్ గా గడిచిపోయింది. నీవు ఏవయినా కబుర్లు చెప్పవా?" అని కోరింది.

ఆ మాటలో ఏదో మంత్రం ప్రభావం వున్నట్టు ఆగిపోయాను.

దగ్గర ఇండ్లలోంచి ఏవో టీవీ కార్యక్రమాల చప్పుడు వినిపించేది. వాళ్ళింట్లో టీవీ వుండేది కాదు. అప్పుడప్పుడే దూరదర్శన్ వచ్చిన కొత్తలు. అప్పటి దాకా ఆకాశవాణి ఒక్కటే వినోద సాధనం ఇండ్లలో.  నా కాలేజీ ముచ్చట్లు, మా ఇంట్లో నేను చూసొచ్చిన దూరదర్శన్ కార్యక్రమాల ముచ్చట్లు ఇలా ఏవేవో  అంశాలు మా మాటల మధ్య దొర్లేవి.

టీవీలో అరుణ్ గోవిల్, దీపికా చికిలియాలు రాముడు సీతలుగా నటించిన రామానంద సాగర్ గారి 'రామాయణం ప్రసారమయ్యేది ఆ రోజుల్లొ.

తను చాల మొహమాట పడుతు మా ఇంటికి వచ్చి ప్రతి ఆదివారం మా ఇంటికి వచ్చి రామాయణం చూసేది. వచ్చిన ప్రతి సారి మా వదినె గారికి బోలెడు కూరగాయలు, ఆక్కూరలు పట్టుకొచ్చేది 'మా ఇంటి దగ్గర పండాయి ఆంటీ' అంటూ వీణ మీటినట్టు చెప్పేది.

అంతేకాదు, ఆ కాసేపట్లో మా వదినెకి పనిలో బోలెడు సహాయపడేది. కూరగాయలు తరిగి ఇవ్వటం, ఇల్లు కాస్తా సర్ది పెట్టడం, ఇవన్నీ కూడా తను చాలా సహజంగా చేసేది.

జీవనది అయిన ఒక పుణ్యనది తాను పారినంత మేరా నేలని సశ్యశ్యామలం చేస్తూ అందరి దాహార్తిని తీరుస్తూ ఎలా వెళుతుందో, తను కూడా తను చరించినంత మేరా తన వల్ల ఇతరులు ఏ విధంగా లాభపడగలరు అన్నట్టు ప్రవర్తించేది.

మా అన్నయ్య ఒక వేళ ఆ గదిలో కి వస్తే చప్పున లేచి నిలబడి పోయేది. ఆయన ఏదో ఒక ఆసనం లో ఆసీనుడు అయ్యేవరకు కూర్చునేది కాదు.

పెద్దలంటే ఎంత గౌరవమో, అంత ప్రేమని పంచేది. ఇదంతా కృతకంగా వుండక చాలా సహజంగా చేసేది.

తను ఒక ప్రేమ మూర్తి, తను ఒక గొప్ప సంస్కారి, తను ఒక కర్మయోగి,

తను ఒక సంగీత నిధి

తను ఒక మూర్తీభవించిన ఓదార్పు

తను ఒక దేవత. ఇంతకంటే మాటల్లో చెప్పలేని అశక్తత నాది.

అక్కడే సోఫాలో కూర్చుని వున్న నన్ను చూసి చిలిపిగా, సిగ్గుగా నవ్వేది అప్పుడప్పుడు. ఒక్కోసారి తను నా ప్రక్కనే వచ్చి కూర్చునేది సోఫాలో చనువుగా. రామానంద సాగర్ కి అందుకే నేను చాలా ఋణపడి వుండాలి నిజానికి.

తనకు అతి సిగ్గు, అతి మొహమాటాలు ఏవీ వుండేవి కావు.

★★★

మా కబుర్లకు ఇదమిత్తమైన ప్రసంగాంశం అంటూ ఏదీ వుండేది కాదు. ఏది తోస్తే అది. నా మాటలు చాలా శ్రద్దగా , మనసు పెట్టి వినేది. నేను అప్పుడప్పుడే ఆర్కే నారాయణ్ వ్రాసిన ఇంగ్లీష్ బుక్స్ అన్నీచదివటం మొదలు పెట్టిన రోజులు. వాటి గురించి మాట్లాడేవాడిని.

నా వంక అబ్బురంగా చూసేది.

తాను సంగీతం గురించి చాలా లోతుగా మాట్లాడేది.

రాగం, తాళం, శృతి, లయ, తంబూరా, నట్టువాంగం, గమకం, చిట్టా స్వరాలు, ఆరోహణలు, అవరోహణలు ఇలా అనేకపదాలు మొదటిసారి ఆమె దగ్గరే తెల్సుకున్నాను.

ఆమె నాతో మాట్లాడుతు కూడా, ట్యూయిషన్ పిల్లలకు ఏమాత్రం లోటు చేసేది కాదు. వారి వారి అవసరాలు సంపూర్ణంగా చూసుకునేది. అలాగే నాకు కూడా తన ధ్యాస యావత్తు ఆ పిల్లల మీద పెడుతోంది నాతో ఏదో తక్కువ మాట్లాడుతోంది, అన్న అసంతృప్తి ఏ మాత్రం కలిగేది కాదు.

తను పూర్తి సమయం నాకై వెచ్చిస్తోంది అన్న భావన కలిగేది నాకు. ఇవి కాక, బట్టలు మడిచే ప్రక్రియ ఇంకో ఎత్తు.

మధ్యలో మెరుపుతీగె లాగా ఎప్పుడు వెళ్ళి తెచ్చుకుంటుందో, వాళ్ళ అమ్మగారు ఉతికి, బయట పూదోటలో ఆరేసిన బట్టలన్నింటినీ తెచ్చుకుని తన ప్రక్కనే పెట్టుకుని, మధ్య మధ్యలో వాటిని చక్కగా మడత పెట్టేది. ఎవరి బట్టలు వారి వారి అరల్లో సర్ది వచ్చేసేది.

ఆ మడతపెట్టే విధానం ఎలాగుండేది అంటే, ఎవరో బాగా మనసు పెట్టి ఇస్త్రీ చేస్తే కూడా అంతకూర్పు రాదు వాటికి. నేలపై వెసుకున్న చాపపై ఆ బట్టలని పరిచి , కోమలమైన తన అరచేతులతో ఆ వస్త్రాలను ఆసాంతం బలంగా అదుముతూ, చక్కగా మడత వేసేది. ఇస్త్రీ చేశారేమో అన్నట్టే వుండేవి అవి.

'ఒక ఇస్త్రీ పెట్టె కొనాలి ఈ సమ్మర్ హాలిడేస్ లో' బట్టల్ని అలా తనదైన బాణిలో మడతలు పెడుతూ అకస్మాత్తుగా ప్రకటించింది ఒక సారి. నా చేతిలో డబ్బులు బాగానే ఆడేవి ఆ రోజుల్లో, అన్నయ్య వదినె ప్రేమతో ఇచ్చే డబ్బు, ఊరినుండి అమ్మానాన్నలు పంపె పాకెట్ మనీ, ఆకాశవాణి వారు పంపే డబ్బులు అయితే ఏమి – వీటి కారణంగా, నా దగ్గర డబ్బులు బాగానే ఉండేవి చేతిలో. నేను తనకు ఓ ఇస్త్రీ పెట్టే కొనిపెట్టటం పెద్ద విషయం కాదు.

చూచాయగా తెలియబర్చాను నా అభిప్రాయాన్ని.

చాలా స్థిరంగా తన అనంగీకారాన్నీ తెలియచెప్పింది. తర్జని చూపిస్తూ చాలా స్థిరమైన కంఠంతో 'ఏ వస్తువూ నువ్వు కొని తేవద్దు. అలా జరిగితే నేను నీతో ఎన్నడూ మాట్లాడను. నీకు నాకు మధ్య మంచి స్నేహం వుంది. అది అలాగే వుండనీ. నాపై జాలీ, సానుభూతి ఎవరు చూపినా నేను తట్టుకోలేను. నాకు ఏమున్నా లేకున్నా అభిమానం వుంది. దాన్ని దెబ్బతీయకు'

ఆ పదాలలోని తీవ్రత, ఆ భంగిమలోని స్థిరత్వం నన్ను కాస్త భయపెట్టాయి.

'అలాగని కాదు.. ' అంటూ ఏదో వివరణ ఇవ్వబోయాను.

'ఈ టాపిక్ వద్దు. ఆపేయ్' ఆమెలో ఒక నియంత కూడా వుంది.

'ఇస్త్రీపెట్టే తెచ్చుకోవాలి అన్నది నాకు ఒక స్వప్నం. నా స్వప్నాన్ని నన్నే సాకారం చేసుకోనివ్వు. ఆ తృప్తి నన్ను అనుభవించనివ్వు. ప్లీజ్ అర్థం చేసుకో. నిన్ను నొప్పించుంటే క్షమించు' అంతలోనే ఆమెలో కరుణ.

నేను బాధపడ్డానేమో అని నాపై కారుణ్యాన్ని చూపింది.

ఆమెకి ఇలాంటి స్వప్నాలు చాలానే వున్నాయి.

తమిళనాడులోని తిరువాయుర్ కి త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవాలకి వెళ్ళి, ముందు వరుసలో కాకున్నా కనీసం చివర్లోనయినా కూర్చుని తంబురా చేతిలో పట్టుకుని శృతిమీటుకుంటూ తన్మయత్వంతో పంచరత్న కీర్తనలు ఆలాపించాలన్నది ఇంకో కోరిక.

సినిమాల్లో కాకున్నా, కనీసం దూరదర్శన్ లో అయినా సరే ఓ చక్కటి పాట పాడాలన్నది ఇంకో కోరిక.

పెద్ద సెలెబ్రెటీ అన్నంత పేరు కాకున్నా, బాగా పాడుతుంది ఈ అమ్మాయి అని అందరు గుర్తిస్తే చాలు అన్న చిన్న కోరిక.

హైదరాబాద్ రవీంద్రభారతీ ఆడిటోరియం వేదికపైనుంచి సోలో పర్ఫార్మెన్స్ ఇవ్వాలి అన్న ఓ చిన్న కోరిక తను తరచు వ్యక్త పరచేది.

తమ్ముడు చక్కగా చదువుకుని జీవితంలో హాయిగా సెటిల్ అవ్వాలనేది,

తమ అమ్మానాన్నలు అప్పుల బాధనుంచి పూర్తిగా విముక్తి పొంది, హుందాగా అందరిముందు తలెత్తుకుని తిరగాలనేది ఆమెకున్న అనేకానేక ఆకాంక్షలలో ఒకటి.

ఆమె తన ఊహలలో సైతం నేలవిడిచి సాము చేసేది కాదు.

ఉత్సాహానికి మారుపేరు లా వుండే తను ఒక్కోసారి చాలా మౌనంగా వుండిపోయేది. నేను వెళ్ళినా కూడా ముక్తసరిగా పలకరించి, పిల్లలకు పాఠాలు చెప్పటంలో నిమగ్నమయ్యేది. నేను పదిమాటలు మాట్లాడితె తను ఒకటొ అరో ముక్త సరిగా బదులు చెప్పేది.

ఒకరోజు తను అలాంటి మానసిక స్థితిలో వున్నప్పుడు నే వెళ్ళటం జరిగింది.

పెద్దగా మాట్లాడలేదు తను నాతో.

సాధారణంగా వెల్లువెత్తిన బ్రహ్మపుత్రా నదిలా వుండే తను గంభీరంగా వుండటం నాకు ఒకింత ఆశ్చర్యాన్ని కలిగించింది. నాకై నేను కలగజేసుకుని ఏదో మాట్లాడబోతే కూడ ఒకటి రెండు ముక్తసరి మాటలతో బదులు ఇచ్చి మిన్నకుంది.

నేను కాస్తొ నొచ్చుకున్న మాట వాస్తవం. నా మాటలకోసం ఎగబడేవారు, నా మాటలకు విపరీతంగా విలువ ఇచ్చేవారు ఉండే వాతావరణంలో పెరిగిన నాకు ఇది ఒక విధంగా శరాఘాతం లా అనిపించింది.

పోనీ నేనేమయినా తప్పు మాట్లాడాన అంటె అదేం లేదు.

నేను కూడా కాసేపు మౌనంగా ఉండిపోయాను.

తన మౌనంతో నేను నొచ్చుకున్నట్టు తనకే అనిపించింది, నేను ఊహించని విధంగా తను అంది

'ఇవ్వాళ నాకు ఎందుకో మనసేమి బాగాలేదు. ఇదమిత్తంగా ఇది కారణం అనికూడా ఏమీలేదు. ప్లీజ్ ఏమనుకోకు. నీపై కోపం ఏమీలేదు. ఎన్నటికీ అలా అనుకోవద్దు . నిజం చెప్పాలంటే నాకు సాంత్వన దొరికేదు నీతో మాట్లాడే ఈ కొన్ని

నిమిషాల సమయం లో మాత్రమే. నీవు ఇంకాసేపు ఇలాగే వుంటే ఇవ్వాళ నీ ముందే ఏడ్చేస్తాను. నాకు ఏమాత్రం మనస్సు బాగాలేదు. ప్లీజ్ వెళ్ళిపో".

ఆమె మౌనం కన్న ఈ మాటలే నాకు ఎక్కువ అయోమయాన్ని కలిగించాయి.

ఆమె అలా మాట్లాడుతుంటే అయోమయంలో పడిపోయాను. నాకు ఏమి అనటానికి తోచలేదు.

ఆమె అలా చెప్పేసి, ఇక తన పనిలో తాను నిమగ్నమయింది.

నిజానికి తను పాఠాలు చెబుతోందే గానీ ఆమె మాటల్లో జీవం లేదు. ఆమెని అంత డిప్రెషన్ లో మొదటి సారి చూడటం జరిగింది. నా మనస్సు బాగా అందోళనకి గురయ్యింది ఆ క్షణంలో.

ఈ లోగా మారుతి కాలేజి నుంచి రావటంతో అతనితో కాసేపు మాట్లాడి ఇంటికి వచ్చేసాను.

ఈలోగా నేను చిత్తూరు జిల్లా  పలమనేరు వెళ్లాల్సి వచ్చింది. కొత్తగా బ్యాంకు ఉద్యోగం వచ్చిన మా అక్కయ్య కి తోడుగా మా అమ్మానాన్నలు అక్కడికివెళ్ళి ఉంటున్నారు.

ఆంధ్రా ఊటీ అని పిలువబడే మదనపల్లి ఉండే జిల్లాలోనే ఉండే ఈ ఊరు చాలా చల్లగా ఉండేది.

కర్ణాటక, తమిళనాడు రెండు రాష్ట్రాల సరిహద్దులలో వుండటం కావచ్చు ఇక్కడి ప్రజల తెలుగు భాష చాలా తమాషాగా ఉండేది.

అక్కడి వాతావరణం చాలా ఆహ్లాదంగా ఉంది. అక్కడికి వెళ్లి ఓ వారం రోజులు ఉండి వచ్చాను. పేరుకు అక్కడ ఉన్నాను కానీ నా మనసంతా ఆదోని లోనే ఉంది. ఎప్పుడెప్పుడు ఆదోని వెళ్దామా, ఎప్పుడెప్పుడు ఆ అమ్మాయిని చూద్దామా అని మనసు నిలకడ లేకుండా ఉండేది. ఏ పని మీద ఏకాగ్రత కుదరకుండా ఉండేది.

మా అమ్మానాన్నలు నా ఈ మానసిక  పరిస్థితిని గమనించనే గమనించారు.

అమ్మానాన్నల్ని వదిలి వేరే ఊళ్ళో వుండి చదువుకోవాల్సి రావటం అదే మొదటి సారి. అది వరలో వాళ్ళను చూడకుండా ఒకట్రెండు రోజులు కూడా అసలు ఉండలేక పోయేవాడిని, అలాంటిది చాలా రోజుల తర్వాత వాళ్ల దగ్గరకి వచ్చి, వాళ్ళని చూసి ఎంతో ఆనందంగా గడపవలసింది పోనిచ్చి, ఏదో ముళ్ళ మీద ఉన్నట్టు గా అన్యమనస్కంగా దిగులు దిగులుగా గడపటం నాకే ఆశ్చర్యాన్ని కలిగించింది. నేను అన్యమనస్కంగా గడపటం వారికి బాధ కలిగించింది.

సరే, ఆ సెలవులు అయిపోయాయి. తిరిగి ఆదోని కి ప్రయాణం.

ఇప్పుడు నా మనసు ఎంత ఆనందంగా  ఉందో మాటల్లో చెప్పలేను. రైలు కంటే వేగంగా వెళ్ళి తనని ఒకసారి కండ్లారా చూసుకోవాలని, తను మాట్లాడుతుంటే అలాగే కూర్చుని చూస్తుండిపోవాలని నా మనస్సెంతా ఉవ్విళ్ళూరిందో మాటల్లో చెప్పలేను.

ఈ తియ్యటి బాధని ప్రేమ అంటారా? ఇలా ఎక్కడ వున్నా తనతో మాట్లాడగలిగేలా ఏదయినా సాధనం వుంటే ఎంత బాగుంటుంది. అందుకేనా కాళిదాసు మేఘాలతో సందేశం పంపించాడు?

నేను చూసే ప్రతి దృశ్యం తనకు చూపించాలని అనిపిస్తోంది. నేను ఈ ప్రపంచాన్ని తన తరఫున సాక్షీ భూతుడిగా చూస్తున్నట్టు అనిపించేది. అన్ని తను మిస్సవుతోందే అని అనిపించేది. ప్రతిది తనకు చెప్పాలని అనిపించేది.

నా ప్రయాణాలు, పలమనేరు వీధులు, నేను చూస్తున్న సినిమాలు, చదువుతున్న పుస్తకాలు, నాలో కలుగుతున్న అనుభూతులు అన్ని తనకు చెప్పాలని, చూపాలని అనిపించేది.

పేరుకు తను నాతో లేదు కానీ, నాతో  తను మాత్రమే వుంది నా ఆలోచనల్లో.

ఆమె తాలుకు ప్రతి ఆలోచన నాకు ఒక పాజిటివ్ వైబ్రేషన్ ని ఇచ్చేది. ఆమె ఆలోచనలు ఎంత తీవ్రంగా నన్ను తొలిచేసేవి అంటే నేను ఒక్కడిగా వున్న ఏ క్షణాన్ని నేను ఆనందంగా అనుభవించలేకపోయాను.

తను నాతో వుంటే ఎంతబావుంటుంది ఈ క్షణం, ఎందుకు తనను నాతో తీసుకురాలేకపోయాను, ఏమిటి ఈ హద్దులు, ఎందుకు మేమిద్దరం స్నేహితులలాగా స్వేచ్ఛగా హాయిగా విహంగాలలాగా ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్ళకూడదు. ఏమిటి ఈ అర్థరహితమైన భయాలు?

ఇలా సాగిపోయేవి నా ఆలోచనలు.

నిజం చెప్పాలంటే నాలో నేను లేను ఆ రోజుల్లో.

అవునూ ఒక్క నాకేనా తనకు కూడా ఇలాగే వుంటుందా?

తనని నా జీవిత సహచరిగా చేసుకోవాలని బలంగా అనిపిస్తోంది ఇటీవల. తను మా ఇంటికి వచ్చేసినట్టు నేను మా ఇల్లు యావత్తు తనకు చూపిస్తున్నట్టు , మా అమ్మానాన్నలని తనకి పరిచయంచేస్తున్నట్టు, నా గదిని నా కవితలని తనకు చూపిస్తున్నట్టు, తను నా కవితలని రాగయుక్తంగా ఆలపిస్తున్నట్టు కలలు గంటున్నాను ఇటీవల.

నే చిన్నప్పుడు తిరిగిన ఊరిని, నా చిన్న నాటి స్కూలుని తనకు చూపించాలని అనిపిస్తోంది.

నాకిష్టమైన ప్రదేశాలన్నీ తనకు చూపించాలని అనిపిస్తోంది.

తన కష్టాలన్నీ తీరిపోతాయని భరోసా ఇవ్వాలని అనిపిస్తోంది.

తనకు నేను ఉన్నాను మాట ఇచ్చి ఊరట కల్పించాలని బలంగా అనిపించేది.

తన కలలు అన్నీ నాకు తెలుసు అని, అల్లాడిన్ అద్భుత దీపంలోంచి వచ్చే జీనీ భూతం లా తన కలల్ని అన్నీ నిజం చేసి తనకు చూపిస్తాను అని చెప్పి తనని ఊరట పరచాలని ఎంతగానో అనిపిస్తోంది.

'వస్తున్నాయి వస్తున్నాయి జగన్నాధ రథ చక్రాలు వస్తున్నాయి' అని చెప్పిన శ్రీశ్రీగారిలా కవితా గానం చేయాలని వుంటోంది.

తనపై నాకున్నది ప్రేమనా, జాలా?

తనంటే నాకున్నది ఇష్టమా, ప్రేమనా, స్నేహమా లేక కేవలము జాలా?

నాకు బలంగా అనిపిస్తోంది నాది ప్రేమే అని.

కాని ఒకటి మాత్రం నిజం నా మనస్సులోని అట్టడుగు పొరల్లో సైతం తనపై కామం నాకు లేదు. నాకు తనపై ఎందుకో తెలియని అభిమానం, ఇష్టం, ప్రేమ ఇలా ఎన్నెన్నో మాటల్లో చెప్పలేని ఇదమిత్థమైన భావనలు.

నేను అసలు తనకు నా మనోభావాలని చెప్పాలా? చెబితే తనేమి అంటుందో, తను నన్ను అసహ్యించుకుంటుందేమో? లేదా ఆనందపడుతుందా? నాతో మాట్లాడుతున్నప్పుడు ఎన్నో సార్లు తన కళ్ళలో ఒక విధమైన మెరుపును నేను గమనించాను. ఏమో నాది ఉత్తి ఆశావహ ధృక్పధమేమో, ఉత్తి విష్ ఫుల్ థింకింగేమో. నేను తనకు కేవలం ఒక స్నేహితుడేనా.

తనకు కూడా ఇలా నాతో మాట్లాడుతూనే వుండిపోవాలని వుంటుందా? తనకు కూడా నన్ను చూడకుంటే ఎదోలా వెలితిగా వుంటుందా?

తను చూస్తే చాలా బాధ్యత గా ప్రవర్తిస్తుంటుంది, కుటుంబం పట్ల, తన కెరియర్ పట్ల. తను ఇచ్చిన చనువుని ఉపయోగించుకుని నేను ఇప్పుడు ఇలా నా మనసులోని సందడినీ, నేను ఊరికెళ్ళి అనుభవించిన అస్థిమితత్వాన్ని ఏకరువు పెడితే, నన్ను తక్కువగా భావిస్తుందేమో.

ఇప్పుడు కనీసం నోరారా మాట్లాడుతోంది. నేను ఇలా పిచ్చిపిచ్చిగా మాట్లాడితే తను ఇకపై నాతో అస్సలు మాట్లాడటం కూడా ఆపు చేస్తుందేమో?

ఏమిటో ఏమీ పాలుబోవటం లేదు.

ఏది ఏమయినా నా సంఘర్షణని తనతో పంచుకోవాలనే నేను గట్టిగా నిర్ణయం తీసుకుని నిద్రలోకి జారుకున్నాను.

రైలు తన పాటికి తాను ఆదోని దిశగా సాగిపోతోంది.

చీకటిని చీల్చుకుంటూ రైలు ముందుకు వెళ్తూనే ఉంది.

అప్పటికి సమయం రాత్రి పన్నెండు గంటలు దాటిపోయింది.

నీలిరంగు దీపం మంద్రంగా వెలుగుతోంది. మిగతా కూపేలన్నింట్లో ప్రయాణీకులందరు ఆదమరచి నిద్ర పోతున్నారు. రైలు వేగంగా వెళుతున్నప్పటికీ  ఏసీ కంపార్ట్మెంట్ అవటం వల్ల బయటి శబ్దాలు ఏవీ లోపలికి చేరటం లేదు. ఊయల ఊగుతున్నట్టు చిన్న చిన్న కుదుపులతో వాతావరణం చాలా ఆహ్లాదంగా వుంది.

అద్దాలకిటికీ కున్న తెరతొలగించి బయటకు చూశాడు ఒక సారి సంతోష్. ఏదో చిన్న స్టేషన్ ని దాటేస్తూ ఆగకుండా వేగంగా సాగిపోతూనే వుంది రైలు.

కథ చెప్పటం ఆసక్తికరంగా  సాగి పోతూ ఉండటం వల్ల  నవ్య గాని సంతోష్ గాని నిద్ర పోలేదు.  అసలు అంత సమయం గడిచిపోయింది  అన్న  స్పృహ ఆ ఇద్దరికీ లేదు.

ఉన్నట్టుండి కథ చెప్పటం ఆపి ఒక సారి చేతి గడియారం వంక చూసుకుని కాస్తా ఇబ్బంది గా ఫీల్ అయ్యాడు సంతోష్.

"ఓ అయాం సారి, అస్సలు టైం చూసుకోలేదు. మిగతా కథ తర్వాత ఈసారి ఎప్పుడైనా  చెబుతాను లేమ్మా  ఇక పడుకో నిద్రపో" ఆ అమ్మాయి వంక  ఆప్యాయంగా చూస్తూ అన్నాడు  సంతోష్

"వద్దు అంకుల్ ఆపొద్దు.  కథ చెబుతూనే ఉండండి.  ఈ కథ చాలా బాగుంది. ఇలాంటి కథ కోసమే నేను వెతుకుతూ  ఉన్నాను. ఈ కథని సినిమాగా తీయడానికి నేను ఆల్రెడీ నిర్ణయం తీసేసుకున్నాను.  మిగతా కథ తెలుసుకోవాలని చాలా  ఉత్కంఠగా ఉంది.  ఇప్పటి మా తరానికి  అస్సలు  తెలియని సున్నితత్వం,  వేదన,  స్వచ్ఛత భావుకత్వం స్వచ్ఛమైన నిష్కల్మషమైన  ప్రేమ ఉన్నటువంటి ఈ కథ  ఈ జనరేషన్ కి  బాగా నచ్చుతుంది.  ఇది సూపర్ హిట్ సినిమాగా నిలిచిపోవడం ఖాయం. మీరు దయచేసి చెబుతూనే ఉండండి."  అంది నవ్య.

ఆ అమ్మాయి వంక చిరునవ్వుతో చూస్తూ ఉండిపోయాడు సంతోష్.

ఎదురుగా వున్న వాటర్ బాటిల్ అందుకుని నీళ్ళు తాగాడు.

కాసేపు కిటికీ అద్దంలోంచి బయటకు చూస్తున్నాడు. చీకటిగా వుండటం వల్ల బయటేమీ కనపడటం లేదు. కాని అతని దృష్టి ఇదమిత్తంగా ఫలానదానిపై అనేమి లేదు.

అతని వదనంలో ఏవో తెలియని భావాలు. కథని గుర్తు తెచ్చుకుంటూ వుండిపోయాడు.

ప్రశ్నల వర్షం కురిపించటం మొదలెట్టింది నవ్య.

"ఇంతకూ మొదట అతను తన ప్రేమని వ్యక్త పరుస్తాడా లేదా ఆ అమ్మాయి వ్యక్త పరుస్తుందా? ఇప్పుడు వారు ఎక్కడ వున్నారు? అతనేమి చేస్తున్నాడు? ఆ అమ్మాయి తన అభిరుచులకు అనుగుణంగా పెద్ద సింగర్ గా ఎదిగిందా? చెప్పండి అంకుల్"

ఏమి సమాధానం చెప్పలేదు సంతోష్. మౌనమే సమాధానం అన్నట్టు నవ్వి, మొత్తం కథ వింటే ఎలాగు తెలుస్తుంది గా అన్నట్టు గొంతు సవరించుకుని తిరిగి చెప్పటం ప్రారంభించ బోయాడు.

"ఆ అమ్మాయి ఫోటొ ఎదయినా వుందా, ఆమె ఎంత అందంగా వుందో చూడాలని చాలా కుతూహలంగా వుంది. మీ వర్ణన వింటే నాకే అసూయగా వుంది."

"లేదు. తనఫోటో ఒక్కటి కూడా నా దగ్గర లేదు. మీరెంతయినా సినిమా వాళ్ళుగా, మీ ఉహలకి ప్రాణం పోసి ఓ చక్కటి అమ్మాయిని ఆ పాత్ర కి తీసుకుంటే సరిపోతుంది" చిన్నగా నవ్వేశాడు సంతోష్.

"ఇప్పుడు ఆ అబ్బాయి ఏమి చేస్తూ వున్నాడు? అతను ఆమెని పెళ్ళిచేసుకున్నాడా? కథ సజావుగానే జరిగిందా? ఏమయినా మలుపులు వున్నాయా? ఇద్దరి ఇండ్లలో ఒప్పుకున్నారా, అనుకోని ఉపద్రవాలు ఏమయినా వచ్చాయా? నాకెందుకో ఆ మారుతి అనే పాత్ర మీద అనుమానంగా వుంది, అతనేమయినా అడ్డుపడ్డాడా? అన్నీ అనుమానాలే నాకు, త్వరగా చెప్పండంకుల్" తొందరించింది నవ్య.

"చెబుతాను, చెబుతాను" సమాధానం ఇచ్చాడు సంతోష్.

"ఇప్పట్లో లాగా స్మార్ట్ ఫోన్లు, మెసేజెస్, వాయిస్ చాట్లు, ఫోటో, వీడియో షేరింగులు, ఈమెయిళ్ళు ఏవీ లెని రోజులు అంటున్నారు. అసలు వారు తమ ప్రేమని ఎలా వ్యక్తం చేసుకోగలిగారు?" తిరిగి మరో ప్రశ్న సంధించింది నవ్య.

ఇక నవ్యని ఎక్కువ సేపు టెన్షన్ లో ఉంచడం ఇష్టం లేనట్టు చెప్పటం మొదలెట్టాడు సంతోష్.

ఇది వరకే చెప్పుకున్నట్టు అతడు చదువులలో పెద్ద ర్యాంక్ హోల్డరేం కాదు. అతడు కుదురుగా కూర్చుని చదివేవాడు కూడా కాదు అప్పటిదాకా నిజానికి. కానీ చాలా తెలివైన వాడు అనే పేరు అతనికి సహజంగానే వచ్చేసేది.

క్లాసులో చెప్పే పాఠాలు వినటం, గుర్తుంచుకోవటం అతనికి అలవాటు. పరీక్షల ముందు కూడా ప్రత్యేకంగా కూర్చుని అతడు చదువుకున్న దాఖలాలు వుండేవి కావు.

నిజానికి కవితలు, కథలు వ్రాయటంలో అతనికి ఆసక్తి ఎక్కువగా వుండేది.

సైకిలేసుకుని చక్కగా చుట్టుప్రక్కలంతా తిరుగుతూ ప్రకృతిని ఆస్వాదించటంలో అతనికి నిజమైన ఆనందం లభించేది. చిన్నప్పటినుంచి కూడా అతని పద్దతి అదే కావటంతో పెద్దగా అభ్యంతర పెట్టేవారు కాదు ఇంట్లోని వారు అతను చదువుకునే విధానాన్ని.

కానీ ఒక చిన్న సంఘటన అతని ఆలోచనా విధానాన్ని బాగా ప్రభావితం చేసింది. ఆ తరువాత డిగ్రీ చదివిన ఆ మూడేళ్ళు అతను వెనుతిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. అతనూ ఎన్నడు పొందనంత పర్సంటేజిలూ, పురస్కారాలు, సన్మానాలు పొందాడు.

ఒక్క పరీక్షలలో మార్కుల విషయంలో మాత్రమే కాదు, కల్చరల్ ఆక్టివిటీస్ లో కూడా అతనే ఫస్ట్. ఇంచుమించు మూడో సంవత్సరం చివరి దాకా అతను అధిరోహించని ఎత్తులు లేవు, పొందని బహుమతులు లేవు, అతని పేరు లేని ప్రశంశా పత్రాలు లేవు.

కాలెజీ వార్షికోత్సవ సందర్భంగా నాటికలు, వ్యాసరచన పోటిలు, వక్తృత్వం పోటీలు ఇలా అన్నింట్లో అతనే అగ్రగామిగా నిలిచాడు. రాష్ట్రస్తాయి సెమినార్ పోటీల్లో కూడా కాలేజీ తరఫున వెళ్ళి ట్రోఫీలు గెలుచుకుని వచ్చాడు.

ఆ తర్వాత అతను చేరిపోయిన అథఃపాతాళాల అంచులుకూడా తక్కువైనవేమీ కావు.

అతని విజయాలకు, పతనానికి కూడా ఆమె కారణం కావటం యాధృచ్చికమే అయినా అది నిష్టుర సత్యం.

కానీ స్వామి వివేకానంద చెప్పిన సూక్తి ప్రకారం తీస్కుంటే, 'నీ విధి వ్రాతకి నీవే సృష్టికర్తవి' ఇది కూడా సత్యమే.

మరి ఈ రెండు వాక్యాలు పరస్పర విరుద్ధంగా అనిపించటం లేదా అంటే, లేదు అనే చెప్పాల్సి వస్తుంది. ఈ రెండు వాక్యాలు కూడా అతని జీవితంలో నిజమే.

ఆమె ప్రోత్సాహంతోనే అతడు అనితర సాధ్యమైన విజయాలు సాధించాడు, ఆమె ఆలోచనలతోనే జీవితాన్ని నరక ప్రాయం చేసుకున్నాడు. అయిన వాళ్ళందరికీ తీరని దుఃఖాన్ని కలిగించాడు.

ఈ కథంతా పూర్తిగా చదివితే మీరు కూడా ఏకీభవిస్తారు, అతని విధి వ్రాతకి అతనే సృష్టికర్త అని.

ఆమె కారణంగానే అతను అలా అయిపోయాడని కూడా మీరు అంగీకరిస్తారు.

"అయితే ఈ కథ ట్రాజెడీ అన్నమాట" తీర్మానించేసింది నవ్య.

"నేను అలా చెప్పానా? ఇంకా ఏమి చెప్పందే?" చిరునవ్వుతో ప్రశ్నించాడు సంతోష్, "ట్రాజెడీ అంటే ఏమిటీ?" తిరిగి సంతోషే ప్రశ్నించాడు.

"అదే హీరో, హీరోయిన్ చివర్లో కలవలేక పోవటం, ఎవరో ఒకళ్ళు చనిపోవటం ఇలాగన్నమాట" నీళ్ళు నములుతూ చెప్పింది నవ్య.

"ఊ. నువ్వు తెలుగు సినిమాలు ఎక్కువ చూస్తావన్నమాట" నవ్వేశాడు సంతోష్.

"ఇంతకూ చెప్పండంకుల్, ఇది దుఃఖాంతమా, లేదా సుఖాంతమా? ఎలా ముగించబోతున్నారు?"

"మొదటే చెప్పాను కద. ఈ కథ సినిమాలకు పనికి రాదని. ఇందులో అలాంటి పడికట్టు రొటీన్ వ్యవహారం వుండదు. ఇది జీవితం. అది వారిని ఎలా నడిపిందో అది మాత్రమే నేను చెప్పగలను. అది కామెడినా, లేదా ట్రాజెడీనా అన్నది చివరో నువ్వే నిర్ణయిద్దువు గానీ." ఆమెని కాస్తా ఉడికిస్తూ చెప్పాడు సంతోష్.

"వాళ్ళు ఇంకా సరిగ్గా కలవనే లేదు, సరిగ్గా మనసులు విప్పి మాట్లాడుకోనే లేదు. ఇంతలో అతను విపరీతమైన విజయాలు సాధించేస్తున్నాడు అన్నారు. సంతోషం. అబ్బ అతన్ని ఆ అమ్మాయి కర్తవ్యోన్ముఖుడిని చేసింది, ఇక అతను హాయిగా ఆమె అభిమానాన్ని చూరగొంటాడు ఆ తర్వాత అంతా సుఖంగా సాగిపోతుంది అని నేను అనుకునేలోగా, ఏదో అధః పాతాళానికి జారిపోయాడు అంటు బాంబు పేల్చారు. ఇది చూస్తుంటే అటు కామెడీ, ట్రాజెడి రెండు కాకుండా థ్రిల్లర్ లాగా వుంది నాకైతే. ఏది ఏమైనా చాలా ఉత్కంఠగా వుంది. దయచేసి కొనసాగించండి." అతన్ని కోరింది నవ్య.

అతను తిరిగి చెప్పటం ప్రారంభించాడు.

**అది జనవరి ఒకటవ తేది.**

ఆ ఊరికి వచ్చిన తరువాత అతనికి మొదటి సంవత్సరాది అది.

కాలేజికి శెలవేమీ ఇవ్వలేదు. అతను యధాప్రకారం ముందు గదిలో పుస్తకాలు సరి చూసుకుంటూ కాలేజీకి వెళ్ళటానికి సిద్ధమవుతున్నాడు.

గుమ్మంలో గొప్పవెలుగు కనిపించిన అనుభూతికి గురయి తలెత్తి చూశాడు.

శాంతికి చిహ్నంలా శ్వేతవస్త్ర ధారియై, మొహంపై చెరగని చిరునవ్వుతో, గాలికి కదలాడే ముంగురులను సవరించుకుంటూ, జీవచైతన్యానికి మారుపేరులా, వీణ మీటితే వచ్చే ధ్వని లాంటి స్వరంతో "హేపీ న్యూ ఇయర్ టు యూ" అని అతనికి దగ్గరగా వచ్చి "ఈ గ్రీటింగ్ కార్డ్ నేనే తయారు చేశాను, ప్రత్యేకంగా నీకోసం. నేను అస్సలు ఎవ్వరి ఇంటికీ వెళ్ళి గ్రీట్ చేసిందే లేదు ఇదివరకు ఎప్పుడు" అని అతని చేతిలో గులాబి వర్ణంలో వున్న ఓ ఎనెవలప్ వుంచి తిరిగి చెప్పింది,

"నేను మొదట చక్కటి గ్రీటింగ్ కార్డ్ కొని ఇద్దామనే అనుకున్నాను. కానీ అంత ఖరీదు పెట్టి కొనలేని అశక్తత ఒక వైపు, నిన్ను ఏదో లాగా ప్రత్యేకంగా గ్రీట్ చేయాలనే తలంపు ఒక వైపు వుండటం వల్ల, చివరికి నేనే తయారు చేసి తెచ్చి ఇచ్చాను........మొన్న నా మూడ్ బాగుండక నిన్ను నొప్పించాను. అందుకు మనఃస్పూర్తిగా సారి. ఈ కొత్త సంవత్సరం సందర్భంగా నాపై కోపం మాఫీ చేసేయ్యవా ప్లీజ్" అంది.

అతనికి మాట్లాడటానికి ఏమి తొచలేదు. హృదయమంతా ఆనందం నిండగా సహజంగా పెదాలపైకి చేరుకున్న చిరునవ్వుతో 'ఓ థాంక్యూ, థాంక్యూవెరీమచ్. నేనసలు ఉహించలేదు నువ్విలా వస్తావని. బాగున్నావా? బైది బై నీక్కూడా నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

నేనసలు గ్రీటింగ్ ఏది కొనలేదు. ఐయాం ఇంబరాస్డ్. నీకు ఇవ్వటానికి ఏమీ సిద్దంగా లెదు నా వద్ద" సిన్సియర్ గానే చెప్పాడు అతను.

"లేదు. నువ్వు ఇవ్వగలవు. నీవు ఒక మాట ఇవ్వాలి. ఈ ఊరికి వచ్చి చదువుకుంటున్నందుకు ఈ మూడు సంవత్సరాలు నీజీవితంలో మైలురాళ్ళలా గా నిలిచిపోవాలి. నీవు కథలు కవితలు వ్రాస్తే వ్రాసుకో, కానీ ప్రిన్సిపాల్ గారి తమ్ముడు వచ్చాడు, అత్తెసరుగా పాసయిపోయాడు అని కాకుండా ఈ కాలేజి చరిత్రలో నీపేరు శాశ్వతంగా నిలిచి పోయేలాగా వుండిపోవాలి నీ మార్కులు, నీ పర్ఫార్మెన్స్. నీ స్నేహితురాలిగా నేను కూడా గర్వించేలా వుండాలి నీ పర్ఫార్మెన్స్. సరేనా. నీ కెరియర్, నీ ఫ్యూచర్ నీకు చాలా ఇంపార్టెంట్. నీ విజయానికి ఈ జనవరి ఫస్ట్ మొమొరబుల్ ఇయర్స్ కి మొదటి రోజు గా నిలిచి పోవాలి. అదే నీవు నాకు ఇవ్వాల్సిన పెద్ద గ్రీటింగ్."

నిజానికి ఆ మూడు సంవత్సరాలు, వాటిని తన జీవితంలోంచి చెరిపేయాలి అని అతను అనుకునేంత గాయాన్ని అతనికి మిగిల్చాయి నిజానికి.

అలా చెప్పేసి ఎంత వేగంగా వచ్చిందో అంత వేగంగానూ తుర్రుమంది.

అది ప్రారంభం. ఆ తర్వాత అతను ఇక వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. కాలేజిలో ఫస్ట్ ప్రయిజు అన్నది అతనికోసమే పుట్టిందా అన్నట్టు అనుకోసాగారు అందరు.

"నా ఉత్తరం చేరిందా? సమాధానం ఇవ్వలేదేం?" ఒకరోజు హఠాత్తుగా అడిగింది ఆమె.

అతనికి ఏమి అర్థం కాలేదు.

"ఏ ఉత్తరం? ఎప్పుడు వ్రాసావు?" అయోమయంలో ఆడిగాడు.

"ఊ. నీవు నన్ను ఏడిపించడానికి చెబుతున్నావు కదు? నిజంగా నీకు చేరలేదా?" రెట్టించి అడిగింది ఆమె.

"ప్రామిస్. నాకు నీవసలు ఏమి చెబుతున్నావో అర్థం కాలేదు. ఉత్తరం ఏమిటి ఎప్పుడు వ్రాసావు? ఏ అడ్రసు కి వ్రాసావు?"

ఇప్పుడు ఆలోచనలో పడటం ఆమె వంతయింది.

"చెప్పవా ప్లీజ్. ఏమి ఉత్తరం? ఎప్పుడు వ్రాసావు? నాకయితే ఏ ఉత్తరం చేరలేదు" ఆతృతగా అడిగాడు అతను. అతడి కంఠంలోని సిన్సియారిటీని ఆమె గమనించింది.

"ఓకే. ఫర్వాలేదులే. అందులో అంత ప్రమాదకరమైన విషయాలేమి లేవు. మరి ఎక్కడికి పోయి వుంటుందబ్బా?" తనలో తానే అనుకుంటోంది ఆమె.

"ఏయ్. చెప్పవా ఏమి ఉత్తరం? తిరిగి అతడే అడిగాడు"

"నీవు వారం రోజులు పలమనేరుకు వెళ్ళినపుడు వ్రాశాను. నీవు వెళ్ళే ముందు నిన్ను చిరునామా అడిగి తీసుకున్నాను గుర్తుందా? చిరునామా అయితే ఏదో యధాలాపంగా అడిగి తీసుకున్నానే కానీ అప్పుడు నాకేమీ ఉత్తరం వ్రాసే ఉద్దేశ్యం లేదు నిజానికి. కానీ నీవు ఊరికి వెళ్ళిన మరుక్షణం నుంచే ఏదో బెంగ." ఆమె చెబుతూ చెబుతూ సిగ్గు పడుతూ ఆగి పోయింది.

"ఊ చెప్పు. ఆ తర్వాత ఏమయింది?"

"మహా అంటె, ఒక్క రోజు వున్నాను నిన్ను చూడకుండా. అంతే. ఏదో దిగులు. నిజానికి నీవు ఈ ఊర్లో ఉన్నంత మాత్రాన ఇరవై నాలుగ్గంటలూ ఎమీ కలిసి మాట్లాడం కద. ఏదో సాయంత్రం ఒక అరగంట, అదీ నా ట్యూయిషన్ల హడావుడిలో నేనుండంగా నిన్ను చూసి చూడనట్టు, పలకరించి పలకరించనట్టూ ఏదో హడావుడిగా నాలుగు మాటలు మాత్రమే కద నేను మాట్లాడేది. అయినా అదొక తృప్తి.

నువ్వు ఊర్లో ఉన్నప్పుడు సైతం ఒక్కో రోజు మనం కలవకుండా కూడా వున్న సందర్భాలు ఎన్నో వున్నాయి. అయినా నీవు ఉర్లోనే దగ్గరే ఉన్నావన్న భరోసా. దిగులు అనిపించేది కాదు.

కాని నీవు ఊర్లో లేవు అన్న ఊహకే నాకు బాగా బెంగగా వుండింది. అందుకే ఓ ఇన్లాండ్ కవర్ తీసుకుని జస్ట్ నాలుగు ముక్కలు వ్రాసాను. నీ క్షేమ సమాచారాలు తెలియజేయగోరుతూ వ్రాసేసాను అంతే. నాకయితే ఈ లెటర్లకన్నా వేగంగా నీ క్షేమ సమాచారములు తెలుసుకోగలిగే వీలు వుంటే ఎంత బాగుంటుందో కద అనిపించింది" వెల్లువ లాగా మాట్లాడేసి, తిరిగి సిగ్గుతో ఎర్రగా కందిపోయిన ముఖాన్ని అతనికి సూటిగా చూపలేక, తల కాస్తా క్రిందకు వంచి, కాలి బొటన వేలితో నేలపై వృత్తాలు గీస్తూ, "అందుకేనేమో కాళిదాసు తన కావ్యంలో మేఘం తో సందేశం పంపించాలనే ఆలోచన చేసాడు" అంది.

ఆమె మాటలు విని అవాక్కయ్యాడు సంతోష్.

ఇవన్నీ సరిగ్గా తనకు కలిగిన భావాలే.

తను ఏ మానసిక స్థితిని అనుభవించాడో అదే మానసికి స్థితిని ఈ అమ్మాయి కూడా అనుభవించింది. తన లాగే ఆమె కూడా తనకొరకు వేదన చెందింది.

ఏదో తెలియని ఆనందం. మాటల్లో చెప్పలేని అనుభూతి తీవ్రత.

"నువ్వు నమ్ముతావా? సరిగ్గ నాకు కూడా ఇలాగే అనిపించింది" వేగంగా చెప్పాడు సంతోష్.

" అది సరే , నా ఉత్తరం ఏమయింది?" ఆ అమ్మాయి అడిగిన ప్రశ్నకి

"అవును ఆ ఉత్తరం ఏమయింది?" తిరిగి ప్రశ్నించాడు సంతోష్.

"ఖర్మరా బాబు" తల పట్టుక్కూర్చుంది ఆ అమ్మాయి.

"పర్లేదులే దానిగురించి ఆలోచించి బుర్ర బ్రద్దలు కొట్టుకోకు. పోస్ట్‌లో మిస్ అయ్యుండచ్చు" అని ఆ అమ్మాయి ధైర్యం చెప్పిందే గానీ అతనికి ఎంత ఆలోచించినా అర్థం కావటం లేదు ఆ ఉత్తరం ఏమయ్యుంటుందా అన్న విషయం.

బాగా ఆలోచిస్తే గుర్తు వస్తోంది లీలగా. తను పలమనేరు వెళ్ళినప్పుడు ఒక రోజు మధ్యాహ్నం జరిగిన సందడి.

ఒకరోజు మధ్యాహ్నం టీవీలో క్రికెట్ మాచ్ ఏదో ప్రత్యక్షప్రసారం జరుగుతోంటే చూస్తూ వున్నాడు అతను.

ఆ మధ్యాహ్నం 'పోస్ట్' అన్న కేక వినపడింది. నాన్న గారు బయటికి వెళ్ళి ఉత్తరం ఏదో అందుకున్నారు.

ఆయన యధాలాపంగా ఓపెన్ చేసి చదివారు ఏదో ఇన్లాండ్ లెటర్. ఆయన పిలిచిన మీదట అమ్మగారు కూడా బయటికి వెళ్ళి ఆయనతో కలిసి చదివినట్టుగా గుర్తు వస్తోంది.

ఆ తరువాత ఇద్దరు కాసేపు తర్జన భర్జనలు పడ్డారు. 'నేను పైనున్న పేరు చూడలేదు ఏదో యధాలాపంగా ఓపెన్ చేసి చూసి చదివేసిన తరువాత అర్థం అయింది, ఇది నాకు వ్రాయబడ్డది కాదు' అని నాన్న గారి గొంతు వినిపిస్తోంది.

బహుశా ఏ పక్కింటి వాళ్ళ ఉత్తరమో పొరపాటున ఓపెన్ చేసి చూశారనుకున్నాడు అతను. క్రికెట్ మాచ్ ఇంట్రెస్టింగ్గా వుండటంతో ఆ ఉత్తరం విషయం గురించి ఎక్కువ ఏకాగ్రత –చూపలేదు ఆ రోజు.

ఇప్పుడు ఆలోచిస్తుంటే గుర్తు వస్తొంది.

'ఓకే. అంటే ఈ అమ్మాయి వ్రాసిన ఉత్తరం అమ్మానాన్నల చేతికి అందిందన్న మాట. మరి తన చేతికి ఎందుకు వారు ఆ ఉత్తరం అందివ్వలేదు? అ ఉత్తరం గురించి ఎందుకు అస్సలు ప్రస్తావించలేదు తనతో?' ఇలా ఎంత ఆలోచించినా అతనికి అంతు పట్టటం లేదు.

అతనికి లీలగా ఇంకో విషయం గుర్తు వస్తోంది.

ఆ రోజు అమ్మానాన్నలు తనతో ఎప్పట్లాగా హాయిగా ప్రవర్తించలేదు. కాస్త నొచ్చుకున్నట్టు గాను, కాస్త ఏదో దిగులుగా వున్నట్టుగాను ప్రవర్తించారని కూడా గుర్తు వస్తోంది. అంతే కాదు, ఆ రోజు మాటల్లో ఎన్నడూ లేనిది కొన్ని చిన్న చిన్న హెచ్చరికల లాంటి జాగ్రత్తలు చెప్పారని కూడా గుర్తుకు వస్తోంది అతనికి.

"నిన్ను చదువుకోటానికి పంపించామని ఎన్నడూ మరచిపోవద్దు. అమ్మాయిల గురించి ఎక్కువ ఆలోచించి చదువు పాడుచేసుకోవద్దు" అంటు ఇలాంటి మాటలు చాలానే చెప్పారని గుర్తు వస్తోంది అతనికి.

అధ్యాయం 2

రైలు ఆగినట్టుగా అనిపిస్తే తెర తొలగించి అద్దాలలోంచి బయటకు చూశాడు సంతోష్. ఏదొ ఊరి తాలుకు ఔటర్ సిగ్నల్ దగ్గర గ్రీన్ సిగ్నల్ కోసం ఆగింది రైలు. దూరం నుంచి ఊరి తాలుకు దీపాలు మినుకు మినుకు మంటూ వెలుగుతున్నాయి.

"అమ్మాయి, ఈ కథ సుఖాంతమా లేదా దుఃఖాంతమా ఎలా ముగుస్తుందబ్బా అని అడిగావు కద ఇందాక. ముగింపు ఎలాగుంటుందో చెప్పను కానీ, మీ సినిమా వాళ్ళ లాగా కాసేపు ఫ్లాష్‌బ్యాక్, కాసేపు ఫ్లాష్‌ఫార్వర్డ్ టెక్నిక్ లో కథ చెప్తా నీక్కూడా మరింత ఉత్సాహం వస్తుంది" ఆ అమ్మాయిని ఆట పట్టిస్తూ ఆగాడు సంతోష్.

"భలే అయిడియా అంకుల్. అలాగే చెప్పండి. స్క్రీన్ ప్లే కూడా ఇదే టెక్నిక్ లో వ్రాసుకుంటాము , చెప్పండి చెప్పండి ప్లీజ్" అంటూ బ్రతిమాలింది నవ్య.

తనను మర్చిపోవటానికి అతను తనకై తాను ఎంచుకున్న మార్గం సమాధి యోగ.

కర్ణాటకలోని హంపీ దగ్గర తుంగభద్ర నది ఒడ్డున వున్నఓ పర్వత శిఖరం పై సమాధి యోగ శిక్షణ కార్యక్రమానికి అతను వచ్చి ఓ వారం రోజులు అవుతోంది.

ఆ ఎత్తైన పర్వతం పైనుంచి ఎటు చూసినా చుట్టూ చిన్న చిన్న కొండలు, కను చూపు ఆనినంత మేరకు పచ్చని అరణ్యాలు పచ్చిక బయళ్ళు. వంపులు తిరుగుతూ ప్రవహిస్తున్న తుంగభద్ర నది.

ప్రకృతి కాంత తన సౌందర్యాన్ని కనుల విందుగా పరచింది ఎటు చూసినా. కానీ అతడు ప్రకృతిని చూడటం లేదు.

ఎత్తైన ఆ పర్వతం పై విశాలమైన మైదానం లాంటి పచ్చిక బయలు లో ఓ చెట్టు మొదలు క్రింద ధ్యాన నిమగ్నుడయ్యాడు. అతనితో బాటు ఇంకొక పదిమంది ధ్యానం చేస్తున్నారు.

వారికి ఎదురుగా వేదిక లాంటి ఎత్తైన అరుగుపై కాషాయాంబర ధారియై, తెల్లటి గడ్డంతో ప్రశాంతత నిండిన వదనంతో గురువు గారు కూర్చుని వున్నారు.

ఆ వారం రోజులుగా అతను పొందుతున్న శిక్షణ చాలా కఠినంగా వుందనే చెప్పాలి.

ఉదయాన్నే నాలుగు గంటలకల్లా నిద్ర లేయటం, కాల కృత్యాల అనంతరం ఒక గంట సేపు ధ్యానం లో గడపటం, ఆ తర్వాత యోగాసనాలు ఒక గంట సేపు, ఆపై ఏదో వనమూలికలతో చేసిన వేడి వేడి కషాయం సేవించటం. ఆ తర్వాత ఒక అరగంట గురువు గారి అనుగ్రహ భాషణం, ఆ తర్వాత చల్ల నీళ్ళతో స్నానం.

ఈ ఆశ్రమ నిబంధనలు ఎంత కఠినంగా వుంటాయంటే ఆ నలభై రోజుల శిక్షణా కార్యక్రమంలో బయటి ప్రపంచాన్ని చూట్టానికి  వీలు లేదు. ఆ ఆశ్రమ ప్రాంగణంలోనే వారిచ్చిన కనీస వసతులు తో కూడిన కుటీరంలోనే వుండాలి. మంచం, కుర్చీ వంటి కనీస సదుపాయాలు కూడా వుండవు అక్కడ. నేలపైనే చాప పరుచుకుని పడుకోవాలి.

బయటివ్యక్తులకు ఫోన్లు చేసుకోవటాలు, ఉత్తరాలు వ్రాసుకోవటాలు లేదు.

భజన, ధ్యానం, యోగా, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, ఉడకబెట్టని పచ్చి కూరలతో కూడిన ఆహారం, కషాయాలు ఇది అక్కడి జీవన విధానం.

ఉదయం నాలుగుకు మొదలైన దినచర్య రాత్రి తొమ్మిదికి ప్రార్ధనతో ముగుస్తుంది.

మానసిక స్థిరత్వానికి కొందరు, శారీరిక అస్వస్థతలు శమింపజేసుకోవటానికి కొందరు, లావు తగ్గటానికి కొందరు ఇలా ఎవరి అవసరాల నిమిత్తం వారు అక్కడికి వస్తుంటారు.

అతడు అక్కడికి వచ్చి వారం రోజులు అవుతోంది. ఈ వారం రోజులు ఆ అమ్మాయిని ఎంత మరచి పోవాలన్నా మరచి పోలేక పోతున్నాడు.

ఆ అమ్మాయి శాశ్వతంగా తనకు ఇక దక్కదు అన్న సత్యం అతన్ని ఎంతగా బాధిస్తోందో, అంతకు రెట్టింపు గా ఆమెకి తాను చేసిన ద్రోహం గుర్తొచ్చినప్పుడల్లా అతనికి తన మీద తనకే అసహ్యం వేస్తోంది.

ఆ గిల్టీ ఫీలింగ్ నుంచి తనను తాను బయట పడేసుకోవటం అసాధ్యం అన్న స్పృహకలిగిన తర్వాత ఇక క్షణం ఆలశ్యం చేయలేదు అతను.

అందుకే ఈ సమాధి యోగా ధ్యాన మందిరానికి అప్లై చేసుకుని వచ్చాడు.

నిజానికి అక్కడ పరిమిత సంఖ్యలో మాత్రమే తీసుకుంటారు అభ్యర్థులను శిక్షణకి. అక్కడ  అడ్మిషన్ పొందటానికి వెయిటింగ్ లిస్ట్ లో పేరు నమోదు చేసుకుని  దాదాపు ఆరేడు నెలలు ఎదురుచూసిన తర్వాత అక్కడికి పిలుపు వస్తుంది.

కానీ ఇతని విషయంలో ఆశ్రమ నిర్వాహకులు తమ నిబంధనలు సడలించాల్సి వచ్చింది. అతన్ని డిప్రెషన్ నుంచి బయట పడేయని పక్షాన అతనికి మతి స్తిమితం తప్పే అవకాశం వుందని గుర్తెరిగి వారు ఆ నిర్ణయాన్ని తీసుకున్నారు.

వాళ్ళ అన్నయ్య ప్రిన్సిపాల్ గారు కార్లో అతన్ని స్వయంగా తీసుకుని వచ్చి ఆశ్రమ నిర్వాహకులతోనూ , గురువు గారితోనూ మాట్లాడి అతన్ని అక్కడ అప్పగించి, నీళ్ళు నిండిన కళ్ళతో, వెళ్ళలేక వెళ్ళలేక వుండుండి వెనుకకు తిరిగి చేయూపుతూ తిరిగి ఊరికి వెళ్ళిపోయాడు.

పచ్చటి ప్రకృతి, చల్లటి వాతావరణం, ఎటు చూసినా వృక్షరాజాలు, కుందేళ్ళు, లేళ్ళు ఇలా అక్కడి వాతావరణం ఎవరినయినా ఇట్టే ఆకట్టుకుంటుంది.

అక్కడి ప్రకృతి సౌందర్యం అతన్ని ఏ మాత్రం ఆకట్టుకోలేక పోతోంది.

పత్రమున అగ్నిశిఖ భద్రపరచవచ్చు,

హృదయమున దుఃఖబాధ భరించలేము★

(★ దాశరథి గారు అనువదించిన 'గాలిబ్ గీతాలు' సంకలనం నుంచి)

అతను తనలో తాను పరితాప పడుతున్నాడు.

అక్కడి శిక్షణ ఎటువంటి శారీరిక రుగ్మతలను కానీ, మానసిక వేదనలను కానీ పోగొట్టటం ఖాయం అని పేరు. కానీ అతనిపై ఆ శిక్షణ ఎటువంటి ప్రభావం చూపించటం లేదు.

అంటే దాని అర్థం అక్కడ సాధన చేయిస్తున్న యోగ విద్యలో ఏదో దోషం వుందని కాదు, అక్కడి గురువులు సరయిన విధంగా శిక్షణ ఇవ్వలేకపోతున్నారని కాదు.

సైకాలజిస్టులు సైతం ఏమి చెప్తారు అంటే, ఏ వ్యక్తి అయినా సరే, సమతౌల్యతతో కూడిన మానసిక స్థితితో వుంటే తప్పనిచ్చి అతని అంతరంగంలో సరి అయిన మార్పులు తీసుకుని రాలేము అని.

ఇంకా అర్థమయ్యేలా చెప్పాలి అంటె తాను మారాలి అనే బలమైన అభిలాష లేని వ్యక్తిని ఏ మానసిక వైద్యుడు, ఏ గురువు కూడా సంస్కరించలేడు.

బ్రతికినన్నినాళ్ళూ వెతలు తప్పవు కదా!

మృతియె వెతల దీర్చు మేటి మందు★

(★దాశరథి గారు అనువదించిన 'గాలిబ్ గీతాలు' సంకలనం నుంచి)

ఇక్కడ ఏమి జరుగుతోంది అంటే అతను ఆమెని చేజేతులా దూరం చేసుకున్నాడు. తన మనసుకు వ్యతిరేకంగా ఆమె పట్ల అంత ఘోరంగానూ, క్రూరంగానూ ప్రవర్తించాడు.

అతను తను చేసిన కృత్యానికి విపరీతంగా కుమిలిపోతున్నాడు. తాను అంత ఘోరంగా ప్రవర్తించగలడని అతను కూడా ఊహించి ఉండడు.

దానికి తోడు అతడు సహజంగానే సున్నిత మనస్కుడు, భావుకుడు కూడా కావటంతో అతను తనను తాను చాలా నిందించుకుంటున్నాడు. తనను తాను హింసించుకుని ఒక రకమైన సాంత్వన పొందుతున్నాడు. ఒక విధంగా చెప్పాలి అంటే ఆత్మహత్యా ధోరణిలో అతని ఆలోచనలు సాగుతున్నాయి.

స్వీయ హింసలో భాగంగా తన కెరియర్ కి ఇంచు మించు ఫుల్ స్టాప్ పెట్టే దిశగా అతని ఆలొచనలు సాగుతున్నాయి. ఒక రకంగా సమస్యని పరిష్కరించుకునే బదులు, సమస్యని మరింత జటిలం చేసుకుంటున్నాడు.

వెలుగుచున్న దివ్వె మలిపివేసినయంత

కానుపించు నల్లనైన మచ్చ,

అట్లె పూర్తికాని అభిలాశముల మచ్చ

గుండెలోన కూరుచుండె నాకు.★

(★దాశరథి గారు అనువదించిన 'గాలిబ్ గీతాలు' సంకలనం నుంచి)

అతని బాధలకు నిర్దిష్టమైన కారణం ఏమిటో తెలుసుకోవాలంటే ఓ పాఠకుడా మనం సరిగ్గా ఓ రెండు సంవత్సరాలు వెనుకకు వెళ్ళాలి.

ఒక రోజు సాయంత్రం ఆమె ట్యూయిషన్లు చెబుతున్న సమయానికి వాళ్ళ ఇంటికి వెళ్ళాడు యధాలాపంగా. సైకిల్ బయటే ఆపాడు.

వారి ఇంటి చుట్టూ దడి కట్టినట్టుండే కంచె చాలా కళాత్మకంగా ఉంటుంది.

సర్కార్ తుమ్మ కొమ్మలను ఒక క్రమ పద్దతిలో విరిచి, పొడవాటి వెదురు బద్దలతో వాటిని ఒక తడికె లాగా అమర్చి , వెదురు బొంగుల సపోర్టుతో ఇంటి చుట్టూ అమర్చిన కంచె చాలా అందంగా వుంది. ఆ కంచెకి లతలూ తీగలతో అల్లుకున్న పూల మొక్కలు చూట్టానికి కంటికింపుగా వున్నాయి.

కళాకారుడు ఎంతో మనసు పెట్టి గీచిన తైలవర్ణచిత్రంలా వుంటుంది వారి ఇల్లు.

వారి ఇంటిని చూసినప్పుడల్లా అతనికి ఒక ఊహ వచ్చేది. పుల్లలు, పుడకలు ముక్కున కరచుకుని వచ్చి పిచ్చుకలు, పావురాలు ఎలాగైతే గూడు కట్టుకుంటాయో అలాగ అనిపించేది వారి ఇల్లు.

ఇంటిలోపలకూడా అంతే.పెద్ద ఖరీదైన సామాగ్రి ఏదీ లేకున్న, ఆధునికమైన ఉపకరణాలు ఏవీ లేకున్నా వారు తమ ఊహా శక్తితో, ప్రేమతో నిర్మించుకున్న ఆ బొమ్మరిల్లు లాంటి ఇంట్లో ఓ విధమైన ప్రశాంతత, నెమ్మదితనం ప్రస్ఫుటంగా కనిపించేవి. బలమైన పాజిటివ్ వైబ్రేషన్స్ బయటి దాకా వచ్చి తాకేవి.

కంచె దాటి వచ్చి అతను ప్రధాన ద్వారం ముందు నిలిచాడు.

వాళ్ళ అమ్మగారు ఎప్పుడు కూర్చుని వుండే స్థానం అయిన కుట్టుమిషన్ స్టూలు ఖాళీగా వుంది. అంటే వాళ్ళ అమ్మగారు ఇంట్లో లేరన్న మాట.

కుట్టుమిషన్ పై మ్యాటీ క్లాత్ కప్పబడి వుంది. ఆ మ్యాటీ గుడ్డపై నగిషీలు చెక్కి, శ్రీరామ అన్న అక్షరాలు అందమైన ఎంబ్రాయిడరీ డిజైన్ తో వ్రాయబడి వుంటాయి. రాముల వారి పట్టాభిషేక దృశ్యం రంగు రంగుల పూలు దారాలతో

అందంగా అల్లబడి వుంటుంది. స్వస్తిక్ గుర్తు, ఓంకారం కూడా శ్రద్ధగా అల్లబడి వుంటాయి. ఆ డిజైన్ ని అంత ఓపికగా కుట్టింది ఆ అమ్మాయే అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.

బయట వాళ్ళనాన్నగారి పాత సైకిల్ లేక పోవటం వల్ల ఆయన కూడా ఇంట్లో లేడని అర్థమవుతోంది. మారుతి ఇంకా ఇంటికి వచ్చే టైం కా లేదు.

ద్వారం బయట మర్కటమూక చెప్పులు బోలెడు ఒక క్రమ పద్దతి లో సుగ్రీవాజ్ఞకి కట్టుబడి పెట్టినట్టు చాలా క్రమశిక్షణగా వదిలివేయబడి వున్నాయి.

తమ టీచర్ పట్ల ఎంతో ప్రేమాభిమానాలు వుంటే మాత్రమే అలాంటి క్రమశిక్షణ సాధ్యమవుతుంది పిల్లలలో.

ఎదురుగా పిల్లల మధ్య ఆమెకూర్చుని వుంది. చేతిలో ఏదో టెక్స్ట్ బుక్ పట్టుకుని పిల్లలకు ఏదో వివరిస్తోంది.

ద్వారం దగ్గర వెలుతురు ను అడ్డగిస్తూ ఒక ఆకారం, మరియు అడుగుల సవ్వడి కి చెబుతున్న పాఠం ఆపి ఆల్చిప్పల్లాంటి విశాలమైన తన కళ్ళని తలుపు వంక సారించి చూసింది తపోభంగమైన మునికన్యలాగా.

నిజానికి పాఠంలో లీనమయ్యేవరకు ఆమె అతని కోసం ఎదురుచూసూనే వుండింది.

అతన్ని చూసిన ఆ క్షణంలో ఆమె మనస్సు పొందిన ఆనందం మాటల్లో వర్ణించటానికి ఏ కవికి సాధ్యం కాదు. ఆమె కళ్ళలో మెరుపు, ఉత్సాహం, ఆనందం;

ఉరికే మనస్సుకు గిరిగీయలేని ఆమె కనులు ఆనంద భాష్పాల జడిలో చెమ్మగిల్లాయి. ఆ ఉత్సాహం, ఆనందం, తాదాత్మ్యతలో మసకబారిన ఆ కన్నులతో అతని రూపాన్ని సరిగా చూడలేకపోయింది ఆమె. రెప్పల మాటున ఊహలలోనే అతని రూపాన్ని ఆవిష్కరించుకుంటోంది.

వచ్చావా నేస్తం
నిజంగానే వచ్చావా నేస్తం
నా కలల జడిలో నేను తడిసి
నను నేనే మైమరిచి
ఆశ నిరాశలనే రెండు చక్రాల రధంలో
లోకమంతా తిరిగేస్తున్నాను
నా లోకమంటే ఏదొ కాదు – నీవే నాలోకం
నీ చుట్టు నాకలలు
నీతోనే నా ఆశ నిరాశలు

వచ్చావా నేస్తం
నిజంగానే వచ్చావా నేస్తం
చిరుగాలి తాకిడికి తెర కదిలినా నీవేనేమో అని భావన
లేత గాలి స్పర్శకి ఆకులు కదలాడినా నీవేనన్నభ్రమత
నీవొస్తావో రావో అన్న మీమాంస
ఇక రావేమోనన్న నిస్పృహ
ఎచటికెళ్ళిపోయావు నేస్తం
అందుకోవా సాచిన నా హస్తం?

ఆశ నిరాశల మధ్య ఊగిసలాడుతున్నది నా మది
వెల్లువెత్తుతున్న నా పరుగుని ఆపేస్తోంది నా హృది.
ఏ సైకిల్ బెల్ మ్రోగినా నీవే
ఏ సవ్వడి వినిపించినా నీవే ★
(★డాక్టర్.రాయపెద్ది వివేకానంద్ స్వీయ కవిత)

ఇలాంటి ఊహల మధ్య అతనికై ఎదురు చూసి చూసి, పిల్లలకు పాఠాలు చెప్పటంలో నిమగ్నమయింది ఆమె కొద్ది సేపటి క్రితమే.

నిజానికి అతడేమి ఆలశ్యంగా రాలేదు. రోజు వచ్చే సమయానికన్న నిజానికి అయిదు నిమిషాలు ముందరే వచ్చాడు. కాని ఒక ప్రత్యేక సంకల్పంతో కూర్చుని వుంది. అతని రాకకి ఎన్నడూ ఇవ్వనంత ప్రాముఖ్యతని ఆమె ఇస్తోంది ఇవ్వాళ. తన హృదయాన్ని అతని ముందర ఆవిష్కరించటానికి ఆమె కృత నిశ్చయురాలు అయింది ఆ వేళ.

అతనికి తన మనస్సులోని మాటలని చెప్పాలని అదే ధర్మమని ఆమె భావించింది. అందుకే సిద్ధపడి వుంది. అతను రావాలి రావాలి అని మనస్సులో బలంగా కోరుకుంటోంది.

అంతలోనే నిరాశ, వస్తాడొ రాడో అని.

రోజు వస్తాడు కద, వస్తాడు లే అని తనకు తానే భరోసా చెప్పుకుంటోంది. మరీ అంతలోనే 'ఏమో, కాలేజి లో ఏదన్న పని పడి ఆగిపోయాడేమో, రాడేమో అని బెంగ పడుతోంది. వాళ్ళ అన్నా వదినెలతో కలిసి ఎక్కడికైనా వెళ్ళాడేమో అని కలవరపడుతోంది.

క్షణం ఒక యుగంగా గడపటం అంటే ఏమిటో ఆమెకి అనుభవంలోకి వచ్చిన క్షణాలు అవి.

అన్యమనస్కంగానే పాఠం చెప్పటం ప్రారంభించింది. తాత్కాలికంగా ఆ తియ్యటి వేదనని మరచిపోగలిగింది పాఠం చెబుతూ.

అంతటి ఉద్విగ్నతతో ఆమె ఎదురుచూస్తూ వుండిన కారణంగా, ఒక్క సారిగా అతను కనపడే సరికి ఆమెలో భావ సంచలనం, చెలియలికట్ట తెగిన నీటిప్రవాహంలా ఆమె కళ్ళలోంచి కన్నీటి ప్రవాహంలాగా వెల్లువలాగా తన్నుకు వచ్చాయి.

"ఎందుకింతా ఆలశ్యం చేసావు?" నిలదీసింది.

"నేను ఎప్పటికన్నా త్వరగానే వచ్చాను, ఇవ్వాళ తెలుసా?" అతని ప్రత్యుత్తరం తో తనను తాను సంభాళించుకుంది.

అయినా అతని పై తనది ఏమిటి ఈ అథారిటి? ఆతనెవరు తనెవరు, అప్పుడే అతనిపై తను అధికారం చలాయిస్తోంది ఏమిటి అని తనలో తాను అనుకుని చిన్నగా నవ్వుకుంది.

పిల్లలకు పాఠాలు చెబుతూ అతనితో యధాలాపంగా కబుర్లు చెప్పే ప్రయత్నం చేస్తోంది. కాని ఎంత దాచుకున్నా ఆమెలో దాగని ఉద్విగ్నత.

కాసేపయ్యాక అతనికి నీళ్ళు తెచ్చి ఇచ్చింది. అది ఒక రూటీన్ ఆమెకి. అతను ఎప్పుడు వచ్చినా కాసేపటికి నీళ్ళు ఇవ్వటం అనేది ఒక పద్ధతిగా పెట్టుకుంది. ఎప్పుడైనా అరుదుగా కాఫీ తెచ్చి ఇస్తుంది.

అతనితో పరిచయం అయిన కొత్తల్లో ఒక సారి అతను "నేను కాఫీలు, టీలు త్రాగనండి, ఎప్పుడైనా అరుదుగా బూస్ట్ త్రాగుతాను" అని చెప్పాడు.

అతను అలా సిన్సియర్‌గా చెప్పిన రోజు ఆమె తన సహజ ప్రవృత్తికి భిన్నంగా బయటికే పక్కున నవ్వేసింది.

ఆమెకి అది వింతగా తోచింది. ఆ వయస్సు కుర్రాళ్ళు చాలా మంది అప్పటికే బీర్లు, గీర్లు త్రాగటం చాలా మామూలు విషయంగా చెప్పుకుంటున్న రోజులు అవి.

'సారీ, అసంకల్పితంగా నవ్వేశాను. నువ్వు బుజ్జోడివి. ఎప్పుడు ఇలాగే వుండాలి. రియల్లీ యూ ఆర్ ఆసమ్" మనస్ఫూర్తిగా అతన్ని అభినందించింది.

"ఏమి ఫర్వాలేదు. నీ నవ్వుకు నేను కారణం అయ్యాను. అంతకంటె ఆనందం ఏముంటుంది?" అతను సిన్సియర్ గానే అన్నాడు ఆ మాటల్ని.

ఆ రోజుల్లోనే వాళ్ళ అమ్మా నాన్నలు బలవంతం చేస్తే వాళ్ళింట్లో కాఫీ త్రాగాల్సి వచ్చింది. వాళ్ళు అస్సలు నమ్మలేదు కాఫీ త్రాగని వాళ్ళు వుంటారు అంటే. అదీ గాక అతను మొహమాట పడుతున్నాడు అని అనుకుని బలవంతం చేస్తూ " మా అమ్మాయి కాఫీ అద్భుతంగా చేస్తుంది ఒక సారి త్రాగి చూడు" అని చెప్పారు.

అప్పుడు త్రాగాడు కాఫీ మొదటి సారి. నిజానికి నీళ్ళ పాలు, తక్కువ చక్కెర వేసి ఆ అమ్మాయి చేసి ఇచ్చిన కాఫీ ఏమాత్రం బాలేకున్నా, త్రాగి అతను నిజంగానే ఇష్ట పడ్డాడు.

ఆ తర్వాత అతనికి అప్పుడప్పుడు కాఫీ ఇచ్చేది తానే చేసి.

తన చేతి వేళ్ళు ఆమె చేతి వేళ్ళకి తగలకుండా జాగ్రత్త పడుతు నీళ్ళ గ్లాసు అందుకుని త్రాగాడు.

కుర్చీలో కూర్చుని వున్నాడు అతడు. అతడి ఎదురుగా అతని మోకాళ్ళకి తగులుతుందేమో అన్నంత దగ్గరగా ఆమె నిలబడి వుంది, అతను అందించిన ఖాళీ గ్లాసు అందుకుని.

ట్యూషన్ కొచ్చిన పిల్లలు ఆమె వెనుక కూర్చుని వున్నారు. ఆమె ముఖ కవళికలు ఆ పిల్లలకు కనపడే అవకాశం లేదు. ఆతని మొహం కనపడకుండా ఆమె అడ్డు వుంది.

అతని చేతిలో మడత పెట్టిన ఓ కాగితాన్ని వుంచింది. ఏదో నోట్‌బుక్ లోంచి చించిన గీతల పేపర్స్ కొన్ని సగానికి మడత పెట్టి అతనికి అందించింది. అతనికి ఏమి అర్థం కాలేదు.

"ఇవి పంకజ్ సార్ కి ఇవ్వవా రేపు కాలేజిలో" అని చెప్పింది. ఆమె స్వరం గది అంతా ప్రతిధ్వనించింది. ట్యూయిషన్ పిల్లలు అందరూ తమ పాఠాలు తాము వల్లె వేసుకుంటు తమ లోకంలో తాము వున్నారు.

అతను సరె అని తల ఊపాడు.

అప్పుడు ఆమె గుసగుసలాడుతున్న ధ్వనిలో "హేయ్ మొద్దూ. అవి నీకే. పిచ్చోడిలా పంకజ్ సార్ కి వెళ్ళి ఇచ్చేవ్. అది నిన్ను ఉద్దేశ్యించి నేను వ్రాసిన కొన్ని వాక్యాలు. ఇంటికి తీసుకెళ్ళి చదువుకో. ఎవరికీ చూపకు"

కాస్త ముందుకు వంగి అతని వంకనే తేరిపారా చూస్తూ స్పష్టంగా ఉచ్చరిస్తూ ఆమె చెప్పిన మాటల సారం అర్థం అవటానికి అతనికి కొన్ని సెకన్లు పట్టింది.

ముదురు వంగపువ్వు రంగు కాటన్ చీరలో మూర్తీభవించిన శుద్ధ సత్వమా అన్న శరీరచాయతో తన ఎదురుగా నిలబడి, ఎర్రటి దొండపండు లాంటి పెదాలను నెమ్మదిగా కదిలిస్తూ తనతో సంభాషిస్తున్న ఆమె, ఆ క్షణంలో దేవతలకు శాశ్వత అమరత్వాని ప్రసాదించటానికి దిగివచ్చిన మోహిని అవతారంలా కనిపించింది. అతనికి.

ఇంతలో గుమ్మం దగ్గర ఏదో అలికిడి అవడంతో అమె తప్పుకుని , తన యధాస్థానానికి వెళ్ళి కూర్చుంది.

ఊహించని పెన్నిధి ఏదో దొరికిన వాడిలా ఆ ఉత్తరాన్ని పదిలంగా షర్ట్ జేబులో గుండెకి దగ్గరగా వుంచుకుని, జేబులో అది వుందో లేదో అని పదే పదే తడిమి చూసుకుంటు, కలలో నడిచే వాడిలా ఒక విధమైన్ తాదాత్మ్యతతో వాళ్ళ ఇంటినుంచి నేరుగా తన ఇంటికి చేరుకున్నాడు.

గోధూళివేళ. ఆకాశం ఎర్రబారింది.

పక్షులు కిలకిలారావాలతో గూళ్ళు చేరుకుంటున్నాయి.

దూరంగా రణమండల శిఖరాలపై హనుమాన్ మందిరంలోనూ, కాలిబాట వెంబడి దీపాలు వెలుగుతున్నాయి.

అప్పుడే సూర్యుడు పశ్చిమాద్రిని చేరుకుంటున్నాడు. తిమిరం వైపు ప్రపంచం సన్నద్ధం అవుతోంది.

ఇంటికి రావటం రావటం అతను నేరుగా డాబాపైకి చేరుకున్నాడు. అతను నడకలో ఒక ఉద్వేగం, మాటల్లో వ్యక్తపరచలేని సంతోషం.

డాబాపైనుంచి వాతా వరణం చాలా ఆహ్లాదంగా వుంది. వాళ్ళింటి వెనుక కనుచూపు ఆనినంత మేరా పచ్చటి పొలాలు, వాటికి ఒక చివర శాంత మల్లప్ప శిఖరం. మామిడి చెట్టు కొమ్మలు డాబా పై వరకు ప్రాకి అక్కడి వాతావరణానికి ఒక కొత్త అందాన్ని అందిస్తున్నాయి. కొబ్బరి చెట్టు ఆకులు, బాదం కొమ్మలు, వేపచెట్టు తాలుకు కొమ్మలు అన్నీ కూడా ఆసక్తిగా చూస్తున్నాయా అన్నట్టు వున్నాయి అతని వంక.

ఏదో వరాన్ని కోరి కొన్ని సంవత్సరాలపాటు నిద్రాహారాలు మానేసి, కఠోర తపస్సు చేసి దేవతల సాక్షాత్కారం పొందిన అనంతరం వరప్రసాదాన్ని పొందిన ఒక తాపసి ఎంత ఆనందాన్ని అనుభవిస్తాడో అంత ఆనందం పొందుతున్నాడు అతను.

అంతలోనే ఒక అభద్రత. ఇది ఇంతకూ ఉత్తరమేనా? తనను ఉద్దేశించి వ్రాసి వుంటుందా? లేక ఏదయినా ఇంగ్లీష్ సబ్జెక్టు కు సంబంధించిన డౌట్లుతో కూడిన ఏదయినా ప్రశ్నావళా?

లేదా తనను ఆటపట్టించి ఆనందించటానికి ఉత్తినే ఏదయినా కాగితాల్ని ఒక బొత్తిగా చేసి తన చేతికి ఇచ్చి వేళాకోళం చేస్తోందా?

పిట్ట గోడపై కూర్చుని ఉత్తరం నెమ్మదిగా జేబులోంచి తీశాడు.

ఎంతో పొందిక గా ముత్యాల్లాంటి అక్షరాలతో గీతలపేపర్ పై వ్రాయబడి వున్న ఆ ఎనిమిది పేజీల ఉత్తరం అతన్ని ఏదో లోకాలకు తీసుకుపోయింది అంటే అతిశయోక్తి కాదు.

**ప్రియమైన నీకు**

నేనసలు ఇలా నీకు వ్రాస్తానని కలలో సైతం ఉహించలేదు ఎప్పుడు.

ఎందుకు వ్రాస్తున్నానో నాకు స్పష్టత వుంది. కానీ ఎలా వ్రాయాలో ఎక్కడినుండి మొదలుపెట్టాలో, ఎలా ఒక క్రమపద్దతిలో వ్రాయాలో అర్థం కావటంలేదు. నేను నీలా రచయితను గానీ, కవిని గానీ కాను కద.

ముందుగా ఒక్కటి మాత్రం గట్టిగా చెప్పనీ నన్ను. అది ఏమిటంటే, నాకు నువ్వంటే చాల చాల ఇష్టం. అది ఎంత ఇష్టమో మాటల్లో చెప్పలేనంత ఇష్టం. ముందుగా ఇవే మాటల్తో ఎందుకు ప్రారంభించాను అంటే నాకు తెలియకుండానే ఇక నా కష్టాల గురించి వ్రాసేస్తాను. నాకు తెలిసింది కష్టాలు మాత్రమే కద.

భూమి, ఆకాశం , మిల్కీవే లు దాటి, దిక్కులు అన్న ఎల్లలు దాటి అనంతంగా వ్యాపించి, సరిహద్దులు అన్నదే ఎరుగని ఈ విశాల విశ్వంలో ఒక చిన్న బిందువు లాంటి నా ఉనికికి ప్రాముఖ్యత ఏమి ఉంటుంది? నేను సరిగ్గా అలాగే అనుకునే దానిని. ఇది ఆత్మన్యూనత కాదు, ఆత్మ జ్ఞానం అని అనుకుంటూ నాకు అప్పజెప్పబడిన పనులు నేను చేసుకుంటూ, నాకు చేతనయినంత మేరా కుటుంబానికి తోడ్పడుతూ, ఏ దశలోనూ నా మనస్సులో శూన్యత ఆవరించకుండా, ఏ ఆశా వ్యామోహాలకు లోనుకాకుండా, ఒక మర మనిషిలాగా జీవితాన్ని జీవిస్తూ అదే జీవితం అని నన్ను నేను బుజ్జగించుకుంటూ లేని ఉత్సాహాన్ని మొహంపై పులుముకుంటూ బ్రతికేసేదాన్ని.

నాకు ఈ మధ్య మనసు అస్సలు బాగుండటం లేదు. నా చిన్ని జీవితంలో నాకు అంటూ ఏ కోరికలు ఆశలు లేవు. నేను ఒక యంత్రం లాగా నన్ను నేను మార్చుకున్నాను ఇన్నేళ్ళు.

ఏ కోరిక కోరుకున్నా అది నెరవేరదు అన్న జీవిత సత్యం చాలా చిన్నవయస్సులోనే నేను తెలుసుకోగలిగాను. ప్రతి కోరిక డబ్బుతోనే ముడిపడి వుంటుంది కద మనం సౌఖ్యాలు పొందాలంటే. అందుకే ఆశ – నిరాశ ఇవి కవల పిల్లలు అని భ్రమ పడేంతగా మనసుకు నేను నచ్చజెప్పుకోగలిగాను. మనం మన మనస్సులకు ఇవ్వగలిగే గొప్ప సౌఖ్యం ఏమిటో తెలుసా, దుఃఖించటం. ఎక్కడో చదివాను సోకించటం కన్నా సోమరితనం ఇంకోటి వుండదని. కానీ అది కడుపులో చల్ల కదలకుండా కూర్చున్నా గడిచిపోయే వెసులుబాటు వున్న వారికి వర్తిస్తుందేమొ కానీ నాలాంటి వారికి కాదు.

ఏ పని చేయలేకపోవటం అన్నది మాఇంటి పరిస్థితి దృష్ట్యా ఆత్మహత్యా సదృశ్యం. ఈ జ్ఞానం నాకు చాలా చిన్న వయస్సులోనే కలిగింది. అందుకే డిగ్రీ ఫస్టియర్ నుంచే కాలేజి వెళ్ళటం మానేసి స్కూలు టీచర్ గా ఉద్యోగం, ట్యూయిషన్లు, కుట్టుమిషన్ పై కుట్టటం లాంటి పన్లు కల్పించుకుని నన్ను నేను బిజీగా వుంచుకుంటున్నాను.

రొటీన్ గా నడిచిపోతున్న నాజీవితం లోకి ఒక మలయమారుతంలాగా వచ్చావు నేస్తం నీవు.

నిన్ను చూసిన మొదటి సారి ఎవరబ్బా ఇతను భలే అందంగా వున్నాడే అని అనుకోవచ్చు ఏ ఒక్కరైన. అందుకు నీకు అన్ని విధాల అర్హత వుంది. ఇప్పుడు నిన్ను పొగుడుతూ కూర్చోవటం నా ఉద్దేశ్యం కాదు.

నిన్ను చూసిన మొదటి క్షణం లో నాకు కలిగిన మొదటి అనుభూతి ఏమిటో తెలుసా? చెబుతాను – సాంత్వన, అవును నేస్తం నాకు నిన్ను చూడంగానే కలిగిన మొదటి అనుభూతి ఓదార్పు, నిశ్చింత, నెమ్మదిదనం.

మందనుండీ, తల్లి నుండీ దూరంగా తప్పిపోయిన లేగ దూడకి తిరిగి తల్లి ఆవు కనపడంగానే ఎలాంటి నిశ్చింత, నెమ్మది, భరోసా, సాంత్వన కలుగుతాయో – నాకు నిన్ను చూసిన మొదటి క్షణంలో అలాంటి అనుభూతి కలిగింది.

నీవు నా జీవిత గమ్యానివి అనిపించింది.

నాకు నీ నీడలో సేద తీరాలని అనిపించింది, నీ పరిష్వంగంలో చేరి వెక్కి వెక్కి ఏడ్వాలని అనిపించింది. కొన్ని అనుభూతులకు అర్థం వుండదు.

నీవు ఎవరో కూడా సరిగ్గా తెలియదు అప్పుడు, ప్రిన్సిపాల్ గారి తమ్ముడివి నీవు అని కూడా తెలియదు. నీవు అక్కడ ఆ క్షణంలో ఎందుకున్నావో కూడా తెలియదు. కాని నాకు నిన్ను చూడంగానే కలిగిన మొదటి భావన సాంత్వన. అయితే అలా ఎందుకు అనిపించిందో ఫాలాక్షుని సాక్షిగా నాకు తెలియదు.

నిరాశలతో జీవించడం అలవాటు అయిన నాకు, దేని మీద ఆశ పడకపోవటం అన్నది పద్దతిగా మారిపోయింది. అలాంటిది నేను ఇటీవల దేవుడ్ని పదే పదే కోరుకుంటున్న ఒకే ఒక కోరిక ఏమిటంటే పెన్నిధిలాగా దొరికిన ఈ స్నేహాన్ని నా నుంచి దూరం చేయకు అని.

నీతో మట్లాడుతూ వుంటె నేను ఆవేళ కలిగిన అలసట యావత్తు మరచిపోతాను. నా సాయంత్రాలు జీవనోత్సాహనికి కేంద్రాలుగా మారిపోయాయి.

ఇప్పటి దాకా వ్రాసినది ఒక సారి ఆగి చదువుకుంటుంటే నాకే నిస్పృహగా అనిపించింది. ఏమిటి ఇంత నైరాశ్యంతొ వున్నాయి నా ఆలోచనలు అని. అయినా నేను ఏదీ దాచుకోవాలి అనుకోవటము లేదు నేస్తం. ఈ ఉత్తరాన్ని నీకు ఇలాగే ఇస్తాను. నేను నిజానికి ఇంత బేలను కాను. నేను కష్టాలను చాలెంజి లాగా భావించి ఎదుర్కొంటాను. నాకు నిరాశ, నిస్పృహ అన్నవి ఎన్నడూ కలుగవు. కానీ నీ ముందు నేనేంటి ఇంత బేలను అవుతున్నాను అంటె అది నీ స్నేహంలో గొప్పదనం . అది నీ స్నేహంలో తీయదనము.

ఒక్కోసారి నిన్ను కౌగిలించుకుని భోరున ఏడ్వాలి అని అనిపిస్తుంది. నాకు సాంత్వన లభించేది అంటే నీ సాంగత్యంలో మాత్రమే.

నాకు నీ మాటలు ఇష్టం

నాకు నీ అమాయకత్వం ఇష్టం

నాకు నీ నవ్వు ఇష్టం

భేషజం లేని నీ ప్రవర్తన ఇష్టం

అందరి మంచిని కోరే నీ ఆప్యాయత ఇష్టం

నీ అలవాట్లు ఇష్టం

నీ తెలివితేటలు ఇష్టం

తెలివితేటలున్నాయన్న అహం నీకు లేకపోవటం ఇష్టం

నీవు నా వాడివి అన్న భావన ఇష్టం

నేనెక్కడ నొచ్చుకుంటానో అని తపన పడే నీ తత్వం ఇష్టం

సారీ ఏమేమొ వ్రాసెస్తూ వున్నాను.

ఇంతకూ నేను ఇదంతా ఎందుకు వ్రాస్తున్నాను అంటే నీ పట్ల ఇంత ఇష్టం మనసులో పెట్టుకుని పైకి ఏమి తెలియని దానిలా నటిస్తూ మాములుగా వుండటం ధర్మం కాదు నాకు బలంగా అనిపిస్తూ వుంది.

నేస్తమా నాకు ఒక వరం ఇస్తావా?

మన స్నేహం ఇలాగే కొనసాగాలి అని నేను కోరుకుంటున్నాను. ఏది ఏమయినా మన స్నేహం ఇలాగే కొనసాగాలి. మనం మంచి స్నేహితులుగా కలకాలం కొనసాగుదాం.

నాకు ఇటీవల భయంకరమైన కలలు వస్తున్నాయి. నువ్వు ఇక నాతో మాట్లాడవేమో అన్నట్టు, నన్ను నీవు మరచీ పోయి నీ అంతట నీవు హాయిగా వెళ్ళిపోతున్నట్టు ఇలాంటి కలలు నాకు పీడకలల కన్నా ఎక్కువ భయంకరమైనవి సుమా.

మిత్రమా, ఒక్కటి మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. మనది ఈ జన్మలో స్నేహం కాదు. ఎక్కడో తీరని ఋణం నన్ను మళ్ళీ నీతో కలిపింది. మిత్రమా నను ఎన్నటికీ విడిపోవుగా.

మనది ఉత్తి స్నేహం అయితే ఏ ఇబ్బంది లేదు. హాయిగా జీవితాంతం మనం స్నేహాన్ని కొనసాగించవచ్చు.

నేస్తమా, నేను సిగ్గు విడిచి చెబుతున్నాను, నాలో కలుగుతున్న హృదయస్పందనలు , వేదన, నిరాశ, నీపై ఉత్తుంగ తరంగంలా ఎగసిపడుతున్న ఇష్టం తాలూకు తీవ్రత చెబుతున్నాయి ఇది ఉత్తి స్నేహం మాత్రమే కాదు అని.

కానీ మిత్రమా నీచేయి అందుకునే అర్హత నాకుందా?

నన్ను నిజంగా నీ జీవితంలోకి ఆహ్వానిస్తావా?

ఇదంతా  నా పిచ్చిఊహలు మాత్రమేనా?

నీక్కూడా నాపై ఇదే స్థాయిలో ఇష్టం వుందా?

మనం ఇద్దరం జీవితాంతం కలిసి వుండగలం అనే దృశ్యం మనస్సులో నీకు కనీసం ఊహామాత్రంగా అయినా వస్తోందా?

నాకు ఇష్టం ఎంత స్తాయిలో వుందో ఇది సాధ్యం కాదేమో అన్న అనుమానమూ అంతే స్థాయిలో ఉంది.

నేనింత నెగెటివ్ థింకర్ ని అని నాకు మొదటి సారి తెలుస్తోంది.

నేను పెద్దగా సాహిత్యం చదువుకున్న దానిని కాను. ఏదో టెక్స్ట్ బుక్స్ చదివిన మిడిమిడి జ్ఞానమే తప్ప ఒక క్రమ పద్దతి లో నా ఆలోచనలు పేపర్ పై పెట్టటం రాదు నాకు.

నాలో కలిగిన ఆలోచనలు యధాతథంగా ఎటువంటి భేషజాలు లేకుండా వ్రాసేసాను.

ఇప్పుడు ఎంత నిశ్చింతగా వుందో మాటల్లో చెప్పలేను.

వుండనా మరి

ఎన్నటికీ నీ జీవిత సహచరిగా వుండాలని ఆశ పడే

నీ

స్నేహితురాలు

చదవటం ముగియగానే అతని కన్నుల వెంబడి ధారాపాతంగా అశ్రువులు.

అది బాధా, వేదనా, ఆనందమా అని ఇదమిత్తంగా చెప్పలేని ఒక అలౌకిక మానసిక స్థితిలో వున్నాడు అతను. అతను చదవటం ముగించే వరకు ఆవరించి ఉన్న మసక వెలుతురు కూడా అంతరించి జగత్తును యావత్తు లలిత యామిని ఆవరించింది.

అతను ఒక తన్మయావస్తలో వున్నాడు.

ఆమె తనని ప్రేమిస్తోంది. ఆ భావన అతనికి తెలియని కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది.

అతని ఆలోచనల ప్రవాహం ఇలా వుంది

"ఆమె నా దృష్టిలో ఒక దేవత. ఆమె నేను కోరని వరాన్ని అయాచితంగా ఇస్తూ, తనను తాను చాలా తగ్గించుకుంటూ సవినయంగా జీవితాంతం తోడు వుండే వరం ఇస్తావా అని పైగా నన్నే యాచిస్తోంది. ఇది కలా నిజమా?"

అతని మనస్సు ఆనందంతో ఉరకలెత్తుతోంది.

"హార్టీ కంగ్రాచ్యులేషన్స్" మరుసటి రోజు కాలేజిలో కనపడంగానే ఉమేష్ చెప్పాడు. అతని పూర్తి పేరు ఉమా శంకర ప్రసాద్. స్నేహితులందరూ అతన్ని ఉమేష్ అని పిలుస్తారు.

"ఎందుకు కంగ్రాచ్యులేషన్స్? ఏమి సాధించానని?" ఆశ్చర్యంగా అడిగాడు అతను.

"దాచినా దాగవు లే ఇలాంటివి. ప్రేమలో పడ్డావట. తనే ప్రపోస్ చేసిందట కద?" ఉమేష్ అలా అడిగేటప్పటికి అదిరిపడ్డాడు అతను.

"ఛ.ఛ. అలాంటిది ఏమి లేదు. అయినా ఎవరు చెప్పారు?" అసలేం అర్థం కావటం లేదు అతనికి. నిన్న రాత్రి ఆ అమ్మాయి తనకు ఉత్తరం వ్రాసిన విషయం తనకు తప్ప ఎవరికీ తెలియదు. ఈ ఉమేష్ గాడికి ఎలా తెలిసిందబ్బా. అయోమయంగా వుంది అతనికి.

"నాకు సీ.ఎం చెప్పాడు" అతని అయోమయాన్ని ఇంకా పెంచుతూ చెప్పాడు ఉమేష్.

"హే. కమాన్. ఛీఫ్ మినిష్టర్ చెప్పటం ఏమిటి? వేళాకోళాలు ఆపి నీకు ఎవరు చెప్పారో చెప్పు అసలు"

"అంటే నేను విన్నది నిజమే అన్నమాట. నాకు ఎలా తెలిసింది అన్న విషయం మీదనే నీ ఫోకస్ వుందే తప్పనిచ్చి, అసలు అలాంటిది ఏమి లేదు అని నీవు అనటం లేదు." అతన్ని మరింత ఆట పట్టిస్తూ నవ్వేశాడు ఉమేష్.

"లేదు. లేదు అలాంటిది ఏమీ లేదు." అటూ ఇటూ చూస్తూ మెల్లిగా గొణిగాడు అతను.

"సీ.ఎం అంటే ఛీఫ్ మినిష్టర్ కాదులే. ఆ ఫలాన అమ్మాయి మేనత్త కొడుకు చంద్రమోహన్. మేము వాడిని ముద్దుగా సీ.ఎం అని పిల్చుకుంటాం. వాడు నాకు చిన్నప్పటి నుంచి పరిచయం" ఆ అమ్మాయి పేరు కూడా కరెక్టుగా చెప్పేశాడు ఉమేష్.

కాసేపాగి, ఉమేషే చెప్పుకుపోసాగాడు

"ఈ సీ.ఎం గాడు మన ఏజే, ఇంటర్ దాకా నాక్లాస్ మేట్. కానీ వాడు మనలా డిగ్రీ చేరక ఇంజినీరింగ్ లో చేరాడు. కర్ణాటకలో గుల్బర్గా లో చదువుతున్నాడు. వాడికి అన్ని అలవాట్లు ఉన్నాయి. నీలాగా బుద్ధిమంతుడు కాదు. మొరటోడు వాడు.

వాడికి వాడి మరదలు కి బాగా చనువు వుంది. వీడి నాన్న గారు రియల్ ఎస్టేట్ అవీ చేస్తూ ఏదో ప్రయివేట్ జూనియర్ కాలేజికి కరస్పాండెంట్ గా చేస్తూ బాగా సంపాయించాడు. మాములు మాటల్లో చెప్పాలంటే ఈ సీ.ఎం. గాడు 'బార్న్ విత్ అ సిల్వర్ స్పూన్ ' కిందే లెక్క. వాళ్ళు బంధుత్వం వుండటం వల్ల కలుస్తున్నారే గానీ, ఈ సీ.ఎం గాడికి, ఈ అమ్మాయి వాళ్ళకి ఆర్థిక పరంగా చూసుకుంటే చాలా అంతరం వుంది.

కాని వీడికి ఆమె అంటే చాలా ఇష్టం. కానీ తన ఇష్టాన్ని ఆమెకి నచ్చే విధంగా ఎప్పుడు చెప్పుకోలేదు. అదొక్కటే కాదు. ఆమె తన కోసమే పుట్టింది అని వీడికి ఒక నమ్మకం.

ఎటు తిరిగి కాళ్ళా వేళ్ళా పడి అయినా సరే తనకే ఇచ్చి చేస్తారు ఆ అమ్మాయిని , అని వాడికి ఒక విధమైన అహంతో కూడిన ఓవర్ కాన్ఫిడెన్స్.

నిజంగా చెప్పాలంటే , వీడు ఆమెని టేకెన్ ఫర్ గ్రాంటెడ్ అన్నట్టు ట్రీట్ చేస్తాడు. ఎప్పుడూ ఆట పట్టించడం, తన్ని ఏడిపించడం, ఏదయినా ఫామిలి ఫంక్షన్స్ లో కల్సినప్పుడు సైతం ఆ అమ్మాయిని ఏడిపిస్తూ వుంటాడు. అదంతా చనువు అని అనుకుంటూ వుంటాడు ఈ మొరటోడు.

తను నీతో క్లోస్ అవటం వాడు అస్సలు ఊహించలేదు అట. దాంతో హర్ట్ అయ్యాడు.

మొన్న ఏదో ఫామిలీ ఫంక్షన్ లో కల్సినప్పుడు, ఆ అమ్మాయిని పట్టుకుని అడిగేశాట్ట. "నన్ను పెళ్ళిచేసుకోవటం నీకు ఇష్టమేనా?" అని.

ఆ అమ్మాయి చాలా సేపు మాట్లాడలేదట. వీడు బలవంతం చేసి పదే పదే ఆడిగిన మీదట, నెమ్మదిగా గొంతు పెగల్చుకుని చెప్పిందట, "బావా, నాకు నీపై ఎప్పుడు అటువంటి ఆలోచన లేదు. చిన్నప్పటి నుంచీ దగ్గరగా చూడ్డం వల్లనుకుంటాను, నాకు మా అన్నయ్యతోనో, తమ్ముడితోనో మాట్లాడుతున్నట్టు వుంటుందే కానీ నీతో – పెళ్ళి అనే ఆలోచనే నాకు ఎప్పుడూ రాలేదు." అని నెమ్మదిగా స్పష్టంగా అందిట.

చెప్పాను కద, వీడు మొరటోడు అని.

"మరి ప్రిన్సిపాల్ గారి తమ్ముడు, ఆ పుస్తకాల పురుగు అంటే ఇష్టమా? అతని పై అలాంటి ఉద్దేశ్యం ఉందా?" అని ముఖాముఖి అడిగేశాట్ట.

వీడు బాగా రీసెర్చి చేసిన తర్వాత సంభాషణ చేస్తున్నాడు అని అర్థమయిందట ఆ అమ్మాయికి.

కాసేపు ఏమి మాట్లాడలేదట. ఆ తర్వాత నిదానంగా చెప్పిందట.

"నేను అతన్ని ఇష్టపడుతున్నానో లేదో గానీ ఆ మాట నువ్వంటుంటే వింటానికి నాకు చాలా బాగుంది బావా.

నాకయితే అతనంటే చాలా గౌరవం వుంది. అతనితో కొద్దిగా స్నేహమే తప్ప మేమేమీ పెద్దగా మాట్లాడుకునేది కూడా ఏమి లేదు. ఎప్పుడన్న సాయంత్రాలు వస్తాడు, మా తమ్ముడితో మాట్లాడటానికి, నీవు అనుకుంటున్నట్టు పెద్ద పెద్ద ఆశలేం లేవు అతని పట్ల. అతనికి ఈ కాలపు కుర్రాళ్ళకు వుండే ఎలాంటి బాడ్ హాబిట్స్ లేవు. అతను ఒక మంచి కవి. చాలా తెలివైన వాడు. ఎదుటి వ్యక్తిని ఎన్నడూ నొప్పించడు. అతనితో మాట్లాడుతూ వుంటే ఇంకా ఇంకా మాట్లాడుతూనే వుండిపోవాలని వుంటుంది బావా. మనం ఎంత వేదనలో అన్నా వుండనీ అతని చిరునవ్వు ని చూస్తూ అతనితో మాట్లాడితే

మన దుఃఖం మర్చిపోతాము. అతను సలహా అని ఇవ్వడు కానీ అతని మాటల్లో మన సమస్యలన్నిటికి పరిష్కారం లభిస్తుంది.

కానీ అతను నన్ను ఇష్ట పడితే నాకు అంతకన్నా కావాల్సింది ఏమీ లేదు. హీ ఈస్ ది పర్‌ఫెక్ట్ జెంటిల్ మేన్" అని అనేసి తుర్రుమందట.

ఈ సంఘటన జరిగి సరిగ్గా రెండు రోజులు కూడా అవలేదు. అప్పటి నుంచి సీ.ఎం. గాడు ఇంచుమించు వందరోజులు లంఖణం చేసిన వాడిలా తయారయ్యాడు. కనుగుడ్లు లోపలికి పీక్కుపోయాయి. అన్నం సరిగ్గా తినటం లేదు. నీళ్ళు సరిగ్గా త్రాగటం లేదు.

వాడు మొరటోడే కాని చెడ్డ వాడు కాదు.

"నా తలరాత లో లేదురా అది. ఆ ప్రిన్సిపాల్ గారి తమ్ముడు అదృష్టవంతుడు." అని పదే పదే గొణుగుతున్నాడు.

నీకు తెలుసుగా నేను మందు పుచ్చుకోనని. కానీ వాడి బలవంతం పై నిన్నంతా వాడి పక్కన బార్ లో కూర్చో వాల్సి వచ్చింది. వాడు పరిమితికి మించి త్రాగుతూ ఈ పర్సనల్ విషయాలు అన్ని నాకు చెప్పాడు. నీవు కాలేజి లో నాకు క్లోస్ ఫ్రెండ్ అని కూడా వాడికి తెలుసు"

అతడు వింటూ వుండి పోయాడు ఉమేష్ మాటల్ని. అతని మనసులో తీవ్రమయిన భావ సంచలనం. ఆ భావనలకు అర్థం ఇది అని చెప్పలేము కానీ అతడికి చాలా సంతోషంగా వుంది. మాటల్లో చెప్పలేని సంతోషం అది.

ఇతని మౌనాన్ని మరో లాగా అర్థం చేసుకున్న ఉమేష్ చెప్పటం మొదలెట్టాడు.

"ఆ సీ.ఎం గాడు  నీకు ఏమీ ప్రమాదం తలపెట్టడు. డోంట్ వర్రీ. వాడి బాధంతా తనకు ఆ అమ్మాయి మిస్ అయ్యిందనే తప్పనిచ్చి నీకు ఏదో ప్రమాదం తలపెట్టాలని కాదు."

"ఛ.ఛ.  నాఉద్దేశ్యం అది కాదు."

"ఇంతకూ ఆమె నీకు ప్రొపోస్ చేసిందా , పార్టీ ఎప్పుడు మామా" ఉమేష్ వాతావరణాన్ని తేలిక పరుస్తూ అడిగాడు.

అతనేమీ పలకలేదు.

ఇంతలో వేరె ఫ్రెండ్స్ రావటంతో ఆ సంభాషణ అక్కడితొ ఆగిపోయింది.

ఆమె వ్రాసిన ఉత్తరాన్ని ఎన్ని వేల సార్లు చదువుకున్నాడో లెక్క లేదు. అది అతని జేబులోనే వుంది. ఉండుండి జేబుపై చేయి వేసి తడుముకుంటున్నాడు.

ఆ ఉత్తరం లో ఎన్ని పదాలు ఉన్నాయో, ఎక్కడ కామా, ఎక్కడ ఫుల్ స్టాప్ వుందో, ఏ వాక్యం తర్వాత ఏ వాక్యం వస్తుందో అతనికి కంఠోపాఠమే.

సాయంత్రం వెళ్ళి ఆమెని కలవాలి.

వెళ్ళే ముందు ఆ అమ్మాయికి ఉత్తరం వ్రాసి ఇవ్వాలనే ఆలోచనతో కాగితం , కలం ముందు వేసుకుని కూర్చున్నాడు.

ఎన్నెన్నో వ్రాయాలని వుంది ఆ ఉత్తరానికి బదులుగా.

అలవోకగా కవిత్వం వ్రాసే అతనికి కలం మొరాయిస్తోంది.

కలం కాగితం మీద పెట్టగానే ఒక ప్రవాహం లాగా సాగిపోయేది అతని కవితా ఝరి. అందమైన పదాలు వాటంతట అవే వచ్చి ఆశువుగా కుదురుకునేవి.

అలాంటిది ఆమెకి ఉత్తరం వ్రాద్దామని కూర్చుంటే కలం ముందుకు సాగటమే లేదు. ఇది అతనికి చిత్రమైన అనుభవం. ఇదివరకు ఎన్నడు కాలేదు అలా.

ఒకటి రెండు వాక్యాలు వ్రాయంగానే, ఇంకా బాగా వ్రాసి ఉండాల్సింది అని అనిపిస్తుంది. ఆ కాగితం తీసి చెత్తబుట్టలో వేసేసి ఇంకో కాగితం తీసుకుని వ్రాయటం మొదలెట్టడం. ఇలా ఒక గంట సాగింది.

అతనికి అర్థం అయిపోయింది ఇక ఈ వేళ్టికి వ్రాయటం కుదరదు అని.

క్రితం రాత్రి కూడా ఇదే పరిస్థితి ఎదురయ్యింది. అప్పుడే ఆమె ఉత్తరం అందుకున్న ఎక్సయిట్‌మెంట్‌తో వ్రాయటం కుదరలేదేమో అని అనుకుని, వ్రాయటం ఆపేసి నిద్ర పోయే ప్రయత్నం చేశాడు. నిద్ర కూడా అతన్ని కరుణించలేదు. ఏవేవో ఆలోచనలు.

’సఖికి కాన్క సమర్పింపజాల నేను,

ఈయదగు హృదయమే లేకపోయె నాకు’

అతనికి అసంకల్పితంగా గాలిబ్ గీతం ఒకటి గుర్తొచ్చింది.

నా హృదయమే నా వద్ద లేదు ప్రియా, అందుకేనేమో ఏమీ వ్రాయలేకపోతున్నాను. అనుకుని చిత్రంగా నవ్వుకున్నాడు.

అలా నిద్ర రాక, వ్రాద్దామంటే మాటలు రాక ఆ రాత్రి భారంగా గడిచింది.

కాలేజిలో ఉమేష్ చెప్పిన మాటలతో మనసు మరింత ఉద్విగ్నభరితమయ్యింది.

’తన పట్ల అంత అభిమానం వుందా ఆమెకి? అబ్బ ఎంత అదృష్టవంతుడుని నేను’ పదే పదే ఇదే ఊహ అతని మనస్సు నిండా కలుగుతోంది.

సాయంత్రం వారి ఇంటికి వెళ్ళే ముందు వ్రాద్దామని మరో సారి కూర్చుని కూడా మరలా అదే పరిస్థితి ఎదురవ్వటంతో, ఇంక చేయగలిగేదేమీ లేక, ఒక 'ఏ ఫోర్' సైజు తెల్ల కాగితం పై రేనాల్డ్స్ పెన్ తో (రేనాల్డ్స్ పెన్ లు వచ్చిన కొత్తలు అవి భారతదేశంలో) క్లుప్తంగా ఇలా వ్రాశాడు,

'అయాచితంగా నీ ప్రేమ భిక్ష లభించినది.
నా అర్హతకి మించి నాకు లభించిన గొప్ప వరం నీ ప్రేమ.
పట్టెడన్నం దొరికితే చాలు అనుకున్నవాడికి
పంచభక్ష్య పరమాన్నాలు దొరికితే ఎలా తబ్బిబ్బు అవుతాడో
అలా వుంది నా పరిస్థితి.
నీవు నాతో మాట్లాడటమే నా అదృష్టం నేను భావిస్తుంటాను,
నన్ను చూసి నీవు నవ్వే చిరునవ్వు నాకు పెన్నిది గా భావిస్తుంటాను.
నీవు మీ ఇంటి నుంచి బయటికి వచ్చి, రోడ్డు మీద వెళ్ళేటప్పుడు
ఓరకంటితో నా వంక చూస్తే చాలనుకుంటాను.
మానవరూపంలో సంచరిస్తున్న దేవతా స్త్రీవి నువ్వని నీకుతెలియదు,
ఎందుకో దయతో వచ్చి ఈ మర్త్యుల మధ్య సంచరిస్తున్న దైవాంశ సంభూతురాలివి.
నీ చిరునవ్వే నాకు వరం
నీ పలుకే నాకు మంత్రోపదేశం
నీ చూపే నాపై కురిసే దయా వర్షం.
ఈ అల్ప సంతోషిని ఉక్కిరిబిక్కిరి చేయసంకల్పించావా?

నీ ప్రేమని నేను అస్సలు ఊహించలేదు.
నేను ఎంత అదృష్టవంతుడను?
ఒకటి చెప్పు మిత్రమా ఇదంతా కలా నిజమా?
నేను నీతో చెప్పాలనుకున్న ఎన్నో మాటలు , ఎంతో అందంగా నువ్వే చెప్పేశావు.

నీకో నిజం చెప్పనా, నా కలం నుంచి రావటానికి

నా మాటలు మొరాయిస్తున్నాయి.

మాటలు రాని మూగ వాడిలాగా అయ్యింది నా పరిస్థితి.

ఇలాంటి పరిస్థితి మొదటి సారి ఎదుర్కొంటున్నాను.

ఇదంతా కల కాదుగా?

నాపై నీ ప్రేమ నా స్వప్నం కాదుగా?

నీలాంటి దేవతా మూర్తి ప్రేమని పొందటానికి నాకు ఏ అర్హత వుంది?

ప్రియా ఇదంతా నిజమా?

నేను ఒక సామాన్యుడిని, నీవు నిజంగా దేవతా మూర్తివి.

నీ ప్రేమ నేను ఈ జన్మ లో పొందిన అత్యంత గొప్ప వరం.

నీ పట్ల నా ప్రేమని నీతో వ్యక్త పరిచే స్థాయి కూడా నాకు లేదని,

నాలో నేనే దాచుకున్న ఒక సామాన్యుడిని.

ఇప్పుడు నేను ప్రపంచంలోనే అతి గొప్ప అదృష్టవంతుడిని.

థాంక్యూ......థాంక్యూ....థాంక్యూ"

ఎన్నో వ్రాయాలనుకున్నా, ఓ నాలుగు మాటలు వ్రాసిన తృప్తితో ఆ కాగితాన్ని మడిచి జేబులో పెట్టుకుని సైకిల్ తీసుకుని వాళ్ళ ఇంటి కి బయలు దేరాడు.

వాళ్ళింట్లో ఎప్పటి లాగా పాఠం చెప్పించుకోవటానికి వచ్చే పిల్లలు కనపడ్డం లెదు. ఇంట్లో ఏదో ఫంక్షన్ జరుగుతున్నట్టు గుర్తుగా ద్వారబంధానికి పూల మాలలు, అరటి స్తంభాలు, మామిడి ఆకులు కట్టబడి వున్నాయి. లోపలి నుంచి ఏదో కోలాహలం వినిపిస్తోంది.

వాకిటి దాకా వెళ్ళి ఇక లోపలికి వెళదామా వద్దా అని సందేహిస్తుండగా, ఆ అమ్మాయి చూడనే చూసింది.

ఆమె ఆ రోజు చాలా ప్రత్యేకంగా కనిపిస్తోంది.

కాస్తా కుంకుమ పువ్వు కలిపిన పసుపు రంగు మైసూర్ సిల్క్ పట్టు చీర, దానికి ఎర్ర రంగు బోర్డర్, జరీ అంచుతో ఎర్ర రంగు జాకెట్. జాకెట్ కి చీరకి మధ్య బంగారు రంగులో మెరిసి పోతున్న పల్చటి నడుం. శంఖం లాంటి మెడ.

ఎర్రటి పెదాల వెనుక, దానిమ్మ గింజల లాంటి పలు వరుస. తళుకులీనుతూ ఊయల లా ఊగుతున్న బుట్టాల లాంటి జూకాలు.

చేతుల నిండుగా గల గల మని సవ్వడి చేస్తూ ఎర్ర రంగు మట్టి గాజులు, చేతికి ఎరుపు, పసుపు రంగు దారాలతో తోరం, ఆ తోరం మధ్యలో తమలపాకు కట్టబడి ఆమె చేతికే కొత్త శోభను ఇస్తోంది. కాళ్ళకు ఘల్లు ఘల్లు మని చప్పుడు చేస్తూ పట్టీలు, నుదుటిన పాపటి బిళ్ళ, జడ కుచ్చులు, జడ వెంబడి ముత్యాలు పొదిగిన చిట్టి చిట్టి వెండి గజ్జులు, తల నిండా మల్లె పూలు ఆమె రూపం చాలా కొత్తగా వుంది.

మళ్ళీ అదే భావన. దేవతా స్త్రీ వచ్చి ఎదురుగా నిలబడినట్టు అనిపించింది అతనికి.

"ఏయ్. ఏమిటి బయటే నిలబడి పోయావు. రా రా. లోపలికి రా. ఇవ్వాళ నోము నోచుకున్నాము. మీ వదినె గారు కూడా వచ్చి వెళ్ళారు ఇందాకే పేరంటానికి" ఆమె మాటలు వింటూ మంత్ర ముగ్ధుడిలా లోనికి నడిచాడు.

వాళ్ళిల్లు కోలా హాలంగా వుంది. ఎవరెవరో ముత్తైదువలు, పట్టు చీరల రెపరెపలు. హారతి పాటలు, ఇలా వుంది లోపలంతా. ఆ వాతా వరణంలో తాను ఎందుకు అన్నట్టుగా కాస్తా కదిలి , "హే, మరో సారి వస్తాలే మీరంతా ఏదో హడావుడిగా వున్నట్టు వున్నారు." అని బయలు దేరబోయాడు.

"ఏం ఫర్వాలేదు. కూర్చో కాసేపు.. బయటివారిని ఎవర్నీ పిలవలేదు. అంతా మా వాళ్ళే. ఇప్పుడున్నది మా మేనత్త వాళ్ళ కుటుంబం. వాళ్ళకు నిన్ను ఇంట్రడ్యూస్ చేస్తా వుండు వాళ్ళు కూడా బయలుదేరే హడావుడిలో వున్నారు."

ముందు ఉన్న చిన్న వరండాలో కూర్చోబెట్టి లోనికి వెళ్ళింది. అతను కూర్చున్నాడు. ఫంక్షన్ కి వచ్చిన మగ వాళ్ళందరు అక్కడే కూర్చున్నారు. ఆ అమ్మాయి నాన్నగారు, మారుతిలతో పాటుగా తనకు తెలియని ఓ నడివయసు పెద్దమనిషి, ఇంకో యువకుడు కూడా కూర్చుని ఉన్నారు. వాళ్ళ ఎదురుగా టీ పాయ్ పై త్రాగి పెట్టేసిన ఖాళీ కాఫీ కప్పులు, అప్పుడే ఏవో స్నాక్స్ తిన్నట్టుగా చిన్నచిన్న ఖాళీ ప్లేట్లు వున్నాయి.

మారుతి వాళ్ళ నాన్నగారు ఆ నడి వయస్సు పెద్ద మనిషితో కబుర్లు చెబుతూ, చిరునవ్వుతో తల పంకించారు ఈ అబ్బాయిని చూస్తూ.

తను కూర్చున్న స్థానం నుంచి లోపలి గదిలో హడావుడి కనిపిస్తోంది. సాధారణంగా ఆ లోపలి గదిలోనే ఆ అమ్మాయి సాయంత్రాలు పాఠాలు చెప్పేది. ఆడ వాళ్ళందరూ రాగ యుక్తంగా ఏవో భక్తి పాటలు పాడుకుంటున్నారు.

ఇంతలో ఆ అమ్మాయి పట్టు చీరని కాళ్ళకు అడ్డు పడకుండా కుచ్చిళ్ళని ఓ చేత్తో పైకి లాగి పట్టుకుని, మరో చేత్తో ఓ ట్రే పట్టుకుని వీళ్ళున్న ముందు గది కి వచ్చింది.

ఆ ట్రేలో ఓ చిన్న పళ్ళెం అందులో మురుకులు, మైసూర్ పాక్‌లు వున్నాయి. అవి అతనికి అందిస్తూ "ఇవి తీసుకోండి ప్లీజ్" అని గట్టిగా చెపుతూ అతనికి మాత్రం కనిపించేలా అతని వైపు తిరిగి మూతిని సున్నలా చుడుతూ , గుస గుసలాంటి స్వరంతో "ఏయ్ ఇవి తింటూ వుండు. వెళ్ళి పోకు, నా ఉత్తరం చదివావా?" అని అడిగింది.

అతను 'చదివాన'న్నట్టు తలూపాడు.

'నేను కూడా ఓ చిన్న ఉత్తరం తెచ్చాను నీకై' గుసగుసగా అంటూ తన గుండెపై చేయి ఉంచుకుని చూపాడు.

ఆమె కళ్ళలో ఒక విధమైన మెరుపు కనిపించింది ఆ క్షణంలో.

"నిదానంగా తింటూ వుండండి, కాఫీ కూడా వస్తుంది" అని పెద్ద గొంతుతో చెప్పి జింక పిల్లలాగా ముత్తైదువుల మధ్యలోకి వెళ్ళిపోయింది. వారంతా భక్తిగా లలితాసహస్ర నామం చదువుతూ వున్నారు.

ఇతను మురుకులు తింటానికి ఉపక్రమిస్తుండగా

మారుతి చొరవ తీసుకుని ఆ నడి వయస్సు పెద్ద మనిషిని పరిచయం చేశాడు, "వీరు స్వర్ణలింగం గారు, మా మామయ్య గారు. అంటే మా మా అమ్మగారి అన్నయ్య. వీరు మనూళ్ళో ఉన్న ఐ.టీ.ఐ కాలేజి కి కరస్పాండెంట్. ఇదిగో వారి పెద్ద అబ్బాయి రాఘవ. ఇక్కడే బ్యాంకులో పని చేస్తారు" అంటూ వారి ప్రక్కనే కూర్చున్న యువకుడిని కూడా పరిచయం చేసేశాడు మారుతి.

కుదురుగా కూర్చోక 'నాన్నా..నాన్నా' అంటూ తెగ అల్లరి చేస్తున్నాడు ఓ కుర్రాడు రాఘవ వడిలో.

వారికి నమస్కారం చేశాడు , ఇతని పరిచయం కూడా అయింది వారితో. అతనికి ఉదయం కాలేజిలో ఉమేష్ చెప్పిన మాటలు గుర్తు వచ్చాయి. 'అయితే వీరేనన్న మాట ఆ మేనమామ గారు' అని మనసులో అనుకుని, అసంకల్పితంగా అడిగేశాడు "చంద్రమోహన్ రాలేదా?" అని.

వారు కాస్తా ఆశ్చర్య పడ్డారు మొదట, "ఓ మీకు మా అబ్బాయి పరిచయం అన్న మాట" స్వర్ణలింగం గారు భృకుటి ముడేస్తూ, ఇతని వంక సాలోచనగా చూస్తూ అన్నారు, ఇతను సర్దుకుని "లేదు లేదు అతన్ని నేను ఎప్పుడు చూడలేదు కూడ. ఒక కామన్ ఫ్రెండ్ వున్నాడు మా ఇద్దరికి. అలా తెలుసు అతని పేరు నాకు అంతే."

"వాడు రాలేదు. వాడికి వంట్లో కాస్త నలతగా వుంటే రాలేక పోయాడు" రాఘవ బదులిచ్చాడు.

లోపలి గదిలో ఆడవాళ్ళ హడావుడి కొనసాగుతూనే వుంది.

కాళ్ళకు పసుపులు రాసుకోవటాలు, వాయనాలు ఇచ్చి పుచ్చుకోవటాలు, తాంబూలాలు ఇచ్చుకోవటాలు సాగుతూ వుండగా మళ్ళీ ఒక సారి వచ్చింది ఆమె.

చక్కటి కప్పులో పొగలు కక్కుతున్న కాఫీ తీసుకు వచ్చింది.

పేరంటానికి కూర్చున్న ముత్తైదువుల మధ్య నుంచి దారి చేసుకుంటూ నడచుకుంటూ రావటమే ఒక యజ్ఞం అనుకుంటే, అలవాటు లేని భారీ పట్టు చీర కుచ్చిళ్ళు ఒకచేత్తో పట్టుకుని, ఇంకో చేత్తో కాఫీ కప్పుని తీసుకురావటం ఒక పెద్ద కసరత్తే అవుతోంది ఆమెకి.

అతని పెదాల చివర ఒక చిన్న మందహాసం చోటు చేసుకుంది.

ఈ సారి తనతో ఓ అమ్మాయిని తీసుకు వచ్చింది. తనకన్న ఓ అయిదారేళ్ళు పెద్దది అన్నట్టుగా వుంది. ఆమె కూడా చాలా చక్కగా వుంది.

"హే, ఈమె దివ్య మంగళ. మా మేనత్త కూతురు. "

"దివ్యా, ఇందాక చెప్పాను చూడు, ఈ అబ్బాయే మన ప్రిన్సిపాల్ గారి తమ్ముడు"

'ఓహో ఈమె పేరు దివ్యమంగళ అన్న మాట' మనసులోనే అనుకున్నాడు ఇతను.

చంక దిగని చిన్న నెలల పాపని పట్టుకుని కూడా ఆమె ఆ కార్యక్రమం అంతా తానే అయి బాగా చురుకుగా తిరుగుతోంది.

ఆమె కి ఆ కుటుంబాలలో చాల ప్రాముఖ్యత వుందని అక్కడి వాతావరణాన్ని చూసిన కాసేపటికే అర్థం అయిపోతుంది ఎవరికైనా.

ప్రతి ఒక్కరూ ఆమెని సలహాలని తీసుకుంటున్నారు. తోరం ఎలా కట్టాలి అన్న దగ్గరనుంచి, ఏ పాట పాడాలి అన్న విషయం వరకు, ప్రతి ఒక్క విషయంలో ఆమె చురుకుగా అందరికీ చేదోడు వాదోడుగా అటు ఇటు తిరుగుతూ అందరితో తలలో నాలుకలాగా తిరుగుతూ వుంది.

సంవత్సరం క్రితమే పెళ్ళయిన ఆమె అమెరికాలో కాపురం వుంటోందని అది వరకు ఆ అమ్మాయి మాటల్లో చెప్పిన విషయం గుర్తుకు వచ్చింది అతనికి.

బంధువర్గం అందరికీ మంగళ అంటే ఒక విధమైన గౌరవం వుండటం గమనించాడు.

అప్పటి దాకా రాఘవ వళ్ళో కుదురుగా కూర్చొని కుర్రాడు కూడా మంగళ రాగానే, అత్తా అంటూ చెంగున అతని ఒడి లోంచి దూకి ఆమె వద్దకు వచ్చాడు.

"ప్రిన్సిపాల్ గారి తమ్ముడు మీరేనా? తాను మీ గురించి చాలా చెబుతూ ఉండింది ఇందాక" అంటూ ఆమె చనువుగా అతని ప్రక్కన చెయిర్ లో కూర్చుంది.

రెండు చేతులు జోడించి నమస్కారం చేసి, చిరునవ్వుతో ఆమె వంక చూస్తుండి పోయాడు అతను.

పిల్లలిద్దర్నీ సవరించుకుంటూనే అతని తో మాట్లాడుతు వుండిపోయింది ఆమె కాసేపు. అతని అభిరుచులు, ఇష్టాయిష్టాలు, అతని ఫ్యూచర్ ప్లాన్స్, ఫామిలీ బ్యాక్‌గ్రౌండ్, స్నేహితుల వివరాలు వగైరా వగైరా లు అడిగి తెల్సుకుంది.

ఆమె చాలా క్యాజువల్ గా అడుగుతున్నట్టు కనిపించినా, అతన్ని అంచనా వేయటానికి ఆమె ఒక పద్దతి ప్రకారం ప్రయత్నం చేస్తోంది.

కాని అతడు అదేం గుర్తించలేదు, ఆమె ప్రశ్నలకు సిన్సియర్ గా సమాధానాలు చెప్పాడు. అతని మనసంతా ఒకటే ఆలోచన, తనతో తెచ్చిన లెటర్ ఎలా అందజేయాలి, వీళ్ళంతా ఎప్పుడు వెళ్ళి పోతారు? ఇదే ఆలోచన అతడి మనసు నిండా.

కాసేపటికి అందరూ వీడ్కోలు చెప్పి బయలు దేరారు. అంబాసిడర్ కారు డ్రైవింగ్ సీట్లో రాఘవ కూర్చుని వున్నాడు, ఒకరొకరు గా అందరు కారు ఎక్కి కూర్చుంటున్నారు.

కుటుంబ సభ్యులు అందరూ కూడా వారికి వీడ్కోలు చెప్పే నిమిత్తం కంచే దాటి బయట నిలబడ్డారు. "ఒక్క నిమిషంలో వచ్చేస్తాం అంటు మారుతి, వాళ్ళనాన్న గారు కూడ కారు దగ్గరికి వీడ్కోలు చెప్పటానికి వెళ్ళారు.

ఇతనొక్కడే వరండాలో కూర్చుని వుండిపోయాడు.

చివరిగా దివ్యమంగళ, ఈ అమ్మాయి కదిలారు ఇంటిలో నుంచి.

ఈ అమ్మాయి బయటికి వెళ్ళబోతూ, తలమాత్రం వెనక్కు తిప్పి కనుసైగ తో అక్కడే గూట్లో ఉన్న అయిదవ తరగతి మాథమేటిక్స్ టెక్స్ట్ బుక్ వంక చూపింది.

కను రెప్పల్ని కదిలించటం ద్వారా "ఏయ్ మొద్దు, ఆ బుక్ లో పెట్టు నీవు తెచ్చిన లెటర్" అని తెలిపింది.

వాళ్ళు ఇద్దరు బయటికి కదలంగానే అతను చటుక్కున తను తెచ్చిన లెటర్ ని ఆమె చెప్పిన బుక్ లో వుంచాడు.

బయట చెప్పులేసుకుంటున్నదగ్గర ఆగి అమాయిలిద్దరూ మాట్లాడుకుంటున్నారు, మల్లె పూల సుగంధంతో బాటు వారి మాటల్ని గాలి లీలగా మోసుకు వస్తోంది.

"ఏయ్. వెరీ గుడ్ సెలెక్షన్. చాలా నచ్చాడు నాకు ఆ అబ్బాయి. యూ అర్ వెరీ లక్కీ. మా సీ.ఎం గాడి కీ ఇతనికీ పోలికే లేదు. యూ ఆర్ మేడ్ ఫర్ ఈచ్ అదర్ అనిపించింది" అది మంగళ గొంతు.

వారు తన గురించే మాట్లాడుకుంటున్నారు అని అర్ధమయి అతనికి కాస్తా సిగ్గుగా అనిపించింది.

కాలం ఎలా గడిచిపోతోందో తెలియడం లేదు.

రోజులు క్షణాల్లా గడిచిపోతున్నాయి. ఉదయం లేచింది మొదలు ఆమెపైనే ధ్యాస. అతడు యాంత్రికంగా కాలేజికి వెళుతున్నాడు వస్తున్నాడు. ఆనందంగా వున్నప్పుడు రోజులు క్షణాలుగా గడిచిపోతాయి అన్న వాక్యం ఎంత సత్యం కద అని ఎన్ని సార్లు అనుకున్నాడొ లెక్క లేదు.

అతని ఊహలు ఎక్కడనుండి మొదలైనా ఆమెతోనే అంతమవటం ఒక చెప్పుకోదగ్గ విశేషం. అది కాలేజిలో క్లాసు కావచ్చు, కెమిస్ట్రీ లాబ్ కావచ్చు, ఇంట్లో టీవీ చూసేటప్పుడు కావచ్చు ఎక్కడ వున్నా ఏమి చేస్తున్నా ఆమె ఊహలు అతన్ని ముసురుకుంటున్నాయి.

అది ఒక విధమైన తియ్యటి బాధ. ఎక్కడికి వెళ్ళినా ఆమె ఆలోచనలే, ఏమి చేస్తున్నా ఆమె ధ్యానమే.

ఎప్పుడూ వింటూ వచ్చిన సిన్మా పాటలే అయినా ఇప్పుడు వాటి సాహిత్యంలో అతనికి కొత్త అర్థాలు తెలుస్తున్నాయి. ఆ మూగ వేదన, విరహం, వ్యధ, కలవాలని వున్నా కలవటానికి అవకాశం రాకపోవటం, కొండంత ప్రేమ ని మాటల్లో వ్యక్త పరచలేని నిస్సహాయత ఇలా ఎన్నెన్నో భావాలు. వాటిలో మాధుర్యం, తియ్యదనం వేదన అతనికి అర్థం కావటం మొదలు అవుతోంది. ఆత్రేయ ని మనసు కవి అని ఎందుకన్నారో అర్థం అవసాగింది.

ఆ రోజుల్లోనే ఆత్రేయ గారు వ్రాసిన 'అభినందన' సినిమా పాటలు విపరీతంగా పాపులర్ అయ్యాయి. ఎక్కడికి వెళ్ళినా ఆ పాటలే చెవుల్లో మారుమ్రోగుతున్నాయి.

ఆ వేదనని, వ్యధని అతడు తట్టుకోలేక పోయేవాడు

ఒక్కోసారి ఆ అమ్మాయిని కలుసుకోవటానికి వీలయ్యేది కాదు, తనింటికి ఎవరన్నా చుట్టాలు రావటమో, లేదా ఆమెకి ఏదయినా పని పడి ఇంట్లో వుండకపోవటమో, ఇలాంటి పరిస్థితులలో అతనికి తెలియకుండానే అతని మనస్సంతా శూన్యం ఆవరించేది. అతనికి తెలియకుండానే అప్రయత్నంగా అతని పెదాల చివర ఈ పంక్తులు వచ్చేసేవి.

"ప్రేమించుటేనా నా దోషము?
పూజించుటేనా నా పాపము?
ఎన్నాళ్ళనీ ఈ ఎదలో ముల్లు?
కన్నీరుగ కరిగే ఈ కళ్ళు

నా లోని నీ రూపము
నా జీవనాధారము

అది ఆరాలి పోవాలి ప్రాణము

నేనోర్వలేను ఈ తేజము,
ఆర్పేయ్యరాదా ఈ దీపము.
ఈ చీకటిలో కలిసే పోయి
నా రేపటిని మరిచే పోయి
మానాలి నీ ధ్యానము
కావాలి నే శూన్యము
అపుడాగాలి ఈ మూగ గానము"★
(★అభినందన చిత్రం – రచన ఆచార్య ఆత్రేయ)

అరె ఈ కవికి ఎలా తెలుసు సరిగ్గా నేను అనుకున్న విధంగానే చెబుతున్నాడె అని అనిపించేది.
ఆ రోజుల్లోనే అతడి డైరీలో ఇలా వ్రాసుకొన్నాడు.
'ప్రియా ఉదయం లేవగానే మొదటి ఊహ నీది
మేలుకొన్నంత సేపు నీ ధ్యానమే
పడుకోనే ముందు చివరి ఆలోచన నీదే
నిద్రలో కలలంతా నీవే.

నేను అన్నదేది లేదు నా ఊహలో
ఏదో స్వప్న లోకంలో నేను జీవిస్తున్నట్టు వుంటాయి నా సజీవ క్షణాలన్నీ
ఇవి నిజమైతే ఎంత  బావుణ్ణు అన్నట్టు వుంటాయి నా స్వప్నాలన్నీ
కలలే నిజమైన వాడి జీవితం ఎంత ధన్యం కదా

నీతో నింపాదిగా మాట్లాడగలనో లేనో ఈ రోజు
అనే ఈ బెంగతోనే సరిపోతుంది పగలంతా.

సాయంత్రం నిను కలవంగానే
అరె ఇంకాసేపట్లో ఈ క్షణాలు కరిగిపోతాయే అని దిగులవుతుంది.

ఎవరో దార్శనికుడు చెప్పాడట
" ఈ క్షణం కూడా  గడిచి పోతుంది" అని.
నీ ఎదురుగా కూర్చుని మాట్లాడుతున్నంత సేపు ఆ వాక్యం గుర్తొచ్చి బాధవుతుంది
నీకై ఎదురుచూస్తూ కూర్చున్నంత సేపు ఆ వాక్యమే నాకు కొత్త శక్తిని ఇస్తుంది.

నా ఆశ నిరాశలతో నిమిత్తం లేకుండా
ఈ క్షణం గతం లోకి జారిపోతూనే వుంది.
ఈ క్షణాలకు శాశ్వతత్వాన్ని ఇవ్వగల
మంత్రశక్తీ ఏదీ ఎందుకు నాకు లేదు?

ఏ పనీ చేసుకోనివ్వవు
తల విదిల్చి తిరిగి పనిలో నిమగ్నం అవబోతే
రెట్టింపు వేగంగా వచ్చేస్తాయి నీ ఊహలు
పేరుకు నేనిక్కడ వున్నా  నా ధ్యాసంతా నీపైనే

నేను చూస్తున్న ప్రతి దృశ్యం నీకు చూపాలని
క్షణంలో నీముందు వాలాలని వుంటుంది
నన్ను మర్చిపోయావేమో అని భయమేస్తుంది
నీ ముందు వాలినా నన్ను గుర్తు పడ్తావో లేదో అనే భీతి కల్గుతుంది.★
(★ డాక్టర్.రాయపెద్ది వివేకానంద్ స్వీయ రచన)

ఇలా వ్రాసుకొనే వాడు కవితలు తన డైరీ లో.

పగలంతా తన ఆలోచనల్తో గడిపే వాడు. అది వేదన అని కూడా చెప్పటానికి లేదు. ఏదో తెలియని ఉద్విగ్నత అతన్ని ఆవహించి అతన్ని నిలువనీయలేక పోయేది.

కాలేజి కి వెళితే ఇంటికి వెళ్ళబుద్ధయ్యేది. ఇంటికి వెళితే కాలేజి కి వెళ్ళబుద్ధయ్యేది. ఎందుకో తెలియదు ఆమె ఇంటి వంక చూస్తు వుండిపోయే వాడు.

ఆమె నడిచిన బాటలో నెమ్మదిగా సైకిల్ తోస్కుంటు ఆమె స్కూలు దాకా వెళ్ళి వచ్చే వాడు.

మధ్యాహ్నం ఆమె లంచ్ కి వచ్చే టైంకి ,ఆమె రాకకై ఎదురు తెన్నులు చూస్తూ గడిపే వాడు.

దూరంగా లీలా మాత్రంగా ఆమె కనపడంగానే అతనిలో కొత్త శక్తి వచ్చేది. తనలోని జీవశక్తిని అంతా దృష్టిలోనూ, ఆ దృష్టినంతా బాట వెంబడి వచ్చే ఆమెపైనా నిలిపి చూసే వాడు.

అమెకి తెలుసు అతను తన కొరకు ఎదురు చూస్తూ వుంటాడని. స్పష్టాస్పష్టంగా కనిపించే ఆ చూపులకే ఉభయులూ పులకించిపోయే వారు.

ఆమె సాగే బాట ఇంచుమించు అతని ఇంటి వైపే వస్తుంది, ఇంకొక రెండువందల అడుగుల దూరం వుండగా ఆమె ఇంటివైపు మలుపుతిరుగుతుంది ఆమె దారి.

లీలా మాత్రంగా కనిపించే స్థితినుంచి, స్పష్టాస్పష్టంగా కనిపించే దశకు వచ్చి, ముఖకవళికలు కాస్తా స్పష్టంగా కనిపించే క్షణాల్లో ఆమె మలుపు తిరిగి తమ ఇంటి వయిపు దారి తీస్తుంది.

ఆ దశలో ఒకరి కొకరు చేతులు ఊపుకునే వారు. ఆ ఆనందం వారికే అర్థం అవుతుంది. ఆమె ఇంచుమించు ముప్పై అయిదు నిమిషాలు ఇంట్లో గడుపుతుంది లంచ్ బ్రేక్ లో. ఆ తర్వాతి తిరిగి స్కూలు కు బయలుదేరుతుంది.

ఆమె షెడ్యూలు మొత్తం అతనికి కొట్టిన పిండే.

ఆమె వెళ్ళిన కాసేపటి వరకు ఆ బాట వంకే చూసి అప్పుడు అతను కూడా భోజనానికి లోనికి వెళ్ళే వాడు. త్వర త్వరగా భోజనం ముగించి తిరిగి ఆమె స్కూలు కు వెళ్ళే సమయానికి బయటకు వచ్చి ఆమెనే చూస్తూ గడిపే వాడు.

వీధిలో ఎవరూ చూడటం లేదనుకుంటే చేతులు ఊపుకోవటం షరా మామూలే అన్నట్టు జరిగి పోయేది.

అగని పెదాల చివర అలవోకగా విశ్వకవి రవీంద్రుని 'గీతాంజలి' లోని పద్యం పలుకుతుంది.

అంతమనేది లేకుండా చేశావు నన్ను. నీ ఆనందమది.

నాజూకయిన జీవన పాత్రని తిరిగి తిరిగి రిక్తం చేసి వెంట వెంటనే నవజీవంతో నింపుతుంటావు

ఈ చిన్న రెల్లు పిల్లం గ్రోవిని నీ వెంట కొండ కోనల్లో తిప్పుకుని, నిరంతరం నూతన రాగాల్నిపలికిస్తావు.

నీ అమృత స్పర్శవల్ల ఉల్లాసంతో నా ఈ చిన్ని గుండె తన పరిధుల్ని దాటి అనిర్వాచ్యమైన అనుభవాన్ని పలుకుతుంది

అంతులేని నీ కాన్కల్ని ఈ చిన్ని దోసిట్లోకి తీసుకుంటాను.

యుగ యుగాలు గడిచినా నువ్వు దయా వర్షం వర్షిస్తూనే వుంటావు

ఇంకా నా దోసిలిలో స్థలం మిగిలే వుంటుంది.★

(★విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ రచించిన 'గీతాంజలి' సంకలనం నుండి. అనువాదం చలం)

"ఆ కాలంలో ప్రేమలు అంటే ఇంతే. ఎవరికి భయపడనక్కర లేదు, ఎవడైతే నాకేంటి అన్నట్టు తెగింపు వుండేది కాదు." కథ చెప్పటం మధ్యలో ఆపి చెప్పాడు సంతోష్.

అతడు కథ చెబుతున్నాడే గానీ, ఇలాంటి కథ సినిమాకు ఏమి పనికి వస్తుంది అన్న ఆలోచన అతనికి ఆది నుంచి ఉన్నదే. నవ్య ఏదో ఒక దశలో పెదవి విరిచి, "అబ్బే ఇదేం కథ సార్, సినిమాకు ఇదే మాత్రం పనికి రాదు" అని చెబుతుందేమో, చెప్పటం ఆపేసి హాయిగా నిద్రకు ఉపక్రమించవచ్చు అన్న ఆలోచన వుంది అతనికి.

కాని అతని ఊహల్ని తలక్రిందులు చేస్తూ ఎప్పటికప్పుడు "అబ్బ. అద్భుతం అంకుల్. నేను ఇలాంటి కథ కోసమే ఎదురు చూస్తున్నాను. చాలా చాలా బాగా వుంది" అని ఆద్యంతమూ అతన్ని ప్రోత్సహిస్తూ వస్తోంది.

నవ్య ఇప్పుడు కూడా అలాగే స్పందించింది.

"లేదు అంకుల్ చాలా బాగా వస్తోంది కథ. నాకయితే ఆ వాతావరణం కళ్ళకు కట్టినట్టు కనిపిస్తోంది. ఆ ఫీల్ బాగా మెయింటెయిన్ చేస్తాం మేము కూడా మా సినిమా లో"

"పెద్దలపై గౌరవం, సంఘం పట్ల భయ భక్తులు, ఎవరేమి అనుకుంటారో అనే భీతి. ఒక విధమైన సంకోచం, సంశయం ఇలా సాగిపోయేవి ఆ కాలంలో ఆలోచనలు.

అందరూ ఇలాగే వుంటారని కాదు గానీ అధిక భాగం ఇలాగే వుండే వారు.

సిటీల సంగతి ప్రక్కన పెడితే, చిన్న చిన్న ఊర్లలో పరిస్థితులు ఇలాగే వుండేవి ఆ రోజుల్లో.

కాలేజీలలో సైతం అమ్మాయిలు, అబ్బాయిలు మాట్లాడుకోవటానికి చాలా జంకే వారు.

దీనికి తోడు దురదృష్టవశాత్తు ఇక్కడ మన కథలో నాయికా నాయకులు అసలు ఒక కాలేజీ విద్యార్థులు కూడా కాక పోయిరి. వాళ్ళు ఏకాంతంగా కలిసి మాట్లాడుకునే పరిస్థితులు అస్సలు వుండేవి కావు.

నేను యధార్థ గాథనే నీతో పంచుకుంటున్నాను, ఏదీ నేను కల్పించి చెప్పడం లేదు కాబట్టి సినిమాకు అవసరమైన మసాలాలు లోపించాయి అని అందుకే నేను పదే పదే నీతో చెబుతున్నాను" అన్నాడు సంతోష్.

"లేదు అంకుల్. నేను ఎలాంటి కథ, కథనం ఆశించానో సరిగ్గా అలాగే వస్తోంది. ఇలాంటి సినిమానే నేను తీయాలనుకుంటున్నాను. మీరు నిస్సందేహంగా చెప్పుకుంటూ వెళ్ళండి. మామూలు సినీ పరిభాషలో చెప్పాలంటే అద్దిరిపోయింది" అంటూ నవ్వేసింది.

తను కూడా నవ్వి తిరిగి చెప్పటం ప్రారంభించాడు సంతోష్.

అతడి మనస్సు ఇంత సంక్షుభితంగా వున్నా కూడా, మొదటి సంవత్సరం ఫలితాల్లో అతనికి కాలేజి లో అందరి కన్నా హయెస్ట్ మార్క్స్ వచ్చాయి. కాలేజి లో ప్రతి క్విజ్ పోటీలో అతనే విజేత. అన్ని విభాగాల్లో అతనే ఫస్ట్.

ఆమె ఊహ అతనికి ప్రేరణ ఇస్తోందో, అదృష్టం కలిసి వచ్చిందో గానీ అతని ప్రభ వెలిగిపోతోంది కాలేజి లో.

అది మంచి వర్ష కాలం. క్షణం తెరిపి లేకుండా ఉదయం నుంచి భారీగా కురుస్తోంది వర్షం. సహజంగానే వర్షాకాలం. దానికి తోడు వాయుగుండం కూడా తోడవడంతో విపరీతమైన వర్షం పట్టుకుంది.

ఆ వేళ కాలేజికీ కూడా వెళ్ళలేదు అతను.

తన గదిలో కూర్చుని కిటికీలోంచి వర్షం చూస్తూ కూర్చున్నాడు. ఇంటి వెనుకే వరి పొలాలు, పొలాల వెనుక పర్వత శిఖరాలు చాలా ఆహ్లాదంగా వుంది ప్రకృతి.

పర్వత శిఖరాలపై నుండి చిన్న చిన్న జలపాతాలలాగా దూకుతున్నాయి వర్షపు నీరు. పర్వత శిఖరంపై శాంతమల్లప్ప ఆలయంలో దీపాలు మినుకు మినుకు మంటూ వెలుగుతున్నాయి. కొండకు దారి తీసే మెట్ల దారి వర్షపు తెరలు, మంచు తెరల మాటున చాలా అందంగా కనిపిస్తున్నాయి.

వాళ్ళింటికి వెళదాం అని మనస్సు లాగుతోంది. మళ్ళీ వాళ్ళ పెద్ద వాళ్ళు ఏమనుకుంటారో అని ఒక వంక మనసు వెనక్కు లాగుతోంది. అసలే ఈ మధ్య మారుతి తనతో సరిగ్గా మాట్లాడటం లేదు.

కాస్త హర్ట్ అయినట్టు కనిపిస్తోంది అతని బిహేవియర్.

ఆ అమ్మాయికి తనకు మధ్య ఈ ప్రేమ అనే కాన్సెప్ట్ మొదలు కాకముందు హాయిగా దర్జాగా వెళ్ళివచ్చేవాడు ఎప్పుడు కావాలనిపిస్తే అప్పుడు. కావాల్సినంత సేపు కూర్చుని సరదాగా మాట్లాడి రాగలిగే వాడు.

ఇది తన మానసిక భావమా, లేక నిజంగానే అలా జరుగుతోందా తెలియదు, ఆ మారుతి ఇప్పుడు తనతో ముక్తసరిగా మాట్లాడుతున్నాడు అని అనిపిస్తుంది.

ఇంతలో అతని చెవులను సోకిన పాట అతన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. ముందు గదిలో నుంచి వినిపిస్తోంది మంద్రంగా.

"మరుగేలరా ఓ రాఘవా!

మరుగేల – చరా చర రూప

పరాత్పర సూర్య సుధాకర లోచన"

సందేహం లేదు. ఇది నిస్సంశయంగా ఆమె గొంతే. తను వచ్చిందా? ఇంత వర్షంలో తను వచ్చిందా? నేను కలగాని కనటం లేదు కద అని అనుకుని అతడు ముందు గది వంక వచ్చాడు.

ఇది కల కాదు నిజం. నిస్సందేహంగా ఇది నిజం. ఆమెని చూసేసరికి 'విశ్వకవి రవీంద్రనాధ ఠాకూర్ 'గీతాంజలి' లోని పద్యం అతని హృదిలో తటిల్లతలా మెరిసి మురిసింది.

"స్వర్ణ మణిమయ రత్న ఖచితాసనం దిగి,

నా పూరింటి చెంత నిలిచావు.

ఓ మూల నే ఒంటరిగా నిను తలచుకుంటుంటే

ఆ సంగీత మాధుర్యం నీ చెవుల చేరగా

నా పూరింటి చెంత నిలిచావు.

అమోఘ విశ్వ సంగీతంతో కలిసిన నా విషాద గీతానికి మెచ్చి

నీవు బహుమతిగా ఓ పుష్పం చేబూని నా పూరింటి చెంత నిలిచావు"★

★(అనువాదం: చావా కిరణ్)

అతని కన్నుల్లో ఆనందంతో కన్నీటి తెర అడ్డొచ్చింది. ఇష్ట సఖి ఎదురుగా వున్నా చూడలేని ఆశక్తత. కర్చీఫ్ తో కళ్ళు తుడుచుకుని, తనెదురుగా సోఫాలో కూర్చుని వున్న తన ప్రియదేవతని ఆశ్చర్యంతో చూస్తుండిపోయాడు.

"ఒరే ఈ అమ్మాయి చక్కగా పాడుతుంది. దా. నువ్వుకూర్చో విందువు గానీ" అని వదినెమ్మ పిలిచింది.

సింగిల్ సీటర్ సోఫాలో వదినెమ్మ కూర్చోనుంది. తను ఇక తప్పని సరై ఆ అమ్మాయి పక్కనే కూర్చున్నాడు.

"నీ ప్రక్కన ఓ నిమిషం కూర్చునే చనువు నాకిమ్మని అడుగుతున్నాను

నీ ముఖ వీక్షణం నుంచి ఎడమైందా, నా హృదయానికి శాంతి విశ్రాంతులు వుండవు." రవీంద్రుని గీతాంజలి నన్ను విడిచిపెట్టాదా ఈ వేళ అనుకున్నాడు అతను తన మనస్సులో.

ఆమె గొంతు సవరించుకుని మళ్ళీ మెదట్నుంచి పాడటం మొదలెట్టింది, కొత్తగా రంగ ప్రవేశం చేసిన శ్రోత కోసం. ఓర చూపులతోనే అతన్ని క్షేమసమాచారాలు అడిగింది. 'చూశావా నీవు రాకుంటే నేనే వచ్చేశాను' అన్న సందేశమూ వుంది ఆ చూపులో.

"మరుగేలరా ఓ రాఘవా!

మరుగేల – చరా చర రూప

పరాత్పర సూర్య సుధాకర లోచన

అన్ని నీ వనుచు అంతరంగమున

తిన్నగా వెదకి తెలుసుకొంటి నయ్య

నెన్నె గాని మదిని ఎన్నజాల నొరుల

నన్ను బ్రోవవయ్య త్యాగ రాజనుత"

కీర్తన పూర్తయింది.

వాళ్ళు గమనించలేదు గానీ, బయట వర్షం అధికమైంది.

"ఏయ్ పిల్లా! టీవీలో 'సాగర సంగమం' వస్తుంది. చూసి వెళ్ళు. ఇవ్వాళ నీ భోజనం ఇక్కడే" ప్రకటించింది వదినెమ్మ. మనసులోనే కోటి కోటి థాంక్స్ లు చెప్పుకున్నాడు వదినెమ్మకి.

అమెకి ఎవరిమీదనయినా ప్రేమ ఎక్కువ అయితే 'ఏయ్ పిల్లా' అనేస్తుంది గబుక్కున.

మొహమాటంగా చూస్తున్న ఆ అమ్మాయి వంక చూస్తూ "మీ అమ్మా వాళ్ళకు నేను కబురు పెడతాను లే" అని భరోసా ఇచ్చింది వదినెమ్మ.

సినిమా మధ్యలో వదినెమ్మ లోపలికి వెళ్ళినప్పుడు , మెల్లిగా అడిగాడు అతడు "ఏయ్, నీ పుట్టిన రోజు ఎప్పుడు?" అని

"జూన్ పదకొండు. నీది ఎప్పుడు?" ఆమె సమాధానం చెప్పింది.

"ఓ మై గాడ్. జూన్ పదకొండు అంటె నిన్ననే. మరి నాకు చెప్పనే లేదేం?" అతడు ఆశ్చర్య పోయాడు.

"ఏమిటొ అసలు అలవాటు లేదు, చిన్నప్పట్నుంచి అలా సెలెబ్రేట్ చేసుకోవటం. ఇంతకూ నీది ఎప్పుడు?"

"నాది జూన్ తొమ్మిది. మళ్ళీ ఓ సారి ఓ మై గాడ్. చూశావా అస్సలు మర్చిపోయాను ఈ సంవత్సరం. నా ఆలోచనలన్నీ నీ గురించే నాకు సంబంధించినది ఏది కూడా నాకు గుర్తు వుండటం లేదు" సిన్సియర్ గానే చెప్పాడు అతను.

ఆమె అతని వంక ఆశ్చర్యంగా చూసింది, ఆమె చూపులో ఒక విధమైన సిగ్గు కూడా తొంగి చూస్తోంది అతని మాటలకు.

"నువ్వు రణమండల శిఖరం ఎప్పుడైనా ఎక్కావా?" ఆమె చిన్నగా అడిగింది.

అతడు 'లేద'న్నట్టు తలూపాడు.

"శ్రావణ మాసం చివరి శనివారం నేను మా స్నేహితురాళ్ళతో కలిసి వెళుతున్నాను. నీకు అదే చెప్దామని వచ్చాను ఇప్పుడు. చాలా బాగుంటుంది అక్కడ. వీలైతే నీవు కూడా రా"

అతను తలూపాడు అంగీకార సూచకంగా

ఇంతలో వదినెమ్మ రావటంతో సంభాషణ కి బ్రేక్ పడింది.

ఇద్దరూ సినిమా చూడ్డంలో నిమగ్నమయ్యారు.

ఆమె ఆ సినిమాలో లీనమయి పోయి ఒక్కో సారి కంట తడిపెట్టుకోవటం కూడా గమనించాడు.

అతనికి కూడా బాగా నచ్చింది ఆ సినిమా. అతడు పెద్దగా సినిమాలు చూడడు. 'సాగరసంగమం' లోని భావోద్వేగాలు అతనికి బాగా నచ్చాయి.

**ఎంతో** ఉత్సాహంగా ప్రారంభమయిన రణమండల ట్రిప్ అతనికి తీరని వ్యధని కలిగిస్తుందని అతడు ఏమాత్రం ముందుగా ఊహించలేక పోయాడు.

అక్కడ భవిష్యత్తుని తెలుసుకునే అవకాశం వచ్చింది. ఎంతో ఉత్సాహంగా భవిష్యత్తులోనికి తొంగి చూసిన అతనికి భయంకరమైన ఆశాభంగం అయింది.

నిజం చెప్పాలంటే భవిష్యత్తును తెలుసుకోవాలని అందరూ ఉత్సాహం చూపిస్తారు. కానీ ప్రతి సారి మనకు భవిష్య దర్శనం ఆనందాన్నే పంచకపోవచ్చు. విషాద రాగాల్ని కూడా ఆలపించవచ్చేమో.

నిజమో కాదో తెలియని భవిష్యవాణిని తెలుసుకుని వర్తమానంలోని ఆనందాన్ని పోగొట్టుకోవడం కన్నా మూర్ఖత్వం వేరే ఏమి ఉంటుంది?

మనం మార్చలేని భవిష్యత్తుని తెలుసుకుంటే మదిలో విషాదాగ్నులే రగులుతాయి తప్ప మరే ఇతర ప్రయోజనం ఉండదని అతనికి అర్థం అయింది ఆ రోజు.

ఓ విధీ ఎందుకు మా జీవితాలతో చెలగాటాలు ఆడతావు

ఆశలు కల్పిస్తావు, ఊహలు రగిలిస్తావు

అందమైన స్వప్నాల్ని చూపిస్తావు

ఆనందాన్ని అందిచ్చినట్టే అందించి

తీరని వ్యధని రగిలిస్తావు

ఓ విధీ! ఓ విధీ!! ఓ విధీ!!!

డైరీ వ్రాస్తూ అతడు జీవితంలో మొదటి సారి ఏడ్చాడు ఆ రాత్రి. కంటికి కనిపించని అదృశ్య శక్తి ఏదో తనతో వింత నాటకం ఆడుతున్నట్టు అనిపించింది ఆ క్షణంలో.

ఇంతకూ ఆ శిఖరంపై ఏమి జరిగిందో తెలుసుకుందాం.

రణమండల శిఖరం

శ్రావణమాసం. చివరి శని వారం తెల్లవారు ఝామున.

చలి గాలులు వణికిస్తున్నాయి.

తెరిపి అన్నది లేకుండా చిరు చిరు జల్లులు గా కురుస్తూనే వుంది వర్షం.

ఆ అమ్మాయి అతన్ని పిలిచి మూడు రోజుల అవుతోంది. ఆమె మాటలే అతని చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి నిరంతరం. "నేను మా స్నేహితురాళ్ళతో కలిసి ఈ శని వారం రణమండల వెళుతున్నాను. వీలయితే నీవు కూడా రావా?" అని. అ మూడు రోజులూ ఎదురుచూస్తూ గడిపేశాడు, ఎప్పుడెప్పుడు వస్తుందా ఆ రోజు అని.

సముద్ర మట్టానికి దాదాపు పదిహేను వందల అడుగుల ఎత్తులో రణమండల శిఖరం పై వెలసి వున్న హనుమాన్ మందిరం చాలా రద్దీగా వుంది.

ఆ గుడికి చాలా ప్రత్యేకతలే వున్నాయి. వుండటానికి ఆంధ్రప్రదేశ్ లోనే వున్నా ఏదో ఉత్తర భారతదేశం లో ఉన్న పుణ్యక్షేత్రం లో లాగా వుంటుంది అక్కడి వాతావరణం.

అక్కడ వెలసిన ఆంజనేయ స్వామి విగ్రహానికి ప్రత్యేకంగా గుడి లాంటి నిర్మాణం గానీ గర్భగుడి గానీ ఏమీ వుండవు. ఆరు బయలు లోనే ఒక పెద్ద శిలపై దాదాపు పది అడుగుల ఎత్తైన నిండైన వీరాంజనేయ రూపంలో వుంటారు.

విగ్రహం ఆద్యంతం సిందూరం పూయబడి చూడటానికి చాల బాగుంటుంది విగ్రహం. అక్కడ విగ్రహానికి గుడి ఎందుకు లేదు అన్న విషయం లో స్థానికులు ఇలా చెబుతారు, ఇక్కడ గుడి నిర్మింపబడాలి అంటే ‘ కొన్ని ప్రత్యేకమైన నిబంధనలు వున్నాయి. అ నిబంధనలకు కట్టుబడి మాత్రమే గుడి నిర్మాణం జరగాలి. లేదంటె పట్టణానికి ముప్పు వస్తుంది. ఇది దైవ శాసనం’.

ఆ నిబంధనల్లో కొన్ని ఏమిటంటే ...

మందిర నిర్మాణం ఒక్కరోజులోనే పూర్తిచేయాలిట, అదీగాక దేశంలోని అన్ని పుణ్యతీర్ధాలనుంచి నీళ్ళను ఒకేసారి తీసుకువచ్చి మందిర నిర్మాణం చేయాలట. ఇందులో అంతరార్ధం ఏమిటో తెలియక మందిర నిర్మాణానికి ఎవ్వరు పూనుకోలేదు.

శ్రావణ మాసంలో ప్రతీ శనివారం ప్రత్యేక పూజలు జరుగుతాయి ఆ గుడిలో. శ్రావణ మాసం ప్రతి శనివారం ఆ ఊరిలోని భక్తులే కాక, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్తాన్ నుంచి కూడ భక్తులు తరలి వస్తారు .

చివరి శనివారం జరిగే జాతరకు అయితే ఇక చెప్పే పనే లేదు.

ఎప్పుడా ఎప్పుడా అని ఎదురు చూసిన రోజు రానే వచ్చింది.

అది శ్రావణ మాసం చివరి శనివారం. స్నేహితులతో కలిసి వచ్చాడు. సైకిళ్ళపై వచ్చినా, వాటిని కొండ క్రింద ఆపేసి దాదాపు ఆరు వందల మెట్లు ఎక్కి పైకి వచ్చారు. అదొక అద్భుత సాహసకృత్యం లాగా వుంటుంది.

మెట్లన్నీ ఒకే తీరుగా వుండవు. కొన్ని దగ్గర్ల సునాయాసంగా, కొన్ని దగ్గర్ల మరీ నిటారుగా వుండే ఆ మెట్లని ఎక్కడం మరీ అంత సామాన్యమైన విషయం ఏమీ కాదు. కాస్తా అజాగ్రత్తగా వుంటే క్రిందకి పడిపోవటం ఖాయం. కొన్ని దగ్గర్ల మెట్లు మాయమయిపోయి సమతలంగా వున్న మైదానం వస్తుంది. శిఖర ఆరోహణంలొ ఒక్కోదగ్గర మైదానాలలో చక్కటి నీటి కొలనులు కూడా కనిపిస్తాయి. వాటి నిండా కలువలు పూచి కంటికి ఇంపుగా వుంటాయి చూట్టానికి. అంతలోనే కఠినమైన నిటారుగా వుండే మెట్లు ప్రారంభమయి పోతాయి.

కొన్ని మెట్లు ఎక్కి ఒక సారి వెనక్కు తిరిగి చూసుకుంటే గర్వంగా అనిపిస్తుంది, మనం ఎక్కివచ్చిన ఎత్తుకు తార్కాణంగా క్రింద ఆదోని పట్టణం లో భవనాలు అగ్గిపెట్టెల్లా కనిపించటం ప్రారంభం అవుతుంది.

దూరంగా వెళ్ళే రైలు బండి వానపాములా కనిపిస్తుంది.

కాన్వాస్ పై ఎవరో చిత్రకారుడు చిత్రించిన చిత్తరువులాగా వుంటుంది ఆ దృశ్యం. చుట్టూ మూడు వైపులా కొండలు, ఒక వైపు పట్టణం. అన్ని వైపులా నేపథ్యంలో వినీలాకాశం.

క్రింద కనిపించే పట్టణం ప్రక్కనే తూర్పు దిక్కున కనిపిస్తున్న రామ్‌జల ఒక అద్భుతమైన మానవనిర్మిత జలాశయం. నీటిని కనిపించనీయకుండా చేస్తున్న మంచు తెరలు ఆ దృశ్యాన్ని మరింత మనోహరంగా మారుస్తున్నాయి.

అతడు అన్ని కొండల్ని ఎన్నడూ చూసి వుండలేదు. ఎటు చూసినా శ్రేష్టమైన గ్రానైట్ రాతితో నిండిన కొండలు. అంతర్జాతీయ మార్కెట్ లో వాటికి చాలానె విలువ పలుకుతుంది. అందుకే నిరంతరం ఆ కొండల్ని ప్రవేటు కాంట్రాక్టర్లు తొలుస్తూనే వుంటారు. సాధారణంగా కొండలు అంటే దట్టమైన వృక్షాలు వుండటం కద్దు, కాని ఇవి పూర్తిగా రాతి కొండలు అయినందువల్ల వృక్షాలు అరుదుగా కనిపిస్తాయి.

ఆ కొండపై గుప్త నిధులు వున్నాయన్న పుకార్లకు కూడా కొదవేమి లేదు.

మిత్రులు అతన్ని బలవంతం చేస్తునే వున్నారు  వెళదామని ఈ శిఖరం విషయం చెప్పి. అతనికి పెద్ద ఆసక్తి లేక పోయింది. అందుకే తాత్సారం చేస్తూ వచ్చాడు ఇన్ని రోజులు.

ఆంజనేయస్వామి గుడి గురించి చెప్పి ఊరించారు. అయినా అతడు పెడచెవిన పెడుతూనే వున్నాడు. ఇంకొంత మంది మిత్రులు 'అరె బాస్, అక్కడ ఎటు చూసినా అందమైన అమ్మాయిలు, ఆంటీలు కనిపిస్తారు. చూసిన కంట చూడలేం అబ్బబ్బ ఏమి ఫిగర్లు తెలుసా' అని ఊరించాడు కూడా.

ఎందుకో అతనికి వెళ్ళాలని అనిపించలేదు అన్ని రోజులు. వాళ్ళు అంతగా అడుగుతుంటే, సరేలే చివరి శనివారం వెళదాం అని నిర్ణయించుకున్నాడు.

ఇంకా చిత్రమైన విషయం ఏమిటంటే ఆ చివరి శనివారం ఆ ఊరికి పూర్తిగా ప్రభుత్వ హాలిడే లాగా వుంటుంది. కాలేజీలు, స్కూళ్ళు, ఆఫీసులు, ఇతర వ్యాపార సంస్థలు కూడా శెలవు పాటిస్తాయి ఆ రోజు.

అబ్బ ఇన్ని ప్రత్యేకతలు వున్నాయంటే వెళ్ళాల్సిందే ఒక సారి అని అనుకున్నాడు అతడు.

ఇంతలో అతన్ని మరింత ఉత్సాహ పరుస్తూ ఆ అమ్మాయి కూడా రమ్మని పిలిచేసరికి అతని ఆనందానికి హద్దులు లేకపోయాయి.

ఆరు వందల మెట్లు ఎక్కటం ఉత్సాహంగా ముగించి కొండ పైకి చేరుకున్నారు మిత్రులు అంతా. విశాలమైన ఆవరణ ప్రారంభం అవుతుంది మెట్లన్నీ అయిపోగానే. ఒక చిన్న ఫుట్ బాల్ గ్రౌండ్ అంత విశాలమైన ఆవరణ. అంత ఎత్తైన ఆ కొండపై అంత విశాలమైన స్థలం వుంటుందని అసలు ఊహించలేరు ఎవరూ.

ఆ విశాలమైన ప్రదేశం మధ్యలో నిలువెత్తు హనుమాన్ విగ్రహం. పూజలు చేస్తూ క్షణం తీరిక లేకుండా వున్నారు పూజారులు. విజయ నగర సామ్రాజ్యాధీశుడు శ్రీ కృష్ణ దేవరాయల వారి గురువు శ్రీ వ్యాస రాయలు స్థాపించారు ఈ విగ్రహాన్ని అని చెబుతారు.

గుడికి కాస్తా దూరంగా విశాలమైన ఆ ఆవరణ అంతటా జాతర. ఏక్కడ చూసినా ఇసుకేస్తే రాలనంత జనసందోహం.

ఆకాశమే పందిరిగా రంగుల రాట్నాలు, బూరాలు, ప్లాస్టిక్ బొమ్మలు అమ్మే వాళ్ళు,  గాజులు రిబ్బన్లు అమ్మే వాళ్ళు, గోరింటాకు డిజైన్ చేతికి పెట్టే వాళ్ళూ, కోతుల్ని ఆడించే వాళ్ళు, చిన్న చిన్న మేజిక్ చేసే వాళ్ళు ఇలా కోలాహలంగా వుంది అక్కడి వాతావరణం.

ఇవన్నీ ఒక ఎత్తు ఆ చలి వాతావరణంలో వేడి వేడి మిరపకాయ బజ్జీలు అమ్మేవాడి వ్యాపారం జోరుగా సాగిపోతోంది. దర్శనం చేసుకుని వచ్చిన భక్తులు అందుబాటులో ఉన్న చిన్న చిన్న టిఫిన్ సెంటర్ల ముందు విధిగా బొరుగుల తిరుగువాత, , మిరపకాయ బజ్జీలు కొనుక్కుని తింటున్నారు.

(అనంతపురం జిల్లా మరియు ఆ జిల్లా సరిహద్దు ప్రాంతాలలో దొరికే ఒక ప్రత్యేకమైన ఫలహారం. మరమరాల్ని నీటిలో నానేసి చింతపండు రసంలో ఊరేసి చేస్తారు. దానికి జతగా మిరపకాయ బజ్జీలు ప్రత్యేక ఆకర్షణ)

ఇవన్నీ కాదు అతను చూస్తున్నది అతని కళ్ళు ఆమె కొరకు వెదకుతున్నాయి. ఆమె చెప్పిన టైంకే వచ్చాడు కద, కాబట్టి ఖచ్చితంగా తను కూడా వచ్చే వుంటుంది అనుకుంటూ చుట్టూ చూస్తున్నాడు అతను.

"ఏయ్ పద పద, మొదట దర్శనం చేసుకుని వద్దాం" అని తొందరించారు మిత్రులు అపర భక్తులు లాగా. అప్పుడు చూశాడు ఎవరో నార్త్ ఇండియన్ అమ్మాయిలు ఒక టీం లాగా అర్చన చేయించుకోవటానికి వెళుతున్నారు.

"రేయ్ ఇదే మంచి అవకాశం. వాళ్ళ అందరి పేర్లు తెలుసుకోవచ్చు పూజారికి గోత్రనామాలు చెప్తారుగా" అంటూ వాళ్ళలో ఒక మేధావి తొందరించాడు.

చిరునవ్వు నవ్వి మిత్రబృందంతో కలిసి పూజకి వెళ్ళాడు. వెళ్ళి తాము కూడా పూజ ముగించుకుని క్యూ నుండి బయటకు వచ్చారు. పేరు దేవుడిది, ధ్యానం, ధ్యాస అమ్మాయిలపైన అన్నట్టు సాగింది వారి పూజ.

అతను మనసార ధ్యానించుకున్నాడు స్వామిని. కేసరి వర్ణంతో మెరిసిపోతున్న ఆ పదడుగుల విగ్రహ మూర్తిలో ఏదో తెలియని పవిత్రత గోచరిస్తోంది. మనస్సు తనంతట తానే వినిర్మలంగా మారి, కళ్ళు మూసుకోగానే, ధ్యానం చక్కగా కుదురుతోంది.

సముద్రమట్టానికి పదిహేను వందల అడుగుల ఎత్తుతో వెలసిన ఆ విగ్రహాన్ని తదేకమనస్కుడై ప్రార్థించాడు అతను. తనచుట్టూ వున్న అమాయిలు, వాళ్ళనే చూస్తూ వాళ్ళ ఇంప్రెషన్ కొట్టేయ్యాలనే ఉద్దేశంతో గట్టిగా ఏవేవో మాట్లాడేస్తున్న మిత్రబృందం తాలూకు మాటలు, మైకుల్లో నిరంతరాయంగా వినిపిస్తున్న భక్తి గీతాలు, పూజారి చేస్తున్న అష్టోత్తర శతనామావళీ ఏవీ అతని ధ్యానాన్ని భగ్నం చేయలేకపోయాయి.

నిర్మల మనస్కుడై, ఏకాగ్ర చిత్తుడై అర్ధనిమీల నేత్రుడై స్వామిని ఒక్కటే కోరిక కోరుకున్నాడు.

"స్వామి, నేను నిన్ను కోరేది ఒక్కటే. నాకు ఏది మంచిదో అదిచేయి. నా మనస్సంతా ఆ అమ్మాయే నిండి వుంది. జీవితంలో నేను ఎన్నడు పొందనంత భావసంచలనానికి గురవుతున్నాను. ఆమె రూపం, ఆమె కంఠం, బాధ్యతాయుతమైన ఆమె ప్రవర్తన ఇలా ఒకటేమిటి ఆమెలో అన్నీ ఇష్టం. ఆమెలో తప్పులు పట్టదగ్గ అంశం ఇప్పటి దాకా నాకు ఒక్కటి కూడా కనపడలేదు. ఆమె నా జీవిత భాగస్వామి అయితే బాగుంటుంది అన్న కోరిక నాలో బలంగా కలుగుతోంది.

ఒక భక్తుడికి తన ఇష్టదైవం ప్రత్యక్షమయితే ఏ స్థాయిలో అతనిలో భావసంచలనం కలుగుతుందో ఆ స్థాయిలో ఆ అమాయిని చూస్తే నాకు ఇష్టం ఏర్పడుతోంది. ఆమెని ఒక పసిపాపలా లాలించాలని, దగ్గరకు తీసుకుని ఓదార్చాలని, తన కష్టాలన్ని తీరిపోయేలా చక్కటి జీవితాన్ని ఆమెకి సమకూర్చాలని బలంగా అనిపిస్తోంది. నాకు అంతా మంచి జరిగేటట్టు చూడు. నీ కృప నాయందు సదా వుండేలా అనుగ్రహించు" అతడు మనఃస్ఫూర్తిగా ప్రార్థించి కళ్ళు తెరిచి, ఆ మూర్తిని మరొొక్కసారి కనులారా చూసుకుని, తీర్థ, ప్రసాదాలు తీసుకుని మిత్రులతో పాటు బయటకు వచ్చాడు.

"ఒరే, నీవు మాష్టర్ ప్లాన్ వేశావురా. మేము ఎన్ని కోతి చేష్టలు చేసినా మమ్మల్ని చూడని ఆ నార్త్ ఇండియన్ అమ్మాయిలు, అక్కడ అర్చన జరిగినంతసేపు కండ్లు మూసుకుని మొక్కుకుంటున్న నిన్నే చూశార్రా నాయనా" మిత్రులు వేళాకోళం పట్టించారు.

ఉదయాన్నే బయలుదేరేముందే చెప్పారు అన్నా వదినెలు, 'శ్రద్ధగా మొక్కుకునిరా స్వామిని. చాలా మహిమ గల దేవుడు."

అలాగే ఆ అమ్మాయి చెప్పిన మాటలు కూడా గుర్తుకు వచ్చాయి "నీవు కోరుకున్నవి అవుతాయోలేదొ కూడా అప్పుడే చెప్పేస్తాడు దేవుడు"

"అదెలా?"

"దర్శనానంతరం ప్రదక్షిణ చేస్తూ స్వామి విగ్రహం వెనుకకు వెళితే , విగ్రహం వెనుక భాగాన ఒక గోడ వుంటుంది. అక్కడ నుంచుని, చేతిలో ఒక రూపాయ నాణేన్ని ఉంచుకుని, మనస్ఫూర్తిగా మొక్కుకుని ఒక కోరిక కోరుకుని ఆ తర్వాత ఆ రూపాయ నాణేన్ని ఆ గోడకు తాకించాలి. నీ కోరిక నెరవేరే పక్షంలో అది గోడకు అతుక్కుంటుంది. లేదంటే అది జారి క్రింద పడి పోతుంది"

"అయ్య బాబొొయి నిజమా?"

"ఏమో అందరూ నిజమనే అంటారు. ప్రయత్నం చేసి చూడు" ఆ అమ్మాయి చెప్పింది.

ఆ సంభాషణ అంతా గుర్తు వచ్చింది.

మిత్రులు ఆ అమ్మాయిల గుంపుకి కాస్తా వెనగ్గా వెళుతున్నారు.

'నేను ప్రదక్షిణలు చేసుకుని వస్తా' అని చెప్పి వారి సమాధానం కోసం ఎదురు చూడకుండా, వారి నుంచి విడివడి అతడు వేగంగా ప్రదక్షిణ దిశగా విగ్రహం వెనుక వైపుకు వెళ్ళసాగాడు. అప్పుడు కనిపించింది ఆమె. ఉదయం నుంచి ఎవరి కోసమైతే అతని కన్నులు వెదుకుతున్నాయో, ఎవరు కనపడితే అతని మనస్సుకు నెమ్మది కలుగుతుందో, ఎవరు

కనపడే దాకా అతని మనసు మనసులో లేదో, ఏ రూపం అతని చిత్తానికి శాంతినిస్తుందో, ఏ చిరునవ్వు అతన్ని హృదయంలోని కలవరాన్ని దూరం చేస్తుందో, ఆ అమ్మాయి కనపడింది అక్కడ.

ప్రధాన మందిరానికి కాస్తా వెనుకగా ఓ చిన్న కొండరాయిపై కూర్చుని తన వంకే చూస్తూ నెమ్మదిగా చేయి ఊపింది.

స్నేహితురాళ్ళతో కూర్చుని వుంది తను. వాళ్ళంతా మిరపకాయ బజ్జీలు తింటున్నారు. అతను కూడ ఆమె వైపు చూచాయగా చేయి ఊపాడు.

ఆమె చిరునవ్వు నవ్వింది. ఆ నవ్వులో ఏదో తేడా. తనకే జీవాన్ని అందించే ఆ చిరునవ్వు నిస్తేజంగా వుంది. అతనికి అర్థం కాలేదు మొదట. ఆ తర్వాత అనుకున్నాడు ఆరు వందల మెట్లు ఎక్కి వచ్చిన అలసట వల్ల అలా అయి వుండొచ్చు అని. కాని మరి కాసేపటికి అతనికి తెలిసింది అసలు కారణం.

తను మాట్లాడితే వినిపించేటంత దూరంలోనే వుందామె. "మారుతీ రాలేదా?" అడిగాడు ఏదో ఒకటి మాట్లాడాలని

"లేదు. లేదు. రేపు ఏదో ప్రాజెక్టు వుందట ప్రిపేర్ అవుతున్నాడు". ఈ లోగా అడుగులు ఆమె దగ్గరకి చేర్చాయి అతన్ని.

"ఇదిగో ఇతను మా తమ్ముడి ఫ్రెండ్. కాలేజి ప్రిన్సిపాల్ గారి తమ్ముడు" అంటూ పరిచయం చేసింది.

ఒకరి వంక ఒకరు ఆర్తిగా చూసుకున్నారు.

"సరే నేను వెళ్ళొస్తా. మా ఫ్రెండ్స్ ఎదురు చూస్తుంటారు" అని కదిలాడు.

అతని మనసుకి ఒకటి అర్థం అవుతోంది "ఆమె, ఎప్పుడూ ఉన్నంత ఉత్సాహంగా లేదు . ఎంత దాచుకున్నా ఏవో విషాద రాగాలు పలుకుతోంది ఆమె వదనం. ఒకట్రెండు సార్లు వెను తిరిగి చూశాడు వస్తూ వస్తూ. ఆమె తననే చూస్తోంది.

అతను నేరుగా వెళ్ళివిగ్రహం వెనుక గోడ వద్దకు వెళ్ళాడు.

అక్కడ ఒక చిన్న సైజు క్యూనే వుంది.

తన వంతు వచ్చే వరకు ఓపికగా వేచి వుండి, గోడ వద్దకు చేరుకున్నాడు. ఆమెకి కనపడుతూనే వుంది యావత్తు. చేతిలో నాణెం వుంచుకుని, స్వామికి మనసారా మ్రొక్కుకుని ఆ గోడకు తాకించాడు.

అతడు అడిగిన ప్రశ్న "స్వామి. నా ప్రేమ సక్సెస్ అవుతుందా?"

నాణెం క్రింద పడేటప్పుడు చేసిన ధ్వని కట్టెదుట వేల కొద్ది పిడుగులు ఒక్కసారిగా పడితే ఎలా వినిపిస్తుందో అలా అనిపించింది అతనికి. అతడికి కాళ్ళక్రింద భూమి కదిలి పోయినట్టు అయింది.

మళ్ళీ మళ్ళీ అదే ప్రశ్న అడుగుతూ గోడకు అంటించే ప్రయత్నం చేశాడు. ప్రతీ సారి అదే ఫలితమే వచ్చింది. కళ్ళు బైర్లు కమ్మినట్టు అనిపించింది అతనికి.

తల తిప్పి ఆమె వంక చూశాడు. అప్పటి దాక తననే చూస్తోందని తన ప్రయత్నాలు అన్ని గమనించింది అని అర్థం అయింది.

'డోంట్ వర్రీ' అన్నట్టు సైగ చెస్తూ,' బేలగా తనకూ అలాగే వచ్చింది ఫలితం అని తన అరచేతిని ఛాతీపై వుంచుకుంటూ సైగ చేసింది. ఆమె దిగులుకు కారణం అర్థం అయింది.

వాళ్ళ స్నేహితురాళ్ళు బలవంతం చేయటంతో ఆమె లేచి బయలు దేరింది.

ఇతడు ఆ దేవుడిని పరీక్షించదలచుకుని అనేక మామూలు ఇతర ప్రశ్నలు వేస్తూ నాణెం అంటించాడు.

'నేనింటికి ఇవ్వాళ క్షేమంగా చేరుతానా?'

'మా వదినె నాకు రాత్రి అన్నం పెడుతుందా?'

'కొండకింద నా సైకిల్ క్షేమంగా వుందా?'

చిత్రంగా వాటన్నిటికీ బదులుగా నాణెం గోడకు అతుక్కుంది.

అతనికి భోరున ఏడ్వాలని పించి, నిశ్శబ్దంగా ప్రక్కకు వచ్చేశాడు.

ప్రకృతి కూడా అతని విషాదంలో పాలు పంచుకుంటోందా అన్నట్టు క్షణాలలో భారీ వర్షం ప్రారంభం అయిపోయింది.

ఆ రోజు కొండ దిగి ఎలా వచ్చాడొ, ఇంటికి ఎలా వచ్చాడొ ఆతనికే తెలియదు. శరీరం లోంచి ప్రాణ శక్తిని ఎవరో గుంజేసిన భావన. ఆ రోజు డైరీవ్రాస్తూ భోరున ఏడ్చేశాడు అతడు.

ఆ రాత్రంతా ప్రకృతి విలపిస్తూనే వుంది.

రెండు రోజులు పట్టింది అతనికి ఆ సంఘటన తాలూకు ప్రభావం నుంచి కోలుకోవటానికి.

ఆ సాయంత్రం వాళ్ళ ఇంటికి వెళ్ళాడు మామూలుగానె. శెలవు కావటాన పాఠాలు చెప్పించుకోవటానికి పిల్లలు ఎవ్వరూ రాలేదు. తాను మొక్కలకు నీళ్ళు పడుతూ వుంది పెరట్లో.

ఆ సంఘటన తాలూకు ప్రభావం తన మాటల్లో కనిపించకుండా మామూలుగా వుండే ప్రయత్నం చేస్తూ అతను అన్నాడు "చాలా బాగుంది గుడి. నీవు చెప్పకుంటే నాకు తెలిసేదే కాదు. ఆ మంచు తెరలు, ప్రకృతి, చల్లటి గాలులు, ఇవన్నిటికి తోడు మంచి గుడి. థాంక్స్ నాకు తెలిపినందుకు"

ఆమె కూడా చిరునవ్వు తో ఏదో మాట్లాడింది. కాసేపు అయ్యాక అతడు తిరుగు ముఖం పట్టాడు అతడు.

అప్పటికే చీకటి అలుముకుంటోంది.

అప్పుడు అంది ఆమె నెమ్మదిగా

"ఏయ్, నీ మొహం చూసుకున్నావా అద్దంలో అస్సలు? ఒక నెల రోజులు జ్వరంతో పడి లేచిన వాడిలా వున్నావు. నీవు అనసరమైన దిగులు పెట్టుకోకు. మనకు ఏది ప్రాప్తం ఉందో అది తప్పక జరుగుతుంది. నేను నీకు సారి చెప్పాలి అసలు. నిన్ను అనవసరంగా అక్కడికి పిలిచి, ఇదంతా చేసాను." ఆమె గొంతు తడబడుతోంది. ఆమె మాటల్లో స్పష్టత లోపించింది. ఎంతగానో అణచి పెట్టుకున్న భావోద్వేగం వెక్కిళ్ల రూపంలొ వస్తోంది. ఆమె కండ్ల నిండా నీటి తెరలు. గాల్లో తేలి వస్తున్న ఆమె మాటలకి అతడు ఆగి పోయాడు. ఒక సారి వెను తిరిగి చూశాడు. అతడి కంటిలోని నీటి ఊటల కారణంగా ఆమె రూపం , ఆమె కన్నీళ్ళు అతనికి కనిపించలేదు.

తన కన్నీళ్ళు ఆమెకి కనిపించకూడదని,అతను గిరుక్కున వెనుదిరిగి వచ్చేశాడు.

ప్రియాతిప్రియమైన నీకు

రణమండల కొండపై అలాంటి ఫలితం రావటం నిజానికి చాలా బాధ కలిగించింది. నేను అస్సలు ఊహించలేదు దేవుని నుంచి అలాంటి సమాధానం వస్తుంది అని. అసలు ఇదంతా పెద్ద మూఢనమ్మకం అని అనిపిస్తోంది. అసలు గోడకు నాణెం అంటుకుని నిలబడటం సాధ్యమా? ఇదంతా అలోచిస్తే పెద్ద మూఢనమ్మకం అని అనిపిస్తోంది. యాధృచ్చికంగా ఒకటి రెండు సార్లు నేను అతికించిన నాణెం అంటుకుని వుండొచ్చు గాక. ఇదంతా పెద్ద నమ్మదగిన విషయంగా నాకు అనిపించటం లేదు.

చూశావా మనుషుల మనోప్రవృత్తి ఎంత చిత్రంగా వుంటుందొ. అదే ఫలితం మనకు అనుకూలంగా వచ్చివుంటే ఇదంతా నిజం అని నేనే చెప్పే వాడినేమో బహుశా. ఏది ఏమయినా మన చేతిలో లేని దాని గురించి మనం దిగులు పడి మన వర్తమానాన్ని పాడుచేసుకోవటం మూర్ఖత్వం.

నీవెందుకు 'సారి' చెప్పటం? నీవు అలా ఏమీ ఫీల్ అవ్వాల్సిన పని లేదు. నేనే నీకు ఇంకా థాంక్స్ చెప్పాలి. నాకు తెలిసిన ప్రపంచం కాలేజి, లైబ్రరి, పుస్తకాలు, కవిత్వం ఇంతే. నీ సలహా వల్ల ఈ ఊర్లోనే వున్న ఇంత అద్భుతమైన టూరిస్ట్ స్పాట్ ని చూడగలిగాను.

నీవు కూడా ఇక ఆ విషయం మర్చిపో. సంతోషంగా వుండాలి నీవు. ఒకేనా.?

అన్నట్టు నీకో గుడ్ న్యూస్. నిన్ననే తెలిసింది. మా అమ్మా, నాన్నలు ఈ ఊరు వస్తున్నారు కొన్నాళ్ళు వుండిపోవటానికి. నీకు మా అమ్మా వాళ్ళకు పరిచయం చేస్తాను. మా అమ్మ నిన్ను చూస్తే బోలెడు సంతోషపడుతుంది. నీవు మా అమ్మకి ఖచ్చితంగా నచ్చుతావు. నీవు ఎవరికి నచ్చవు?

మా అమ్మా వాళ్ళు ఎప్పుడెప్పుడు వస్తారా అని ఎదురు చూస్తున్నాను. అసలు ఆ రణమండల శిఖరంపై అలాంటి ఫలితం ఎందుకు వచ్చిందో నాకే ఆశ్చర్యంగా వుంది. మామూలుగా ప్రేమికులకు వచ్చే అతిపెద్ద సమస్య కుల, మతాలు వేరు అన్న కారణంగా పెద్దలు ఒప్పుకోకపోవటం.

యాధృచ్చికంగా మనకు ఆ సమస్య కూడా ఏమీ లేదు.

నేను నా చిన్నప్పటి నుంచి కూడా ఏదీ కావాలి అని మా అమ్మానాన్నలని వేధించలేదు. వాళ్ళ ప్రతి నిర్ణయాన్ని గౌరవిస్తూ వస్తున్నాను. నేనై నేను నోరు తెరిచి అడిగితే నా కోరిక ఏది కాదనరు అనే ధీమా నాకుంది.

కాకపోతే వాళ్ళకూ నా ప్రేమ సంగతి ఎలా చెప్పాలా అన్నది నాకు పెద్ద సమస్యగా వుంది. ప్రస్తుతానికి నీవు, నేను బాగా స్నేహంగా వున్నాం అన్న విషయం వారికి అర్థమయ్యేలా ప్రవర్తిద్దాం. నీ అంత చక్కటి అమ్మాయిని మా అమ్మ తప్పక ఇష్ట పడుతుంది. నిన్ను మా అమ్మకి పరిచయం చేసినప్పుడు నీవు నీలా వుంటే చాలు. నీకు ఎవ్వరూ సాటి రారు. ప్రత్యేకంగా నీవు ఏమీ ప్రిపేర్ అవ్వాల్సిన పని లేదు.

నాలో నాకు గమ్మత్తైన ఆలోచనలు వస్తున్నాయి తెలుసా? చెబితే నవ్వుతావు. మళ్ళీ ఆడవాళ్ళని కించపరిచానని అంటావేమో.

ఏంటంటే,

అసలు పెళ్ళిళ్ళ విషయానికి వస్తే ఆడపిల్లలు పెళ్ళికి ఎంత త్వరగా అర్హత పొందుతారు కద. నేను గమనిస్తూనే వున్నాను, మీ అమ్మా నాన్నలు నీ పెళ్ళి విషయం లో తొందర పడుతున్నారు. మొన్న మాటల్లో అన్నారు, ఎవరో బ్యాంకు ఎంప్లాయి అట, నిన్ను ఏదో పెళ్ళిలో చూశాట్ట. నిన్ను పైసా కట్నం లేకుండా చేస్కుంటానని కబురు పెట్టాడట వాళ్ళ పెద్ద వాళ్ళ ద్వారా. ఇక నీవు ఓకే అనటమే మిగిలివుంది అన్నట్టు చెప్పుకొచ్చారు మీ అమ్మగారు.

నాకు కాస్తా శూన్యంగా అనిపించింది ఆ మాటలు వింటుంటే. కాసేపు నా చెవులు పని చేయలేదు. నా పెన్నిధిని ఎవ్వరో కొల్లగొట్టుకుని పోతున్నట్టు అనిపించింది.

'తను ఇంకా డిగ్రీ సెకండ్ ఇయరే కద ఆంటీ' అన్నాను అక్కడికీ

'ఇప్పట్నుంచి మన ప్రయత్నాలు మనం చేయాలి కద నాయన, ప్రయత్నం అంటూ మొదలెట్టి నాలుగు సంబంధాలు చూస్తే ఏదో ఒకటి కార్య రూపం దాల్చటానికి ఇంకో ఒకట్రెండు సంవత్సరాలు పడుతుంది. ఈలోగా తన డిగ్రీ అయిపోయి

తన కాళ్ళమీద తాను నిలబడ గలిగితే మాకు ఒక నిశ్చింత' మీ అమ్మగారు ఏదో చెప్పుకొని పోతున్నారు గాని, నాకేమి వినిపించడం లేదు నిజానికి.

నాకసలు ఏమనిపించింది అంటే, లేచి నిలబడి గట్టిగా దిక్కులు పిక్కటిల్లి పోయేలాగా అరిచి చెప్పాలని అనిపించింది "తను నా స్వంతం. తనకు ఎవ్వర్నీఇచ్చి చేయకండి. మేము ఒకర్నొకరు ఇష్టపడుతున్నాము" కాని అలా చెప్పలేకపోయాను.

చెప్పాను కద, అమ్మాయిలు పెళ్ళికి త్వరగా అర్హత సంపాయించేస్తారు. మా అబ్బాయిల విషయం అలా కాదు కద. డిగ్రీ అవగొట్టుకోవాలి, ఇంకా పై చదువులు చదువుకోవాలి, ఉద్యోగప్రయత్నాలు చేసుకోవాలి, ఉద్యోగం సంపాయించాలి, తనను తన జీవిత భాగస్వామిని కూడా పోషించుకోగలిగేలా స్థిరపడాలి. పెళ్ళి అనే మాట గురించి ఆలోచించటానికి అప్పుడు కాస్తా అర్హత వస్తుంది అబ్బాయిలకు.

అందువల్ల మీ అమ్మగారికి చెప్పలేక పోయాను. ఒక వేళ నేను ధైర్యం చేసి అలా అడిగాననే అనుకుందాం, ఆమె నన్నే బొద్దింకనో చూసినట్టు చూసి 'ఇంకా డిగ్రీ సెకండియర్ లోనే ఉన్నావు, అప్పుడే పెళ్ళికి తొందర వచ్చిందా నాయనా' అని అంటే నా మొహం ఎక్కడ దాచుకోవాలి?

ఏమిటో నాకు దిగులుగా వుంటోంది ఒక్కోసారి.

అందుకే అటునుంచి నరుక్కురావాలి అని డిసైడ్ అయ్యాను. మా అమ్మా వాళ్ళు వచ్చాక వారికి నిన్ను చూపించి, మా అమ్మగారికి నీపై సదభిప్రాయం ఏర్పడేలా చేయగలిగితే, మన సమస్య దాదాపు తీరిపోయినట్టే.

అన్నట్టు ఈ లెటర్ ని మీ స్కూలు అడ్రసు కు పోస్ట్ లో పంపిస్తున్నాను. ఎవరైనా అడిగితే యూనివర్శిటీ నుంచి వచ్చింది అని చెప్పి మేనేజ్ చేయి. నీవు కూడా ఏమి వ్రాయాలనుకున్నా నిరభ్యంతరంగా మా ఇంటి అడ్రసుకే పోస్టు చేయవచు. నాకు అనేక పత్రికా కార్యాలయాల నుంచి, ఆకాశవాణి నుంచి లెటర్స్ వస్తూ వుంటాయి కాబట్టి ఎవ్వరికీ అనుమానం రాదు.

వుండానా మరి.

నీ

ప్రియ స్నేహితుడు"

ఇలా ఉత్తరం వ్రాసి ముగించాకా అతనికి చాలా నిశ్చింతగా అనిపించింది.

అటు తర్వాత రెండు రోజులకు అతని పేరుతో ఒక ఇన్లాండ్ లెటర్ వచ్చింది. ఫ్రం అడ్రసు దగ్గర ఖాళీగా వుంది. అతనికి ఆ చేతి వ్రాత పరిచయమే. ముత్యాలన్నింటిని శ్రద్ధగా ఒక దగ్గర ఏర్చి కూర్చి పెట్టారా అన్నట్టు వుంటుంది ఆమె చేతి వ్రాత.

ఉత్తరం పై తన పేరు తనకే చాలా అందంగా కనపడింది ఆమె చేతి వ్రాతలో.

"ఏయ్ మొద్దు,

నీ ఉత్తరం అందింది. అయ్యబాబోయి నీకు ఎంత ధైర్యం? నాకు స్కూలు అడ్రసుకు లెటర్ వ్రాస్తావా? నేను అస్సలు ఊహించలేకపోయాను. ఏమిటి నీకు ఇంత తెంపరితనం? అసలు నాకు చెప్పనయినా చెప్పావా ఉత్తరం వ్రాస్తున్నాను అని. కనీసం చెప్పి వుండాలి నేను కాస్తా మానసికంగా సిద్ధపడి వుండే దానిని కద.

నిన్నంతా ఒకటే వర్షం, చలి. క్లాసులో పిల్లలకు లెక్కలు చెప్పిస్తూ వుండినాను. మా ఆయమ్మ వచ్చి 'ఏదో పోస్టు వచ్చిందమ్మా' అంటూ నీ లెటర్ నా చేతికి తీసుకువచ్చింది.

నీకు చావు తెలివి తేటలు ఎక్కువ. యూనివర్శిటీ కవర్ లాంటి బ్రవున్ కవర్ ఎక్కడ సంపాయించావు నాయనా. పైగా దాని మీద ఫ్రం అడ్రస్ దగ్గర కూడ చక్కగా ఏదో యూనివర్శిటి నుంచి వచ్చినట్లు ఎలా వ్రాసావో. నాకు చాలా సేపు అర్థం కాలేదు. యూనివర్శిటీ వారు ఎందుకు పంపించారబ్బా అని చాలా సేపు ఆలోచించాను. ఎందుకంటే ఓపెన్ యూనివర్శిటీ నుంచి నాకు రావాల్సిన కరస్పాండెన్స్ మొత్తం మా నాన్న గారి అడ్రసు కు వస్తుంది. నా స్కూలు అడ్రసు అసలు వారికి తెలిసే అవకాశం లేదు. కానీ కొన్ని క్షణాలు తేరిపారా చూస్తే, నీ చేతివ్రాతని సులభంగానే గుర్తు పట్టాను. నీది అద్భుతమైన చేతివ్రాత కద. అదిగొ బుంగమూతి పెట్టేసుకుంటున్నావు. నీ చేతివ్రాత అంతబాగుండకున్నా నీ మనసు చాలా మంచిది. నాకు అదే నీలో నచ్చేది; నిజం చెప్పాలంటె నీ ఉత్తరం అందగానే, నాకు ఎంత సంతోషం అయిందో తెలుసా, నాకు ఇబ్బంది కలుగకూడదు అని చెప్పి నీవు ఎంత దూరం ఆలోచిస్తావు, కద. నీవు నా బుజ్జిగాడివి.

నిజం చెప్పాలంటే రణమండల శిఖరం పై జరిగిన పరిణామలు నాకు కూడా చాలా బాధ కలిగించాయి. ఆ రోజు నేను ఎంత నిస్పృహకి గురయ్యానంటే మాటల్లో చెప్పలేను.

నీవు నాకు జీవితంలో దొరికిన ఒక ఒయాసిస్ అని అనుకుంటూ వచ్చాను, కానీ నీవు నా జీవితంలో ఒక ఎండమావిగా మిగిలిపోతావా? అసలా ఊహనే నాకు ఎంతో భయాన్ని బాధని కల్గించింది. ఆ రోజు మొత్తం నేను గాలి తీసేసిన బెలూన్ లాగా నిస్తేజంగా ఉండిపోయాను.

మా స్నేహితురాళ్ళకు అసలేమి అర్థం కాలేదు. "పొద్దున వచ్చేటప్పుడు ఎంతో ఉత్సాహంగ వుండినావు కదనే, ఇంతలోపు ఏమయింది" అని ఒకటే గోల.

నేను ఆ రోజు సిన్సియర్ గా ఇంకోటి ఫీలయ్యాను తెలుసా. ఏమిటంటే, మనం చక్కగా స్నేహితుల్లాగా వుండిపోకుండా ఈ ప్రేమ అనే కాన్సెప్ట్ ఎందుకొచ్చిందిరా భగవంతుడా మన మధ్య అని చాలా సార్లు అనుకున్నాను ఆ రోజు.

నేను నీ మొహం లో అంత విషాదాన్ని భరించలేకపోయాను. నా వల్ల నీ జీవితంలో ఎలాంటి దుఃఖం రాకూడదు.

నేను నా మనసులోని బాధల్ని, భావాల్ని ఎవరితో పంచుకోను. నేను మనసు విప్పి నా గురించి ఏదయినా చెప్పింది అంటె అది నీ ఒక్కడితోనే. నీ సాంగత్యంలో నేను ఎంతో భరోసాగా ఫీల్ అవుతాను.

నీ ప్రతి మాట నాకు గుర్తు వస్తునే వుంటుంది. ఇప్పుడు కూడా అచ్చు నీతో మాట్లాడుతున్నట్టు ఫీలవుతూ వ్రాస్తున్నాను తెలుసా. నీవు వ్రాసింది నిజం. ఒక స్త్రీ వివాహానికి సిద్దం కావటం చాలా సులభం. నన్ను పోషించే స్థాయికి నీవు రావాలి అంటే నీవు ఇంకా ఎంత కష్టపడాలి జీవితంలో అన్న విషయం నాకు తెలుసు.

కాని నాకు ఒకటి సంతోషకరమైన విషయం ఏమిటంటే, మొదటి సంవత్సరం ఫలితాల్లో నీకు వచ్చిన మార్కులు గురించి మా నాన్న గారు కూడ నిన్న మా ఇంట్లో భోజనాల దగ్గర చెప్పి నిన్ను చాలా పొగిడాడు. నాకు ఎంత గర్వంగా అనిపించిందో. ఏయ్ దొంగా, నిన్ను నివ్వు యావరేజ్ స్టూడెంట్ అని చెప్పుకొచ్చావు మొదట్నుంచి, అది ఊరికే నన్ను ఆట పట్టించటానికా? దాదాపు పదిహేను నిముషాలు నీ గురించే చెపుతూ వుండిపోయారు మా నాన్న గారు నీ గురించి, బోలెడు సర్టిఫికెట్స్ తయారు చేసి వుంచారట నీ పేరుతో. ఎస్సే రైటింగ్ పోటీలు, వక్తృత్వం పోటీలు, డిబేట్లు, క్విజ్ ప్రోగ్రాములు ఇలా చాలానే తయారు చేశారట. త్వరలో రాబోయే కళాశాల వార్షికోత్సవాలలో ఇవ్వటానికి. ఆయనే కద అడ్మిన్ సెక్షన్ హెడ్. నీ గురించిన ప్రతి డెవలెప్ మెంట్ ఆయనకు తెలిసిపోతుంది.

ఇటు చదువులలోనూ, ఎక్స్ట్రా కరిక్యులర్ ఆక్టివిటీస్ లోనూ నువ్వు దిట్టవట. అబ్బో చాలా పొగుడుతూ వుండిపొయాడు నీ గురించి. చెప్పాను కద చాలా గర్వంగా అనిపించింది నీవు నా ఫ్రెండ్ అని చెప్పుకోవటానికి. నేనేం పలకలేదు బాబూ ఊరికే వింటూ ఉండిపోయాను.

ఏయ్ బుజ్జిగాడు, నీవిలాగే బాగా చదువుకోవాలి. నన్ను చేసుకుని నన్ను పోషించాలి కద. బాగా చదువుకో. మంచి ఉద్యోగం తెచ్చుకో. మా ఇంట్లో వాళ్ళకి ఇప్పుడే మన విషయం చెప్పి, వాళ్ళని అనవసరంగా కంగారు పెట్టకుండా , నా పెళ్ళి విషయం మటుకు నేను దాటవేస్తు వస్తాను లే. ఈ బ్యాంకు ఎంప్లాయి ఎవరబ్బా, మా ఇంట్లో వాళ్ళు ఈ విషయం నాకు చెప్పలేదే ఇప్పటివరకు.

కాకపోతే ఒకటి జరిగింది. మొన్న మా అమ్మ నన్ను ఫోటో స్టూడియోకి తీసుకు వెళ్ళీ చక్కగా రెండు ఫోటోలు తీయించింది. ఎందుకో అనుకున్నాను. ఓహో వాళ్ళ మాష్టార్ ప్లాన్ ఇదన్నమాట.

నీవు అనవసరమైన ఆలోచన్లు అన్ని పెట్టుకుని నీ మనస్సు పాడుచేసుకోకు. నేను నీకోసం ఎన్ని సంవత్సరాలైనా ఎదురుచూస్తాను. నాకు నీతో కలిసి జీవించటం అనే ఊహనే చాలా హాయిగా వుంది. ఎంత సాంత్వన పొందుతున్నానో నాకే తెలియదు.

బ్యాంకు వాడు కాదు కద, ఎవడొచ్చినా జాన్తానై. నీవు ఈ విషయం లో నిర్భయంగా ఉండు. నేను ఆగివుంటాను నీ కోసం.

నేను కూడా బాగానే చదువుకుంటాన్లే. మరీ నీ అంత బాగా కాకున్నా, మేమూ ఫర్వాలేదండి. ఒక మోస్తరు స్టూడెంట్లమే. నేను డిగ్రీ అవగొట్టేసి ఏదో ఒక ఉద్యోగం చూసుకుంటు నీకు చేదోడు వాదోడుగా వుంటాన్లే.

మన భవిషత్తుని ఊహించుకుంటూ వుండటం నాకు ఇటీవల ఏర్పడిన కొత్త హాబీ. ఎన్నెన్ని కలలు కంటున్నానో లెక్క లేదు. అవన్నీ వ్రాయలంటే ఈ ఉత్తరం చాలదు, ఓ గ్రంధం అవుతుంది.

మీ అమ్మనాన్నలు వస్తున్నారంటే నాక్కుడా చాలా ఎక్జైటింగ్ గావుంది. మీ ఇంట్లో ఫోటోస్ చూశాను కద. నాకు మీ అమ్మగారంటే చాలా గౌరవభావం ఏర్పడింది. ఆవిడని చూడంగానే నేను చేయబోయే మొదటి పని ఆవిడ కాళ్ళకి దండం పెట్టి మొక్కుతాను. ఇదేదో ఆవిడని ఇంప్రెస్ చేయటానికి కాదు. నాకు నిజంగా చాలా గౌరవభావం ఏర్పడింది ఆమె అంటే.

ఈ ఇన్లాండ్ లెటర్లు చాలవు నా మాటలకి అని అర్థం అయింది. ఇదే నేను నీకు వ్రాస్తున్న చివరి ఇన్లాండ్ లెటర్. కంగారు పడకు. ఇక పై హాయిగ కాగితాలపై వ్రాసి కవర్ లో పెట్టి పంపుతాను.

ఈ లెటర్ల అయిడియా భలే వుంది. అయినా అతి సర్వత్ర వర్జయేత్. మరీ ఎక్కువెక్కువ లెటర్లు వ్రాసి నా దుంపతెంచకు తండ్రీ. యూనివర్శిటీ వారికి నీపై ఏమిటి అకస్మాత్తుగా ఇంత ప్రేమ అని అడగొచ్చు మా స్కూలు మేనేజ్మెంట్ వారు.

ఉండనా మరి

నీ

‘ప్రేమ అంటే పెదవి చివరి నుంచి వచ్చే మాట కాదు

ప్రేమ అంటే అదొక భావన కాదు

నిజమైన ప్రేమ కార్య రూపేణా మాత్రమే వ్యక్తమగును’ టీవీలో ఎవరో ప్రవచనకారుడు చెబుతున్నాడు.

తను ప్రేమించే ఇద్దరు వ్యక్తుల మధ్య తను జీవితంలో గొప్ప సంఘర్షణ ఎదుర్కొనబోతున్నాడని అతనికి ఆ క్షణంలో తెలియదు.

ఆదోని రైల్వే స్టేషన్

సమయం: ఉదయం పది గంటలు.

గత రెండు రోజులనుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తూనే వుంది వర్షం. దానికి తోడు విపరీతమైన చలిగాలులు.

కారు దిగి గొడుగు తెరచు కొని స్టేషన్ లోనికి అడుగుపెట్టాడు. డ్రైవర్ కార్లోనే కూర్చుని ఎదురు చూస్తుండి పోయాడు.

రైలు అరగంట ఆలశ్యం అని వ్రాసారు బోర్డు పై.

మద్రాసు – బొంబాయి మార్గం లో కర్ణాటక సరిహద్దులో వుంటుంది ఆ చిన్న స్టేషన్. ప్లాట్‌ఫాం పై జనాల రద్దీ కూడా ఏమీ పెద్దగా లేదు. వుండుండి ఒకరో ఇద్దరో లగేజితో వచ్చిరైలు కోసం ఎదురు చూస్తున్నారు.

వాతావరణం బాగా చలిగా వుంది.

అతడు ఓ బెంచి పై కూర్చుని రైలు పట్టాలు కనిపించినంత మేరా చూస్తున్నాడు. అతని మనసంతా ఉద్విగ్నంగా వుంది.

అతనికి చాలా నమ్మకంగా వుంది, తన తలితండ్రులకు ఆ అమ్మాయి ఖచ్చితంగా నచ్చుతుంది అని. అతని ఆత్మవిశ్వాసానికి మరో కారణం ఏమిటంటే అతను ఊహ తెలిసినప్పటి నుంచి కూడా ఫలానాది కావాలి అని పట్టుబట్టి తలితండ్రులను ఇబ్బంది పెట్టి ఎరుగడు.

అతని స్నేహితులు అందరూ ఏదో ఒక ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరి పొయారు. వాస్తవానికి అతను కూడ ఇంజినీరింగ్ ఎంట్రన్స్ వ్రాసినప్పటికి తగిన ర్యాంకు రాలేదు.

వాళ్ళ నాన్నగారి స్నేహితులు, సన్నిహితులు సలహా ఇచ్చారు, ఏదయినా మంచి ఇంజినీరింగ్ కాలేజీ చూసుకుని మేనేజిమెంట్ కోటా లొ చేర్చండి పిల్లవాడిని. మంచి భవిష్యత్తు వుంటుంది కదా అని. వాళ్ళ నాన్నగారు ససేమిరా అన్నారు. 'కష్టపడి ర్యాంకు తెచ్చుకుని వుండిన పక్షాన మహరాజుగా చేర్పించి ఉండేవాడిని, ఇలా దొడ్డి దారిన చేర్పించటం నాకు ఇష్టం లేదు' అని.

అతనికి ఇంజినీరింగ్ చేరటం ఇష్టమే కానీ తండ్రి ఉద్దేశ్యం అర్థమయ్యాక ఇక అతను అ ప్రస్తావన కూడా తండ్రి దగ్గర తీసుకురాలేదు ఆ పైన.

తన ప్రవర్తన వల్ల, తన మాటల వల్ల తన తలితండ్రులు బాధ పడకూడదు. వీలయినంత వరకు వారిని సంతోష పెట్టాలి ఇది అతని ప్రధాన ఉద్దేశ్యాలలో ఒకటి.

చిన్నప్పటి నుంచీ కూడా అతనికి స్నేహబృందం తక్కువే. మనసుకు బాగా దగ్గరయిన ఒకరిద్దరు స్నేహితులతో ఆత్మీయంగా మసలుకుంటాడు తప్పనిచ్చి, అనవసరమైన స్నేహాలు చిన్నప్పటి నుంచి అతను అలవాటు చేసుకోలేదు.

'మీ అబ్బాయి ఎంత బుద్ధిమంతుడండి' అని ఎవరైనా తన గురించి తలితండ్రుల ముందు అంటూంటే వాళ్ళ మొహాలపైన కనబడే ఆనందం అతనికి తృప్తిని ఇచ్చేది.

అందువల్ల అతనికి ఏ దురభ్యాసాలు ఏర్పడలేదు. పరిమిత స్థాయిలో స్నేహితులు, మంచి అలవాట్లు, కవిత్వం, రచనలు చేయటం, ఇంటిలోని వారితో ఆత్మీయంగా వుండటం ఇదంతా చిన్నప్పటి నుంచి అతని పద్ధతి.

ఏ విషయంలోనైనా సరే అమ్మ మాట జవదాటకూడదు ఇది అతని ప్రిన్సిపుల్. అది భయం అని ఎవరైనా అనుకుంటే కాదు అనే చెప్పాల్సి వస్తుంది.

వాళ్ళ ఇంట చిన్నప్పటి నుంచి కూడా పెద్దల పట్ల భయం అన్న ప్రస్తావన కంటే , ప్రేమ, అభిమానాలే ఎక్కువ ప్రాధాన్యత వహించాయి.

తన తల్లి కంట్లో నీళ్ళు కదిలితే అతను తన గుండెల్లో ముల్లు దిగినంత విల విలలాడిపోతాడు.

ప్రేమ అంటే పెదవి చివరినుంచి వచ్చే తియ్యటి మాటలు కాదు, నిజమైన ప్రేమ అంటే అది మనం ప్రేమించే ఎదుటి వ్యక్తికి మన సేవ రూపంలో అందించాలి అన్నది అతడు చిన్నప్పటి నుంచి కూడా పాటిస్తూ వస్తున్న పద్దతి. అది అతని జన్మ సంస్కారం.

అతడికి చిన్నతనం నుంచి కూడా తల్లితో అనుబంధం ఎక్కువ. చిన్నప్పటి నుంచి కూడా తల్లిని అమితంగా ప్రేమించే వాడు. కూరగాయలు తరిగి ఇవ్వటం, ప్రతి ఆదివారం మార్కెట్ కెళ్ళి కూరగాయలు తీసుకురావటం ఇవి అతనికి ఇష్టమైన పనులు. తల్లిని మెప్పించే పనులు చేసి ఆనందపడేవాడు.

ఇవన్నీ ఒకెత్తు, నాకు ఇది కావాలి అని ఏది , ఎప్పుడు కూడా వారిని ఇబ్బంది పెట్టింది లేదు.

అందుకే అతను చాలా నమ్మకంగా వున్నాడు తన కోరికనని తల్లి కాదు అనదు అని.

ఇంతలో పెద్ద చప్పుడు చేసుకుంటూ రైలు రానే వచ్చింది. అతడు తన ఊహలలోంచి బయటకు వచ్చి గబ గబా రైలు వంక కదిలాడు.

రైలు వచ్చిన శబ్దం విని బయట నుంచి కార్ డ్రైవర్ కూడా పరుగు పరుగున వచ్చాడు. అప్పటికే పోర్టర్ ను మాట్లాడి వుంచారు.

రైలు వచ్చి ఆగింది నెమ్మదిగా.

ఆ ఊర్లో ఎవ్వరూ ఎక్కువగా దిగలేదు. ఆ అబ్బాయి వాళ్ళ అమ్మా నాన్నా మాత్రమే దిగారు. వర్షపు జల్లులు వారిని అభిషేకించాయి..

"బాగున్నావా కన్నా" రైలు దిగిన వాళ్ళ అమ్మగారు అతనిని గట్టిగా కౌగిలించుకుని పలకరించింది.

"బాగా చదువుకుంటున్నావా?" వాళ్ళనాన్నగారు కూడా పలకరించారు.

"ప్రయాణం బాగా జరిగిందా, ఇబ్బంది ఏమి ఎదురుకాలేదు కద" ఈ అబ్బాయి ప్రేమగా పలకరించాడు వారిద్దరిని.

డ్రైవర్, పోర్టర్ లగేజి తీసుకుని కారు దిశగా కదిలారు. కాసేపట్లో రైలు బయలుదేరింది తిరిగి.

అందరూ బయటకు వచ్చారు. వర్షం ఏమాత్రం తెరిపినివ్వలేదు. నిరంతరాయంగా కురుస్తూనే వుంది.

కారు బయలు దేరింది. సరదాగా కబుర్లు చెప్పుకుంటూ ప్రయాణం సాగిపోయింది.

జగదానంద కారకా

జయ జానకీ ప్రాణ నాయకా

జగదానంద కారకా

గగనాధిప సత్కులజ రాజ రాజేశ్వర

సుగుణాకర సురసేవ్య భవ్య దాయక

సదా సకల జగదానంద కారకా

ఆమె పాడుతుంటే చెవుల్లో అమృతం పోస్తున్నారా అన్నట్టు వుంది.

అందరూ మంత్ర ముగ్ధులై వింటున్నారు ఆమె పాటని.

ఒక గంట వెనక్కు వెడదాం, ఆమె రావటం, ఆ అబ్బాయి అమ్మానాన్నల్ని కలవటం, వారి సంభాషణ అన్ని విందాం.

అమ్మానాన్నలు వచ్చారని ఆమెకి చెప్పి, వీలున్నపుడు వచ్చి కలవరాదా అని పిలిచాడు అతడు.

ఆ వేళ సాయంత్రం వర్షం కాస్తా తెరిపినిచ్చింది. కాని చిరు జల్లులు నిరంతరం కురుస్తూనే వున్నాయి. చలిగాలులు శరీరాల్ని వణికిస్తున్నాయి. సాయంత్రం సమయం అయిదే అయినప్పటికీ, చీకటి తెరల్ని దించేసుకుని విశ్రాంతికి సిద్దమవుతూ వుంది ప్రకృతి.

నెమ్మదిగా వీస్తున్న చలిగాలికి వర్షం జల్లు వచ్చి పన్నీరులా తాకుతోంది శరీరాల్ని.

"అత్తయ్యా! ఈ అమ్మాయి మన కాలేజిలో పన్చేసే నారాయణ గారి అమ్మాయి. మీ చిన్న అబ్బాయికి చక్కటి స్నేహితురాలు. చాలా బాగా పాటలు పాడుతుంది. కర్ణాటక సంగీతం లో చక్కటి శిక్షణ కూడా తీసుకుంది. మీరు ఈ అమ్మాయి పాట విని తీరాలి." వదినెమ్మ ఆ అమ్మాయిని పరిచయం చేసింది.

అతడు తన తల్లి ముఖంలోని భావాల్ని సులభంగానే చదవగలడు. 'మీ చిన్న అబ్బాయికి చక్కటి స్నేహితురాలు' అన్న వాక్యం దగ్గర తన తల్లి మొహంలో రంగులు మారటం గమనించాడు.

ఆ అమ్మాయి కి కూడా తన అత్తగారిని పరిచయం చేసింది వదినెమ్మ. "ఏయ్ పిల్లా, ఈమె మా అత్తయ్య గారు. అంటే మీ ఫ్రెండ్ అమ్మగారు.నిన్ననే ఊరి నుంచి వచ్చారు మా అత్త మామయ్యలు. నేనే నీకు కబురుపెడదాము అని అనుకున్నాను , మంచిదయింది నువ్వే వచ్చావు"

పరిచయకార్యక్రమం అవగానే ఆ అమ్మాయి పెద్దావిడ పాదాలని భక్తిగా నమస్కరించింది. కాస్తా పక్కగా కుర్చీలో కూర్చున్న మామయ్య గారి పాదాలకి కూడా నమస్కరించింది.

ఆ నమస్కారం చేయటంలో ఎంతో సహజమైన భక్తిభావన తొంగి చూస్తోంది.

విశాలమైన ఆ హాల్లో, వారికెదురుగా సోఫాలో ఒదిగి కూర్చుంది. ఆ అమ్మాయి ప్రత్యేకంగా ఏమీ అలంకరణ చేసుకోకున్నా ఆ వేళ చాలా బావుంది చూడ్డానికి.

పూర్ణ చంద్రుడిని, అలలతో ఎగిసిపడుతున్న సముద్రాన్ని, జలపాతపు సౌందర్యాన్ని ఎంతసేపు చూసినా అలసట రాదు అంటారు కవులు.

అలాగే ఆ అమ్మాయిని ఎంత సేపు చూసినా తనివితీరదు అతనికి.

ముదురు గోధుమ వర్ణం చీరపై బంగారు వర్ణం లో చిన్ని చిన్ని చతురస్రాల డిజైన్ తొ ఉన్న ప్యూర్ శిల్క్ చీర కట్టుకుని వుంది ఆ అమ్మాయి, ముదురు కాఫీ రంగు బార్డర్ తో చాలా అందంగా వుంది ఆమె ఆ చీరె లో. ముదురు కాఫీ రంగు రౌండ్ నెక్ జాకెట్, చిన్ని బంగారు గొలుసు, రెండు చేతులకు మట్టిగాజులు, చెవులకు బుట్టాల కమ్మలు, నుదుటిన పావలా కాసంత ఎర్రకుంకుమ బొట్టు, మంద్రంగా సంగీతం వినిపించే మువ్వలతో కూడిన పట్టీలు, వెరసి స్వర్గం నుంచి దిగి వచ్చిన దేవ కన్యా అన్నట్టు వుంది ఆ అమ్మాయి.

"ఊ, ఏం పేరమ్మాయి నీది?" రాజసం ఉట్టిపడుతున్న స్వరంతో అడిగింది వాళ్ళ అమ్మగారు

పేరు చెప్పింది ఆ అమ్మాయి.

"మంచిది. ఏమి చదువుకుంటున్నావు"

తిరిగి సమాధానం చెప్పింది ఆ అమ్మాయి

"మీరెంత మంది అన్నదమ్ములు, అక్క చెల్లెళ్ళు?"

"మీ నాన్న గారు ఏమి చేస్తుంటారు?"

"మీ అమ్మగారి పేరేమి? ఆమె ఏమి చేస్తుంటారు?"

"నీవు సంగీతం ఎంత కాలం నుంచి సాధన చేస్తున్నావు?"

"మీ తమ్ముడా మా వాడి స్నేహితుడు, లేదా నువ్వా?, మీరు ఒక కాలేజి కూడా కాదు కద మీకసలు పరిచయం ఎలా జరిగింది?

"తీరిక వేళల్లో ఏమి చేస్తుంటావు?"

"చదువుకోకుండా ఉద్యోగం చేయటం ఏమిటి? అప్పుడే ఏమి తొందర వచ్చింది?"

ఇలా ఆ అమ్మాయిని యక్ష ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టింది ఆవిడ.

ఇంతలో వేడి వేడి బజ్జీలు వేసి ప్లేట్లలో తీసుకువచ్చింది వదినెమ్మ. ఈ అమ్మాయి మెరుపు తీగెలా లేచి చొరవగా వంటింటిలోనికి వెళ్ళి అందరికీ మంచి నీళ్ళగ్లాసులు పట్టుకొచ్చింది. తనే స్వయంగా చిన్ని చిన్ని ప్లేట్లని ఆ అబ్బాయికి, అతని అమ్మా నాన్నలకి అందించింది. తలా ఒక గ్లాసు మంచి నీళ్ళ గ్లాసునందించింది.

కిటికీ లోంచి బయటి వాతావరణం అందంగా కనిపిస్తోంది.

బయట వర్షం జోరందుకుంది. కొబ్బరాకుల మీదా, బాదం ఆకుల మీదా పడిన వర్షం నీటి చినుకులు వింతైన ధ్వనిని సృష్టిస్తున్నాయి.

బయటి వీధి దీపం తాలూకూ సోడియం వేపర్ లాంప్ కాంతి కొబ్బరాకుల మీద పడి పరావర్తనం చెందుతోంది.

"ఏయ్ పిల్లా! ఒక మంచి పాట పాడవా" వదినెమ్మ ఆ అమ్మాయిని కోరింది. వదినెమ్మకి చాలా ప్రేమ ఆ అమ్మాయంటే. తను ఎంతో ప్రేమించే వారిని మాత్రమే ఆమె 'ఏయ్ పిల్ల' అని పిలవటం గమనించాడు అతను.

ఆ అమ్మాయి కొద్దిగా సిగ్గు పడింది.

"ఏమి ఫర్వాలేదు. కొత్త వాళ్ళెవరూ లేరు పాడు" ప్రోత్సహించింది వదినెమ్మ

"వేదికనెక్కి పాడతావటగా! ఇప్పుడు ఎందుకు కొత్తగా సిగ్గు" అత్తయ్య యధాలాపంగానే అన్నా, ఆ అమ్మాయి మొహంలో ఒక విధమైన 'షాక్' కనపడింది ఒక క్షణం పాటు. అది క్షణం మాత్రమే.

ఆ తర్వాత సర్దుకుంది. "ఏ పాట పాడమంటారు?" చిరునవ్వుతో ప్రశ్నించింది.

"అమ్మాయి, త్యాగరాజ స్వామి వారి పంచరత్న కీర్తనలలో ఒకటైన – జగదానంద కారకా, పాడవా?" అప్పటి దాకా మౌనంగా వున్నా మామయ్యగారు కుర్చీ ముందుకు జరుపుకుంటూ అడిగారు.

"అలాగేనండీ" సిగ్గుతో తలూపింది ఆ అమ్మాయి. అలా తల ఊపేటప్పుడు ఆమె చెవి బుట్టాలు అందంగా కదిలాయి.

భుజం చుట్టూ చీర చెంగు కప్పుకుంటూ, గొంతు సవరించుకుని ఆమె పాడటానికి ఉపక్రమించే లోగా బయట ఆకాశాన్ని నిలువునా చీలుస్తున్నట్టు, కళ్ళు బైర్లు కమ్మేలాంటి మెరుపు, కొన్నిక్షణాల్లో ఏక్కడో పిడుగు పడినట్టుగా చెవులు దిమ్మెత్తి పోయేలా పెద్ద శబ్దం రావటమేమిటి కరెంట్ పోవటమేమిటి అన్నీ ఒక దాని వెంబడి ఒకటి సంఘటనలు నాటకీయంగా జరిగి పోయాయి.

ఆ రోజుల్లొ చిన్న ఊర్లలో వర్షం వస్తే కరెంట్ పోవటం సహజం. అందుకు జనాలు కొవ్వొత్తులు, హరికెన్ లాంతర్లు సిద్దంగా ఉంచుకునే వారు.

వదినెమ్మ వెంటనే కొవ్వొత్తి వెలిగించి టీపాయ్ మీద పెట్టింది.

ఆ చీకటి గదిలో ఆ కొవ్వొత్తి కాంతి ఆ అమ్మాయి మొహం మీద పడి ఆమె వదనానికి చిత్రమైన శొభనిస్తోంది. ఆమె మొహం ఒక కోణంలో కదిలినప్పుడల్లా ఆమె ముక్కు పుడక ఇంద్రధనుస్సు కాంతులీనుతోంది. ఆమె పలువరుస తెల్లదనం వెన్నెల వెలుగులా ఆ చీకటిని పోద్రోలే ప్రయత్నం చేస్తోంది.

అతనికి తెలియకుండానే అతని మనస్సు జయదేవుని అష్టపది ని నెమరేసుకుంది.

ప్రియే చారు శీలే, ప్రియే చారు శీలే
వదసియది కించిదపి దంతరుచి కౌముది
హరతి దరతిమిరమతి ఘోరం

(పలికితే చాలు నీ పలువరుస వెన్నెలలు
కలికి నా ఎడద చీకటుల పోద్రోలు)

స్ఫుర దధర శీధవే తవవదన చంద్రమా
రోచయతు లోచన చకోరం ||ప్రియే||

(నీ మోము జాబిల్లి మోవి తేనియలు
నా నయనములు చకోరమ్ములై గ్రోలు)

ఆమెని చూస్తుంటే జయదేవుని అష్టపది అతని గుండేలో పదే పదే పలుకుతోంది.

ఆమె గొంతు సవరించుకుని త్యాగరాయకీర్తన అందుకోవటంతో అతను ఈ లోకంలోకి వచ్చిపడ్డాడు.

ఆ నిశి రాత్రి ఆమె పాడుతున్న త్యాగరాజ స్వామి కృతి 'జగదానంద కారకా' అందరి హృదయాల్ని ఆనందంతో నింపింది. కోటి చంద్రుల చల్లదనాన్ని, కోటి సూర్యుల కాంతిని అందరి మనస్సులలో నింపింది ఆమె గానం.

ఆమె భక్తి పారవశ్యంతో పాడుతూనే ఉంది.

జగదానంద కారకా
జయ జానకీ ప్రాణ నాయకా
జగదానంద కారకా

గగనాధిప సత్కులజ రాజ రాజేశ్వర
సుగుణాకర సురసేవ్య భవ్య దాయక
సదా సకల జగదానంద కారకా

పాట మొత్తం పూర్తయింది. అందరూ ఆనంద పారవశ్యులు అయ్యారు.

"చాలా చక్కగా పాడావమ్మాయి. అద్భుతం" మామయ్య గారు మనస్ఫూర్తిగా అభినందించారు.

పసిపిల్లవాడిలాంటి మనస్తత్వం ఆయనది. ఏదయినా నచ్చితే మనస్ఫూర్తిగా అభినందిస్తారు. సినిమాలు చూసేటప్పుడుకూడా ఆయన అంతే. ఏదయినా హాస్య సన్నివేశం వస్తే పసిపిల్లాడిలా గట్టి గట్టిగా నవ్వేసి ఆనందపడిపోతారు. దుఃఖం కలిగించే సీన్ వస్తే కళ్ళ నీళ్ళు పెట్టేసుకుంటారు. కలెక్టర్ హోదాలో పని చేస్తున్నాననే అనవసరమైన భేషజాలు ఎవీ లేవు ఆయనకు.

"చీకటి పడింది. మీ ఇంట్లో వాళ్ళు కంగారు పడుతుంటారేమోనమ్మాయి" అని చెప్పేసి లోనికి వెళ్ళి పోయారు అత్తయ్య గారు.

ఆ అమ్మాయిని భోజనానికి వుండిపొమ్మని చెబ్దామనుకుని కూడా అత్తయ్య ప్రవర్తనలోని ఒక విధమైన అయిష్టత, ఆవిడ కంఠంలో ని ఒక విధమైన నిరసన చూశాక వదినెమ్మ ఆ ప్రయత్నం మానుకుంది.

కాసేపయ్యాక కరెంట్ వచ్చింది. అందరూ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నారు. వదినెమ్మ మౌనంగా వడ్డన కొనసాగిస్తోంది. అన్నయ్యకూడ వచ్చి కలిశాడు. ఆయన స్నేహితుల ఇంటికి వెళ్ళి వుండినారు.

ఆ రాత్రి భోజనాల దగ్గర "అరె పెద్దబ్బాయ్. సాయంత్రం నువ్వు ఉండుంటే బాగుండేదిరా. ఒకమ్మాయి వచ్చి ఎంత చక్కగా పాడిందనుకున్నావు?" నాన్నగారు మరొక్క సారి గుర్తుతెచ్చుకున్నారు ఆ అమ్మాయిని, ఆమె పాటని.

అమ్మ గంభీరంగానే వుండి పోయింది.

ఆ అబ్బాయికి ఏమి మాట్లాడటానికి పాలు పోవటం లేదు. తన తల్లికి ఆ అమ్మాయి ఎందుకో నచ్చలేదు అన్నది అర్థమవుతూనే వుంది.

అతని హృదయం బాధతో మూలిగింది.

'ఆ అమ్మాయి బాగుంది కదూ, తను చాలా బాగా పాడుతుంది కదూ' అని తల్లిని అడగాలని పెదవి చివరిదాక వచ్చిన ప్రశ్నని అణచి వేసుకున్నాడు.

'అమ్మా ఆ అమ్మాయి చాలా మంచిది. ఈ కాలం అమ్మాయిలలాగా కాదు. నీకు తెలుసు కద, నేను అస్సలు అమ్మాయిల వంక చూడను, పెద్ద మాట్లాడను. నేనేదో నా లోకమేదో అన్నట్టు వుంటాను. కాని మొదటి సారిగా నేను ఈ అమ్మాయిని దగ్గరనుంచి గమనించాను. నిజంగా తను చాలా ప్రత్యేకం. తను ఎంత కష్టపడుతుంది అనుకున్నావు వాళ్ళ ఇంటి కోసం. అసలు తను ఒక మిషన్ లాగా పని చేసుకుంటూ పోతుంది తనకు అసలు అలసట అన్నది ఉంటుందా అన్నట్టు కష్ట పడుతుంది. తను ఖచ్చితంగా నీకు కూడా బాగా నచ్చుతుంది' అని ఇలా ఎన్నో మాటలు చెప్పాలి తల్లితో అనుకున్న వాడు తల్లి యొక్క గంభీరమైన వదనం చూసీ ఏమీ మాట్లాడలేక పోతున్నాడు.

తన తల్లికి ఆ అమ్మాయి బాగా నచ్చుతుంది అని బలంగా అనిపిస్తూ వుండినది నిన్నటి వరకు. కాని అకారణంగా ఆ అమ్మాయి పట్ల అయిష్టత చూపుతోంది తన తల్లి. అతనికి అయోమయంగా వుంది.

పెద్ద పెద్ద సముద్ర కెరటాలు వచ్చి కొండ శిలలను ఢీ కొంటే వచ్చే లాంటి అలజడి అతని మస్తిష్కం అంతా ఆవరించింది. తినే తిండి మీద ధ్యాస నిలబడటం లేదు. నోటికేది రుచించటం లేదు.

ప్రతి ఒక్కరికి ఎదుటివారు మొదటిచూపులోనే నచ్చాలని నియమమేం లేకున్నా, కనీసం ఏ భావం లేకుండ వుండే అవకాశం కూడా ఒకటుంటుంది కద. కానీ తన దురదృష్టమేమో ఈ అమ్మాయి పట్ల తన తల్లికి మొదటి పరిచయంలోనే అయిష్టత ఏర్పడింది.

ఆతడికి తన తల్లి గురించి తెలుసు. తనకు ఒక సారి ఒక అభిప్రాయం అంటూ ఏర్పడ్డాక హరిహరబ్రహ్మాదులు దిగి వచ్చినా కూడా తన అభిప్రాయం మార్చుకోదు అని. 'ఫస్ట్ ఇంప్రెషన్ మే నాట్ బీ ది లాస్టింగ్ ఇంప్రెషన్' మొదటి చూపులో, మొదటి పరిచయంలో ఏర్పడే అభిప్రాయాలు సర్వసాధారణంగా ఎమోషన్స్ ఆధారంగా ఏర్పడతాయి అంటారు సైకాలజిస్టులు.

కానీ లాజికల్ మైండ్ తో ఆలోచించి తర్కం తో ఏర్పడే అభిప్రాయాలే నిజమైన అభిప్రాయాలు.

మరి లోపం ఎక్కడ జరిగిందో అతనికి అంతు పట్టలేదు. ఎందుకు తన తల్లికి ఆ అమ్మాయి పట్ల ఇలా అయిష్టత ఏర్పడింది? తను ఏమి చేయగలడు?

ఒకటి మాత్రం నిజం. తనకు కావాల్సింది ఏదీ కూడా, స్వంత వారి దగ్గర సైతం అతను చనువుగా అడిగి సాధించుకునే అలవాటు లేదు అతనికి. అతని తత్వం కాదు అది.

అడగందే అమ్మయినా పెట్టదు అని వాడుకలో వున్న మాట. కానీ ఆడగటం అన్నది అతని ప్రవృత్తి కాదు. అదేదో గొప్ప లక్షణం అని కాదు. అతని తత్వం అది.

తనకు ఇష్టమైన తిండి అడిగి చేయించుకోవటం కానీ, తనకు కావాల్సినది ఏదయినా డిమాండ్ చేసి పొందటం కాని అతని ప్రవృత్తి కాదు.

కాని తన తత్వానికి భిన్నంగా నోరు తెరిచి అడిగి తీవ్రమయిన ఆశాభంగానికి గురయ్యాడు కొన్ని రోజుల తర్వాత.

అది ముందు ముందు తెలుసుకుందాం.

అసలు వాళ్ళ అమ్మగారికి ఆ అమ్మాయి పట్ల ఎందుకంత తీవ్రమయిన అయిష్టం ఏర్పడింది అన్న విషయం అతనికి తెలిసింది ఆ రాత్రే. అది ఏమిటి అన్నది తెలుసుకుందాం.

బయట నిలిపి ఉంచిన కార్,బైకులు కాంపౌండ్ లోపల పెట్టి గేట్ తాళం వేసి పడుకోటానికి వెళ్ళబోయే ముందు, హాల్లో అమ్మానాన్నల మాటలు చెవిన పడ్డాయి ఆ అబ్బాయికి.

నాన్న మాటలు వింటుంటే చాలా ఆనందం కలిగింది అతనికి. 'నాన్న కూడా సరిగ్గా నా లాగే ఆలోచిస్తారు' మనసులో చాలా సంబర పడ్డాడు. వాళ్ళ నాన్నగారు ఏమంటున్నారంటే "లక్ష్మీ, ఆ అమ్మాయిని చూశావా. ఎంత చక్కగా వుంది కద. ఈ అమ్మాయి వ్రాసిన ఉత్తరమే మనకు పలమనేరులో వుండగా అందింది మన చేతికి. నా వరకు నాకు ఈడు

జోడు చక్కగా వుంటారు. సంగీత కళ కూడ వుంది ఈ అమ్మాయికి. మన వాడ్ని గమనించావా, ఆ అమ్మాయి పాడుతుంటే ఎంత పారవశ్యంగా చూస్తూ వుండిపోయాడో, వీళ్ళిద్దర్ని కలిపితే హాయిగా చిలకా గోరింకల్లాగా వుంటారు అని అనిపిస్తోంది."

"మహరాజా మీరిలా అంటారని నేను ఊహించలేదు" సాధారణంగా "ఏమండి" అని సంబోధించే ఆమె బాగా కోపం వచ్చినప్పుడో, లేదా ఆయన అభిప్రాయం తప్పు అని నిర్ధారణగా తేల్చి చెప్పాల్సినప్పుడు అలా "మహరాజా" అని సంబోధిస్తుంది. అది అతడికి చిన్నప్పటి నుంచి తెలుసు.

అతడు వింటుండిపోయాడు తన తల్లి మాటల్ని

"పట్టుమని పదిహేడు ఏండ్లు లేవు ఈ అమ్మాయికి. కానీ ఎంత టక్కరిదో చూడండి. అసలు ఆ ఉత్తరం వ్రాయటమే నాకు నచ్చనిది. మన వాడ్ని అమాయకుడిని చేసి బుట్టలో వేసుకుంది. అసలు ఇలాంటి వాళ్ళ వలలో పడుండకుండా వుండాల్సింది మనవాడు. ఏది ఏమయినా మీరు ఆ అమ్మాయి పట్ల సానుభూతిగా ఆలోచించటం ఆపేయ్యండి. సాయంత్రం నుంచి చూస్తున్నా మీ వరుస. నాకీ సంబంధం ససేమిరా ఇష్టం లేదు." కుండ బద్దలు కొట్టినట్టు చెప్పేసింది ఆవిడ.

**"నాకు మీ అమ్మగారిని** చూస్తే భయం వేసింది" బేలగా చెప్పింది ఆ అమ్మాయి.

వాళ్ళ పెరట్లో మల్లె పందిరి క్రింద ఆమె మల్లె పూలు కోస్తూ అతనితో మాట్లాడుతూ వుంది. ట్యూయిషన్ పిల్లలకి ఏదో వర్క్ అప్పజెప్పి బయటకు వచ్చింది అతనితో మాట్లాడటానికి.

అతను ఆమెకి దగ్గర గా ఓ తిన్నె మీద కూర్చుని వున్నాడు. వాతావరణం ప్రశాంతంగా వుంది. గత కొన్ని రోజులుగా నిరవధికంగా కురుస్తున్న వర్షం ఆ రోజు మధ్యాహ్నం నుంచి శాంతించింది. కానీ నల్లటి మేఘాలు ఆకాశం అంతటా అలుముకుని వున్నాయి. చలిగాలులు వీస్తూ వున్నాయి ఆగకుండా.

"అదేంటి. ఎందుకలా అనిపించింది?" తెలిసి కూడా తెలియనట్టే అడిగాడు అతడు.

"ఏమో. ఆమెకి నా పట్ల బాగా కోపంగా వున్నట్టు అనిపిస్తోంది. ఆమెకి నా పట్ల సదభిప్రాయం ఏర్పడలేదు ఎందుకో. అది కేవలం నా దురదృష్టం అంతే." ఆ అమ్మాయి నిట్టూర్చింది.

"ఏయ్. నువ్వలా అనుకోకు. పాత తరం వారు కద. వారు అలాగే వుంటారు పైకి. నిజానికి మా అమ్మ మనసు చాలా మంచిది. వాళ్ళు ఊరి నుంచి వెళ్ళే లోగా నేను విషయం కదిపి వారి దగ్గర గ్రీన్ సిగ్నల్ తీసుకుంటాను" అతడు ఆశాభావం వ్యక్తం చేశాడు.

ఆ తర్వాత అవి ఇవి కబుర్లు చెప్పుకుని విడిపోయారు ఆ వేళ్టికి.

వారిద్దరి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఒకరిపై ఒకరికి ఏర్పడిన అభిమానం తీవ్రమవసాగింది. ఉత్తరాలలో ప్రత్యేకంగా ఒక టాపిక్ అంటూ ఉండేది కాదు. దేని గురించి అయినా సరే పేజీలకు పేజీలు వ్రాసుకునే వారు. ఒకర్ని ఒకరు కలుసుకుని ఏకాంతంగా కబుర్లు చెప్పుకునే వెసులు బాటు లేకపోవటం వల్ల ఈ ఉత్తరాలు అనే మాధ్యమం వారికి బాగా నచ్చింది.

కబుర్లు, జోకులు, ఒకరిలో ఒకరికి నచ్చిన అంశాలు చర్విత చర్వణమే అయినా పదే పదే చెప్పుకుని మురిసి పోయేవారు.

ఆమె అతనితో తన భవిష్యత్తుని ఊహించి తన కలల్ని పేజీల నిండా పరిచేది. అతడు కూడా అదే విధంగా తన కలల్నీ, లక్ష్యాలని ఆమెతో పంచుకొనే వాడు.

నచ్చిన పాటలు, నచ్చిన కవిత్వం ఇలా ఏది తోస్తే అది మాట్లాడుకుంటున్న ఫీలింగ్ తో వ్రాసుకునే వారు.

వారు ఒక నిబంధన పాటించే వారు. వారంలో ఒక రోజు మాత్రమే పోస్ట్ చేయాలి ఉత్తరం. కానీ రోజంతా ఎప్పుడు ఏది తోచినా అది కాగితం మీద పెట్టేయ్యాలి, ఇంచుమించు డైరీ లాగా. మనసుకు తోచిన భావన తోచినట్టు వ్రాసేయ్యటమే. ఆ తర్వాత ఆ కాగితాలన్నింటిని ఒక కవర్ లో పెట్టి పోస్ట్ చేయటం. అతడు సోమవారం పోస్ట్ చేసే వాడు. లోకల్ పోస్టే కాబట్టి ఆమెకి అది మంగళవారం అయ్యేసరికల్లా చేరేది.

ఉత్తరంతో బాటుగా, అతడు వ్రాసిన ఉత్తరంలోని ఏవైనా ప్రశ్నలు వుంటే వాటికి సమాధానాలు వ్రాసి, ఇంకా అతడు ప్రస్తావించిన అంశాలకనుగుణంగా తనకు తోచిన జ్ఞాపకాలు వ్రాసి, అన్ని పేపర్లను కవర్లో పెట్టి ఆమె బుధవారం పోస్ట్ చేసేది.

ఇలా ఇద్దరూ వారానికి ఒక ఉత్తరం విధిగా వ్రాసుకునే వారు.

అతడు గురువారం ఉదయం కల్ల కాలేజీ క్యాంపస్ లోనే వున్న పోస్ట్ ఆఫిస్ కి చేరుకునే వాడు. ఇతనికి అనేక పత్రికాఫీసుల నుండి, ఆకాశావాణి నుండి ఉత్తరాలు రావటం అక్కడి సిబ్బందికి తెలిసిన విషయమే కాబట్టి వారు అతని పేరిట వచ్చిన ఉత్తరాలు అన్నీ అతనికి అందించే వారు. అతని కన్నులు ఆత్రంగా ఒక ప్రత్యేక ఉత్తరం కోసం వెదికేవి.

అక్కడి పోస్ట్ మాష్టారు ఒక్కోసారి ఇతనికి క్లాసు పీకే వాడు . విద్యార్థి జీవితం లో సమయం అత్యంత విలువైనది అని, జీవితంలో ఏది పోయినా తిరిగి పొందవచ్చు కానీ సమయాన్ని తిరిగి పొందలేము అని, విద్యార్థి అనే వాడు ఎంత సేపు చదువు మీదనే ఏకాగ్రత చూపాలని, ఇతరత్ర విషయాలలో తలదూర్చి సమయాన్ని వృధా చేసుకోరాదని హితవు పలికేవాడు.

అతనికి తమ గురించే ఏమయినా తెలిసిందా అని అప్పుడప్పుడు అనుమానం వచ్చేది ఇతనికి. కానీ అతను అందరు విధ్యార్థులతోనూ అదే విధంగా మాట్లాడుతూ వుండటం తో ఆయన ధోరణే అంత అని సరిపెట్టుకొనే వాడు.

నిజానికి ప్రేమకంటే బలమైనది నమ్మకం. ఒక భార్య తన భర్తని ప్రేమించవచ్చునేమో కాని అతన్ని నమ్మక పోవచ్చు. అతడు ఏక్కడెక్కడ తిరుగుతున్నాడో, ఏమి చేస్తున్నాడొ అని అనుమాన పడుతు వుండవచ్చు.

తల్లి తన కుమారుడిని ప్రేమించవచ్చునేమో కానీ, అతను సరిగ్గ స్కూలుకు వెళుతున్నాడొ లేదో అని అనుమానపడొచ్చు.

కాబట్టి ఈ ప్రపంచంలో ప్రేమింపబడటం కంటే కూడ గొప్పవిజయం, ఎదుటి వ్యక్తి యొక్క నమ్మకాన్ని చూరగొనటం.

అందుకే అంటారు, ట్రస్ట్ ఈజ్ ఎ గ్రేటర్ ఫీలింగ్ దాన్ లవ్ అని.

అదృష్ట వశాత్తు వారిద్దరు ఒకర్ని ఒకరు ఎంత ప్రేమించుకుంటున్నారో, అంతకు మించి ఒకర్ని ఒకరు నమ్ముతున్నారు.

ఒకటే లాగా సాగితే అది కాలం ఎందుకు అవుతుంది?

ఆమె ప్రేమని, విశ్వాసాన్ని కూడా చూరగొన్న అతను ఆమె తనపై వుంచిన విశ్వాసాన్ని పోగొట్టుకోబోయే సంఘటన అతి త్వరలోనే జరగబోతోంది అని ఆ ఇద్దరికీ తెలియదు.

అత్యంత దురదృష్టకరమైన ఆ సంఘటన వారిద్దరి జీవితాల్ని శాశ్వతంగా మలుపు తిప్పబోతోంది అని వారికి ఏ మాత్రం తెలియదు.

ఒక వైపు అతని చదువు సక్రమంగా సాగిపోతొంది. అతడు డిగ్రీ రెండవ సంవత్సరం కూడా రికార్డ్ బ్రేకింగ్ మార్కులు నమోదు చేశాడు. ఆ కాలేజి చరిత్రలోనే అత్యధిక మార్కులు పొందిన విద్యార్థిగా అతని పేరు , ఫోటో నోటీసు బోర్డులలో పెట్టబడటం జరిగింది. వీటికి తోడు ఎక్స్ట్రాకరిక్యులర్ ఆక్టివిటీస్ లో కూడా అతని ప్రభంజనం కొనసాగుతోంది.

ఆవేళ ఆదివారం.

ఉదయం ఫలహారాలు సిద్ధం చేస్తూ వదినెమ్మ, తన తల్లి వంటింట్లో ఉండగా అతడు వంటింట్లో కెళ్ళి కూర్చున్నాడు. నిలడి వదినెమ్మ వంట కట్ట ముందు నిలబడి గ్యాస్ స్టవ్వు పై చపాతీలు వేస్తోంది.

తన తల్లి డైనింగ్ టెబులు ముందు కూర్చుని అప్పడాల కర్రతో చపాతీలు వత్తి ఇస్తోంది.

వదినెమ్మ నవ్వుతూ 'ఏమయ్యా కాఫీ త్రాగుతావా?' అని అడిగి, తిరిగి అత్తయ్యని ఉద్దేశ్యించి "ఇప్పుడు నా మరిది కాఫీ త్రాగుతున్నాడండి అత్తయ్య గారు. ఇక బూస్ట్ త్రాగె చిన్న పిల్లాడు కాదు నా మరిది" అని అంది.

అతడు ఊహించినట్టు అమ్మ మొహంలో కోపం కనిపించలేదు. ప్రసన్నంగా వుంది. ఆవిడ నవ్వుతూ అంది

"మంచిదేలే కానీ అనవసరంగా ఎక్కువ త్రాగకు, అదేమంత గొప్ప అలవాటని మొదలెట్టావు?"

అతడు నవ్వి ఊరుకున్నాడు.

వంటింటి గూట్లో ఉన్న చిన్ని టేప్ రికార్డర్ లో క్యాసెట్ ప్లే అవుతోంది. మంగళంపల్లి బాల మురళీ కృష్ణ ఆలపించిన

"నగు మోము కనలేని నా జాలి తెలిపి.." మంద్రంగా వస్తోంది.

అతడు అదే సరి అయిన అదనుగా భావించి "అమ్మా మొన్న ఆ అమ్మాయి పాట ఎంత బాగా పాడింది కద. తనకు కూడా ఇలా పెద్ద గాయని గా ఎదగాలని ఆకాంక్ష" అని నెమ్మదిగా చెప్పాడు అతడు.

వాళ్ళ అమ్మగారు ఏమి పలకలేదు. గంభీరంగా వుండి పోయారు.

వదినెమ్మ నిశ్శబ్దంగా చపాతీలు కాల్చటంలో నిమగ్నమయ్యింది.

అతడు ఒక స్థిర నిర్ణయం తీసుకుని వచ్చాడు ఆ వేళ ఆ గదిలోకి. ఏది ఏమయినా సరే తల్లికి తన ప్రేమ విషయం చెప్పి ఆమె అనుమతి తీసుకోవాలనే ధృఢసంకల్పంతో వున్నాడు అతడు.

వాళ్ళ అమ్మగారు అవసరమయిన దానికన్నా ఎక్కువ ఏకాగ్రతతో చపాతీలని అప్పడాల కర్రతో సాగదీస్తున్నారు. వదినెమ్మ కూడా అంతే నిశ్శబ్దంగా చపాతీలు కాల్చటంలో నిమగ్నయి వుంది.

ఇదేదో తుఫాను ముందటి ప్రశాంతి అని అతనికి అర్థమవుతూనే వుంది.

వంట గదిలో ఈశాన్యం మూల నున్న దేవుని మందిరం నుంచి ఆంజనేయస్వామి జాలిగా తనని చూస్తున్నట్టు అనిపించింది అతనికి.

గొంతు సవరించుకుని ఒక సారి స్థిరంగా అన్నాడు " అమ్మా నీతో మాట్లాడాలి"

వదినెమ్మ ఒక సారి తలతిప్పి అతని వంక చూసింది, ఆమె కు ఏమి అర్థం కాలేదు విషయం ఏమిటో.

ముక్కు మీదకు జారిన కంటి అద్దాల్ని కుడిచేతి చూపుడు వేలితో సవరించుకుంటూ "చెప్పు చిన్న బాబూ, ఏమి కావాలి?" ప్రేమగా అడిగారు ఆవిడ.

అతను పుట్టింది లగాయతూ అతనేది అడగక ముందే అతనికి ఏది అవసరమో అది సమకూరుస్తూ వస్తున్నారు. అతను నోరు తెరిచి ఏదీ అడగాల్సిన అవసరమే రాకుండా చూసుకున్నామని ఆవిడ అనుకుంటుంటారు.

నోరు తెరిచి ఫలానాది కావాలి అని తలి తండ్రులను ఏనాడు అడిగి వారిని ఇబ్బంది పెట్టలేదు. వారేది సమకూరిస్తే దానిని తృప్తిగా వాడుకుంటూ వస్తున్నాను అని అతను అనుకుంటున్నాడు. సాటి మిత్రులు అనుసరిస్తున్న ఫాషన్లు, లేటెస్టు

ట్రెండ్స్ వారికి తెలియని కారణంగా, వారు పాత కాలపు ట్రెండ్స్ కు అనుగుణంగా వస్తువులు సమకూర్చినా అతను ఏ వంకలూ పెట్టకుండా వాటిని వాడుకునే వాడు. మిత్రులు కూడా నవ్వే వారు కాదు. అతను తనదైన వ్యక్తిత్వంతో ముందుకు సాగిపోతుండటం వల్ల స్నేహితులు అతన్ని ఆటపట్టించే వారు కాదు.

ఒకే అంశాన్ని రెండు విభిన్న కోణాల్లో చూస్తే ఇలాగే వుంటుంది.

దీనినే పారడైమ్ షిఫ్ట్ అని అనవచ్చు.

వారు ఏది అందిస్తే అది, నచ్చినా నచ్చకున్నా గోల చేయకుండా అందుకున్నానని అతను అనుకుంటుంటాడు.

అతని అవసరాల్ని కనుక్కుని , అతడు అడిగే అవసరం లేకుండానే అన్నీ సమకూర్చి పెడుతూ వస్తున్నామని ఆవిడ అనుకుంటుంటారు.

తను ఇప్పటి దాకా ఏదీ డిమాండ్ చేసి అడగలేదు కాబట్టి తను నోరు తెరిచి అడిగే ఈ మొదటి కోరికని అమ్మానాన్నలు తిరస్కరించరు అని  అతను కాన్ఫిడెంట్ గా ఉన్నాడు.

అతడు నోరు తెరిచి అడిగే అవసరమే లేకుండా చూసుకుంటూ వస్తున్నామే, మరి ఇదేంటి ఇతను ఈ రోజు ఏదో అడగబోతున్నాడు అని ఆవిడ ఆశ్చర్య పడుతున్నారు.

అతడు చెప్పబోతున్నాడె కాని అతనికి ధైర్యం చాలటం లేదు. అలాగన్చెప్పి తనేదో తప్పు చేస్తున్నానన్న భావన ఏమీ లెదు ఆతనికి. కాకపోతే తన వయసు మహా అంటే పందొమ్మిది. క్వాలిఫికేషన్ ఏదయినా వుందా అంటే తను చేస్తున్నది ఇంకా డిగ్రీ ఫైనల్ ఇయర్. చదువే పూర్తి కాలెదు, ఉద్యోగం మాట దేవుడెరుగు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో నోరు తెరిచి 'నేను ఫలానా అమ్మాయిని ప్రేమిస్తున్నాను. ఆమెకి చూస్తే పెళ్ళి సంబంధాలు ఖాయం అయ్యేలా వున్నాయి. మీరు పూనుకుని వాళ్ళ పెద్ద వాళ్ళతో మాట్లాడి మా ప్రేమ గురించి చెప్పి, ఆ పిల్లకి ఇంక ఏ పెళ్ళి సంబంధాలు చూడొద్దని చెప్పండి. నేను స్థిర పడంగానే నేను ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాను' అని ఎలా చెప్పగలడు ఈ మాటలు.

అవి చెప్పటానికి తగినంత ఆత్మస్థైర్యం అతనికి ఏర్పడటం లేదు మనసులో .

అదీ కాకుండా వాళ్ళ అమ్మగారికి ఆ అమ్మాయి పట్ల ఉన్న సదభిప్రాయం అతనికి తెలిసిన సంగతే. కాబట్టి తగినంత ధైర్యం చాలటం లేదు అతనికి.

అతని సంకోచం, తడబాటు చూసి వాళ్ళ అమ్మగారు ఇంకోలా అనుకున్నారు. ఇతను అడగబోయే విషయం పట్ల ఇతనికే నిబద్దత ఉన్నట్టు లేదు. విషయం ఏమిటో తెలియదు కానీ అతను పూర్తి గా సంధిగ్ధ స్థితి లో వున్నాడు.

అతనికి మన సలహా అవసరం వుంది. మనం స్థిరంగా వుండి అతనికి కాస్తా చేయూతనిస్తే అతన్ని ఆ కన్ఫ్యూషన్ నుంచి బయట పడేయవచ్చు అని ఆవిడ అనుకుంటున్నారు.

అతడు చివరికి గొంతు పెగల్చుకుని చెప్పాడు

"అమ్మా, మొన్న పాట పాడింది చూడు ఆ అమ్మాయి అంటే నాకు చాలా ఇష్టం. తను నీకు కూడా నచ్చుతుంది. తను చాలా మంచిది"

ఒక దానికి ఒకటి పొంతన లేని మూడు వాక్యాలు  చెప్పేసి ఊపిరి పీల్చుకున్నాడు అతను.

చపాతీని పెనం మీద వేయబోతున్న వదినెమ్మ నిర్ఘాంతపోయి నిలబడిపోయింది.

ఏమి పలకలేక ఆ అబ్బాయి వంకే చూస్తుండిపోయారు వాళ్ళ అమ్మగారు.

ఆమె అస్సలూహించలేదు ఆ అబ్బాయి అలా మాట్లాడగలడని

ఆమె అతని వంక చూస్తుండి పోయారు.

"అవునమ్మా. తనంటే నాకు ఇష్టం. తను బాగా పాటలు పాడటం ఒక్కటే కాదు, తనకు బాధ్యతలు తెలుసు. ఇంత చిన్న వయసులో ఇంత బాధ్యత గా వ్యవహరించే అమ్మాయిని నువ్వు అస్సలు చూసి ఉండవు.

తనతో నా జీవితం బాగుంటుందనే నమ్మకం నాకుంది." కాస్త్రా ధైర్యం కూడగట్టుకుని అతడే చెప్పాడు.

వాస్తవానికి అతడు పిరికివాడేమి కాదు. తన తల్లి పట్ల గౌరవంతో తను చెప్పదలచుకున్న విషయాన్ని అలా కుండ బద్దలు కొట్టినట్టు చెప్పటానికి కాస్త్రా మొహమాట పడ్డాడు.

అదే కారణంగా ఇంక అంతకన్నా ఎక్కువగా మాట్లాడటానికి అతడు ఇచ్చగించలేదు.

అప్పటి దాకా నిశ్శబ్దంగా వున్న పెద్దావిడ నెమ్మదిగా నోరు విప్పారు. నెమ్మదిగా చెబుతూ వున్నా ఆమె ప్రతి పలుకులో స్థిరత్వం వుంది.

"చినబాబూ, నీవు చాలా పొరపాటు పడుతున్నావు. మెరిసేదంతా బంగారు కాదు. బ్రతకడం తప్పని సరి అయినప్పుడు ప్రతి ఒక్కరు కష్టపడతారు అది సహజం. అది ఒక గొప్ప లక్షణంగా నీవు భావించాల్సిన పని లేదు. ఆ కష్టపడే తత్వాన్ని, తాము పడే కష్టాన్ని ఎరగా వేసి నీలాంటి సున్నిత మనస్తత్వం గల వారిని బుట్టలో వేసుకోవటం అలాంటి వారికి మామూలే.

ఆ అమ్మాయి చదువు పూర్తవనీ, మీ నాన్నగారికి చెప్పి ఆ అమ్మాయికి ఏదయినా ఉద్యోగం ఇప్పించటం లో సహాయం చేద్దాం.

ఆమె బాగా పాటలు పాడుతుందన్నావు. మంచిది. ప్రభుత్వంలో సాంస్కృతిక శాఖ వారిని కదిపి ఆమెకి అసలు ఎవరూ ఊహించలేనంత బ్రేక్ ఇప్పిద్దాం, వాళ్ళకు అప్పులున్నాయా, కావాలంటే అవి తీర్చటం లో మనవంతు సహాయం చేద్దాం. స్నేహం అంటే ఇలాగ వుండాలి. అంతే.

అసలు ఎవరు వాళ్ళు? మనకు ఏ విధంగ చూసినా సరి సాటి కాదు. ఆర్థిక స్థితి గతుల గురించి కాదు నేను మాట్లాడుతున్నది. పొట్టపోసుకోవటానికి కుట్టు మిషన్ పై నాల్గు జాకెట్ గుడ్డలు కుట్టుకునే మనిషి నా వియ్యపురాలు అంటే నాకు సమ్మతం కాదు. నేను నలుగురిలో ఎలా తల ఎత్తుకు తిరగను రేపొద్దున. ఒక కష్టం వచ్చినప్పుడే మనుషుల నిజమైన వ్యక్తిత్వాలు బయట పడతాయి అంటారు. వాళ్ళకు ఆర్థిక కష్టాలు వచ్చాయి , అది బాధాకరమైన విషయమే. కాదనను. ఆ పరిస్థితి నుంచి బయటపడాటానికి పద్ధతి గల వారు ఏమి చేస్తారు? నగో నట్రో, భూమో పుట్రో అమ్మి ఆ అప్పులు తీరుస్తారు. లేదా పీ.ఎఫ్ మీద లోన్ తీసుకుని తీర్చే ప్రయత్నం చేస్తారు. వీళ్ళేమి చేశారు? జనం నెత్తిన కుచ్చు టోపి పెట్టారు. అది సరి అయిన పద్ధతి కాదు కద. నేను వాళ్ళ గురించి పూర్తిగా కూపీలాగాను. నాకు తెలిసిందేమిటంటే, వాళ్ళ కుటుంబానికి మంచి పేరు లేదు.

ప్రతి పరిచయం, స్నేహంగా పరిణమించాల్సిన పని లేదు.

ప్రతి స్నేహం, ప్రాణ స్నేహంగా మారల్సిన అవసరం లేదు.

స్నేహం కుదరాలన్నా, ప్రేమించాలన్నా, పెళ్ళి చేసుకోవాలన్నా ఒక అర్హత అవసరం. పెళ్ళి విషయానికి వస్తే అటేడు తరాలు, ఇటేడు తరాలు చూడాలి అంటారు. ఏడో తరం దాకా ఎందుకు, వాళ్ళ అమ్మానాన్నలే సరిగా లేరు.

రేపొద్దున ఇలాంటి పిల్ల మన ఇంటి పరువు తీసే పనులు చేసినా నేను ఆశ్చర్య పోను.

ప్రతి ఒక్కరికి ఒక అర్హత వుంటుంది. ఆ అర్హతని మించి ఆశిస్తే అది ఎవరికి మంచిది కాదు.

కాస్తా తెల్ల తోలు, నాల్గు మంచి మాటలు, కష్టపడే తత్వం, నాల్గు రాగాలు ఆలపించగల నేర్పు ఇవే కద నీకు ఆ పిల్లలో నచ్చాయి. ఇవే గుణాలున్న పిల్లలు మన సరి సాటి వారిలో కోటి మంది ఉంటారు.

నీవు చదువు అయిపోగొట్టుకుని జీవితంలో కాస్తా స్థిర పడితే రంభా ఊర్వసులని తలదన్నే రూపసులు, ఇంకా అద్భుతంగా పాటలు పాడగలిగే గాయనీమణులు మన వాళ్ళలోనే దొరుకుతారు."

ఆవిడ కాసేపు నిశ్శబ్దంగా ఆగిపోయారు.

వదినెమ్మ అత్తయ్య మాటలతో ఏకీభవించినట్టుగానే కనపడింది.

"పరిచయాన్ని ఇంత దూరం ఎందుకు తెచ్చుకుంటున్నావు చినబాబూ. నీ స్థాయికి, నీ అర్హతలకు తగిన అమ్మాయి కాదు అనిపిస్తోంది నాకు. అత్తయ్య నిజమే చెబుతున్నారు" వదినెమ్మ చెప్పింది.

"సమాజం అన్నాక రక రకాల వ్యక్తులు తారస పడుతుంటారు. అందరినీ చిరునవ్వుతో పలకరిస్తూ ముందుకు వెళుతుండాలి. మనకు ఏది మంచిదో అది మనం చేస్తూ పోతుండాలి. జాలి దయ వుంటే సాయం చేద్దాం అంతేకాని తన్నుమాలిన ధర్మం అన్నట్టుగా నీ జీవితాన్నే వారికి అర్పించటం నాకు అస్సలు ఇష్టం లేదు.

విషయం స్పష్టంగా చెప్పాలి అంటే ఈ పరిచయం ఇంతకన్నా ముందుకు తీసుకువెళ్ళకు. పెళ్ళి అనే మాట మర్చిపో. ఆ అమ్మాయికి ఎవరో గంతకు తగ్గ బొంత దొరకనే దొరుకుతాడు. నీవు నీ సమయాన్ని చదువు పట్ల, నీ భవిష్యత్తు పట్ల వెచ్చిస్తే మంచిది"

అంతటితో ఆ సమావేశం ముగిసింది అన్న అర్థం వచ్చేటట్టుగా ఆవిడ వత్తిన చపాతీ లన్నీ పక్కన పెట్టేసి ముందు గదిలోకి వెళ్ళిపోయారు.

అతడు నిస్తేజంగా డైనింగ్ టేబుల్ ముందరే కూర్చుండి పోయాడు.

అతడి ముందు వేడి వేడి కాఫీ కప్పు ఉంచి, అతని పక్కన వచ్చి నిలబడి అతని భుజం పై చేయి వేసి ఓదారుస్తూ చెప్పింది వదినెమ్మ.

"అత్తయ్య చెప్పినట్టు విను చినబాబు. చక్కగా చదువుకో. కాలేజిలో నీకు మంచి పేరు వచ్చింది. మీ అన్నయ్యకి మంచి పేరు తెచ్చిపేడుతున్నావని మీ అన్నయ్య కూడా గర్వపడుతున్నాడు. ఇలాంటి ఆకర్షణలు వస్తూనే వుంటాయి జీవితంలో, కానీ అన్నింటినీ అధిగమించి గమ్యం చేరుకునే వాడే నిజమైన విజేత."

అలా చెబుతూ కాస్తా ఆగి, ఆమె నెమ్మదిగ స్థిరంగా రెండు మాటలు చెప్పింది.

"నీవు చిన్న పిల్లాడివేం కాదు. ఏది మంచి ఏది చెడ్డ అని ఆలోచించగల ప్రాజ్ఞ్యత నీకు వుందనే నేను విశ్వసిస్తున్నాను. ఆ అమ్మాయి పట్ల నాకయితే వ్యక్తిగతంగా చెడు అభిప్రాయం లేదు. అత్తయ్యగారు చెప్పినట్టు వాళ్ళ అమ్మానాన్నలకు అంత మంచి పేరు లేకపోవచ్చు. కానీ మనింటికి వచ్చాక ఆ పిల్ల మన పిల్ల అవుతుంది.

'ఏది ఎటుపోయినా నాకు ఆ అమ్మాయి కావాలి, నేను ఆ అమ్మాయినే పెళ్ళి చేసుకోవాలి' అని నీవునుకుంటే, నేను మీ అన్నయ్య కూర్చుని అత్తయ్య గారితో మాట్లాడి వప్పిస్తాం. నీకు అత్తయ్య గారి కోపం గురించి తెలియనిది ఏముంది? ఆమె కోపం తాటాకు మంట లాంటిది. నిజానికి ఆమె మనసు చాలా మంచిది"

వాస్తవానికి అతడు అయోమయంగా వున్నాడు. తల్లి మాటలకు బాధ కానీ, వదినెమ్మ మాటలకు ఆనందం కానీ కలుగ లేదు అతడి మదిలో. అతడి మెదడంతా మొద్దుబారిపోయింది.

అతడు ఊహించింది వేరు. తను అలా చెప్పగానే తన తల్లి ఎటువంటి ప్రతిఘటన లేకుండా, 'ఓ తప్పకుండా అలాగే. నీ నిర్ణయం పట్ల మాకు భరోసా వుంది. నీవు ఎలా చెబితే అలా చేద్దాం' అని అంటుందని అతడు ఊహించాడు.

అంత విశ్లేషణతో కూడిన వ్యాఖ్యానం చేయకుండా తన తల్లి చాలా మమూలుగా 'వద్దు' అని వుండినా అతడు ఇంతే స్థాయిలో దిగ్భ్రాంతికి గురయివుండేవాడు.

అది అసలు ఊహించని పరిణామం అతనికి. రెండ్రోజుల క్రితమే ఆ ఉత్తరం కారణంగా ఆమెలో బలంగా ఏర్పడ్డ అయిష్టతని ఆమె వ్యక్త పరిచినప్పటికీ, ఆమె తన మాటలకు విలువనిస్తుంది అని అతనికి చాలా బలంగా అనిపిస్తూ వుండినది. ఆమె అంత తీవ్రస్థాయిలో తన నిరసన వ్యక్తం చేయటం అతనికి పిడుగుపాటులాగ వుంది.

చూట్టానికి సింహంలా దర్పంగా కనిపిస్తుందే కాని అతని తల్లికి అతడంటే పిచ్చి ప్రేమ.

ఆ రాత్రంతా ఆవిడ నిద్రపోలేదు. కొడుకు భవిష్యత్తుని తలచుకుని దిగులుపడసాగింది. ఏనాడు నోరు తెరిచి 'ఇది కావాలి' అని తన కొడుకు అడిగి ఎరుగడు. జీవితంలో మొదటి సారి 'అమ్మా నాకు ఇది ఇష్టం. నా ఇష్టాన్ని మన్నించవా' అని అడిగితే తాను అంత తీవ్ర స్థాయిలో అతని ఇష్టాన్ని తిరస్కరించి వుండకూడదేమో అన్న దిగులు ఆమె మనసంతా నిండి పోయింది.

భర్త తో కూడా అదే చెప్పుకుని బాధ పడింది ఆవిడ. వారిద్దరు చాలా సేపు అదే ఆలోచనలో మునిగి పోయారు.

'లక్ష్మీ, నేను మళ్ళీ కూడా అదే చెబుతున్నాను. పిల్ల పిల్లవాడు చిలకా గోరింకల్లాగా చాలా చక్కగా వున్నారు. ఆ పిల్ల సుగుణవతి అని నాకు బలంగా అనిపిస్తోంది. మనం పెద్దవాళ్ళం అని ఎప్పుడనిపిచ్చుకుంటాం అంటే, పిల్లలకు వారి భవిష్యత్తుకు ఉపయోగపడే లాంటి పనులు చేసి, వారిని ఆనందపెట్టినప్పుడు మనం నిజంగా పెద్ద వాళ్ళం అనిపిచ్చుకుంటాం గానీ, మనం మన పెద్దరికాన్ని ఉపయోగించి, అకారణంగా ఏవేవో అపోహలు మనసులో పెట్టుకుని , ప్రతి దానికి అనవసరంగా 'వద్దు వద్దు' అడ్డుపడి, వారి ఇష్టాలను నిర్దాక్షిణ్యంగా చిదిమేయటం, వారి ఆనందానికి అడ్డు పడటం అంతమంచిది కాదేమో అని నాకనిపిస్తోంది" అని చెప్పేసి ఆమె వంక ఒక సారి చూశాడు. ఆమె శ్రద్ధగా వింటోంది అన్న నమ్మకం కుదిరాక తిరిగి కొనసాగించాడు

"ఇక వాళ్ళ పేరెంట్స్ విషయానికి వస్తే, అర్థిక కష్టాలు వచ్చినప్పుడు ఒక సిలబస్ ప్రకారమే అందరూ రియాక్ట్ అవ్వాలి అనేం లేదు, వారు ఆ చీటి పాటలు మంచి ఉద్దేశ్యంతో ప్రారంబించి వుండవచ్చు. వారికి తెలియని ఏవో పరిస్థితుల కారణంగా వాళ్ళకు చెడ్డ పేరు వచ్చి వుండవచ్చు. మనం వాళ్ళు వీళ్ళూ చెపింది విని ఎందుకు అభిప్రాయాల్ని ఏర్పర్చుకోవాలి?

ఓకే, వాళ్ళు ఫ్రాడ్ చేసే వారే అనుకుందాం. చిన్నపిల్ల ఆ పిల్ల తప్పేముంది అందులో? రేపు పొద్దున మనింటికి వచ్చింతర్వాత మన పిల్ల అవుతుంది కాని వాళ్ళ పిల్ల కాదు కద.

నా వరకు నాకు మనం పిల్లవాడి ఇష్టాన్ని మన్నించటం సబబు అని అనిపిస్తోంది."

ఆయన చెప్పటం ముగించాడు.

ఆమెకి కూడా అదే సబబు అని అనిపించింది.

ఇది ఇలా వుండగా పక్క గదిలో నిద్ర రాక అతను తీవ్రమైన మనో వేదన అనుభవిస్తున్నాడు.

"అమ్మయ్య! ఆ అబ్బాయి వాళ్ళ అమ్మనాన్నలు ఒప్పుకున్నారు, అన్నా వదినెలు ఒప్పుకున్నారు. ఆ అమ్మాయికీ ఇష్టమే, అబ్బాయికీ ఇష్టమే. ఇక కథ సుఖాంతం అవ్వాలి కద.

మధ్యలో బ్రేకప్ ఎలా అయ్యారు? ఎందుకు అతడు తుంగభద్ర నది ఒడ్డున కొండశిఖరం పై సమాధి యోగ శిబిరానికి వెళ్ళాల్సి వచ్చింది? అసలు ఈ కథలో విలన్ ఎవరు? అందరూ మంచి వాళ్ళే కనబడుతున్నారే?"

నవ్య ఆతృతగా ప్రశ్నించింది.

సంతోష్ ఆమె వంక చిరునవ్వు నవ్వుతూ నింపాదిగా చెప్పాడు. "ఈ కథలో తనకు తానే నిజమైన శత్రువు గా మారాడు ఆ అబ్బాయి"

"వ్వాట్? ఆ అబ్బాయి తనకు తాను శత్రువుగా మారాడా? అదెలా?"

"అతడు 'గుడ్‌బాయ్ సిండ్రోం" అనే మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ వ్యాధి లక్షణాలు వున్న వ్యక్తులు చిత్రంగా ప్రవరిస్తారు. సమాజం నిర్దేశించిన నియమనిబంధనలని, ప్రవర్తనా నియమావళిని తూ.చ తప్పకుండా పాఠించే లక్షణం కలిగి వుంటారు. తలితండ్రుల మాటకు ఎదురుచెప్పకూడదు, సత్యమునే పలకవలెను, అమ్మానాన్నల సంతోషం కొరకు వ్యక్తిగత సుఖాల్ని సైతం తృణప్రాయంగా త్యజించవచ్చు ఇలాంటి భావాల్ని కలిగి వుంటారు. తమ అభీష్టానికి వ్యతిరేకంగా పెద్దల సంతోషానికి ప్రాధాన్యతనిస్తూ, తమను తామె హింసించుకుంటూ, అందులోనే ఒక విధమైన తృప్తిని పొందుతారు. సాధారణంగా ఇలాంటి వ్యక్తులు ఇంట్రావర్టులుగా మారిపోతారు క్రమంగా"

"సర్ మీరు చెప్పేది అర్థం అవటం లేదు. పెద్దలు చెప్పినట్టు వినటం మంచిదేగా. అది సిండ్రోం ఎలా అవుతుంది?"

"వినటం మంచిదే. అదే విధంగా తనకు ఇష్టమైన వ్యక్తిని చేసుకుంటానని అసెర్టివ్ గా చెప్పటం కూడా తప్పేం కాదు. లేదా వారు చెప్పిన మాటలతో ఏకీభవించి వారు చెప్పింది సబబే అనే కన్విక్షన్ తో ఒప్పుకున్నా ఇబ్బంది లేదు. అలా కాక తమ మనసుకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తూ, క్షణ క్షణం మానసికంగా నరకం అనుభవిస్తూ, ఇతరులకు తామేదో మేలు చేస్తున్నామన్న సూడో శాటిస్‌ఫాక్షన్ అనుభవిస్తూ నిరంతరం వ్యధచెందటం ఈ 'గుడ్ బాయ్ సిండ్రోం' బాధితుల ప్రధాన లక్షణం. కుదురుగా కూర్చుని చర్చించుట అనేది ఉండదు. తమ మాట అందరూ పొగిడెయ్యాలి. వ్యతిరేకత రాకూడదు. వచ్చిందో, ఒక్క సారిగా షెల్ లోకి వెళ్ళి పోతారు.

ఇంకో సంగతి ఏమిటి అంటే, ఒక్కోసారి ఆ సంఘర్షణ కారణంగా వాళ్ళు విపరీతంగా ప్రవర్తిస్తారు. ఎదుటివారిని హింసించటం, సమాజానికి హాని తల పెట్టడం కూడా చెయ్యవచ్చు ఈ స్థితిలో వీరు.

"అయ్య బాబోయి. మరి ఇతడు ఏమి చేస్తాడు? అసలు కథ ఎలాంటి మలుపులు తిరుగుతుంది? అసలు ఊహకు అందటం లేదు. కథ కొనసాగించండి ప్లీజ్."

"డాక్టర్ పీవీ జానకిరాం

హిప్నాటిస్టు, సైకాలజిస్టు, రచయిత, పర్సనాలిటీ డెవలెప్మెంట్ ట్రెయినర్"

ఆటో ఆగింది ఆ ఇంటి ముందు. ఆగిన ఆటో లోంచి ఆ అబ్బాయిని తీసుకుని వాళ్ళ అన్నయ్య గారు దిగారు. ఆ అబ్బాయి చూట్టానికి చాలా నీరసించి ఉన్నాడు. ఒక నెల రోజులు జ్వరంతో లంఖణాలు చేసిన వాడిలా వున్నాడు.

ఆటొ అతనికి డబ్బు ఇచ్చి పంపించేశారు. గేటు తీసుకుని నెమ్మదిగా లోపలికి ప్రవేశించారు.

జానకి రాం గారిది అదే ఇల్లు, అదే కన్సల్టేషన్ సెంటర్ కూడా.

అప్పుడు సాయంత్రం ఆరున్నర అయుంటుంది.

అది చాలా పాతకాలం మేడ. గవర్నమెంట్ వారు కట్టిచ్చిన ఏవో క్వార్టర్ల లాగా వున్నాయి. గోపి రంగు గోడలు. ప్రతి ఇంటి చుట్టు కాస్తా ఖాళీ స్తలం అందులో రకరకాల మొక్కలు కొబ్బరి చెట్లు.

ఆ మొక్కలు చెట్లు చూడగానే అతని ఆ అమ్మాయి వాళ్ళ ఇల్లు గుర్తొచ్చింది.

ఆఫీసు బాయ్ లాంటి కుర్రాడు వాళ్ళ వివరం అడిగి వారికి ముందే అపాయింట్ మెంట్ వుందని నిర్దారణ చేస్కుని వారిని కన్సల్టేషన్ రూంలో కూరోబెట్టాడు.

ఫాన్ నెమ్మదిగా తిరుగుతోంది. గదిలో గోడలపై పుట్టపర్తి సాయిబాబా లామినేటేడ్ ఫోటోలు నిలువెత్తువి తగిలించి వున్నాయి. జానకి రాం గారు చేసిన ఇంద్రజాల ప్రదర్శనల తాలూకు ఫోటోలు కూడా గోడలపై ప్రముఖంగా తగిలించి వున్నాయి.

అప్పటికి గత అయిదేళ్ళుగా యండమూరి వీరెంద్రనాథ్ గారి తులసిదళం ప్రభంజనం సృష్టిస్తోంది ఆంధ్రప్రదేశ్ అంతటా. అ వెల్లువ కారణంగా ఉన్నట్టుండి పేరు తెచ్చుకున్న వ్యక్తి ఈ జానకిరాం. వాస్తవానికి అతడు ఒక మెజిషియన్ అంతే. ఈ హిప్నాటిజమ్ ఊపును ఆధారం చేసుకుని తన మాటల గారడిని ఉపయోగిస్తూ ఒక వెలుగు వెలుగుతున్నాడు.

సర్వ రోగ నివారిణి వచ్చేసింది. ఈ హిప్నాటిజం వల్ల తగ్గని వ్యాధే లేదు అన్న ధృఢమైన అభిప్రాయం అప్పట్లో బాగా చదువుకున్న వాళ్ళకు కూడా వుండేది. ఈ హిప్నాటిజం వల్ల జనాలకు రోగాలు తగ్గాయాలేదా అన్నది ప్రక్కన పెడితే ఈ జానకి రాం మాత్రం బాగా వెనకేసుకున్నాడన్నది బహిరంగ రహస్యం.

మన కథానాయకుడు అతని అన్నగారు ఈ క్లినిక్ కి ఎందుకు వచ్చారు అంటే మనం ఒక వారం రోజులు వెనక్కు వెళ్ళాలి ఆవిడ.

అతని తలితండ్రులు ఆ రాత్రి బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చారు.

'చినబాబు అంతగా ఇష్టపడుతున్నాడు కాబట్టి అతని అభిష్టాన్ని మన్నిద్దాం. అనవసరంగా అతని మనసు కష్టపెట్టి మనం బావుకునేది ఏమి లేదు' అన్నది ఆ నిర్ణయం.

వాస్తవానికి అతని తల్లికి నూటికి నూరు పాళ్ళు ఇష్టమేమి లేదు. అబ్బాయి మనసు కష్టపెట్టకూడదు అన్న ఒకే ఒక కారణంగా వారు ఆ నిర్ణయానికి వచ్చారు. ఇక వాళ్ళ నాన్నగారి విషయానికి వస్తే ఆయన కాస్త ఆధునికంగా ఆలోచించే మనిషి. ఆయనకి నూటికి నూరుపాళ్ళు నచ్చింది ఈ ఆలోచన.

తానొకటి తలచిన దైవం ఒకటి తలచు అని నానుడి ఉండనే ఉంది కద. తెల్లవారే సరికి ఆ అబ్బాయి చెప్పిన నిర్ణయం విని వాళ్ళు హతాశులయ్యారు. వాళ్ళ అమ్మగారు మాత్రం చాలా రిలీఫ్ గా నిట్టుర్చారు.

క్రితం రాత్రి ఆ అబ్బాయికి నిద్ర పట్టలేదు అస్సలు. రాత్రంతా ఆలోచిస్తూ నే గడిపాడు. డైనింగ్ టేబుల్ దగ్గర తల్లి మాట్లాడిన మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి. ఆ అబ్బాయి ఊహించినది ఒకటి అయినది ఒకటి. ఆమె మనఃస్ఫూర్తిగా అంగీకరిస్తుంది అన్నది అతడు భావన. కానీ అది ఒట్టి అడియాస అని అర్థం అయిపోయింది. అతను చిన్నప్పట్నుంచి కూడా తన తల్లిని బాధించి ఎరుగడు. ఆమెని ఏదో రకంగా ఆనందపెట్టడమే తన జీవిత ధ్యేయం అన్నట్టు మసలు కునే వాడు. ఆమె తాను చేసిన పనికి ఆమె నుంచి వచ్చే అభినందనలు అతనికి కొత్త శక్తిని ఇచ్చేవి.

అందరి ముందు కూడా అమె 'మా అబ్బాయి నేను చెప్పిన మాట జవదాటడు. మాకోసం ఏమయినా చేస్తాడు. మేము చాలా అదృష్టవంతులము ఇలాంటి అబ్బాయిని దేవుడు మాకు ఇచ్చాడు' అని తరచు అతను వినే లాగా అనేది. ఆ మాటలు అతనికి కొత్త శక్తిని ఇచ్చేవి.

ఆవిడ సైకాలజి కోర్సు ఏది చెయకున్నా అతని సబ్ కాన్షస్ మైండ్ ని చక్కటి అఫర్మేషన్స్ తో మంచి దిశగా మలచగలిగింది.

"మా వాడు అబద్ధాలు చెప్పడు"

"మా వాడు మా దగ్గర ఏదీ దాచడు"

"మా వాడికి ఏ దురభ్యాసాలు లేవు"

"మా వాడికి దైవ భక్తి ఎక్కువ"

"దేవుడిని మొక్కందే ఏ పని మొదలెట్టడు"

"ఆడపిల్లలతో చాలా గౌరవంగా వ్యవహరిస్తాడు" ఇలాంటి మాటలు చాలా ప్రభావాన్ని చూపిస్తాయి పసి హృదయాలపై.

పిల్లల పెంపకంలో ఇదొక మంచి టెక్నిక్. ఇతర ఇరుగు పొరుగు స్త్రీలతో , బంధువర్గం తో ఎక్కడైనా పెళ్ళిళ్ళూ పేరంటాల్లో కలిసినప్పుడు, అతడు చాటుగా వున్నప్పుడు, అతనికి వినపడేలా ఇలాంటి మాటలు ఆమె తరచు చెప్పేది. ఆ మాటల్లో ఎంతో గర్వం ఎంతో సంతోషం వ్యక్త పరిచేది.

ఇది అతని వ్యక్తిత్వం మీద చాలా చక్కటి ప్రభావాన్ని చూపించింది. అతడు ఆవిడ చెప్పే పై లక్షణాలన్నీ తన వ్యక్తిత్వంలో భాగం చేసుకున్నాడు. అమె అతడిని తరచు అతని వ్యక్తిత్వాన్ని అభినందించేది.

అతడు ఆమె పొగడ్తల కోసం సదా తనను తాను మంచి మార్గంలో వుంచుకోవటానికి ప్రయత్నం చేసే వాడు. స్కూల్ వయసు నుంచి కూడా తన గురించి మంచి రిమార్కులు ఇంటికి చేరేలాగా తాపత్రయ పడే వాడు. తన బుర్ర, తెలివి తేటలు పరిమితి చేసినంత మేరకు కష్టపడి చదివే వాడు. మార్కులు సంగతి అటుంచితే ఆయా సబ్జక్టులలోని సారాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకుని ఉపాధ్యాయుల ముందు నిరంతరం తన ప్రతిభని ప్రదర్శించే వాడు.

దానికి తోడు అతనికి సహజసిద్దంగా కవిత్వం ఒంటబట్టింది.

నలుగురిలో మంచి పేరు తెచ్చుకోవడానికి ఏయే మార్గాలు వున్నాయో అవన్నీ అతడు ఎన్నుకుని నిరంతరం పొగడ్తలు పొందటానికి అలవాటు పడ్డాడు. అవి లభించని నాడు ఒడ్డున పడ్డ చేపపిల్లలా విలవిలలాడే వాడు.

ఇలాంటి నేపథ్యంలో అతని వ్యక్తిత్వం వికసిస్తూ వచ్చింది.

ఒక రకంగా చెప్పాలి అంటే పైన పేర్కొన్నవన్నీ మంచి వ్యక్తిత్వ లక్షణాలే. కానీ తలితండ్రులను ఇంప్రెస్ చేయాలి, వారితో మంచి అనిపించుకోవాలి, మంచిగా ప్రవర్తించాలి అనే ఒక విధమైన అబ్సెషన్ చోటు చేసుకుంది అతనిలో.

ఈ కారణంగా , తల్లి నుంచి ఎదురయిన వ్యతిరేకత అతనిలో తీవ్ర భావసంచలనాన్ని కలుగజేసింది. అదే సందర్భంగా అతడు ఒక ఆత్మ ఘాతుక నిర్ణయాన్ని తీసుకున్నాడు.

దురదృష్టవశాత్తు వారు తనకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారన్న విషయం అతడికి తెలియదు.

మరుసటి రోజు ఉదయం కాఫీలు త్రాగే సమయంలో ప్రకటించాడు.

"అమ్మా నన్ను మన్నించు. నాకు నీవు చెప్పిన విషయాలన్నీ సరి అయినవి అనే అనిపిస్తున్నాయి. నేను ఆ అమ్మాయి విషయంలో ఇక ఎంత మాత్రం ముందుకు పోను. నా చదువు సంధ్యల మీద ఏకాగ్రత చూపిస్తాను"

వాళ్ళ అమ్మానాన్నలకు చాలా సంతోషం కలిగించింది అ వార్త. కానీ అతడు అనుభవించిన మానసిక సంఘర్షణ వారికి తెలియదు. వారు కాస్తా అనునయించి ఓదార్పుగా అతనితో మాట్లాడి, 'మాకు సమ్మతమే ఆ అమ్మాయి' అని ఒక మాట చెప్పుంటే పరిస్థితి ఎలా వుండేదో, కానీ వాళ్ళు కూడా రిలీఫ్ గా ఫీలయ్యారు.

అప్పుడు అతడు నెమ్మదిగా చెప్పాడు

"నేను హైదరాబాద్ వెళ్ళి పీవీ జానకిరాం గారిని కలుస్తాను. అనుమతినివ్వండి. హిప్నాటిజం ద్వారా నేను ఆ అమ్మాయిని పూర్తిగా మరచిపోవటానికి ప్రయత్నంచేస్తాను" రాష్ట్రంలో అందరిలాగానే జానకిరాం గారు చాలా గొప్పవాడు అనే భ్రమలో వున్నాడు అతను.

వాళ్ళకు అప్పటికయినా అతనిలోని సంఘర్షణ అర్థం అయ్యుంటే బాగుండేది. 'మర్చి పోతాను అంటున్నాడు కద. మంచిదేలే' అనుకున్నారు. కాని దాని తర్వాత పరిణామాలు చాలా దారుణంగా వుండబోతున్నాయి అన్నది వారు ఊహించలేక పొయారు.

"మీరేనా ఆదోని నుంచి వచ్చింది?" జానకి రాం గారు గదిలోకి వస్తూ చిరునవ్వుతో ప్రశ్నించారు.

ఇద్దరూ లేచి నమస్కరించారు. పరిచయ కార్యక్రమం ముగిశాక, కూర్చుని మాట్లాడుకోవటం మొదలెట్టారు

వాళ్ళ అన్న గారు విషయం మొత్తం పూసగుచ్చినట్టు వివరించారు. చివర్లో చెప్పుకొచ్చారు " మా వాడికి మీరంటే చాలా గౌరవం సార్. మీ మీదే పూర్తి ఆశలు పెట్టుకుని వచ్చాడు"

"ఓకే" గంభీరంగా తలపంకించాడు జానకిరాం గారు "మీరు ఇక్కడే కూర్చోండి, నేను ఈ అబ్బాయి తో మాట్లాడతాను. ఇవ్వాళే మొదటి సిట్టింగ్ టేకప్ చేస్తాను. అతనితో మాట్లాడిన తర్వాత ఎన్ని సిట్టింగ్ లు అవసరమవుతాయో చెప్పగలను. ఈ మొదటి సిట్టింగ్ కి సంబంధించి, కన్సల్టేషన్ కి సంబంధించి మీరు అమౌంట్ పే చేయండి" అంటూ ఒక మొత్తం చెప్పాడు. ఆ రోజుల్లో అది చాలా పెద్ద మొత్తం.

అన్నగారు మారు మాట్లాడకుండా చెల్లించారు.

జానకి రాం గారు మేడ పైభాగానికి తీసుకు వెళ్ళారు ఈ అబ్బాయిని. బాగా ఇరుకుగా వున్న పాతకాలం మేడ అది. కొబ్బరాకులు తొంగి చూస్తున్నాయి. కొబ్బరాకుల చాటు నుంచి నిండు చంద్రుడు దోబూచులాడుతున్నాడు.

ఆ అబ్బాయికి మారుతి వాళ్ళ మేడమీది కొబ్బరాకులు, చంద్రుడు గుర్తు వచ్చాయి. ఒక సారి తల విదిలించాడు బలంగా. ఆ అమ్మాయిని ఎంత మరచి పోవాలన్నా మరచి పోలేక పోతున్నాడు. ఖచ్చితంగా ఈ జానకి రాం గారె సహాయం చేయాలి.

ఆఫిస్ బాయ్ రెండు కుర్చీలు ఎదురెదురుగా వేశాడు. ఆయన ఒక దాంట్లో కూర్చుని తన ఎదురుగా వున్న కుర్చీలో ఈ అబ్బాయిని కూర్చోమన్నాడు. ఆఫీసు బాయ్ మేడ దిగి పోయాడు.

అంతటా నిశ్శబ్దం. పక్క అపార్ట్‌మెంట్ లోంచి దూరదర్శన్ ప్రసారాలు వినిపిస్తున్నాయి. కింద రోడ్డు పైనుంచి చిన్నగా ట్రాఫిక్ చప్పుడు వినిపిస్తోంది.

"ఎంత మంది ఆంటీలని పడేసావు?" ఊహించని విధంగా ఆయన అలా అడిగేసరికి అతడు నిరుత్తరుడు అయ్యాడు.

"నిన్నే అడుగుతున్నది. ఎంత మంది ఆంటీలని పడేశావు"

"ఆంటీలేమిటి?' గొంతు పెగల్చుకుని అడిగాడు ఈ అబ్బాయి.

"నాకు తెలుసులేవోయి మీ కుర్రాళ్ళ సంగతి. సెక్స్ బుక్స్ బాగా చదువుతావా? మందు కొడతావా? బీరు గీరు లాంటి వాటితోనే ఆపేశావా" అన్నీ తనకే తెలుసనే అజ్ఞానం ఆయనలో కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది.

"సర్. మీకు తప్పుగా అర్థం అయింది. నాకలాంటి అలవాట్లేవి లేవు. నేను ఒకమ్మాయిని మనఃస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. కానీ మా అమ్మనాన్నలకు ఇష్టం లేదేమో ఆ అమ్మాయి అని అనిపిస్తోంది. అందుకే వారిని తృప్తి పరచటానికి ఆ అమ్మాయిని మరచి పోదలచుకున్నాను. మీ సహాయం కావాలి అందుకు" చాలా సిన్సియర్‌గా చెప్పాడా అ అబ్బాయి

"మీ అమ్మానాన్నలను తరువాత తృప్తి పెడుదువుగానీ, నీవు స్వయంతృప్తి పొందుతుంటావా? రోజుకు ఎన్ని సార్లు హస్త ప్రయోగం చేసుకుంటావు?" తన జోకుకు తానే నవ్వుకుంటు అతని సమాధానం కోసం ఎదురు చూడసాగాడు

"సర్. మీరు చాలా దారుణంగా మాట్లాడుతున్నారు. మీ హిప్నాటిజం ద్వారా నేను ఆ అమ్మాయిని మరచి పోవాలని అనుకుంటున్నాను"

"తప్పకుండా మరచి పోదువు గానీ, అసలు నీ వ్యక్తిత్వం ఇదీ అని నాకు తెలిస్తే కద కేసులోని లోతు ఎంతో, ఎన్ని సిట్టింగ్ లు అవసరమౌతాయో తెల్సుకోవటానికి"

అంటూ ఇలాంటివే అసంధర్భమైన ప్రశ్నలు గుప్పించి, కాసేపయ్యాక తన అసిస్టెంట్ (అదే ఆఫీస్ బాయ్) ని బెల్ కొట్టి పిలిచాడు.

ఆ అబ్బాయికి ఇది మామూలే ఏమో. ఒక టేప్ రికార్డర్, హెడ్ ఫోన్లు పట్టుకొచ్చాడు. ఎక్స్టెండర్ ద్వారా కరెంట్ కనెక్షన్ ఇచ్చి, టేప్ రికార్డర్ ఆన్ చేశాడు. ఆ రోజుల్లో నేషనల్ పానసోనిక్ కంపెనీ స్టీరియో రికార్డర్ అంటే చాలా లగ్జరీ కిందలెక్క.

అందులోని క్యాసెట్ స్పూల్ నెమ్మదిగా తిరగటం ప్రారంభించింది.

హెడ్ ఫోన్లు ఆ అబ్బాయి తలమీదుగా చెవులకు తగిలించి, “కళ్ళు మూసుకుని ఇది విను. అందులో చెప్పినట్టు చెయ్యి”. అని చెప్పి ఆయన, ఆఫీస్ బాయ్ క్రిందకి వెళ్ళారు.

ఆయన మాటల్లో ఒక సబ్జెక్టు (పేషంట్) పట్ల వుండాల్సిన దయ, జాలీ ఏవీ కనిపించడం లేదు. ఈ కాలం కుర్రాళ్ళంతా పనికిమాలిన వాళ్ళు అన్న ఒక కృతనిశ్చయత ఆయన ప్రవర్తనలో కనిపిస్తోంది.

అతను సిన్సియర్ గా ఆయన చెప్పిన ప్రకారం కళ్ళు మూసుకుని అందులో వచ్చే సూచనలకు అనుగుణంగా ఊపిరి పీలుస్తూ, వదులుతూ కూర్చున్నాడు.

ఇంతా చేస్తే అది సెల్ఫ్ హిప్నాటిజం కాసెట్. అది ఆయన రూపొందించినదే.

ఆ విధంగా మరో రెండు రోజులు ఈ ప్రక్రియ కొనసాగింది.

"యెస్. ఈ అబ్బాయి ఆ అమ్మాయిని పూర్తిగా మరచి పోయాడు” అని ప్రకటించాడు ఆయన.

నిజానికి అతని మనసంతా అమె నిండి వుంది. ఎప్పుడెప్పుడు ఆదోనికి వెళ్ళి ఆమెని చూద్దామా అని వుంది. కాని వద్దు వద్దు వెళ్ళకూడదు చూడకూడదు అని తనలో తనే తపన పడుతున్నాడు.

కంప్యూటర్ హార్డ్ డిస్క్ లోని డేటాని  డిలీట్ చేసినట్టు తన మెదడు లోంచి ఆమె తాలూకు జ్ఞాపకాలు, ఆమె అంటే వున్న ఇష్టం తొలగిపోతాయని భావించాడు అతడు, హైదరాబాద్ కి వెళ్ళటానికి ముందు.

అది అసాధ్యమని అర్థమయి పోయింది. అతడికి ఒకటి అర్థమయిపోయింది ఈ హిప్నాటిజం అనేది ఒట్టి బోగస్, లేదా ఈ జానకి రాం ఒక ఫ్రాడ్. ఈ రెండిటిలో ఒకటి నిజం ఉండాలి.

మన మనసుని మనం సంభాళించుకోవాలే తప్ప ఇలాంటి చిట్కాలు ఏవీ పని చేయవని అర్థం అయిపోయింది.

జానకి రాం గారు కూడా అదే చెప్పాడు. కొన్ని రోజుల పాటు అ ఊరికి ఆ పరిసరాలకు దూరంగా వుంటే మంచిది. అదే పరిసరాలు, అవే మనుషులు వుంటే మళ్ళీ అవే జ్ఞాపకాలు చుట్టుముట్టుతాయి అని చెప్పారు.

అతడు హైదరాబాద్ వెళ్ళి డాక్టర్ జానకి రాం గారిని కలవటానికి ముందు జరిగిన సంఘటన అతనికి పదే పదే గుర్తు వస్తోంది.

"మీ అమ్మానాన్నలతో మాట్లాడేవా?" అడుగుతోంది ఆ అమ్మాయి. 'మాట్లాడానా, అవును మరి వారు ఏమన్నారు. ఔనన్నారా? కాదన్నారా?' తనలో తానే ప్రశ్నించుకుంటు విరక్తిగా నవ్వాడు అతడు.

"ఏయ్ నీకేమయింది ఈ వేళ?" అంటోంది ఆ అమ్మాయి.

"నీవు మీ అమ్మానాన్నాలను ఒప్పించి ఒక్కసారి వారు మా అమ్మా నాన్నలతో మాట్లాడితే ఒక పని అయిపోతుంది. ఏమంటావు. మనం తొందర పడాలి"

అతడేం పలకలేదు.

అతడి మౌనాన్ని ఆమె చదవగలుగుతోంది. వాళ్ళ అమ్మగారికి తన పట్ల అయిష్టత వుందన్నది సుస్పష్టం.

ఇక తన విషయానికి వస్తే . అమ్మానాన్నలను తను అడగాలంటె కాస్తా బిడియంగా వుంది. ముఖ్యంగా ఈ కుర్రాడి చదువే పూర్తి కాలేదు కద. పైగా వాళ్ళింట్లో వాళ్ళకు ఇష్టం లేకుండా మనం ఎందుకు ముందడుగు వేయాలి అని తన అమ్మానాన్న అడిగితే ఏం సమాధానం చెప్పుకోవాలో తెలియని స్థితిలో వుందామె.

కాని ఒక విషయం లో ఆమె కి చాలా స్పష్టత వుంది. ఆ అబ్బాయి తనకు సరి అయిన జోడి.

ఆ అమ్మాయి సహజంగా సిగ్గరి, బిడియస్తురాలు. ముఖ్యంగా తన పరిమితిని దాటి ఒక్క మాట ఎక్కువగా మాట్లాడదు. జీవితాన్ని ఎదుర్కోవటం లో, పేదరికంతో పోరాడటంలో తన ధైర్య సాహసాల్ని ప్రదర్శిస్తూ వస్తోంది ఇన్నాళ్ళూ.

తన ఇల్లు, తన చదువు, స్కూల్లో ఉద్యోగం ఇలా తన లోకం లో తాను బ్రతుకుతూ ఉండినది ఇన్నాళ్ళూ, కానీ అతని ప్రేమ ఇచ్చిన శక్తి వల్ల ఆమెకి ఆత్మస్థైర్యం పెరిగినట్టు అనిపిస్తోంది.

ఆమెలో భవిష్యత్తు పట్ల కొత్త ఆశలు, జీవితం పట్ల సానుకూల ధొరణి బలపడుతున్నాయి. అతను కొత్తవాడు అని అనిపించడం లేదు. అతను తన కోసమే పుట్టాడా అన్నంత హాయైన అనుభూతి ఆమెలో కల్గుతోంది.

అతనితో మాట్లాడుతు వుంటే ఎన్నో జన్మల నుంచి తెలిసిన ఆత్మీయ నేస్తంలా అనిపిస్తుంది ఆమెకి. సాధారణంగా మనం ఎదుటి వారితో ఏదైనా మాట్లాడేటప్పుడు ఒకటికి రెండు సార్లు ఆలోచించి, సరిగ్గానే మాట్లాడుతున్నామా లేదా అని, ఎదుటి వ్యక్తి ఏమనుకుంటారో అని యోచించి ఆపై మాట్లాడతాము.

కాని దగ్గర వారిదగ్గర మాట్లాడేటప్పుడు ఇలాంటి బిడియం, మొహమాటం ఏవీ పాటించము. అందుకే అంటారు "మనల్ని ఎవరు ఎక్కువ ప్రేమిస్తారో వారే మనల్ని ఎక్కువ ఏడిపిస్తారు అని".

ఆ చనువుతోనే నోరు తెరిచి అతన్ని ఒక మాట అడిగేసింది.

ఒక సంవత్సరం క్రితం అయితే ఆమె అంత ధైర్యం చేసి వుండదు. ఆమె కి తనలోని ఈ మార్పు తనకే స్పష్టంగా కనపడుతోంది.

అతన్ని అలా అడిగేశాక ఆమెకే అనిపించింది, తనేనా అలా అడిగింది అని.

కాని నోరు తెరిచి అడిగే వరకు ఆమెకే తెలియదు, తను అలాంటి ప్రపోజల్ చేయగలదని. అతనితో తాను మానసికంగా ఎంత సాన్నిహిత్యాన్ని అనుభవిస్తోందో ఆమెకే తెలిసి వచ్చిన క్షణం అది.

ఇంతకూ ఆ అమ్మాయి ఏమి ఆడిగిందో చూద్దాం.

"మన కాలనీ ముందర నుంచి వెళ్ళే రోడ్డు ఎక్కడికి వెళుతుందో తెలుసు కదా?" అర్థం లేని ఆ ప్రశ్నకి అతడు ఉలిక్కి పడి ఆమె వంక అయోమయంగా చూశాడు

"ఊ. తెలుసు. ఎమ్మిగనూరు కి, ఆపై మంత్రాలయం వెళుతుంది ఈ రోడ్డు"

"ఏయ్ మొద్దు. మీ అమ్మా వాళ్ళు ఒప్పుకోకున్నా కంగారు పడకు. మనం మంత్రాలయం వెళ్ళి పెళ్ళీ చేసుకుని వచ్చేద్దాం. అప్పుడు ఇక ఎవరికీ మనం భయపడాల్సిన పని లేదు. ఏమంటావు?" ఆమె మాటలు వింటూ వుండిపోయాడు అతడు.

"అందరూ ఒప్పుకుంటే బాగుంటుంది కద" చివరికి ఒక అర్థం లేని మాట అనేశాడు.

" నిజమే .బాగుంటుంది. మరి మీ అమ్మా వాళ్ళను ఒక సారి ఒప్పించు. ఈ బ్యాంకు కుర్రాడిది పెద్ద పీడ అయింది నాకు, అమ్మా వాళ్ళు చెప్పిన బ్యాంకు కుర్రాడు, వాళ్ళ అమ్మానాన్న లు వచ్చారు నిన్న. నన్ను చూసుకోవటానికి. వాళ్ళకు నేను నచ్చానట" నెమ్మదిగా చెప్పింది ఆ అమ్మాయి. ఆమె కళ్ళ నిండా కన్నీళ్ళు.

ఆమె వంకే చూస్తున్నాడు అతడు.

అతడి కళ్ళలో ఏ విధమైన భావం లేదు. ఏమి మాట్లాడాలో అర్థం కాని వాడిలా "ఆ అబ్బాయి బాగున్నాడా? నీకు నచ్చాడా?" అని అడిగాడు.

"ఏయ్. ఏమి మాట్లాడుతున్నావు నువ్వు. జోకులకు ఇది సమయం కాదు. వాళ్ళు చాలా తక్కువ కట్నం ఆశిస్తున్నారు. మా వాళ్ళకు నచ్చిన అంశం అది. పెళ్ళి కూడా చాలా సింపుల్ గా చేస్తే చాలు అంటున్నారు"

అతడేమి పలకలేదు.

వాళ్ళిద్దరూ ఆ అమ్మాయి ఇంటి గేట్ (ముళ్ళు కంచె) దగర నిలబడి వున్నారు. అప్పటికే మసక చీకటి కమ్ముకుంది. వీధి లైట్లు ఇంకా వెలగలేదు. దూరంగా రణమండల శిఖరాల మెట్లదారి వెంబడి వెలుగుతున్న దీపాలు తళుకులీనుతున్నాయి.

"నేను ఆడపిల్లనయినా సిగ్గువిడిచి నా అభిప్రాయాన్ని చెప్పేశాను. నాకు నువ్వు కావాలి. నువ్వేమి చేస్తావొ నువ్వే ఆలోచించి నిర్ణయం తీసుకో. మీ అమ్మానాన్నల్ని ఒప్పించు. ఎవరు వచ్చి ఎవరిని అడగాలి అన్నది కూడా సమస్య కాదు. మీ వాళ్ళు కాస్త సానుకూలంగా వున్నారు అంటే నేను మా అమ్మావాళ్ళని ఒప్పించి మీ ఇంటికే తీసుకు వస్తాను.

తీరా నేను ఒప్పించి తీసుకు వచ్చిన తర్వాత, మీ వాళ్ళు ససేమిరా అంటే బాగుండదు.

లేదా ఇది ఇంపాజిబిల్ అనుకుంటావా, నేను ఇందాక చెప్పిన మాట మీదా వుంటాను. అవును నిజంగా చెబుతున్నాను. అయ్ లవ్యూ రా"

తన ప్రేమని ఆమె అప్పటి దాకా , పేపర్ మీద పెట్టిందే గానీ మొదటి సారి ఆమె తన పలుకులతో అలా చెబుతుంటే అతనికి ఆనందం కలగాలి వాస్తవానికి.

"అవున్రా. నాకు నివ్వంటె పిచ్చి. పిచ్చి ప్రేమ. ఎంతో హుందాగా నాలోకంలో నేనుండే దాన్ని నేను. నన్ను పిచ్చిదాన్ని చేశావు నువ్వు. వేరే ఎవర్నో చేసుకోవటం కంటే చచ్చిపోవటం మేలు అనిపిస్తోంది నాకు" ఆమె కంఠంలోంచి మృదు భావనాతరంగాలు జాలువారుతున్నాయి.

పరిస్థితులు అతన్ని పిచ్చివాడిని చేస్తున్నాయి. మనసారా ఆనందించాల్సిన ఆ క్షణంలో అతని హృదయంలో విషాద రాగాలు పలుకుతున్నాయి.

తల్లి నిరసన ఒక వంక, తననే వెర్రిగా నమ్ముకున్న నెచ్చెలి ప్రేమ ఒక వంక.

అతనికి తనలోని మార్పు తనకే స్పష్టంగా అర్థమవుతొంది. పైకి కనపడేటంత ధైర్యవంతుడు కాడు తను. ఏ కష్టం లేనప్పుడు ధైర్యంగా ఎవడైనా వుంటాడు. నిజమైన కష్టం వచ్చినప్పుడె ఒక మగ వాడు ధైర్యంగా వుండాలి. సరి అయిన నిర్ణయం తీసుకోవాలి.

సరిగ్గా ఒక సంవత్సరం క్రితం తను ఎంత ధైర్యంగా వుండే వాడు. ఎవడు ఎదురైతే నాకేమి, దేనినైనా ఎదిరించగలను అన్న ఆత్మవిశ్వాసం తన స్వంతంగా వుండేది. అలాంటి తనకేమయింది ఇప్పుడు?

"ఏమి మాట్లాడవేంటి?" ఆమె రెట్టించింది. అప్పటికే ఆమె కళ్ళలో కన్నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి.

"డోంట్ వర్రీ, మనం ఏదోకటి చేద్దాం" అసంకల్పితంగా ఆమె చేతిని అందుకోబోతూ చెప్పాడు.

తన చేతిని అతనికి దూరంగా లాగేసుకుంటూ "నీ ఇష్టం. మనుషుల విలువ మనుషులు దూరం అయినప్పుడు తెలుస్తుంది. నిర్ణయం తీసుకోవాల్సింది నువ్వే. బై. గుడ్ నైట్"

అలా చెప్పేసి ఆమె లోనికి వెళ్ళిపోయింది వాళ్ళ నాన్నగారు రావటంతో.

"నమస్తే అంకుల్" అని ఆయన్ని గ్రీట్ చేసి వచ్చేశాడు ఈ అబ్బాయి.

మహాయోగి లక్ష్మమ్మ కళ్యాణ మండపం

ఆదోని.

"లక్ష్మీ వెడ్స్ సుధాకర్" బయట పెద్ద బోర్డు దర్శనం ఇస్తోంది.

మంగళ వాద్యాలు జోరుగా మ్రోగుతున్నాయి. పెండ్లి మండపం హడావుడిగా వుంది. అప్పుడే మాంగళ్యధారణ కార్యక్రమం ముగిసింది.

వాళ్ళ కాలేజి లోని ఒక లెక్చరర్ గారి అమ్మాయి పెళ్ళి. అటు కాలేజి స్టాఫ్, ఇటు కాలనీ వాసులు, ఇరువైపుల నుండి బంధువర్గం చాలా కోలాహలంగా వుంది వాతావరణం.

అన్నా వదినెల్నితీసుకుని కార్ నడుపుకుంటూ వచ్చాడు అతను. అంతకు అరగంట క్రితమే ఆ అమ్మాయి కూడా వాళ్ళ అమ్మానాన్నలతో బాటుగా వచ్చింది అదే పెండ్లికి.

అదే పెండ్లి మండపం సాక్షిగా ఒక ఘోరం జరుగుతుంది అని ఎవ్వరూ ఉహించలేదు.

వధూవరులను ఆశీర్వదించి, భోజనశాల వైపు వెళ్ళే వాళ్ళు కొందరు, కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ మండపంలో కూర్చున్న వారు కొందరు ఇలా వాతావరణం చాలా ఉల్లాసంగా వుంది.

ఆమె ఉండుండి  అతన్నే చూస్తూ వుంది. మాంగళ్యధారణ జరిగేటప్పుడు ఆమె చూపంతా అతనిపైనే వుంది. దాదాపు రెండు నెలల తర్వాత చూస్తొంది అతన్ని.

ఆమె వేషధారణ చాలా సింపుల్ గా వుంది. చిన్ని జరీ అంచుతో కూడిన నీలం రంగు మైసూర్ సిల్క్ చీర, అదే రంగు జాకెట్ ధరించి వుంది. చిన్ని బొట్టు, కాసిన్ని గాజులు, పల్చటి వెండి మువ్వలు.  అంతే ఆమె అలంకరణ. స్కూలుకి ఏదో  క్లాసులు చెప్పేటప్పుడు వెళ్ళినట్టు వుందే గానీ ఆమె అలంకరణ, పెళ్ళికి వస్తున్నట్టు లేదు.

ఆమె కి మనసు ఏమాత్రం బాగాలేదు. తలి తండ్రుల బలవంతం మీద పెళ్ళికి వచ్చిందే గానీ ఆమె కి వంటరిగా ఇంట్లోనే వుండిపోయి భోరున ఏడ్వాలనుంది.

ఈ రెండు నెలలు ఉత్తరాలు లేవు. చివరికి కంటి చూపులు లేవు.

అన్ని రోజుల ఎడం తర్వాత అతడు కనపడంగానే ఆమెకి ఎంతో ఉద్విగ్నంగా వుంది. పరుగున వెళ్ళి అతని ప్రక్కన కూర్చుని మాట్లాడాలని, అతని క్షేమ సమాచారాలు అడగాలని, అసలు అన్ని రోజులు కనపడకుండా ఎక్కడికి వెళ్ళాడని అడగాలని వుంది. ఆతన్నే చూస్తో వుంది.

ప్రేమ అనేది మనుషుల్ని కలుపుతుంది, ప్రేమ అనేది ఒక అందమైన మనోహరమైన భావన అని విన్నాను. మరి మన విషయంలో ఇలా అవుతోంది ఏమిటి?

ఆమెకి ఎన్నో చెప్పాలని వుంది.

నిన్ను కలవకుండా చేస్తున్న ఈ ప్రేమ నాకొద్దు.

ఆమె చేతిలో అతనికై వ్రాసి తెచ్చుకున్న ఉత్తరం వుంది. పర్సులో ఉన్న ఆ ఉత్తరాన్ని ఒక సారి తడిమి చూసుకుంది

**ప్రియాతి ప్రియమైన నీకు,**

ప్రేమ అంటే అదొక మధుర భావన అని, ప్రేమ మనుషుల్ని కలుపుతుంది అని విన్నాను ఇదివరకు. అదంతా అబద్ధమేమో అనిపిస్తోంది. ఈ ప్రేమ మంచిది కాదురా. అవునురా ఇది ఏ మాత్రం మంచిది అని అనిపించటం లేదు. ఇది నిట్టనిలువునా మన ఇద్దర్నీ దూరం చేస్తోంది.

ఎంత హాయిగా నవ్వుతూ మాట్లాడుకునే వారం. ఎవరూ చూస్తారనే భీతో, భయమో వుండేవి కావు. నీవు మాట్లాడేటప్పుడు నీ ప్రతి మాటతో ప్రేరణ పొందే దానిని. సహజంగా నేను చాలా ధైర్యవంతురాలిలాగా కనిపిస్తాను కానీ, విధిలేని పరిస్థితులలో ఆ ఉద్యోగం చేస్తూ డిగ్రీని దూరవిద్య ద్వారా చేసే దానిని , అదేం పెద్ద గొప్ప కాదు. నీకే అది చాలా గొప్పగా అనిపించి నా గురించి చాలా గొప్పగా పొగిడే వాడివి. నిజానికి నీ నుంచి పొందిన జ్ఞానం, ధైర్యం, ప్రేరణ మాటల్లో చెప్పలేనివి. నా జీవితంలో నేను గడిపిన అత్యంత విలువైన క్షణాలు అంటే సాయంత్రాలు పిల్లలకు పాఠాలు చెబుతూ నీతో మాట్లాడిన క్షణాలే. అంత గందరగోళంలో కూడా నీవు నాకు ఎంత జ్ఞానాన్ని అందించే వాడివి. నీకు తెలియని విషయం లేదా అని ఆశ్చర్యం అవుతుంది నాకు ఒక్కోసారి. నీలాంటి స్నేహితుడు నాకున్నాడు అని ఎంత గర్వించే దానినో నాకే తెలియదు.

అక్కడితో ఆపేసి వుంటే ఎంత బావుండేది? నా అత్యాశ నాకు, నీకు కూడా దుఃఖాన్ని కలుగచేస్తుందని నాకు ఊహామాత్రంగా కూడా తెలియదు రా.

నీ మోహం పై చిరునవ్వే తప్పనిచ్చి, ఏ ఇతర భావాలు నేను చూసి వుండలేదు. నిన్ను ఇటీవల చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది. నీ ఇంతటి కష్టానికి నేనే కద కారణం. నన్ను ఎన్నటికయినా క్షమిస్తావా?

ఈ ప్రేమ అన్న భావన మన మధ్య కలగకుండా వుండుంటే మనం హాయిగా మన స్నేహాన్ని కొనసాగించి వుండే వారం కద అని ఎన్ని సార్లు అనిపిస్తోందొ ఈ మధ్య.

నీ అమాయకత్వంతో కూడిన వెన్నెల లాంటి నవ్వు, ధైర్యాన్ని ఇచ్చే నీ మాటలు, భావుకత్వం ఉట్టి పడే నీ కవితలు, ఉత్తేజానిచ్చే నీ ప్రేరణాత్మకమైన వాక్కులు ఇవన్నీ నాకు వినిపించవా?

మనం స్నేహంగా వున్న కాలంలో మనం ఎంత ధైర్యంగా కలిసి మాట్లాడుకునే వారం. ఏమయిపోయాయి ఆ మాటలన్నీ, ఏమయిపోయాయి ఆ రోజులన్నీ. అవన్నీ ఉత్తి కలలేమో.

నాకు నువ్వు కావాలిరా. నీ నవ్వు కావాలి. నీ మాటలు కావాలి.

ప్రేమ అన్న ఈ ఒక్క పదం కారణంగా మన మధ్య ఇంత ఎడబాటు ఏర్పడుతుంది అనుంటే అసలు ప్రేమ అన్న ప్రసక్తి మన మధ్య నేను తీసుకు వచ్చుండే దానిని కాదు.

నీ తేజస్సుని, నీ ఆనందాన్ని, నీ ఉత్సాహాన్ని దోచేసిన దోషిని నేనే నేమో అన్న భావన నన్ను కలచి వేస్తోంది.

వద్దు ఇవేవి వద్దు మనం మళ్ళీ ఇది వరకులా హాయిగా వుందాం.

సాయంత్రాలు మా పూదోటలో గడుపుదాం. మల్లెల కన్నా స్వచ్ఛమైన నీ మాటలు వింటాను.

నీ నవ్వుల చల్లదనాన్ని పొందుతాను. నీ సాన్నిధ్యంలో నేను ఎంత ధైర్యాన్ని, నిబ్బరాన్ని పొందే దానినో మాటల్లో చెప్పలేను. బ్రతికుండగానే నరకాన్ని చవి చూస్తున్నాను. మనుషుల మధ్య ఈ బంధాలు ఎందుకు ఏర్పడతాయి రా.

అసలు రెండేళ్ళ క్రితం వరకు నీవెవరు, నేనెవరు? అసలు నా జీవితంలోకి ఎందుకు వచ్చావు? ఎందుకు నాలో ఆశలు కల్పించావు?

నాకు కొత్త జీవితాన్ని ఇచ్చేది నీవే అన్న భ్రమ నాలో కలుగుతుండగా దాన్ని నువ్వు తొలగించే ప్రయత్నం ఎందుకు చేయలేదు?

'ఏయ్ నీవన్ని ఉత్తి కలలు. పిచ్చి పిచ్చి ఆలోచనలు మానేయి' అని నా మొదటి ఉత్తరం అందిన రోజే ఎందుకు నాకు మొట్టికాయలు వేసి బుద్దులు చెప్పలేదు?

నీతో పెద్ద చిక్కేమిటంటే నీవు లేని నన్ను ఊహించలేకుండా చేసేశావు. అంతలోనే కర్కశంగా ఇన్ని యుగాలు నన్ను ఒంటరిని చేసి, నాతో మాట మాత్రంగా నైనా చెప్పకుండా ఎక్కడికో వెళ్ళిపోయావు.

నేనన్నదానిని ఉన్నానో లేదో అన్న ఆలోచన అయినా వచ్చిందా అసలు నీకు?

నాతో చెప్పి, ఒక్క నెల కాదు, రెండు నెలలు కాదు , రెండు యుగాలయినా సరే నీవు దూరంగా వెళితే నేను ఆ బాధను సహిస్తాను. నీకై ఎదురు చూడ్డంలో ఆనందాన్ని అనుభవిస్తూ ఆ అనుభూతులను సిరాతో అక్షరాల రూపంలో నిక్షిప్తం చేస్తూ , ఆ ఉత్తరాల దొంతరలని నీకై దాచిపెడుతూ, ఆ ఎడబాటును సయితం ఆస్వాదిస్తూ వుండే దానిని కద.

ప్రతి క్షణం నాకు ఒక యుగం లాగా గడిచింది. నిన్ను చూడక ప్రతి రోజు ఒక శిక్షలాగా గడిచింది. నేస్తమా, నీవు నా జీవితంలో ప్రవేశించక ముందు నేను ఎలా కాలం గడిపానో నాకే తెలియదు.

ఒక్క రోజు నువ్వు కనపడకుంటే నాకది నరక సదృశ్యమే. ఎందుకు నాకీ ప్రత్యక్ష నరకాన్ని శిక్షగా వేసి నీవు ఎక్కడికో వెళ్ళిపోయావు?

అన్నీ ప్రశ్నలే. ఒక్క దానికి నీవు జవాబు ఇవ్వవు. నేను వ్రాస్తున్న ఈ పిచ్చి రాతలు అసలు నీకు అందుతాయా అసలు?

నీవు ఎక్కడికి వెళ్ళావో తెలియదు. నీకు ఏ చిరునామాకి ఉత్తరం వ్రాయాలో తెలియదు.

ఎందుకు నాకు ఇంత పెద్ద శిక్ష?

ఓ నేస్తమా, నీవు ఇంత బరువు మోయవద్దు. నాపై ప్రేమని మీ అమ్మానాన్నలకు చెప్పి ఒప్పించలేకపోతున్నానని నిరాశ చెందకు. సంఘాన్ని, అయిన వాళ్ళని ఎదిరించి పారిపోయి పెళ్ళీ చేసుకోవాలా, అబ్బ అంత సాహసం నేను చేయాలా అని కూడా కంగారు పడకు.

అలాంటి వెర్రి సాహసాలు చేస్తేనే ప్రేమ అని నేను కూడా అనుకోను.

ఇవేవి సాధ్యం కాదు అనుకుంటే మనం మళ్ళీ మంచీ స్నేహితులుగా మిగిలిపోదాం. ఈ కోపాలు, అలకలు, ఈ నిశ్శబ్దాలు, ఎక్కడికి వెళ్ళావో తెలియకపోవటాలు ఇవేవి వద్దు.

నాకు నీతో హాయిగ స్వేఛ్ఛగా మాట్లాడగలిగే స్థితి చాలు.

నువ్వెప్పటికి నాతో ఇది వరకట్లా స్నేహంగా వుంటే చాలు.

నువ్వేమి మనసులో పెట్టుకోకు.

మనం ప్రేమ అనే ఈ భావన వల్ల ఏమి సాధించాము? స్వేచ్ఛ కోల్పోయాము. ఎద నిండా దుఃఖాన్ని కొని తెచ్చుకున్నాము. ఒకరి మొహాలు ఒకరు చూస్కోకుండా వుండి పోతున్నాము.

నీ గుండే మీద చేయి వేస్కుని చెప్పు. మనం ఒకర్ని ఒకరం అసలు తాకుకున్నామా? మనం ఒకరితో ఒకరం హద్దులు దాటి ఏనాడయినా మాట్లాడుకున్నామా?

మనం మన పెద్దలు సిగ్గుతో తలవంచుకునే పనులు ఏమయినా చేశామా?

మనం ఇది వరకు ఎలా ఉన్నామో ఇప్పటిదాకా కూడా అలాగే వున్నాము కద.

మనం చేసిందల్లా ఒక్కటే దోషం, అదేమిటంటే మనం ఎన్నటికీ కలిసి వుందాము అని కల కనటం.

మన స్వప్నాలు అన్నీ నెరవేరాలని రూలేం లేదు కద. బాధ పడకు.

నాకు ఒక్కటే ఒక్క వరం ఇవ్వు. నాతో స్నేహాన్ని కొనసాగించు కనీసం. నాతో ఈ దూరాన్ని పాటించకు. భరించలేను.

నీవు ఈ పెళ్ళికి వస్తావని నాకు తెలుసు. అందుకే ఈ ఉత్తరం తీసుకు వస్తున్నాను. నీకై వ్రాసి వ్రాసి పోష్టు చేయని ఎన్నో ఉత్తరాలు వున్నాయి. అవన్నీ తెచ్చి నిన్ను బాధ పెట్టను లే. ఇదొక్కటే ఇస్తాను.

ఏ మాత్రం వీలున్నా ఈ ఉత్తరం నీకు అందిస్తామని ఆశతొ వ్రాస్తున్నాను.

నీ

ప్రియాతిప్రియమైన స్నేహితురాలు

**అతను చాలా** దయనీయంగా వున్నాడు చూడ్డానికి. ఎంతో దర్పంగా, ఉత్సాహంగా, కళగా వుండే అతడు చాలా నీరసించి కనిపిస్తున్నాడు.

ఆతడు షేవింగ్ కూడా చేసుకోకుండా గడ్డం అలాగే వదిలేశాడు. అతని మొహంలో ఎప్పుడూ కనిపించే తేజస్సు మృగ్యం అయింది.

ఎప్పుడు చూసినా మడత నలగని దుస్తులలో, బట్టల కంపెనీ మోడల్ లాగా కనిపించే అతడు నిర్వేదంగా ఉన్నాడు. అంత ఫంక్షన్‌కి ఇస్త్రీ కూడా చేయబడని సాధారణమైన తెల్లరంగు కాటన్ షర్ట్, నీలిరంగు జీన్స్ వేసుకుని వచ్చాడు.

రెండు నెలలు గా అతడు ఊర్లో లేడు.

హైదరాబాద్ నుంచి వచ్చిన తర్వాత డాక్టర్ జానకి రాం గారి సలహా మేరకు అతన్ని వాళ్ళ అక్కయ్యా వాళ్ళ ఊరికి పంపారు. వెళుతూ వెళుతూ తనతో బుక్స్ కూడా తీసుకు వెళ్ళాడు.

ఇంకో మూడు నెలల్లో ఫైనల్ ఇయర్ పరీక్షలు.

కొత్త వాతావారణం, కొత్త మనుషులు ఉంటారు కాబట్టి, అక్కడికెళ్ళి అన్నీ మరచి పోయి, కుదురుగా చదువుకుని హాయిగా తిరిగి వస్తాడని వాళ్ళ అమ్మానాన్నలు అంచనా వేశారు.

అక్కడికి వెళ్ళినా అతని పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేదు.

అక్కడ గడిపిన కొన్ని రోజులు ధ్యానం నేర్చుకునే ప్రయత్నం చేశాడు. ఎవరో బాబా వున్నారంటే దర్శనానికి వెళ్ళాడు. తన ఆలోచనలని ఎంత దూరం చేసుకోవాలని ప్రయత్నం చేసే వాడొ అంతకు రెట్టింపు వేగం తొ అవి అతన్ని చుట్టుముట్టేవి.

గంటల తరబడి శూన్యంలోకి చూస్తుండి పోయే వాడు. ఏ పని చేయటానికి ఆసక్తి చూపే వాడు కాదు.

ఎవరిని చూసినా తనే గుర్తు వచ్చేది. ఏ పాట విన్నా అందులోని భావం తనకే అన్వయించి వ్రాసారా అది అన్నట్టు తోచేది.

**ఎదుటా నీవే ఎదలోనా నీవే**
**ఎటు చూస్తే అటు నీవే**
**మరుగైనా కావే**
**మరుపే తెలియని నా హృదయం**
**తెలిసీ వలచుట తొలి నేరం**
**అందుకే ఈ గాయం**
**గాయాన్నైనా మాననీవు**
**హృదయాన్నైనా వీడిపోవు**
**కాలం నాకు సాయం రాదు**
**మరణం నన్ను చేరనీదు**
**పిచ్చి వాడ్ని కానీదు**
**కలలకు భయపడి పోయాను**
**నిదురకు దూరం అయ్యాను**
**వేదన పడ్డాను★**
**(★ అభినందన చిత్రంలో ఆచార్య ఆత్రేయ వారి రచన)**

మనసు కవి ఆత్రేయ వ్రాసిన పాట అక్షర సత్యం కదా అని ఎన్ని సార్లనుకున్నాడొ.

అక్కడుండగా ఒక రోజు ఒక టెలిగ్రాం వచ్చింది. "మదర్ సీరియస్ స్టార్ట్ ఇమ్మీడియెట్లీ" అని. ఆ రోజుల్లో మొబైల్ ఫోన్లు, ఎస్సెమ్మెస్‌లు, ఇంటర్‌నెట్ సౌకర్యం వుండేది కాదు.

ఏదయినా ముఖ్యమైన సమాచారం వేగంగా పంపాలి అంటే టెలిగ్రామే గతి. ప్రతి ఇంటికి ల్యాండ్ లైన్ ఫోన్ కూడా వుండేది కాదు.

వాళ్ళ అమ్మగారికి సడన్ గా గుండె పోటు రావటంతొ హైదరాబాదు లోని నిజాం ఆసుపత్రికి తరలించారు అట. అక్కాబావలతో బాటు హడావుడిగా హైదరాబాద్ చేరుకున్నారు.

అక్కడ ఎవ్వరు అతన్ని సూటి పోటి మాటలు అనలేదు కానీ అందరి చూపుల్నీ అతడు చదవగలిగాడు. తల్లి ఆరోగ్యం విషమించటానికి అతనే కారణం అన్న భావన అందరి చూపుల్లో కనిపిస్తోంది.

వాస్తావానికి రెండు నెలల తర్వాత పరీక్షలు వ్రాయటానికి వచ్చినప్పుడు వాళ్ళ అమ్మగారితో సూటిగా చెప్పేయ్యాలి అని అనుకున్నాడు, 'అమ్మా తనను నేను మరచిపోలేకుండా వున్నాను. ఆస్థి, అంతస్తు ఇవన్నీ మనం సృష్టించుకున్నవి. ఆ అమ్మాయి నూటికి నూరు పాళ్ళు మంచిది. నాకు తనతో జీవితం కావాలి. వాళ్ళ అమ్మానాన్నలకు సంబంధించిన చింత నేను చేయదలచుకోలేదు. మీకు ఇష్టమయినా, కాకున్నా నేను తెగించి నా నిర్ణయనికి కట్టుబడి వుండాలని అనుకుంటున్నాను. తనను కోల్పోతే నేను జీవితమే కోల్పోయినట్టు. ఈ భావన నాకు ఈ మధ్య పదే పదే కలుగుతోంది. తలితండ్రులుగా నాకు మీపై సంపూర్ణ గౌరవం వుంది. కానీ నా ఈ నిర్ణయాన్ని మీరు కాదనవద్దు' ఇలా చెప్పేయ్యాలి అమ్మా నాన్నలతో అని అతడు ఒక నిర్ణయం తీసుకుని నిశ్చింతగా పడుకున్నాడు.

కానీ మరుసటి రోజే ఈ టెలిగ్రాం.

ముఖ్యమంత్రిగా ఉన్న ఆ రోజుల్లో ఎన్టీ రామారావు గారికి గుండె నొప్పి వచ్చి అమెరికా కి వెళ్ళాల్సి వచ్చింది. ఆ రోజుల్లోనే ఆయనకి అమెరికాలోని మన తెలుగువారైన డాక్టర్ కాకర్ల సుబ్బారావు గారి గురించి తెలిసింది. వారిని ఆంధ్రప్రదేశ్ కి ఆహ్వానించి నిజాం ఆసుపత్రి బాధ్యతలు అప్పజెప్పి, తెలుగు వారికి అంతర్జాతీయ స్థాయి వైద్యం అందించాలని ఆయన నిర్ణయం తీసుకోవటం ఆ రోజుల్లోనే జరిగిపోయాయి. ఆ తర్వాత నిజాం ఆసుపత్రి సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిగా మారటం, ఎందరివో ప్రాణాలు కాపాడటం జరిగినది ఆ రోజుల్లోనే.

ఆసుపత్రి లో అయినవాళ్ళందరూ చెప్పింది ఒక్కటే.

'పిడిరాయిలాంటి మనిషి మీ అమ్మగారు. ఏ అనారోగ్యం ఎరుగరు. అలాంటిది నీ గురించి ఆలోచించి ఆలోచించి గుండెపోటు తెచ్చుకున్నది. దేవుని దయ వలన సకాలంలో బైపాస్

ఆపరేషన్ అయ్యింది కాబట్టి బ్రతికి పోయింది. ఆమెను నీవు ఎంతమాత్రం కష్టపెట్టద్దు. ఆమె చెప్పినట్టు మసలుకో''

ఈ పరిస్థితులలో తన మనసులోని మాటను తల్లికి చెప్పటం ఎంతమాత్రం భావ్యం కాదని అతనికి అర్థం అయింది. నాన్నగారితో, అన్నయ్య వదినెలతో ఎవరికి చెప్పినా కూడ చివరికి తన నిర్ణయం వల్ల తల్లి గుండె పై పెనుభారం పడి ఆమె ప్రాణాలకే పెను ముప్పు ఏర్పడే ప్రమాదం వుందని అతడు ఇక మౌనం దాల్చాడు.

అక్కయ్య వాళ్ళ ఊరికి వెళ్ళటం, అటు నుంచి హైదరాబాద్ కి వెళ్ళటం ఇలా ఏతావాత ఓ రెండు నెలలు ఆ ఊరికి దూరంగా ఉండిపోయాడు.

ఇక వర్తమానం లోకి వస్తే, "భోజనాలకు వెళదాం పద చినబాబూ" వదినెమ్మ మాటలతో ఈ లోకంలోకి వచ్చాడు. పెళ్ళి పందిట్లో జనం పల్చగా వున్నారు. వేదిక మీద మహరాజ కుర్చీలలో నూతన వధూవరులు కూర్చుని ఏదో మాట్లాడుకుంటున్నారు.

భోజనాలు ముగించుకున్న అతిథులు కొందరు తాంబూలాలు సేవిస్తూ ఫాన్ల క్రింద కుర్చున్నారు. చాలామంది ఇళ్ళకు వెళ్ళి పోయారు.

"సరే వదినె. నేను కూడ ఒక నిమిషంలో వచ్చేస్తున్నా" అని చెప్పాడు.

అన్నయ్య వదినెమ్మలు మేడ పైని డైనింగ్ హాల్ వంక దారితీశారు.

అతడు కూడా వారితో వెళ్ళుంటే ఎలా వుండి వుండేదో పరిస్థితి.

అతడు వంటరిగా ఆలోచిస్తూ కూర్చున్నాడు.

ఉదయం నుంచి కనిపిస్తూనే వుంది ఆ అమ్మాయి. ఎవరి చిరునవ్వు కోసం తను పిచ్చి వాడిలా ఎదురు చూసే వాడో, ఎవరు కనిపిస్తే చాలని మేడ ఎక్కి ఎదురు చూసే వాడొ, ఎవరు మాట్లాడితే అన్నీ మరిచిపోయి పరవశించి వినే వాడో, ఎవరు కలల్లో కనపడితే చాలని రాని నిద్రకై ఎదురుచూసేవాడో, కలలో ఆమె కనపడాలని దేవుణ్ణి మొక్కుకుని నిద్రకు ఉపక్రమించేవాడో, రాని నిద్రని, కనలేని కలల్ని నిందించుకుంటూ ఉండిపోయేవాడో, సాక్షాత్తు ఆ కలల దేవత తన కండ్ల ముందరే తిరుగుతోంది.

తనతో చూపు కలిపే ప్రయత్నం చేస్తోంది ఉదయం నుంచి.

ఏదో మాట్లాడాలని చూస్తోంది పెళ్ళికి వచ్చినప్పటి నుంచి.

తన కలల్ని మరింత పెంచి తనకు ద్రోహం చేయలేదు. తనని కలిసి మాట్లాడి తనకు భవిష్యత్తు పట్ల మరిన్ని భ్రమలు కలిగించలేదు.

తన అసహాయ స్థితిని చెప్పినా తను వినే స్థితిలో లేదు. మన జీవితం మనిష్టం అంటుంది. మనిద్దరం ఒక్కటయ్యాక ఎవరూ ఏమీ అనలేరు కాస్త్తా ధైర్యం చేయి అంటోంది.

తనకు ధైర్యం లేక కాదు. తనను ఈ క్షణంలో కట్టుబట్టలతో తీసుకు పోయి పెళ్ళిచేసుకుని పోషించుకోగలడు, ఆ స్థైర్యం తనకుంది.

కాని తన తల్లిని బాధపెట్టే ఉద్దేశం తనకు ఏ కోశానా లేదు. ఈ అమ్మాయి గొప్పతనాన్ని తన తల్లి అర్థం చేసుకోలేక పోవటం తన దురదృష్టం. తనవాళ్ళు, ఆ అమ్మాయి తరఫు వాళ్ళు అందరు ఆనందంగా ఒప్పుకుని పద్దతి ప్రకారం పెళ్ళి జరిగితే బాగుంటుంది కాని, అయిన వాళ్ళందరిని బాధపెట్టి తాము ఏమి బావుకుంటాం.

తనకు ఆమె అంటే ఇష్టం లేదని ఎవరయినా అంటే  అంతకు మించి మూర్ఖత్వం ఇంకోటి వుండదు.

**మేరే బస్ మే అగర్ కుఛ్ హోతా**

**తో, ఆంసూ తేరీ ఆంఖోం మే ఆనే న దేతా.**

**సారా దర్ద్ అకేలే సహ్ లేతా**

**తుఝె మై ఘం కోయీ ఉఠానే న దేతా**

(నాకేమాత్రం శక్తి ఉన్నా నీ కన్నుల్లో కన్నీరు రానీయను. నీ బాధ మొత్తం తీసేస్కుని నేనొక్కడినే  భరించగలను, నీకే బాధని కలుగనివ్వను). శైలేంద్ర సింగ్ పాడిన పాట అప్రయత్నంగా గుర్తుకు వచ్చింది అతనికి.

నేస్తమా, నీవు నాగురించి బాధ పడకు. తలిదండ్రులను బాధించలేని నా అశక్తతని మన్నించు. నా ఏ నిర్ణయాన్ని కాదనలేదు వారు ఇంత వరకు. నా జీవితానికి సంబంధించిన అతి ముఖ్యమైన ఈ నిర్ణయాన్ని వారు హర్షించలేకపోవడం నాకు పిడుగుపాటుగా వుంది.

నేను నిన్ను మరువలేను.

వారిని ఒప్పించలేను. నా పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కలాగ వుంది.

మొదట్లో నేననుకునే వాడ్నినీ కోసం ఎవరినయినా ఎదిరించగలనని. నీ కోసం ఎంత సాహసాలు అయినా చేయగలనని అనుకునే వాడిని అవన్నీ అపోహలు అని అర్థం అవుతోంది.

కానీ ఒకటి మాత్రం నిజం. నీవు లేని నాజీవితం అర్థ రహితం. ఈ రెండు నెలలుగా నేను పాటిస్తున్న మౌనం నాకు నరక సదృశ్యంగా వుంది. నన్ను నేను పరీక్షించుకున్నాను. నీవు లెకుండా బ్రతుకగలనా అని. అది అసాధ్యం అని అర్థం అయిపోయింది.  ఒక్కో క్షణాన్ని ఒక్కో యుగంలా గడిపాను నిను చూడకుండా.

నేస్తమా చేదుగా వున్నా మాత్ర మింగకతప్పదు. భరించలేని ఈ ఎడబాటు ఇక నా జీవితం లో శాశ్వతం కాబోతోంది.

ఈ రోజు నువ్వు నాకనుల ముందరే కనిపిస్తున్నా మాట్లాడించాలని వున్నా మాట్లాడించలేకపోతున్నాను. నిన్ను మరచి పోతానని నాకు నేనే మాట ఇచ్చుకున్నాను.

ఇది నాకు ఏమాత్రం ఆనందకరం కాదు.

ఇది నాకు నరకంకన్నా తక్కువ ఏమి కాదు.

నా జీవితం ఎలా వుండబోతోందో నాకయితే ఏమీ అర్థం కావటం లేదు.

**ఊగానే నీ పాటలో ఊయ్యాలై**
**ఉన్నానే ఈనాటికి నేస్తాన్నై**

**తానాలే చేసాను నేను నీ స్నేహం లో**
**ప్రాణాలే దాచావు నీవు నా మోహం లో**

**ఆనాటి నీ కళ్ళలో నా కళ్ళే**
**ఈనాటి నా కళ్ళలో కన్నీళ్ళే**

**ఉందా కన్నీళ్ళకు అర్దం ఇన్నేళ్ళుగా వ్యర్థం చట్టందే రాజ్యమ్**
**సుక్కల్లే తోచావే ఎన్నెల్లే కాచావే ఏడ పోయావే★**
**(★ నిరీక్షణ చిత్రంలో కేజే జేసుదాస్ గానం – రచన ఆచార్య ఆత్రేయ)**

నీవు ఎంత బాధపడి వుంటావో నేను ఊహించగలను. ఇంకా అవి మన పరిచయం అయిన కొత్తలు. ఎక్కడికి వెళుతున్నానో చెప్పి వెళ్ళాను. అప్పుడు నాలుగంటే నాలుగే రోజులు వెళ్ళాను. అప్పుడే వుండలేక పోయాం మనం ఒకరితో ఒకరు చూసుకోకుండా. నాకు తెలుసు ఈ రెండు నెలలు నీవు నరక యాతన అనుభవించి వుంటావు.

ఎందుకంటే అంతకంటే ఎక్కువ నరక యాతన నేను అనుభవించాను. నాకు తెల్సు ఆ బాధ.

కాని ఒకటి మాత్రం నిజం. మనవి కలవని దారులు. మనం ఎన్నటికీ కలవలేం అన్న సత్యం నాకు స్పష్టంగా బోధ పడింది. ఏ అద్భుతమో జరిగి నువ్వు,నేను కలిస్తే ఎంత బావుంటుంది అన్న ఆశ నాకూ వుంది.

కానీ మా అమ్మానాన్నల ఇష్టానికి వ్యతిరేకంగా నేను ఇప్పటిదాకా ఏ పని చేయలేదు. వాళ్ళు నేను చేసే పనులకు సంతోషపడి నన్ను అభినందించటమే నాకు అలవాటు. మొదటి సారిగా మా అమ్మ నా పని పట్ల అయిష్టాన్ని వ్యక్త పరచింది. నేను ఆమెని బాధించలేను. ఆమె మొహంలో దిగులుని, దుఃఖాన్ని నేను చూడలేను.

ఇక మనం ఎన్నటికి కలవలేక పోవచ్చు.

ఇవ్వాళ నిన్ను కనులారా చూసుకున్నాను. చాలు ఈ జన్మ కి ఈ అదృష్టం చాలు. నీతో మనసారా మాట్లాడాలని నా మనస్సంతా లాగేస్తున్నా కూడా నన్ను నేను నిలువరించుకుంటున్నాను. ఏదేని మాట్లాడానుకో నా నిర్ణయం సడలి పోవచ్చు. అందుకే ఏమాటా మాట్లాడె ప్రయత్నం చేయలేదు. నన్ను అసహ్యించుకుంటున్నావు కదు. అసహ్యించుకో. ఇంకా అసహ్యించుకో. నన్ను ఏ మాత్రం ఇష్ట పడవద్దు. నన్ను ద్వేషించు. అలాగన్నా నన్ను మరచి పో. నీవయినా నీ జివితంలో ఆనందంగా వుండు. నాజీవితానికి ఇంతే అనుకుంటా.

అతనిలో ఆలోచనల ప్రవాహం సాగిపోతోంది.

నీవు నన్ను ఇంకా అసహ్యించుకునేలా చేసి నీ నుంచి దూరమవుతా.

పర్సు తీసుకుని అతనికి దగ్గరగా రాసాగింది ఆమె. ఆ పర్సులోనే దాచుకుంది ఆమె అతనికై వ్రాసి పెట్టుకున్న ఉత్తరం.

ఆమె ఒక్కో అడుగు దగ్గరగా వచ్చే కొద్ది అతనిలో కూడా ఆనందం కట్టలు తెంచుకొంటోంది. ఆమెని చూడకూడదు, ఆమెతో మాట్లాడకూడదు అని బలవంతం మీద తన్ని తాను నిగ్రహించుకుంటూ వస్తున్నాడు ఉదయం నుంచి.

ఆమె వచ్చి తనదైన సమ్మోహనకరమైన చిరునవ్వుతో పలకరిస్తే తానిక ఆగగలడా? ఆమెని మరచి పోవాలనే తన నిర్ణయానికి కట్టుబడి వుండటం సాధ్యమయ్యే పనేనా అప్పుడు.

ఏదో ఒకటి చేయాలి. అతని మెదడు నిండా ఇలా అర్ధరహితమైన అనారోగ్యకరమైన ఆలోచనలు కొనసాగుతున్నాయి.

అప్పుడు లేచాడు అతడు. ఆమె దగ్గరి దాకా వచ్చింది. అతని ఎదురుగా నిలబడి చిరునవ్వుతో "ఏయ్ మొద్దు ఎక్కడికి వెళ్ళావు ఇన్నాళ్ళు. నేనెంత కంగారు పడ్డాను తెలుసా?" అంటూ తన పర్సు తీయబోయింది.

అప్పుడు జరిగింది ఆ సంఘటన.

అతను విసురుగా ఎడం భుజాన్ని ఒడిసి పట్టుకుని 'నాతో రా చెబుతాను' అని విసురుగా ఆమెని జన సమూహానికి కాస్తా దూరంగ లాక్కెళ్ళాడు. చర చర మని లాక్కుంటూ అతను తీసుకు వెళుతుంటే ఆమెకి ఏమీ అర్థం కాలేదు మొదట. "ఏయ్ వస్తున్నాను కద, ఎందుకు ఆ విసురు?" అంటు గోముగా విసుక్కుంది.

కళ్యాణమండపం ప్రవేశద్వారం దగ్గరకి చేరుకున్నారు. అతిథులకు ఆహ్వానం పలికి, పన్నీరు చిలకరించి, చేతిలో గులాబి పెట్టిన ఆహ్వాన బృందం భోజనానికి వెళ్ళింది. అక్కడి టేబుల్, చెయిర్స్ ఖాళీగా వున్నాయి. అక్కడ నిలబడి ఆమె జబ్బని అలాగే ఒడిసి పట్టుకుని స్పష్టమైన పదాల్తో ఇలా చెప్పాడు.

"నాకు నువ్వంటే అసహ్యం. నా దృష్టిలో నీవు బజారు ఆడవాళ్ళకన్నా నీచం. ఎందుకు నీతో స్నేహం చేశానో నాకే తెలియదు. నన్ను మరచిపో. నా వెంట పడకు. నీతో స్నేహం కొనసాగించే ఉద్దేశం నాకు ఎంతమాత్రం లేదు. నా జీవితం లో నేను చేసిన అతి పెద్ద పొరపాటు నీతో స్నేహం చేయటం"

అసహాయత, దుఃఖం అతనితో అలా పలికిస్తున్నాయి. ఆ మాటల్లో ఏ ఒక్కటీ అతడు మనసుతో అనటం లేదు. ఆమెని నొప్పించటానికి మాత్రమే అతను అంటున్నాడు.

ఆ అమ్మాయి కూడా చిన్నపిల్ల. సైకాలజీ లో 'ట్రాన్సాక్షనల్ ఎనాలిసిస్' పట్ల ఏ కొద్దిగా అవగాహన వున్నా కూడా అతనప్పుడు పసి పిల్లాడిలాంటి మనస్థత్వంతో మాట్లాడుతున్నాడు అని అర్థం చేసుకోగలిగి వుండేది. అప్పుడు ఆమె అతని మాటల్ని పేరెంట్ స్టేట్ లో విని అతన్ని అర్థం చేసుకోగలిగి వుండేది.

కానీ దురదృష్టం ఆమె అతని మాటల్ని యధాతథంగా అర్థం చేసుకుని దిగ్భ్రమ కి గురయ్యింది.

అతడి కళ్ళు ఎర్రగా మారాయి అలా మాట్లాడుతున్నప్పుడు. ఎర్రగా మారిన ఆ కండ్లలోంచి కన్నీరు ధారలుగా వస్తున్నాయి. మొహం జేవురించింది.

ఆమె అతడి వంకే చూస్తుండిపోయింది. అతని మాటలు ఒక్కొక్కటి పదునైన బాణం ములుకుల్లాగా తగులుతున్నాయి ఆమెకి. కాసేపటికి ఆమె చెవులు వినటం ఆగిపోయాయి. కనులు తెరుచుకునే వున్నాయి కానీ దృశ్యాల్ని చూడటం ఆపేశాయి. ఆమె కీ ఏమీ కనపడ్డం లేదు.

అవుదూడ కళ్ళలాంటి ఆమె పెద్ద కళ్ళు ఆ దిగ్భ్రమకి మరింత పెద్దవి అయ్యాయి. మొదట ఒక పల్చటి కన్నీటి తెర ఆమె కళ్ళంతా అలముకుంది. ఆ తర్వాత బొట బొట మని కన్నీటి బిందువులు ఆమె కనుకొలకుల నుండి సంతతధారగా జాలువారటం మొదలెట్టాయి.

తెరచిన పర్సు తెరచినట్టే వుండి పోయింది.

పర్సు లోపలి కాగితాల్ని పట్టుకున్న ఆమె సుకుమారమైన ఎర్రటి వేళ్ళు అలాగె ఉత్తరాన్ని ఒడిసి పట్టుకుని వుండిపోయాయి.

ఆమె భుజం పై అతడు పట్టు సడలించాడు.

వారిరువురికి అదే తొలి స్పర్శ. తెల్లటి సుకుమారమైన ఆమె భుజం ఎర్రగా కంది పోయి అతడి స్పర్శ తాలూకు ఆనవాళ్ళు కొన్ని రోజులు నిలిచిపోయాయి.

వారిద్దరి గుండెల్లో ఆ స్పర్శ తాలూకు వాతలు జీవితాంతం మిగిలిపోయాయి. వారి తొలి స్పర్శ ఆవిధంగా జీవితాంతం గుర్తుండిపోయేలా భీతావహంగా ఉండిపోయింది ఇరువురి మదిలో.

తాను అలా మాట్లాడగలనని అతడు అనుకోలేదు. ముందుగా అనుకుని మాట్లాడిన మాట ఒక్కటి కూడా లేదు వాటిలో.

చిన్న నాటి నుండి కూడా అతను ఎవర్నీ నొప్పించి ఎరుగడు. ఎవర్ని బాధపెట్టి ఎరుగడు. అతనికి విపరీతమైన కోపం వచ్చినా దుఃఖం కలిగినా తనను తాను హింసించుకునే వాడు. లేదా తనకు అత్యంత ప్రీతిపాత్రమైన బొమ్మల్ని, వస్తువులను ధ్వంసం చేసి ఆపై వాటి తాలూకు ముక్కల్ని ముందరేసుకుని భోరున విలపించేవాడు.

ఇప్పటి అతని ప్రవర్తన అంతకన్నా భిన్నంగా ఏమీ లేదు. కానీ ఇక్కడ వున్నది బొమ్మ కాదు, స్పందించి గాయపడే గుణం వున్న మనసున్న మనిషి.

అతని మీదనే ఆశలు పెట్టుకుని, ఆ ఆశలు భగ్నం అవటంతో ఆమె నిరుత్తరురాలయింది. ఆమె గొంతులోంచి ఏ మాటా పెగలలేదు.'అసలు తనకు మాటలు వచ్చు అన్నది కూడా మరచిపోయింది.

ఆమె నిస్సత్తువగా అక్కడి కుర్చీలో కూలబడి పోయింది.

అతడు వగరుస్తూ బయటికి వెళ్ళి పోయాడు.

అతిథులకు స్వాగతం పలికే వేదిక దగ్గర వారు ఒకరికి ఒకరు శాశ్వతంగా వీడ్కోలు పలుక్కోవటం కేవలం యాధృచ్ఛికం అనలేము. విధివ్రాత కూడా కావచ్చు.

**రెఖావోంక ఖేల్ హై ముకద్దర్,**

**రేఖావోం సే మాత్ ఖారహే హో.**

(హస్తరేఖలు మన జీవితాల్ని శాశిస్తాయి, హస్త రేఖలతోనే నీవు చావు దెబ్బలు తింటున్నావు సుమా)

జగ్‌జీత్ సింగ్ పాట ఎక్కడినుంచో వినిపిస్తోంది.

రైలు వేగంగా వెళుతూనే వుంది.

అప్పుడు సమయం దాదాపు తెల్లవారు ఝాము మూడు మూడున్నర అవుతూ వుంటుంది.

చెప్పటం ముగించిన సంతోష్ తెర తొలగించి మసక అద్దాల కిటికీ లోంచి బయటకు చూస్తుండి పోయాడు. అతని కండ్ల నిండా కన్నీరు నిండి వుంది.

అతడు డగ్గుత్తికతో చెప్పాల్సివచ్చింది చివరి వాక్యాలు.

నవ్య పరిస్థితి ఏమీ మెరుగ్గా లేదు. ఆమె కళ్ళ నుండి ఆగకుండా కన్నీరు ఉబుకుతోంది.

"ఏమిటంకుల్. చేజేతులా జీవితాన్ని నాశనం చేసుకున్నాడు ఆ కుర్రాడు. అతడికి ఏమయినా బుద్ధి వుందా" కఠినంగా అడిగేసింది.

'అసలు లేదు. అతడి ఆ అనాలోచిత నిర్ణయం ఎందరి జీవితాల పైనో బలమైన ముద్ర వేసింది"

"ఆ తర్వాత ఏమయింది అంకుల్?"

"సినిమా ఇక్కడితో ఆపేస్తే బాగుంటుందేమో. అని నా అభిప్రాయం.

అయినా నిజజీవితంలో ఏమి జరిగిందో చెబుతాను.

ఆ తర్వాత ఆమెకి ఆ బ్యాంకు కుర్రాడితో పెళ్ళయింది. అమె అంతే అయోమయ స్థితిలో మొగుడితో అత్తారింటికివెళ్ళిపోయింది.

ఆ అబ్బాయి తలితండ్రులు అతన్ని స్వంత ఊరికి తీసుకుపోయారు. తను చేసిన పనికి అతడు పశ్చాత్తాపంతో కుమిలి పోయాడు. ఆ వ్యధ కారణంగా అతను తీవ్రమైన డిప్రెషన్ లో కూరుకుపోయి, దాదాపు నాల్గు సంవత్సరాలు జీవచ్ఛవంగా గడిపాడు. అప్పటిదాకా అప్రతిహతంగా కొనసాగుతూ వస్తున్న అతని చదువు విచిత్రమైన మలుపు తిరిగింది. చివరి సంవత్సరం పరీక్షలలో అన్నీ పరీక్షలు బాగానే వ్రాశాడు , వాటిలో కూడా అతనికి రికార్డు స్థాయి మార్కులు వచ్చాయి. ఆ అమ్మయిని మాటలతో గాయం చేసిన తొలి రోజులు అవి. అతనికి ఆ రోజుల్లో ఒక రోజు వున్న మానసిక స్థితి మరొక రోజు వుండేది కాదు. చివరి రోజు ఫిజిక్స్ పరీక్ష బాగా వ్రాశాడు. పరీక్ష ఇంకో పదినిమిషాల్లో పూర్తవతుందనగ, హఠాత్తుగా తన సమాధాన పత్రాన్ని తానే చించేసుకుని, ఆ తర్వాత తన డిగ్రీని సైతం మరో మూడేండ్లు పూర్తి చేయకుండా, తనను తాను హింసించుకున్నాడు.

అతను ఆమెని మానసికంగా గాయపరచిన సంవత్సరానికి ఆ అమ్మాయికి పెళ్ళయింది.

ఆ సంవత్సర కాలంలో ఆ అబ్బాయి ఇంటి వారు వారిద్దరిని కలపటానికి చేయని ప్రయత్నం లేదు. కానీ అప్పటికే చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు అయింది"

"అతను డిప్రెషన్ లో నుంచి ఎలా  బయట పడ్డాడు? ఇప్పుడు ఎక్కడ వున్నాడు? ఏమి చేస్తున్నాడు?" నవ్య ఆరా తీసింది.

"అన్ని డిప్రెషన్ లోంచి బయటకు వచ్చే ప్రయత్నాలు అవన్నీ ఒక గ్రంధం వ్రాయవచ్చు. జీవితంలొ సరిగ్గా ఎదిగి రావాల్సిన సమయంలో అతని జీవితం అలా అవటం ఆ తలితండ్రులకు ఎంత వ్యధ కలిగించిందో నీవు ఊహించగలవు.

ఆ తర్వాత ఒక ఆధ్యాత్మిక గురువు ద్వారా అతను ఊహించని విధంగా ఆ డిప్రెషన్ నుంచి బయట పడ్డాడు. ఆ తర్వాత ఇక అతను జీవితంలో వెను దిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు."

"అతను ఇప్పుడు ఏమి చేస్తున్నాడు? నవ్య ప్రశ్నించింది.

“అదృష్టవశాత్తూ అతనికి అనుకూలవతి అయిన అమ్మాయితో పెళ్ళి కుదిరింది. ఆమె కి పెళ్ళికి ముందరే ఏ విషయం దాచకుండా చెప్పేశాడు. ఆమె కూడా అతన్ని సహృదయంతో అర్థం చేసుకుని అతని వెన్నంటి ఉంది. ఆమె అందించిన ప్రోత్సాహంతో తన కెరియర్ లో ముందుకు దూసుకుపోతున్నాడు. సైకాలజి రంగంలో విశేష కృషి చేసి ఎందరో యువతీ యువకులు జీవితాల్లో వెలుగు పంచుతున్నాడు. అతను తన జీవితాన్ని అంత ఛిన్నాభిన్నం చేసుకోవటానికి ప్రధాన కారణం అతనిలో సరి అయిన వ్యక్తిత్వ నిర్మాణం జరగకపోవటం. సమస్య ఎంత పెద్దదయినా కూర్చుని చర్చిస్తే తప్పక పరిష్కారం లబిస్తుంది.  జీవితంలో చాలా సందర్భాలలో హృదయంతో కాక మెదడుతో ఆలోచించాల్సి వుంటుంది.

తను ఎన్ని సాధించినా, అతని మనసులో ఒక ములుకులా ఆమెని అవమానించానే అన్న బాధ పీడీస్తూనే వుంటుంది.

ఆ వేదన అతన్ని వెంటాడుతూనే వుంది. అదొక్కటే అతని జీవితంలోని ప్రధాన వేదన.

అతడి జీవితంలో ఒకే ఒక రిగ్రెట్, ఆ అమ్మాయిని అంత దారుణంగా అవమానించి వుండకూడదు అని. జీవితం ముగిసేలోగా  ఆమెని ఒక్కసారి అయినా సరే కలిసి మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పుకోవాలి అన్నది ఒక్కటే అతని తీరని కోరిక.

ఆ గిల్టీ ఫీలింగ్ వల్లనే అతడు తీవ్రమయిన డిప్రెషన్ కి లోనయ్యాడు. అతడు ఉద్దేశపూర్వకంగా చేసిన అవమానం కాదు అది. ఆమె చిరునామా కూడా అతనికి తెలియదు. ఆమె ఎక్కడ వుందో అతనికి తెలియదు.

ఆమె తారస పడితే ఆమె నోటి వెంబడి "క్షమించాను" అన్న మాటలు వినే వరకు అతనిలోని ఆ ఆత్మన్యూనతా భావం పూర్తిగా తొలగి పోదు"

చెప్పటం ముగించి, నవ్య వంక ఆప్యాయంగా చూస్తూ ఇలా అన్నాడు "చాలా సమయం గడిచిపోయిందమ్మా. నువ్వు అసలు విశ్రాంతి తీసుకోలేదు. కాసేపన్నా పడుకో అమ్మాయి"

"అలాగే అంకుల్. మీరు పడుకోండి. అంకుల్. నేను ఈ కథతో సినిమా తీయటం ఖాయం." అని ఉద్విగ్నతతో గట్టిగా అరిచి చెప్పింది ఆ అమ్మాయి ముసుగు తన్ని పడుకునే ముందు. ఆమె నిద్ర పోయే ప్రయత్నం చేస్తోంది కానీ నిద్ర రావట్లేదు.

ఆ కథలోని ఆర్ద్రత ఆమెని కంట తడిపెట్టించింది. అ కథ గురించే ఆలోచిస్తూ కళ్ళు మూసుకుంది.

అతడు విశ్రాంతిగా నడుం వాల్చాడు.

సికింద్రాబాద్ స్టేషన్.

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు.

మంచు తెరల దుప్పట్లు నగరాన్ని కప్పేసి వున్నాయి. చలి వణికిస్తోంది. నగరం ఇంకా పూర్తి నిద్ర లేవలేదు.

రైలు నెమ్మదిగా ప్లాట్ ఫాం కొచ్చి ఆగింది. వీరి కంపార్ట్ మెంట్ ఆగిన దగ్గర ప్లాట్ ఫాం పై లైట్ల కాంతి పలుచగా వుంది. రైలు పూర్తి ఆగి ఆగకముందే సంతోష్ వాళ్ళ కార్ డ్రైవర్ కంపార్ట్మెంట్ లోనికి వచ్చేసి 'గుడ్ మార్నింగ్ సార్' అంటు గ్రీట్ చేశాడు.

లగేజి తీసుకుని గేట్ దగ్గరకి వెళ్ళి పోయాడు.

నవ్య తాలూకు లగేజి బ్యాగు అందుకున్నాడు సంతోష్. 'అయ్యో అంకుల్, మీకెందుకు శ్రమ' మొహమాట పడిపోయింది నవ్య.

మొదట నవ్య దిగింది రైలు పెట్టె లోంచి.

నవ్య కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. తన కళ్ళని తానే నమ్మలేకపోయింది, తనని రిసీవ్ చేసుకోటానికి తన తల్లి వచ్చి నిలబడి వుంది.

"అమ్మా వాట్ ఎ సర్ప్రైజ్. ఇంత తెల్లవారి ఝామున నువ్వు వస్తావని ఊహించలేకపోయాను.. అయాం వెరి హాపీ" అంటూ తల్లిని కౌగిలించుకుంది నవ్య.

"అమ్మా మన సినిమాకి కథ దొరికింది అమ్మా. అందుకే ఆ సంతోషంలో నీకు రెండున్నర గంటల రాత్రి కథ మొత్తం ఫోన్లో చెప్పి విసిగించాను. ఇదిగో అమ్మా వీరే ఆ రచయిత సంతోష్" అతన్ని చూపిస్తూ చెప్పింది.

నెమ్మదిగా రైలు పెట్టె దిగాడు సంతోష్. ఆ మసక చీకటి, మంచు తెరల వల్ల వారు స్పష్టంగా కనిపించటం లేదు.

ఇంతలో టీవీ కెమెరాలతో మీడియా ప్రతినిధుల బృందం పరుగులు పెట్టుకుంటూ వచ్చారు నవ్య వైపు.

"కంగ్రాచులేషన్స్ నవ్య గారు. మీరు ప్రతిష్టాత్మక అవార్డు ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్న శుభ సందర్భంగా ఇవే మా అభినందనలు"

వారు ఆమెని తీసుకెళ్ళి కాస్త ఎడంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఓ చిన్ని స్టేజిపై నిలబెట్టి ప్రశ్నలు అడగటం ప్రారంభించారు.

"అమ్మా సంతోష్ అంకుల్తో మాట్లాడుతూ ఉండు. నేను వచ్చేస్తా"

నవ్య మీడియా ప్రతినిధుల బృందం వైపు వెళ్ళిపోబోతూ వారిని ఒకరికొకరికి పరిచయం చేసి వెళ్ళింది.

"ఏయ్ మొద్దు. బాగున్నావా?" ఆ గొంతు తనకు చిరపరిచితమే. బాగా శృతి చేసిన వీణ తీగెని అనుభవజ్ఞుడైన వైణికుడు మీటితే స్వరం పలికినట్లు పలికే కంఠధ్వని. రెండడుగులు ముందుకేస్తూ పలకరించింది ఆమె.

అప్పటి దాకా మసక చీకటిలో నిలుచుండిపోయిన ఆమె ఒక రెండడుగులు ముందుకు వేసి సంతోష్ ని చూస్తూ చిరునవ్వు నిండిన వదనంతో పలకరించింది.

ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది ఆమె. వయసు యాభై దాటుతున్నా ఆమెలోని ఆ తేజస్సు

చెక్కు చెదరలేదు. ప్రక్కనె ఆడ్వర్టైజ్మెంట్ కి ఏర్పాటు చేసిన హోర్డింగ్ తాలూకు

లెడ్ లైట్ల కాంతి ఆమె మీద ప్రతిఫలిస్తూ ఆమెకి కొత్త ఆకర్షణని కల్పిస్తోంది.

లేత గంధం రంగు కేరళ కాటన్ చీర , బంగారు రంగు అంచు తో ఆమె దివినుండి భువికి దిగిన దేవతలా వుంది. ఆమె వర్చస్సు మరింత ఇనుమడించింది ఇన్నేళ్ళలో.

జుత్తు వదులుగా ముడి వేసుకుంది. ఒకట్రెండు వెండి రంగు వెంట్రుకలు ఆమె నుదురు దగ్గర కనిపిస్తున్నాయి. రెండు చేతులకు నిండుగా ఎర్రటి మట్టి గాజులు,మెడలో నల్ల పూసల చైన్. చెవులకి చిత్రంగా ఊగుతున్న బుట్ట జూకాలు.

ఆమెనే చూస్తుండిపోయాడు.

అతను తన కళ్ళని తాను నమ్మలేక పోయాడు. తను చూస్తున్నది నిజమా కలా అతనికి అర్థం కావటం లేదు.

"ఏయ్ మొద్దు. నిన్నే. బాగున్నావా? నీవు నాకేమి క్షమాపణలు చెప్పాల్సిన పని లేదు. ఎందుకురా నీవు నాకు క్షమాపణలు చెప్పటం? నీవేం తప్పు చేశావు? నీవు అనుభవించిన సంఘర్షణ, నీవు అనుభవించిన వేదన ఆ పగ వాడికి

కూడా వద్దు, నీవు ఎంత వత్తిడికి గురయ్యావో నాకు తెల్సు. నాకు నీ మీద ఎప్పుడు కోపం లెదు. నీకు అదే విషయం చెబుతూ అప్పుడు ఓ ఉత్తరం వ్రాసి పట్టుకోచ్చాను. నీవు నింపాదిగా వుంటేగా అది నీకు అందించే దానికి. నీ ఉద్రేకం నీ ఆవేశమే నీది ఆ రోజు. నాకు ఆ రోజు నిజంగా చాలా బాధ అయింది. ఇంచు మించు నేను చచ్చిపోయాననే అనుకున్నాను. ఆ వేదన పగవాడికి కూడా వద్దు. ఆ తర్వాత నీ కోణం లొ ఆలోచించటం తో నాకు నీమీద కోపం పూర్తిగా పోయింది. నీ జీవితంలో ఇంత అల్లకల్లోలానికి, ఇంత వేదనకి కారణం అయిన నన్ను నీవు క్షమిస్తావు కదూ" ఆమె అంది.

అతనికి ఇన్ని సంవత్సరాల నుంచి మోస్తున్న పెద్ద భారం దిగిపోయినట్టు అయింది.

ఆమెకి ఎన్నటికైనా క్షమాపణలు చెప్పాలి అనేది అతని ఆలోచన అంతే. ఆమె ఎదురుగా నిలబడి మాట్లాడుతూ వుంటే ఆ సంభ్రమంలో ఏమి మాట్లాడాలో కూడా తెలియనట్టు ఆమెనే చూస్తుండి పోయాడు.

అతని కళ్ళనిండా కన్నీళ్ళు. ఆమె కళ్ళని కప్పేస్తూ కన్నీటి తెరలు.

ఆమె ముందుకు కదిలి అతని చేతుల్ని మృదువుగా తన చేతుల్లోకి తీసుకుంటూ "నిజానికి నీకే నేను క్షమాపణలు చెప్పాలి. నీ జీవితంలో ఇంత అల్లకల్లోలానికి కారణం అయ్యాను. నన్ను క్షమిస్తావు కదూ!"

అలా అన్నాననుకుంది ఆమె. కానీ మాట పెగలలేదు. వారి కన్నీటి ప్రవాహంలో వారికి చూపు ఆనటం లేదు, ఉద్విగ్నతతో గొంతు పెగలడం లేదు.

ఆ జంటకి మాటలు అక్కరలేదు. వారి కన్నీళ్ళే భావాల్ని పంచుకుంటున్నాయి.

నవ్యతో దూరంగా మీడియా బృందం ఇంటర్వ్యూ కొనసాగుతోంది.